
'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 16

శనివారం 30-9-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




## పతకాల మోత

ఆసియా క్రీడల్లో శుక్రవారం భారత క్రీడాకారులు ఎనిమిది పతకాలతో అదరగొట్టారు. షూటింగ్‌లో రెండు స్వర్ణాలు, మూడు రజత పతకాలు వచ్చాయి. పురుషుల టెన్నిస్ డబుల్స్‌లో సాకేత్–రామ్ జోడీ రజతం నెగ్గగా... అథ్లెటిక్స్, స్క్వాష్‌లో ఒక్కో కాంస్య పతకం లభించింది. ఓవరాల్‌గా భారత్ 33 పతకాలతో నాలుగో స్థానానికి ఎగబాకింది. 12లో



## 'ఇండియా' కూటమిలోనే ఉంటాం

ప్రతిపక్ష ఇండియా కూటమి నుంచి తాము బయటకు వచ్చే ప్రసక్తే లేదని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ తేల్చిచెప్పారు.

వివరాలు 6లో ▸



## వరల్డ్ కప్ కాదు.. టెర్రర్ కప్!

క్రికెట్ ప్రపంచకప్.. 'ప్రపంచ టెర్రర్ కప్'గా మారుతుందన్న ఖలిస్తాన్ ఉగ్రవాది పన్నూపై అహ్మదాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు.


వివరాలు 6లో ▸



## కర్ణాటక బంద్ విజయవంతం

తమిళనాడుకు కావేరి జలాల విడుదలను నిరసిస్తూ 'కన్నడ ఒక్కూట' చేపట్టిన కర్ణాటక రాష్ట్ర బంద్ విజయవంతమైంది.

వివరాలు 6లో ▸



## పాక్‌లో ఆత్మాహుతి దాడులు

పాకిస్తాన్‌లో శుక్రవారం జరిగిన రెండు వేర్వేరు ఆత్మాహుతి దాడుల్లో 58 మంది చనిపోగా, 100 మందికి పైగా గాయపడ్డారు.

వివరాలు 6లో ▸

## న్యూస్‌రీల్

### ఏపీ సంక్షేమ పథకాలు ఆదర్శనీయం



అణగారిన వర్గాల అభ్యున్నతి, సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని, అవి లేకపోతే ఆ వర్గాల అభివృద్ధే లేదని పలువురు విద్యావేత్తలు, ఆర్థికవేత్తలు అన్నారు. ఓపెన్ మైండ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఏఎన్‌యూలో నిర్వహించిన సదస్సులో వారు తమ అభిప్రాయాలను వెల్లడించారు.

వివరాలు 10లో ▸

### మరింత సులభంగా ధ్రువీకరణ పత్రాలు



విద్య, ఉద్యోగ ఇతర అవసరాల కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాల వారికి జారీ చేసే వివిధ రకాల ధ్రువీకరణ పత్రాల జారీని ప్రభుత్వం మరింత సులభతరం చేసింది. కుల, నివాస, జనన వివరాలతో కూడిన ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్ ఒకసారి తీసుకొంటే చాలని స్పష్టం చేసింది.

వివరాలు 3లో ▸





విజయవాడలోని విద్యాధరపురంలో జరిగిన వైఎస్సార్ వాహనమిత్ర సభకు హాజరైన లబ్ధిదారులు.. వారికి అభివాదం చేస్తున్న సీఎం జగన్

# యుద్ధానికి సిద్ధం

## మనం వేసే ప్రతి అడుగు, ప్రతి ఓటూ.. పేదవాడిని రక్షించుకోవడానికే: సీఎం జగన్

పేదల ప్రభుత్వానికి, పెత్తందార్లకు మధ్య సంగ్రామం ఇది 2లో

### మనసున్న మన ప్రభుత్వం ఒకవైపు.. మనసులేని గత పాలకులు మరోవైపు

- దోచుకుని.. దాచుకునేందుకే అధికారం ఇవ్వమంటున్నారు
- మేనిఫెస్టోను చెత్తబుట్టలో పడేసిన చరిత్ర వారిది
- ఈ ఎన్నికల కురుక్షేత్రంలో మీ బిడ్డకు అండగా నిలవండి
- లంచాలు, వివక్షకు తావులేకుండా అందరికీ సంక్షేమ ఫలాలు

"రాబోయేది ఎన్నికల కురుక్షేత్ర యుద్ధం! ఎలాంటి లంచాలు, అవినీతికి తావు లేకుండా ప్రజలందరికీ మేలు చేస్తున్న మీ బిడ్డ ప్రభుత్వం ఒకవైపు... కేవలం దోచుకోవటానికి పంచుకోవటానికి, దాచుకోవటానికి మాత్రమే ఉన్న పెత్తందార్లు మరోవైపు నిలిచిన యుద్ధమిదీ. పేదల అనుకూల ప్రభుత్వానికి, పెత్తందార్లకు మధ్య జరిగే యుద్ధం ఇది. ఈ ఎన్నికల యుద్ధంలో మీకు అండగా ఉన్న మీ బిడ్డ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి.

- 'వైఎస్సార్ వాహన మిత్ర' సభలో సీఎం వైఎస్ జగన్

### 'ఉపాధి'కి ఇంధనం..

- వరుసగా ఐదో ఏడాదీ 'వైఎస్సార్ వాహన మిత్ర' పథకంతో ఆర్థిక సాయం.. 2,75,931 మంది ఖాతాల్లోకి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.275.93 కోట్లు
- ఐదేళ్లలో రూ.1,301.89 కోట్ల సాయం.. ఒక్కొక్కరికీ మొత్తం రూ.50 వేల లబ్ధి.. ఎంతోమందికి సేవలందిస్తున్న మీకు ప్రభుత్వం తోడుగా నిలబడుతుంది: సీఎం జగన్

2లో

### ప్రజారోగ్యానికి 'రక్ష'

10లో

జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రివెంటివ్ కేర్‌లో కొత్త అధ్యాయం

5 దశల్లో కార్యక్రమం నిర్వహణ

వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం వైఎస్ జగన్

## ఫ్యాక్ట్ చెక్

### పప్పు లోకేశ్.. ఇది తప్పు

- రాష్ట్రంలో లైంగిక వేధింపులపై లోకేశ్ తప్పుడు ఆరోపణ
- చిన్న వయస్సు గర్భధారణలకు వేధింపులే కారణమంటూ ట్వీట్
- టీడీపీ పాలనలో కంటే ఇప్పుడు బాగా తగ్గిన లైంగిక వేధింపులు.. 2015–16లో 6.8 శాతం ఉండగా 2019–20లో 3.7 శాతానికి తగ్గాయి
- జాతీయ కుటుంబ, ఆరోగ్య సర్వే వెల్లడించిన వాస్తవమిది
- ప్రభుత్వంపై బురద జల్లే ఉద్దేశంతో లోకేశ్ తప్పటడుగు

- వివరాలు 14లో






# ప్రభుత్వ భూములూ మింగేశారు!

## అమరావతిలో చంద్రబాబు ముఠా అరాచకాలు

### భూసమీకరణ ప్యాకేజీ కింద రూ.760.25 కోట్లు స్వాహా.. పచ్చ గద్దల అసైన్డ్ భూదోపిడీ-2

సాక్షి, అమరావతి: మాజీ సీఎం చంద్రబాబు అమరావతిలో సాగించిన భూదోపిడీలో తవ్వుతున్న కొద్దీ కొత్త అక్రమాలు గుట్టలు గుట్టలుగా బయట పడుతున్నాయి. అసైన్డ్ భూములే కాకుండా ప్రభుత్వ భూములనూ వదల్లేదు. చంద్రబాబు, పి.నారాయణ, లోకేశ్ త్రయం బినామీల పేరిట కొల్లగొట్టిన భూముల జాబితా చాంతాడులా సాగుతోంది. అసైన్డ్ రైతులకు ఎలాంటి పరిహారం ఇవ్వకుండానే వారి భూములను రాజధాని కోసం టీడీపీ సర్కారు తీసుకుంటుందని బెదిరించి రూ.3,370 కోట్ల విలువైన 617 ఎకరాలను కొల్లగొట్టిన కుంభకోణాన్ని 'సాక్షి' ఇప్పటికే బట్టబయలు చేయడం తెలిసిందే. అయితే అసైన్డ్ రైతులే కాకుండా అమరావతిలోని ప్రభుత్వ భూములను సైతం తమ బినామీల పేరిట నమోదు చేసి

మిగతా 5వ పేజీలో ▶

ఇదండీ జగత్



వర్రీ ఎందుకు సార్! ప్రస్తుతం మనం చేస్తున్న పనులు కూడా అలాగే ఉన్నాయి!!

### లోకేశ్ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను మూసివేసిన హైకోర్టు

- ఆయనకు సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ నోటీసు ఇస్తామని ఏజీ నివేదన
- అవసరమైనప్పుడు విచారణకు రావాలని కోరతామని వెల్లడి
- ఏజీ వాదనలను పరిగణనలోకి తీసుకున్న కోర్టు.. దర్యాప్తునకు సహకరించాలని లోకేశ్‌కు ఆదేశం

10లో

### 4 వరకు లోకేశ్‌ను అరెస్ట్ చేయొద్దు

సీఐడీకి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేశ్‌రెడ్డి ఆదేశం

తదుపరి విచారణ అదే రోజుకు వాయిదా

స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో ముందస్తు బెయిల్ కోసం లోకేశ్ పిటిషన్

10లో

### చంద్రబాబు కనుసన్నల్లోనే ఐఆర్ఆర్ అలైన్‌మెంట్ మార్పు

- ముందుగా నిర్ణయించుకొన్న విధంగా అలైన్‌మెంట్ తయారు చేయించారు
- లింగమనేని రమేశ్‌కు చంద్రబాబు లబ్ధి చేకూర్చారు.. అందుకు ప్రతిగా బాబుకు ఆయన తన ఇంటిని ఇచ్చారు
- ఈ ప్రాజెక్టు వెనుక క్విడ్ ప్రో కో ఉంది
- హైకోర్టుకు నివేదించిన ఏజీ శ్రీరామ్
- బాబు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తదుపరి విచారణ 3కి వాయిదా

3లో

### ఫైబర్‌గ్రిడ్ కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వండి

హైకోర్టులో చంద్రబాబు పిటిషన్

పూర్తి వివరాలు సమర్పించాలని సీఐడీకి హైకోర్టు ఆదేశం

3లో

## క్లుప్తంగా...

### వారిని ఆదుకునేందుకే వైఎస్సార్ వాహన మిత్ర

**సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి**

**సాక్షి,అమరావతి:** బతుకు బండి లాగేందుకు ఇబ్బందిపడుతూ ఆటో, టాక్సీలను నడుపుకుంటున్న అన్నదమ్ములను, అక్కచెల్లెమ్మలను ఆదుకునేందుకు మన ప్రభుత్వంలో వైఎస్సార్ వాహన మిత్ర పథకాన్ని ప్రవేశపెట్టామని సీఎం వైఎస్ జగన్ పేర్కొన్నారు.' స్వంతంగా ఆటో, టాక్సీలను నడుపుకుంటున్న వారు పలు సర్టిఫికెట్లు పొందడంలో అండగా నిలిచే ఉద్దేశంతో ఈ పథకం ద్వారా వారికి ఏటా రూ.10 వేలు అందజేస్తున్నాం. దేవుడి దయతో నేడు వరుసగా ఐదో ఏడాది 2,75,931 మంది డ్రైవర్ అన్నదమ్ములు, అక్కచెల్లెమ్మల ఖాతాల్లో రూ.276 కోట్లను జమచేశాం. ఈ పథకం ద్వారా ఇప్పటి వరకూ ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున మొత్తం రూ.1,300 కోట్లను మన ప్రభుత్వం అందజేసింది' అంటూ శుక్రవారం ఎక్స్ (ట్విట్టర్)లో పోస్ట్ పెట్టారు.

### రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో ఆ 2 ప్రాజెక్టులు కీలకమవుతాయి

**అదానీ గ్రూపు చైర్మన్ గౌతమ్ అదానీ పోస్ట్**

**సాక్షి, అమరావతి:** రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో తాము చేపట్టిన ప్రాజెక్టులు కీలకపాత్ర పోషిస్తాయంటూ అదానీ గ్రూపు చైర్మన్ గౌతమ్ అదానీ పేర్కొన్నారు. గురువారం తాడేపల్లిలో సీఎం జగన్‌తో జరిగిన సమావేశంపై ఆయన సోషల్ మీడియాలో స్పందించారు. 'సీఎం జగన్‌తో సమావేశం ఎల్లప్పుడూ సమగ్రంగా ఫలప్రదంగా జరుగుతుంది. ఈ సమావేశంలో ఏపీలో చేపట్టిన కీలక ప్రాజెక్టులైన గంగవరం పోర్టు, వైజాగ్ డేటా సెంటర్ వంటివాటిపై చర్చించాం. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో ఈ 2 ప్రాజెక్టులు అత్యంత కీలకం అవుతాయని ఇరువురం భావిస్తున్నాం'' అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

### రూ.1,021 కోట్లతో 'క్రిస్' సిటీ

**సాక్షి, అమరావతి:** చెన్నై– బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా 10,834.5 ఎకరాల్లో కృష్ణపట్నం నోడ్ అభివృద్ధి కానుంది. దేశానికి స్వాతంత్రం వచ్చి 75 ఏళ్ల పూర్తయిన సందర్భంగా ప్రపంచ ప్రమాణాలకనుగుణంగా అత్యాధునిక వసతులతో ఈ పారిశ్రామిక నగరం నిర్మితం కానుంది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వ నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (నిక్‌డిక్ట్)..ఏపీఐఐసీతో కలిసి నిక్‌డిక్ట్ కృష్ణపట్నం ఇండస్ట్రియల్ సిటీ డెవలప్‌మెంట్ లిమిటెడ్ (క్రిస్ సిటీ) పేరుతో ప్రత్యేక కంపెనీని ఏర్పాటు చేసింది. తొలి దశలో రూ.1,503.16 కోట్లతో 2,500 ఎకరాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన అనుమతులివ్వడంతో ఈపీసీ విధానంలో క్రిస్ సిటీలో రూ.1,021.41 కోట్ల విలువైన కీలక మౌలిక వసతులు కల్పించడానికి ఏపీఐఐసీ టెండర్లు పిలిచింది. ఆసక్తిగల సంస్థలు నవంబర్ 9 మధ్యాహ్నం 3 గంటల్లోగా బిడ్లు దాఖలు చేయాలని కోరింది. బిడ్ గెలుచుకున్న సంస్థ పారిశ్రామిక నగరాన్ని అనుసంధానిస్తూ రోడ్లు, విద్యుత్, నీరు వంటి కనీస మౌలిక వసతులు అభివృద్ధి చేసి వాటిని నిర్వహించాల్సి ఉంటుంది. పనిచేసే చోటే నివాసం ఉండేలా పర్యావరణ అనుకూల పారిశ్రామిక నగరంగా క్రిస్ సిటీని నిర్మిస్తోంది. తొలి దశ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే 78,900 మందికి ఉపాధి లభిస్తుందని అంచనా. 36 నెలల్లో తొలి దశ అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

### స్టీల్ ప్లాంట్‌కు చివరి త్రైమాసికంలో రూ. 81 కోట్ల లాభం

**ప్లాంట్ సీఎండీ అతుల్ భట్**

**ఉక్కునగరం:** విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు 2022–23 చివరి త్రైమాసికంలో రూ.81 కోట్ల లాభం వచ్చిందని స్టీల్ ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ తెలిపారు. స్టీల్ ప్లాంట్ రిజిస్టర్డ్ కార్యాలయంలో శుక్రవారం సంస్థ 41వ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం) నిర్వహించారు. స్టీల్ ప్లాంట్ సీఎండీ అధ్యక్షత వహించారు. అధీకృత నామినీగా రాష్ట్రపతి తరఫున సమావేశానికి ఉక్కు మంత్రిత్వ శాఖ డైరెక్టర్ నీరజ్ అగర్వాల్ హాజరయ్యారు. సీఎండీ భట్ వాటాదారులనుద్దేశించి మాట్లాడుతూ 2022–23లో గ్లోబల్ ఎనర్జీ సంక్షోభం, ఆశావహంగా లేని మార్కెట్లు, లిక్విడిటీ పరిమితుల ప్రభావం స్టీల్ ప్లాంట్ పని తీరుపై కొనసాగిందన్నారు. డిసెంబర్ 22 – మార్చి 23 మధ్య కాలంలో 1.76 మిలియన్ టన్నుల ఉత్తమ ఉత్పత్తిని సాధించిందని చెప్పారు. తద్వారా 2 ఫర్నేస్‌ల నుంచి 106 శాతం సాధించిందని వివరించారు. గతేడాది చివరి త్రైమాసికంలో రూ.81 కోట్ల లాభాలు సాధించిందన్నారు.

### రూ.30 కోట్లతో ఎన్సీఎల్ సిమెంట్ విస్తరణ

**ఎన్సీఎల్ ఇండస్ట్రీస్ ఎండీ గౌతమ్**

**సాక్షి, అమరావతి:** పెరుగుతోన్న డిమాండ్‌కు అనుగుణంగా సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచనున్నట్లు ఎన్సీఎల్ ఇండస్ట్రీస్ ప్రకటించింది. ఏపీలోని కొండపల్లితో పాటు తెలంగాణలోని మట్టపల్లి సిమెంట్ యూనిట్లను రూ.30 కోట్లతో విస్తరించనున్నట్లు కంపెనీ ఎండీ గౌతమ్ తెలిపారు. ఎన్సీఎల్ ఇండస్ట్రీస్ కొత్తగా ప్రవేశపెట్టిన 2 బ్రాండ్లు నాగార్జున సిమెంట్ వశిష్ఠ, స్టీల్ కిరీటీలను విజయవాడలో మార్కెట్లోకి ఆయన విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రస్తుతం నెలకు 3 లక్షల టన్నులుగా ఉన్న ఉత్పత్తి సామర్థ్యం కొత్త బ్రాండ్ వశిష్ఠ వల్ల 30% డిమాండ్ పెరుగుతుందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు.



థాంక్యూ జగనన్న అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న డ్రైవర్లు



విజయవాడలో జరిగిన సభలో వైఎస్సార్ వాహనమిత్ర లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

# యుద్ధానికి సిద్ధం

## మనం వేసే ప్రతి అడుగు, ప్రతి ఓటూ.. పేదవాడిని రక్షించుకోవడానికే: సీఎం వైఎస్ జగన్

**సాక్షి, అమరావతి:** ఎన్నికల మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంలా భావిస్తూ అమలు చేస్తున్న మీ బిడ్డ ప్రభుత్వం ఒకవైపున నిలిస్తే.. ప్రజలను మోసగించేందుకే మేనిఫెస్టోను తీసుకొచ్చి ఆ తరువాత చెత్తబుట్టలో పడేసిన చరిత్ర ఉన్నవారు మరోవైపున మోహరించారని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. నిరుపేదలకు అండగా నిలిచిన మనసున్న ప్రభుత్వం ఓ వైపు.. పేదలను వంచించిన మనసు లేని గత పాలకులు మరోవైపు ఉన్నారని చెప్పారు. నీతివంతంగా అన్ని సామాజిక వర్గాలు, అన్ని ప్రాంతాలకు మంచి చేస్తున్న మన ప్రభుత్వం ఒకవైపున ఉంటే.. మరోవైపున సామాజిక అన్యాయాలు, ప్రాంతాలకు అన్యాయాలు చేయడమే చరిత్రగా ఉన్న ప్రత్యర్థులు మరోవైపున ఉన్నారని తెలిపారు. శుక్రవారం విజయవాడలో వైఎస్సార్ వాహన మిత్ర పథకం ద్వారా వరుసగా ఐదో విడత కింద 2,75,931 మంది లబ్ధిదారులకు రూ.275.93 కోట్ల ఆర్థిక సాయాన్ని బటన్ నొక్కి బ్యాంకు ఖాతాల్లో జమ చేసిన అనంతరం నిర్వహించిన సభలో సీఎం జగన్ మాట్లాడారు. మేనిఫెస్టోను పవిత్ర భగవద్గీత, బైబిల్, ఖురాన్‌లా భావిస్తూ అధికారంలోకి వచ్చిన మొట్టమొదటి రోజు నుంచి చెప్పిన ప్రతీది అమలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే 99 శాతం వాగ్దానాలను పూర్తి చేసి మన ప్రభుత్వం మాట నిలబెట్టుకుందని చెప్పారు. సభలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

### కులమతాలు లేవు.. పేదలు – పెత్తందారులే

ఈ రోజు మనం వేసే ప్రతి అడుగు, ప్రతి ఓటు.. పేదవాడిని రక్షించుకోవడానికే వేస్తున్నాం. పేదవాడి ప్రభుత్వాన్ని నిలబెట్టుకునేందుకు అడుగులు వేస్తున్నాం. ఒక పెత్తందారీ ప్రభుత్వం రాకూడదని అడుగులు వేస్తున్నాం. పేదవాడికి, పెత్తందార్లకు మధ్య యుద్ధం జరగబోతోంది. ఈ యుద్ధంలో కులాలు లేవు... మతాలు లేవు. పేదవాడు ఒకవైపు, పెత్తందారులు మరోవైపు ఉన్నారన్నదే గుర్తు పెట్టుకోండి.

### గతంలో డబ్బులు ఎందుకు రాలేదు?

నాడు కూడా ఇదే రాష్ట్రం, ఇదే బడ్జెట్! కేవలం మారిందల్లా ముఖ్యమంత్రి ఒక్కడే. అప్పుల పెరుగుదల కూడా అప్పటికన్నా మీ బిడ్డ హయాంలోనే తక్కువే. మరి మీ బిడ్డ ఎలా బటన్ నొక్కగలుగుతున్నాడు? వివక్ష, లంచాలు లేకుండా రూ.2.35 లక్షల కోట్లను అక్కచెల్లెమ్మల ఖాతాల్లో నేరుగా ఎలా జమ చేయగలుగుతున్నాడు? మీకు గతంలో ఎందుకు డబ్బులు రాలేదు? ఆ డబ్బులన్నీ ఎవరి జేబుల్లోకి వెళ్లాయి? అనేది ఆలోచన చేయండి.



లబ్ధిదారుల సమక్షంలో వైఎస్సార్ వాహన మిత్ర నిధులను బటన్ నొక్కి విడుదల చేస్తున్న సీఎం జగన్

### కరకట్ట రిటైనింగ్ వాల్ పొడిగింపు

- రెల్లి, కాపు కమ్యూనిటీ హాల్స్ మంజూరు
- విజయవాడలో మరో ఐదు మసీదులు

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీను నియోజకవర్గ అభివృద్ధి పనుల కోసం అడిగారు. కరకట్ట ప్రాంతంలో రూ.7 కోట్లతో రిటైనింగ్ వాల్ అడిగారు. ఇప్పటికే మనం రూ.400 కోట్లతో రిటైనింగ్ వాల్ కడుతున్నాం. కృష్ణలంక ప్రాంతంలో మీకు కనిపించే ఉంటుంది. ఇందులో భాగంగా ఆయన కోరినట్లుగానే దాన్ని పొడిగిస్తూ రూ.7 కోట్లు కూడా మంజూరు చేస్తున్నాం. ఎస్సీ సోదరుల కోసం రెల్లి కమ్యూనిటీ హాల్ కూడా మంజూరు చేస్తున్నాం. కాపు కమ్యూనిటీ హాల్ అడిగారు. అది కూడా మంజూరు చేస్తున్నా. రూ.3.50 కోట్లతో ఐదు మసీదులు మంజూరు చేస్తున్నా. ఎస్సీ శ్మశానవాటికను కూడా మంజూరు చేస్తున్నా.

### ఇటువైపు స్కీమ్‌లు... అటువైపు స్కామ్‌లు

- నా ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలకు డీబీటీలో 80 శాతం నేరుగా బటన్ నొక్కి పారదర్శకంగా అందచేశాం. గ్రామ, వార్డు సచివాలయాల్లో 83 శాతం ఉద్యోగాలను వారికే అందించిన మనందరి ప్రభుత్వం ఒక వైపున ఉంటే.. మరోవైపున ఎస్సీ కులాల్లో ఎవరైనా పుట్టాలనుకుంటారా? అని హేళన చేసిన అహంకారానికి, బీసీల తోకలు కత్తిరిస్తా.. ఖబడ్దార్? అని బెదిరించిన కండకావరానికి మధ్య యుద్ధం జరగబోతోంది.
- గవర్నమెంట్ స్కూళ్లలో నా ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలు, నా పేద ఓసీ వర్గాల పిల్లలకు సీబీఎస్ఈ విద్యా బోధనను ప్రవేశపెట్టడంతోపాటు అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడేందుకు 'ఐబీ' సిలబస్ దిశగా కూడా అడుగులు వేస్తున్న మనందరి ప్రభుత్వం ఒక వైపున ఉంటే.. మరోవైపున పేద వర్గాలకు ఇంగ్లిషు మీడియం చదువులు అందకూడదని, వారు పెద్ద చదువులు చదవకూడదనే పెత్తందారీ మనస్తత్వం ఉన్న వారితో ఎన్నికల సంగ్రామం జరగనుంది.
- పేదలెవరూ గూడులేక ఇబ్బంది పడకూడదని రాష్ట్రవ్యాప్తంగా 30.76 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు ఇళ్ల పట్టాలిచ్చి ఒక ఇంటి వారు కావాలని తపిస్తున్న మనందరి ప్రభుత్వం ఒకవైపున ఉంటే.. మరోవైపున ఈ పేదలకు ఇళ్లపట్టాలే ఇవ్వకూడదు, వారికి ఇళ్లపట్టాలిస్తే డెమోగ్రాఫిక్ ఇంబ్యాలన్స్ అంటే కులాల మధ్య వ్యత్యాసం వస్తుందని ఏకంగా కోర్టులకెళ్లి కేసులు వేస్తున్న ఆ పెత్తందారులతో ఎన్నికల యుద్ధం జరగబోతోంది.
- ఒక్క పైసా కూడా లంచాలకు తావు లేకుండా, వివక్ష లేకుండా బటన్ నొక్కి నేరుగా ఏకంగా రూ.2.35 లక్షల కోట్లను పేదల ఖాతాల్లోకి పారదర్శకంగా పంపించిన మీ బిడ్డ ప్రభుత్వం ఒకవైపు ఉంటే... మరోవైపున ఫైబర్ గ్రిడ్ స్కామ్, స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్, ఇన్నర్ రింగ్ రోడ్డు స్కామ్, అసైన్డ్ భూముల స్కామ్, అమరావతి పేరిట చేసిన అతిపెద్ద దగా, జన్మభూమి కమిటీల పేరిట చేసిన దుర్మార్గాలు, నీరు – చెట్టు పేరిట సాగించిన దోపిడీ, రైతులకు చేసిన మోసాలు, అక్కచెల్లెమ్మలకు మాట ఇచ్చి చేసిన వంచనలు, పిల్లలను సైతం వదలకుండా అన్ని వర్గాలను మోసం చేసిన వారితో ఎన్నికల యుద్ధం జరగబోతుంది.

### ఆ గజదొంగల ముఠాను నమ్మి మోసపోకండి

వాళ్ల మాదిరిగా నాకు ఒక గజదొంగల ముఠా తోడుగా లేదు. ఈనాడు, ఆంధ్రజ్యోతి తోడుగా లేదు. టీవీ 5 అండగా లేదు. ఒక దత్తపుత్రుడు తోడు అంతకన్నా లేదు. దోచుకుని, పంచుకుని, తినుకోవడం నా విధానం కాదు. నేను నమ్ముకున్నది పైన దేవుడిని, ఆ తర్వాత మిమ్మల్నే. అదే నా విధానం. వారికి అధికారం కావాల్సింది దోచుకోవడానికి.. దోచుకున్నది పంచుకోవడానికి.. పంచుకున్నది తినడానికే! రాబోయే రోజుల్లో వాళ్లు మీ ఇంటికి వస్తారు. ఒక్కో ఇంటికి కేజీ బంగారం, ఒక బెంజ్ కారు కూడా ఇస్తామని కూడా చెబుతారు. అటువంటి వాళ్లు చెబుతున్న అబద్ధాలను నమ్మకండి. మీ ఇంటిలో మీకు మంచి జరిగిందా.. లేదా? అన్నదే కొలమానంగా తీసుకోండి. మీ ఇంట్లో మంచి జరిగి ఉంటే మీ బిడ్డకు మీరే సైనికుడిలా అండగా నిలబడండి.

# 'ఉపాధి'కి ఇంధనం

- డ్రైవర్ సోదరులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్ కచ్చితంగా తీసుకోండి
- ఎంతోమందికి సేవలందిస్తున్న మీకు ప్రభుత్వం తోడుగా నిలబడుతుంది: సీఎం జగన్

**సాక్షి, అమరావతి:** ఆటోలు, టాక్సీలను నడిపే డ్రైవర్ సోదరులు స్వయం ఉపాధి పొందడమే కాకుండా రోజూ లక్షలమంది ప్రయాణికులకు సేవలందిస్తున్నారని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. సొంతంగా ఆటోలు, టాక్సీలు కలిగి ఉండి వాటిని నడిపే వారికి ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్‌తో పాటు ఇతర ఖర్చుల కోసం ఏడాదికి రూ.పది వేల దాకా ఖర్చవుతోందన్నారు. అంత మొత్తం భరించేందుకు ఇబ్బందిపడే పరిస్థితుల్లో ఉన్న అన్నదమ్ములు, అక్కచెల్లెమ్మలకు మంచి చేసేందుకే ఏటా రూ.10 వేల ఆర్థిక సాయం అందించేందుకు 'వైఎస్ఆర్ వాహనమిత్ర' పథకాన్ని తెచ్చినట్లు తెలిపారు. వరుసగా ఐదో ఏడాది ఈ పథకం ద్వారా మంచి చేస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం విజయవాడలోని విద్యాధరపురంలో నిర్వహించిన కార్యక్రమంలో బటన్ నొక్కి 2,75,931 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.275.93 కోట్ల వైఎస్సార్ వాహన మిత్ర పథకం ఐదో విడత ఆర్థిక సాయాన్ని నేరుగా బ్యాంకు ఖాతాల్లో సీఎం జగన్ జమ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ముఖ్యమంత్రి జగన్ ప్రసంగించారు. ఆ వివరాలివీ..

### మీలో ఒకడిగా.. 'వాయిస్ ఆఫ్ ది వాయిస్‌లెస్'!

ఇవన్నీ ఎవరో చెబితేనో.. ఎవరో ఉద్యమాలు చేస్తేనో తీసుకొచ్చినవి కావు. నా 3,648 కి.మీ. పాదయాత్రలో మీ సమస్యలను కళ్లారా చూశా. మీలో ఒకడిగా నాలుగేళ్లుగా మీ సమస్యల పరిష్కారం కోసం అడుగులు వేస్తున్నాం. ప్రజాస్వామ్య వ్యవస్థలో 'వాయిస్ ఆఫ్ ది పీపుల్..' అంటారు. మీ బిడ్డ పాలనలో 'వాయిస్ ఆఫ్ ది వాయిస్‌లెస్' అంటే... తమ కష్టాన్ని చెప్పుకోలేని, తన ఆర్తిని వినిపించలేని పేదల గొంతుకై వాళ్ల తరపున నిలబడుతున్న ప్రభుత్వం మనది. కాబట్టే అట్టడుగున ఉన్న పేదవాడు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని మనసా వాచా కర్మణా మీ బిడ్డ నమ్మాడు కాబట్టి ఆ దిశగా నాలుగేళ్లలో అడుగులు పడ్డాయి. **- సీఎం జగన్**

### ఐదేళ్లలో రూ.1,301.89 కోట్లు..

ఆటోలు, ట్యాక్సీలు నడుపుకొంటున్న నా అన్నదమ్ములు, అక్కచెల్లెమ్మల చేతుల్లో నేరుగా రూ.10 వేలు పెడుతున్నాం. ఈ డబ్బు ఎలా వాడతారు? దేనికి వినియోగిస్తారన్నది నేను అడగను. కానీ మీ అందరికి సవినయంగా ఒక్కటి విజ్ఞప్తి చేస్తున్నా. మీ వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్ కచ్చితంగా ఉండేలా చూసుకోండి. మీ వాహనంలో ప్రయాణికులు ఉన్నారని, మీకూ కుటుంబాలు ఉన్నాయనే విషయాన్ని మర్చిపోవద్దు. ఎంతోమందికి సేవలందిస్తున్న మీకు ప్రభుత్వం తోడుగా నిలబడుతుంది. ఒక్క ఏడాది కూడా ఈ పథకాన్ని ఆపకుండా ఐదేళ్లలో ఐదు విడతల్లో ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున సహాయం చేయడం ద్వారా ఒక్క వైఎస్సార్ వాహన మిత్ర ద్వారానే ఇప్పటివరకు రూ.1,301.89 కోట్లను నేరుగా అందించాం.

### గడప వద్దకే సంక్షేమం

ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ, గృహ నిర్మాణాలు, రేషన్ కార్డుల దగ్గర నుంచి పెన్షన్ల దాకా, జనన, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలన్నీ ఇంటివద్దకే తీసుకొచ్చి అందిస్తున్నాం. మీ అవసరాలు ఏమిటో జల్లెడ పట్టి మరీ తెలుసుకుని నవరత్నాల్లోని ప్రతి సంక్షేమ పథకాన్ని నేరుగా గడపవద్దకే చేర్చుతున్నాం. నా పేద అన్నదమ్ములు, అక్కచెల్లెమ్మల పిల్లలు గొప్పగా చదవాలన్న ఆరాటంతో మన గ్రామంలోని ప్రభుత్వ బడికే ఇంగ్లిష్ మీడియం చదువులను తెచ్చాం. లంచాలు, వివక్షకు తావు లేకుండా వలంటీర్, సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చాం. మీ గ్రామానికే విలేజ్ క్లినిక్ తీసుకొచ్చి మీకు అందుబాటులో ఉంచాం. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను పరిచయం చేయడంతోపాటు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఇంట్లో బీపీ, షుగర్, హెచ్‌బీ, కఫం టెస్టులను నిర్వహిస్తూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని తపన పడుతున్నాం. గ్రామ, వార్డు స్థాయిలోనే మహిళా పోలీసులను ఏర్పాటు చేశాం. ప్రతి అక్కచెల్లెమ్మ ఫోన్‌లో దిశ యాప్ ఉండేలా చూస్తున్నాం. విత్తనాల నుంచి విక్రయాల దాకా రైతన్నలకు ప్రతి అడుగులోనూ తోడుగా నిలుస్తూ ఆర్బీకేలను తీసుకొచ్చాం.

### రైతన్నలు.. నేతన్నలు.. గంగపుత్రులు

రాష్ట్రంలో 52.39 లక్షల మంది రైతన్నల కష్టాలు, కన్నీళ్లు తెలిసిన ప్రభుత్వంగా వారికి తోడుగా నిలబడుతున్నాం. ఒక్క వైఎస్ఆర్ రైతుభరోసా కోసమే రూ.30,985 కోట్లు ఖర్చు చేశాం. పంటలు వేసే సమయానికి పెట్టుబడి ఖర్చుల కింద రైతన్నల చేతుల్లో డబ్బులు పెట్టాం. ఇలాంటి మేలు చేసిన ప్రభుత్వం రాష్ట్ర చరిత్రలో మరొకటి లేదని అన్నదాతలకు తెలుసు. వేట నిషేధ సమయంలో ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్న మత్స్యకార సోదరులకు అండగా నిలుస్తూ మత్స్యకార భరోసా ద్వారా 2.43 లక్షల కుటుంబాలకు ఐదేళ్లలో ఏకంగా రూ.538 కోట్లు అందించాం. మగ్గం కదిలితే తప్ప బతుకు బండి నడవని 82 వేల చేనేత కుటుంబాలకు ఐదేళ్లలో ఒక్క నేతన్న నేస్తం పథకం ద్వారానే రూ.982 కోట్లు అందించి అండగా నిలిచాం.

### తోడు అందిస్తూ.. చేదోడుగా నిలుస్తూ

రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితుల్లో రోడ్డు పక్కనే, ఫుట్‌పాత్‌ల మీద విక్రయాలు సాగించే చిరువ్యాపారులను ఆదుకునేందుకు జగనన్న తోడు, జగనన్న చేదోడు పథకాలను అమలు చేస్తున్నాం. వాళ్ల వ్యాపారాలు ఎలా చేసుకుంటున్నారు...? అందుకు పెట్టుబడి ఎక్కడ నుంచి వస్తుంది? ఆ పెట్టుబడి కోసం ఎంతెంత వడ్డీకి డబ్బులు తెస్తున్నారో గతంలో ఎవరూ పట్టించుకోలేదు. అలాంటి 15.87 లక్షల మంది చిరువ్యాపారులకు జగనన్న తోడు పథకం ద్వారా ఇప్పటివరకు వడ్డీలేని రుణాల రూపంలో రూ.2956 కోట్లు అందించాం. రజక సోదరులు, నాయీ బ్రాహ్మణులు, టైలర్ అన్నదమ్ములు, అక్కచెల్లెమ్మల కోసం జగనన్న చేదోడు పథకం తీసుకొచ్చి 3.30 లక్షల మందికి ఇప్పటివరకు రూ.927 కోట్లు సాయం అందించాం.

### అమ్మ ఒడి.. విద్యా దీవెన.. వసతి దీవెన

అక్కచెల్లెమ్మలు బాగుంటేనే ఆ కుటుంబాలు బాగుంటాయి. పిల్లల చదువుల కోసం తల్లిదండ్రులు ఇబ్బంది పడకుండా మీ బిడ్డ జగనన్న అమ్మఒడి పథకాన్ని తెచ్చాడు. 52 నెలల్లో 44.48 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు తోడుగా ఉంటూ అమ్మఒడి కోసం రూ.26 వేల కోట్లు విడుదల చేశాం. 26.99 లక్షల మంది తల్లులకు వారి పిల్లల పెద్ద చదువుల కోసం విద్యా దీవెన ద్వారా అందించిన సహాయం రూ.11,317 కోట్లు. జగనన్న వసతి దీవెన బోర్డింగ్, లాడ్జింగ్ ఖర్చులు చెల్లిస్తున్నాం. ఏడాదికి రూ.20 వేలు వరకు అందిస్తూ జగనన్న వసతి దీవెన కోసం రూ.4,275 కోట్లు వెచ్చించాం.

### అక్కచెల్లెమ్మలను ఆదుకుంటూ...

చంద్రబాబు రుణమాఫీ హామీని నమ్మి పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలు మోసపోయారు. మాట ప్రకారం వారిని ఆదుకుంటూ వైఎస్ఆర్ ఆసరా పథకాన్ని తెచ్చి 80 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు రూ.19,178 కోట్లు ఇచ్చాం. లేదంటే చంద్రబాబు మోసాలతో 18 శాతం ఉన్న ఎన్పీఏలు, అవుట్ స్టాండింగ్ లోన్స్ 50 శాతం దాటేవి. అక్కచెల్లెమ్మలకు వైఎస్ఆర్ సున్నా వడ్డీ కూడా వర్తింపచేసి దాదాపు రూ.5 వేల కోట్లు ఇచ్చి తోడుగా నిలబడ్డాం. 26.40 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అక్కచెల్లెమ్మలకు వైఎస్ఆర్ చేయూత పథకం ద్వారా రూ.14,129 కోట్లు వారి చేతుల్లో పెట్టాం. వైఎస్ఆర్ కాపునేస్తం ద్వారా 3.58 లక్షల మంది కాపు అక్కచెల్లెమ్మలకు రూ.2,029 కోట్లు సాయం అందించాం. వైఎస్ఆర్ ఈబీసీ నేస్తం ద్వారా 4.39 లక్షల మంది ఓసీ నిరుపేద అక్కచెల్లెమ్మలకు అందించిన సహాయం రూ.1,257 కోట్లు. 30.76 లక్షలమంది అక్కచెల్లెమ్మలకు ఇళ్ల స్థలాలిచ్చాం. ఇప్పటికే 21.32 లక్షల ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. తమకు ఇంతగా మేలు చేసిన ప్రభుత్వం రాష్ట్ర చరిత్రలోనే కాదు.. దేశ చరిత్రలోనే మరొకటి లేదని నా అక్కచెల్లెమ్మలకు తెలుసు. ఇవన్నీ ఎవరో అడిగితేనో, ఎవరో ఉద్యమాలు చేస్తేనో వచ్చినవి కావు. ఇవన్నీ కూడా మీ బిడ్డ.. మీలో ఒకడు ముఖ్యమంత్రి అయ్యాడు కాబట్టే.. మీ కష్టాలు, సుఖాలు తెలిసిన వ్యక్తి ముఖ్యమంత్రి అయ్యాడు కాబట్టే.. ఇది మీ ప్రభుత్వం కాబట్టే ఇవన్నీ జరుగుతున్నాయి.

### హాజరైన మంత్రులు, ఎమ్మెల్యేలు

కార్యక్రమంలో మంత్రులు పి.విశ్వరూప్, జోగి రమేశ్, తానేటి వనిత, ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, వసంత కృష్ణ ప్రసాద్, రక్షణనిధి, కైలే అనిల్ కుమార్‌లతోపాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### రాష్ట్రానికి జగనన్న అవసరం



నేను విజయవాడలో 15 ఏళ్లుగా సీఎన్‌జీ ఆటో నడుపుతున్నాను. గతంలో ఇక్కడ 4 సీఎన్‌జీ స్టేషన్లు మాత్రమే ఉండడంతో గ్యాస్ కోసం రోజంతా పడిగాపులు పడేవాళ్లం. ఆటోలకు ఇన్సూరెన్స్‌లు, ఫిట్‌నెస్‌లు చేయించుకోవడానికి కూడా కుదిరేది కాదు. పాదయాత్రలో మా సమస్యలు మీకు చెప్పగానే సానుకూలంగా స్పందించారు. మీరు సీఎం అవ్వగానే వాహనమిత్ర పథకం ద్వారా మాకు సాయం చేస్తున్నారు. ఈ విడతతో కలిపి నాకు రూ.50,000 వచ్చాయి. **మీ** చొరవతో విజయ వా డలో ఉన్న సీఎన్‌జీ స్టేషన్లు 4 నుంచి 15 **అయ్యాయి.** కోవిడ్ వల్ల రవాణా రంగం కుదేలైపోతే మానవత్వంతో మాకు 5 నెలల ముందే వాహనమిత్ర సాయం అందించా రు. నా తల్లి 2 నెలలు గవర్నమెంట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంటే వలంటీర్ వచ్చి పెన్షన్ ఇచ్చారు. మా అమ్మ చనిపోయే వరకు రూ. 81 వేలు వచ్చాయి. నా కూతురుకి అమ్మ ఒడి సాయం అందింది. నా కుమారుడికి వసతిదీవెన ద్వారా రూ.20 వేలు, ఇంజినీరింగ్ చదువుకు రూ.2,20,320 వచ్చాయి. మొత్తం నా కుటుంబానికి రూ.3,85,300 లబ్ధి కలిగింది. నా ఆటోకు ఇంధనం ఎంత అవసరమో... ఈ రాష్ట్రానికి జగనన్న కూడా అంతే అవసరం.

**– వినోద్, ఆటో డ్రైవర్, వాహనమిత్ర లబ్ధిదారుడు, విజయవాడ**

# అధైర్య పడొద్దు... అండగా ఉంటా

- బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పిన సీఎం జగన్
- తక్షణమే సాయం అందించిన కలెక్టర్

**సాక్షి ప్రతినిధి, విజయవాడ:** విజయవాడలోని విద్యాధరపురం స్టేడియం గ్రౌండ్‌లో సీఎం వైఎస్ జగన్ వైఎస్సార్ వాహన మిత్ర లబ్ధిదారులకు శుక్రవారం ఐదో విడత ఆర్థిక సాయం విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి హాజరై తిరిగి క్యాంపు కార్యాలయానికి వెళ్లే సమయంలో పొందుగుల చిన్నారెడ్డి, నాగోజీ చంద్ర శేఖర్‌ల అనారోగ్య సమస్యలను ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు సీఎంకు వివరించారు. విజయవాడ భవానీపురానికి చెందిన పొందుగుల చిన్నారెడ్డికి ఇటీవల జరిగిన ప్రమాదంలో వెన్నుపూస దెబ్బతింది. తాను ఏ పని చేయలేకపోతున్నానని, తన ఇద్దరు కుమార్తెలతో జీవనోపాధి ఇబ్బందికరంగా ఉందని సీఎంకు చెప్పారు. సమస్యను విన్న సీఎం జగన్ చలించి మానవతా దృక్పథంతో ఆర్థిక సహాయం చేయాల్సిందిగా జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. అలాగే భవానీపురానికే చెందిన నాగోజీ చంద్ర శేఖర్ తన కిడ్నీలు పాడైపోయిన కారణంగా ఆర్థిక కారణాలతో వైద్యం చేయించుకోవడానికి ఇబ్బందిగా ఉందని ముఖ్యమంత్రికి వివరించారు. అతని సమస్యను విన్న సీఎం వైద్య సేవల నిమిత్తం ఆర్థిక సహాయం చేయాల్సిందిగా కలెక్టర్‌ను ఆదేశించారు. ఇరువురి సమస్యను విన్న సీఎం జగన్ అధైర్య పడొద్దు అండగా ఉంటానని వారికి ధైర్యం చెప్పారు. సీఎం ఆదేశించిన వెంటనే ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఎమ్మెల్యే వెలంపల్లితో కలిసి శ్రీనివాసరెడ్డికి రూ.10 లక్షలు, చంద్రశేఖర్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.లక్ష చెక్కును అందజేశారు.



చిన్నారెడ్డి సమస్యను వింటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

చిన్నారెడ్డికి రూ.10 లక్షల చెక్కు అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే





చంద్రశేఖర్‌కు రూ.లక్ష చెక్కు అందజేస్తున్న కలెక్టర్,ఎమ్మెల్యే

చంద్రశేఖర్ సమస్యను వింటున్న సీఎం జగన్



# ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠా అరెస్ట్

## రూ.8 లక్షలు నష్టపోయిన వ్యక్తి ఫిర్యాదుతో రాకెట్ వెలుగులోకి

- పోలీసుల అదుపులో 11 మంది బుకీలు
- వారి పేరిట ఉన్న 63 బ్యాంక్ అకౌంట్లు ఫ్రీజ్
- 36 ఖాతాల ద్వారా రూ.367.62 కోట్ల లావాదేవీలు జరిగినట్లు గుర్తింపు
- మీడియాకు వివరాలు వెల్లడించిన డీసీపీ–1 శ్రీనివాసరావు



మీడియాతో డీసీపీ -1 శ్రీనివాసరావు తదితరులు

దొండపర్తి : ఆన్‌లైన్ ద్వారా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ముఠాకు విశాఖ పోలీసులు చెక్ పెట్టారు. బెట్టింగ్ వేసే వారిని నిలువునా ముంచుతున్న బుకీ గ్యాంగ్‌లో 11 మందిని అరెస్ట్ చేశారు. పోలీస్ కమిషనరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం డీసీపీ–1 కె.శ్రీనివాసరావు మీడియాకు వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. క్రికెట్ బెట్టింగ్ పేరుతో రూ.8 లక్షల వరకు తనను మోసం చేశారని నగరానికి చెందిన ఒక వ్యక్తి ఇటీవల పోలీస్ స్పందనలో ఫిర్యాదు చేశాడు. ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న పోలీసులు వెంటనే దర్యాప్తు ప్రారంభించారు. ఈ విషయంలో తీగ లాగితే డొంక కదిలింది. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలానికి చెందిన మెరుపురెడ్డి సూరిబాబు ఈ ముఠాలో ప్రధాన సూత్రధారుల్లో ఒకరుగా పోలీసులు గుర్తించారు. అంతర్జాతీయ, ఐపీఎల్ మ్యాచ్‌ల సమయంలో 20 నుంచి 30 మంది మంది నుంచి డబ్బులు వసూలు చేసి ఒక్కో మ్యాచ్‌కు రూ.4 లక్షల వరకు బెట్టింగ్ చేసేవాడు. ఇలా ఏడాదికి రూ.5 కోట్ల నుంచి రూ.6 కోట్లు బిజినెస్ టర్నోవర్ చేసేవాడు. ఇలా సేకరించిన మొత్తాన్ని నగరంలోని సూర్యాబాగ్ ప్రాంతంలో టూర్స్ అండ్ ట్రావెల్స్ నడిపిస్తున్న దినేష్‌కుమార్ అనే వ్యక్తికి పంపేవాడు. ఇందుకు అతడికి 2 శాతం కమీషన్ ఇచ్చేవాడు. ఇలా తనకు తెలిసిన వ్యక్తులను కూడా బుకీలుగా మార్చి బెట్టింగ్ సామ్రాజ్యాన్ని విస్తరించాడు. ఈ బుకీ గ్యాంగ్ గుట్టుగా బెట్టింగ్ నిర్వహించడంతో పాటు.. బెట్టింగ్ వేసే వారికి డబ్బులు నష్టపోయేలా సాఫ్ట్‌వేర్లను రూపొందించారు. సాధారణంగా గెలిచే అవకాశమున్న జట్టుకు తక్కువ పర్సెంట్, ఓడిపోయే అవకాశాలున్న జట్టుకు ఎక్కువ శాతం డబ్బును ఆఫర్ చేస్తుంటారు. ఆ విధంగా జట్టు మీద బెట్టింగ్ వేశాక కొంత సమయం వరకు వాటిని వేరొక జట్టుకు మార్చుకునే అవకాశం ఉంటుంది. కానీ వీరు అలా మార్చడానికి అవకాశం లేకుండా ఆ సమయంలో సర్వర్‌ను ఆఫ్ చేసేవారు. ప్రధానంగా గేమ్ విన్నర్, లాస్ ఆప్షన్స్.. హ్యాండ్లర్ చేతిలో ఉండడంతో ఒకవేళ గెలిచినప్పటికీ నష్టం వచ్చిందని చెప్పి వారి ఐడీని బ్లాక్ చేస్తారు. ఆ డబ్బును తమ కరెంట్ అకౌంట్లలోకి జమ చేసి వాటి నుంచి కార్పొరేట్ ఖాతాల్లోకి బదిలీ చేస్తున్నట్టు పోలీసుల విచారణలో నిర్ధారణైంది. ఈ గ్యాంగ్‌కు సంబంధించిన 63 బ్యాంక్ ఖాతాలను గుర్తించి ఫ్రీజ్ చేయగా.. అందులో 36 ఖాతాల ద్వారా ఇప్పటి వరకు రూ.367.62 కోట్లకు పైగా లావాదేవీలు జరిగినట్టు గుర్తించారు. వాటిలో 13 అకౌంట్లలో ఉన్న రూ.75 లక్షలు స్తంభింపచేసినట్లు పోలీసులు చెప్పారు. అరెస్ట్ అయిన వారిలో సూరిబాబు, విశాఖకు చెందిన హండ దినేష్‌కుమార్, బర్రి శ్రీను, గుర్రం శివ, కిల్లాడి శ్రీనివాసరావు, ఉరిటి కొండబాబు, ఉరిటి వెంకటేశ్వర్లు, సుందరాపు గణేష్, దూలి నూకరాజు, అల్లు నూకరాజు అవినాష్, ఉప్పు వాసుదేవరావులున్నారు. ఈ రాకెట్ వెనుక ప్రధాన సూత్రదారి కోసం గాలిస్తున్నట్టు డీసీపీ–1 శ్రీనివాస్ తెలిపారు. సమావేశంలో ఏడీసీపీ(ఎస్‌బీ) నాగేంద్రుడు, సైబర్ క్రైం సీఐ భవాని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మరింత సులభంగా ధృవీకరణ పత్రాలు

**కుల, నివాస, జనన ధృవీకరణ పత్రం ఒకసారి పొందితే చాలు**

- ఒరిజినల్ పోయినా అదే నంబరుతో కొత్త సర్టిఫికెట్
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- కొత్త సర్టిఫికెట్స్ కోసం ఒత్తిడి తేవద్దని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు ఆదేశాలు

సాక్షి, అమరావతి: విద్య, ఉద్యోగ ఇతర అవసరాల కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాల వారికి జారీ చేసే వివిధ రకాల ధృవీకరణ పత్రాల జారీని ప్రభుత్వం మరింత సులభతరం చేసింది. ఈ మేరకు మార్గదర్శకాలను విడుదల చేస్తూ శుక్రవారం రాత్రి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేసారు. కుల, నివాస, జనన వివరాలతో కూడిన ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్ ఒకసారి తీసుకొంటే చాలని స్పష్టం చేసింది. ఒకసారి పొందిన సర్టిఫికెట్లను శాశ్వత ధృవీకరణ పత్రాలుగా పరిగణించాలని, ప్రతిసారీ కొత్త సర్టిఫికెట్ కోసం ఒత్తిడి తేవద్దని పాఠశాల, ఉన్నత, సాంకేతిక, వైద్య విద్య శాఖలు, స్కిల్ డెవలప్‌మెంట్, వ్యవసాయ, పశు సంవర్ధక, మత్స్య తదితర సంక్షేమ శాఖలతో సహా అన్ని ప్రభుత్వ శాఖలు, ప్రైవేటు సంస్థలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

ఈ సర్టిఫికెట్లు ఎక్కడైనా పోయినా, వాటి కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా గ్రామ, వార్డు సచివాలయం లేదా మీ సేవా కేంద్రాల్లో అదే నంబరుతో కొత్తది పొందే వెసులుబాటు కల్పించింది. ఇందుకు ఎలాంటి అదనపు డాక్యుమెంట్లు సమర్పించాల్సిన అవసరం లేదు. దరఖాస్తుదారు తన వద్ద ఉండే జిరాక్స్ కాపీలో పేర్కొన్న నంబరు చెబితే కొత్తది ఇస్తారు. కుటుంబంలో గతంలో ఎవరూ ఎలాంటి ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్ పొంది ఉండకపోతే దరఖాస్తుదారు ప్రస్తుతం ఈకేవైసీ చేయించుకొని తహసీల్దార్ ద్వారా ధృవీకరణ పత్రం పొందాలి. ఒక వేళ దరఖాస్తుదారు ఈకేవైసీ చేయించుకొని సర్టిఫికెట్ పొంది ఉంటే, అతని తండ్రి లేదా తండ్రి తరఫున రక్త సంబంధీకులు ఎవరైనా ఎలాంటి వెరిఫికేషన్ లేకుండా ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం తహసీల్దార్ నుంచి కుల ధృవీకరణ పత్రం పొందొచ్చు.

## శ్రీవారి సర్వ దర్శనానికి 30 గంటలు

తిరుమల: తిరుమలలో శుక్రవారం భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండిపోయి శిలాతోరణం వద్దకు క్యూ చేరుకుంది. గురువారం అర్ధరాత్రి వరకు 54,620 మంది శ్రీవారిని దర్శించుకుని హుండీలో రూ.2.98 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలో, దర్శన టికెట్లు లేనివారికి 30 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టోకెన్లు ఉన్నవారికి 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. కాగా, తిరుమలలో శుక్రవారం కురిసిన భారీ వర్షంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

**12 అడుగుల భారీ జెర్రిపోతు**


అతిథిగృహం వద్ద భారీ జెర్రిపోతు

తిరుమలలోని లక్ష్మీనివాస్ అతిథిగృహం వద్ద శుక్రవారం భారీ జెర్రిపోతు కలకలం సృష్టించింది. అతిథిగృహం సమీపంలో జెర్రిపోతు ఉన్నట్లు ఉద్యోగులు గుర్తించి టీటీడీ అటవీ ఉద్యోగి భాస్కరనాయుడుకు సమాచారమిచ్చారు. ఆయన అక్కడికి చేరుకుని 12 అడుగుల జెర్రిపోతును చాకచక్యంగా పట్టుకుని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

## ఫైబర్‌గ్రిడ్ కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వండి

- హైకోర్టులో చంద్రబాబు పిటిషన్
- పూర్తి వివరాలు సమర్పించాలని సీఐడీకి హైకోర్టు ఆదేశం
- విచారణ 4కి వాయిదా

సాక్షి, అమరావతి : ఫైబర్ గ్రిడ్ ప్రాజెక్టులో పెద్ద ఎత్తున ఆర్థిక అక్రమాలు జరిగాయంటూ సీఐడీ నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు.. ఫైబర్ గ్రిడ్ కేసు పూర్తి వివరాలను తమ ముందుంచాలని సీఐడీని ఆదేశించింది. తదుపరి విచారణను అక్టోబర్ 4కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.చంద్రబాబు తరఫున సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. 2021 సెప్టెంబర్‌లో నమోదు చేసిన కేసులో చంద్రబాబును సీఐడీ ఇటీవల 25వ నిందితునిగా చేర్చిందని తెలిపారు. ఆ మేర ఏసీబీ కోర్టులో పీటీ వారెంట్ దాఖలు చేసిందన్నారు.

**ఇదీ కేసు..**


చంద్రబాబు ప్రభుత్వం హయాంలో ఫైబర్ గ్రిడ్ ప్రాజెక్టుకు సంబంధించి రూ.321 కోట్ల మేర కుంభకోణం జరిగింది. ఈ ప్రాజెక్టు టెండర్‌ను టెరాసాఫ్ట్ కంపెనీకి అప్పగించారని, ఇందులో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని, దీని వెనుక అప్పటి ప్రభుత్వ పెద్దల పాత్ర ఉందంటూ ఏపీ ఫైబర్ నెట్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ 2021లో సీఐడీకి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా సీఐడీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

## బాబు కనుసన్నల్లోనే ఐఆర్‌ఆర్ అలైన్‌మెంట్ మార్పు

**హైకోర్టుకు నివేదించిన ఏజీ శ్రీరామ్**

సాక్షి, అమరావతి : అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు (ఐఆర్‌ఆర్) అలైన్‌మెంట్‌లో మార్పులు అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు కనుసన్నల్లోనే జరిగాయని సీఐడీ హైకోర్టుకు తెలిపింది. అలైన్‌మెంట్ ఎలా ఉండాలో ముందే ఓ నిర్ణయానికి వచ్చి, దానికి అనుగుణంగా ప్రాజెక్టు పనులు దక్కించుకున్న సంస్థ చేత అలైన్‌మెంట్‌ను తయారు చేయించారని వివరించారు. ఈ మార్పుల ద్వారా వ్యాపారవేత్త లింగమనేని రమేశ్‌కు చంద్రబాబు లబ్ధి చేకూర్చారని చెప్పింది. అందుకు ప్రతిఫలంగా రమేష్ కృష్ణానది కరకట్ట సమీపంలో ఉన్న తన ఇంటిని చంద్రబాబుకు ఇచ్చారని తెలిపింది. ఇది క్విడ్ ప్రోకోయేనని వెల్లడించింది. ఇప్పటికే స్కిల్ కుంభకోణం కేసులో అరెస్టయి రిమాండ్ ఖైదీగా ఉన్న చంద్రబాబు.. ఐఆర్‌ఆర్ ముసుగులో జరిగిన భూ దోపిడీ కేసులో ముందస్తు బెయిలు కోరుతూ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి శుక్రవారం మరోసారి విచారణ జరిపారు. ఈ సందర్భంగా సీఐడీ తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపించారు. అలైన్‌మెంట్ మార్పు వల్ల రమేశ్ భూములను కాపాడటమే కాక, వాటి విలువ ఎంతో పెరిగేలా చేశారని ఆయన వివరించారు. రమేశ్ బ్యాంకు ఖాతాల్లో పెద్ద ఎత్తున డబ్బు కూడా జమ చేశారని, అందుకు లెక్కలు కూడా చూపలేదన్నారు. దానిని ఇంటి అద్దెగా చంద్రబాబు తదితరులు చెబుతున్నారని తెలిపారు. రెండేళ్ల తరువాత అద్దె చెల్లించడంలో అంతరార్థం ఏమిటో తెలుసుకోవాల్సి ఉందని అన్నారు. ఇందుకోసం చంద్రబాబును కస్టడీలోకి తీసుకుని విచారించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఇన్నర్ రింగ్ రోడ్డు ప్రాజెక్టు అమలు వెనుక అవినీతి జరిగింది కాబట్టే అవినీతి నిరోధక చట్టం కింద కూడా చంద్రబాబుపై కేసు నమోదు చేశామని చెప్పారు. ఐఆర్‌ఆర్ అలైన్‌మెంట్ ప్రాజెక్టును నామినేషన్ పద్ధతిలో అప్పగించడాన్ని అప్పటి సీఆర్‌డీఏ అధికారులు వ్యతిరేకించారని, వాటిని పట్టించుకోకుండా చంద్రబాబు ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. దురుద్దేశంతో అర్హత నిబంధనలు కుదించేశారన్నారు. అలైన్‌మెంట్ పరిధిలోకి కావాల్సిన వారి భూములు రాకుండా జాగ్రత్త పడ్డారని తెలిపారు. మాస్టర్ ప్లాన్‌ను సైతం అలాగే రూపొందించారని వివరించారు. ప్రాజెక్టు రూపకల్పన, అమలు, దాని వెనుక ఉన్న ఉద్దేశాలను చూడాలని కోర్టును కోరారు. ఈ ప్రాజెక్టు వెనుక క్విడ్ ప్రో కో ఉందన్నారు. ఐఆర్‌ఆర్ పేరుతో ఆస్తులు అమ్ముకుని, డబ్బు గడించారని తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో చంద్రబాబు అరెస్టయి రిమాండ్‌లో ఉన్న నేపథ్యంలో ఈ కేసులో కూడా ఆయన అరెస్ట్ అయినట్లు భావించడానికి వీల్లేదన్నారు. అలా భావిస్తే దర్యాప్తునకు తీవ్ర విఘాతం కలుగుతుందని చెప్పారు. అందువల్ల ఈ కేసులో చంద్రబాబుకు బెయిల్ మంజూరు చేయవద్దని కోర్టును కోరారు. చంద్రబాబు తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా, దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. లింగమనేనికి చెల్లించిన అద్దెపై సీఐడీకి అనుమానాలుంటే చంద్రబాబుకు నోటీసులు జారీ చేసి వివరణ కోరితే పూర్తి వివరాలు సమర్పించే వారిమని అన్నారు. ఇంత చిన్న దానికి కస్టోడియల్ విచారణ అవసరం ఏముందన్నారు. తాము చెల్లించిన డబ్బుకు రమేశ్ లెక్కలు చూపకుంటే అది చంద్రబాబు తప్పెలా అవుతుందని ప్రశ్నించారు. ఈ కేసులో సీఐడీ వాస్తవాలను కప్పిపుచ్చుతోందన్నారు. సీఐడీ దర్యాప్తు మొత్తం పక్షపాతంతో సాగుతోందన్నారు. కోర్టు సమయం ముగియడంతో న్యాయమూర్తి తదుపరి విచారణను అక్టోబర్ 3కి వాయిదా వేశారు.

# 5న కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ భేటీ



- 3లోగా తాగునీటి అవసరాలకు ప్రతిపాదనలు పంపాలని సూచన
- రెండు రాష్ట్రాల ఈఎన్‌సీలకు కృష్ణా బోర్డు సభ్య కార్యదర్శి లేఖ

సాక్షి, అమరావతి: వర్షాభావ పరిస్థితులవల్ల దిగువ కృష్ణా బేసిన్‌లోని ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జునసాగర్‌లలో నీటి నిల్వలు కనిష్ఠంగా ఉన్న నేపథ్యంలో మే 31 వరకూ తాగునీటి అవసరాలపై చర్చించేందుకు హైదరాబాద్‌లో అక్టోబర్ 5న త్రిసభ్య కమిటీ సమావేశాన్ని కృష్ణా బోర్డు నిర్వహించనుంది. శ్రీశైలం, నాగార్జునసాగర్‌ల నుంచి మే 31 వరకూ తాగునీటి అవసరాలకు ఎన్ని నీళ్లు అవసరమో అక్టోబర్ 3లోగా ప్రతిపాదనలు పంపాలని రెండు రాష్ట్రాల ఈఎన్‌సీలకు కోరింది. కమిటీలో సభ్యులందరూ ఈ సమావేశంలో తప్పనిసరిగా పాల్గొనాలని సూచించింది. ఈ మేరకు రెండు రాష్ట్రాల ఈఎన్‌సీలకు కృష్ణా బోర్డు సభ్య కార్యదర్శి డీఎం రాయ్‌పురే శుక్రవారం లేఖ రాశారు. శ్రీశైలం, నాగార్జునసాగర్‌లలో నీటి లభ్యతను బట్టి, రెండు రాష్ట్రాల అవసరాలను పరిగణలోకి తీసుకుని నీటి కేటాయింపులపై కృష్ణా బోర్డుకు సిఫార్సు చేయడానికి సభ్య కార్యదర్శి కన్వీనర్‌గా రెండు రాష్ట్రాల ఈఎన్‌సీలు సభ్యులుగా త్రిసభ్య కమిటీని కృష్ణాబోర్డు ఛైర్మన్ ఏర్పాటుచేశారు. ప్రస్తుత నీటి సంవత్సరంలో మొదటిసారిగా జూలైలో సమావేశమైన త్రిసభ్య కమిటీ.. తాగునీటి అవసరాల కోసం రెండు ప్రాజెక్టుల నుంచి 12.7 టీఎంసీలను విడుదల చేయాలని సిఫార్సు చేయడంతో ఆ మేరకు నీటి విడుదల ఉత్తర్వులను జూలై 21న కృష్ణా బోర్డు జారీచేసింది. ఆ తర్వాత ఆగస్టు 21, 24న త్రిసభ్య కమిటీ రెండోసారి సమావేశమైంది. ఉమ్మడి ప్రాజెక్టుల్లో నీటినిల్వ తక్కువగా ఉన్న నేపథ్యంలో.. తాగునీటి అవసరాల కోసం నిల్వచేయాలని రెండు రాష్ట్రాలు ఏకాభిప్రాయానికి వచ్చాయి. తాగునీటి అవసరాల కోసం రెండు రాష్ట్రాలు పంపిన ప్రతిపాదనలపై సంప్రదింపులు జరపకపోవడంతో అప్పట్లో నీటి విడుదల ఉత్తర్వులను కృష్ణాబోర్డు జారీచేయలేదు. ఇదే అంశాన్ని కృష్ణా బోర్డు ఛైర్మన్ శివ్‌నందన్‌కుమార్ దృష్టికి సభ్య కార్యదర్శి డీఎం రాయ్‌పురే తీసుకెళ్లారు. తక్షణమే త్రిసభ్య కమిటీ సమావేశం నిర్వహించి.. రెండు రాష్ట్రాల తాగునీటి అవసరాలను చర్చించి.. నీటి కేటాయింపులకు సిఫార్సు చేయాలని కృష్ణా బోర్డు ఛైర్మన్ ఆదేశించారు. దాంతో అక్టోబర్ 5న త్రిసభ్య కమిటీ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు సభ్య కార్యదర్శి డీఎం రాయ్‌పురే తెలిపారు.

## 'రైల్వే'లో ఆన్‌లైన్ ఎంప్లాయ్ ఐడీ కార్డు సేవలు

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలోనే తొలిసారిగా ఆన్‌లైన్ ఎంప్లాయ్ ఐడీ కార్డు సేవలను విజయవాడ డివిజన్ ఐటీ సెల్ విభాగం అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ మేరకు డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్ ఏడీఆర్‌ఎంలు డి.శ్రీనివాసరావు, ఎమ్.శ్రీకాంత్‌లతో కలిసి శుక్రవారం తన కార్యాలయంలో ఆన్‌లైన్ ఎంప్లాయ్ ఐడీ కార్డు సేవలను ప్రారంభించారు. డీఆర్‌ఎం మాట్లాడుతూ ఆన్‌లైన్ మాడ్యూల్ ద్వారా ఎంప్లాయ్ ఐడీ కార్డులు జారీ చేయడం డివిజన్‌కే గర్వకారణమన్నారు. ఈ మాడ్యూల్‌ను డివిజన్‌కు అందించిన ఐటీ సెల్ విభాగం ఉద్యోగులను ఆయన అభినందించారు. ఉద్యోగులు http://www.bzaid.com వెబ్‌సైట్‌ను ఓపెన్ చేసి తమ పీఎఫ్ నంబర్, ఫొటో, సంతకం, ఇతర ముఖ్యమైన సమాచారం అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. వీటిని పర్సనల్ బ్రాంచ్ సిబ్బంది తనిఖీలు చేసిన అనంతరం ఆన్‌లైన్‌లోనే ఐడీ కార్డులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. గతంలో ప్రారంభించిన మాస్టర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ నుంచి డేటాను తీసుకునేలా ఐటీ సెల్ డిజైన్ చేసిందన్నారు. ఉద్యోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉండే ఫ్రెండ్లీ అప్లికేషన్ రూపొందించడంలో కృషి చేసిన పర్సనల్ బ్రాంచ్, ఐటీ ఉద్యోగుల కృషిని అభినందించారు.


ఆన్‌లైన్ ఎంప్లాయి ఐడీ కార్డు సేవలను ప్రారంభిస్తున్న డీఆర్‌ఎం

## తిరుమల ఘాట్ రోడ్లలో ఆంక్షల సడలింపు

**టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి వెల్లడి**

తిరుమల: తిరుమల ఘాట్ రోడ్లలో ద్విచక్ర వాహనాల రాకపోకలపై విధించిన ఆంక్షలను టీటీడీ సడలించింది. తిరుమల అన్నమయ్య భవనంలో శుక్రవారం టీటీడీ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఈవో ఏవీ ధర్మారెడ్డి ఈ విషయాన్ని ప్రకటించారు. అలిపిరి కాలినడక మార్గంలో చిరుతల సంచారం నేపథ్యంలో భక్తుల భద్రత దృష్ట్యా సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ద్విచక్ర వాహనాల రాకపోకలను టీటీడీ నిలిపివేసిన విషయం తెలిసిందే. టీటీడీ అటవీశాఖతో అధికారులతోపాటు రాష్ట్ర అటవీశాఖ అధికారులు ఆ ప్రాంతంలో 6 చిరుతలను బంధించడంతో పాటు వారం రోజుల పాటు పూర్తిగా పరిశీలించిన తర్వాత ఎలాంటి ముప్పు లేదని నిర్ధారించారు. దీంతో శుక్రవారం నుంచి ఘాట్ రోడ్లలో రాత్రి 10 గంటల వరకు ద్విచక్ర వాహనాలను అనుమతించనున్నారు. అక్టోబర్ 14న అంకురార్పణ, అక్టోబర్ 15–23 వరకు జరగనున్న నవరాత్రి బ్రహ్మోత్సవాల సంసిద్ధతపై శాఖల వారీగా అధికారులతో ఈవో సమీక్షించారు.

# వినియోగదారుల కేసుల పరిష్కారంలో కృత్రిమ మేధ

- హక్కులపై ప్రజల్లో అవగాహన పెరిగింది
- ఎన్‌సీఆర్‌డీ అధ్యక్షుడు జస్టిస్ అమరేశ్వర్‌ప్రతాప్ సాహి


సావనీర్ విడుదల చేస్తున్న జస్టిస్ అమరేశ్వర్‌ప్రతాప్ సాహి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శులు

సాక్షి, విశాఖపట్నం/సాక్షి, అమరావతి: వినియోగదారుల హక్కులకు సంబంధించిన కేసుల పరిష్కారం కోసం కృత్రిమ మేధని వినియోగిస్తుండటం శుభపరిణామమని జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్(ఎన్‌సీఆర్‌డీ) అధ్యక్షుడు జస్టిస్ అమరేశ్వర్ ప్రతాప్ సాహి అన్నారు. విశాఖపట్నంలోని ఓ హోటల్లో శుక్రవారం కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఆహార, పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో 'వినియోగదారుల హక్కులు, రక్షణ' అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. దక్షిణాది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ కార్యదర్శులు, వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ అధ్యక్షులు, వినియోగదారుల గ్రూపులు, ఎన్జీవోలు హాజరయ్యారు. వినియోగదారుల రక్షణ ఫ్రేమ్‌వర్క్, డెవలప్‌మెంట్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ స్టాండర్డ్స్, ప్రైస్ మానిటరింగ్, లీగల్ మెట్రాలజీ యాక్ట్–2009 తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జస్టిస్ సాహి మాట్లాడుతూ వినియోగదారుల కమిషన్ గత ఏడాది 1.26 లక్షల కేసులు పరిష్కరించగా, ఈ ఏడాది ఇప్పటివరకు 1.36 లక్షల కేసులు పరిష్కరించడం శుభపరిణామమని చెప్పారు. కేసుల పరిష్కారం కోసం కాన్ఫోనెట్ 2.0 ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు. దీనిపై రాష్ట్రాలు తమ అభిప్రాయాన్ని తెలియజేయాలని కోరారు. వినియోగదారులు 17 ప్రాంతీయ భాషల్లో ఫిర్యాదులు చేయవచ్చని వివరించారు. ప్రతి నెలా వినియోగదారుల హక్కుల కంట్రోల్ రూమ్‌కు లక్షకు పైగా ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. ప్రజలకు తమ హక్కుల పట్ల అవగాహన పెరిగిందని, ఇది స్వాగతించదగిన పరిణామమని పేర్కొన్నారు. కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి రోహిత్‌కుమార్ సింగ్, ప్రత్యేక కార్యదర్శి నిధి ఖరే, ఏపీ ప్రభుత్వ కార్యదర్శి అరుణ్‌కుమార్ తదితరులు మాట్లాడుతూ వినియోగదారుల హక్కులను కాపాడటంతోపాటు ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేందుకు వినియోగదారుల వ్యవహారాల విభాగం ఆయా రాష్ట్రాల సహకారంతో పని చేస్తోందన్నారు. ప్రపంచంలో ఎక్కడైనా తూనికలు, కొలతల పరికరాలను విక్రయించడానికి అంతర్జాతీయంగా ఆమోదించిన ఓఐఎంఎల్ సర్టిఫికెట్‌లను జారీ చేసే అథారిటీని పొందిన 13వ దేశంగా భారత్‌ను జాబితాలో చేర్చడంలో కృషి చేసిన లీగల్ మెట్రాలజీ విభాగానికి అభినందనలు తెలిపారు.

## డీజేలో నచ్చిన పాట వేయలేదని యువకుడి ఆత్మహత్య

**శ్రీకాకుళం జిల్లాలో ఘటన**


సాయికుమార్(ఫైల్)

నందిగాం : వినాయక నిమజ్జన సమయంలో డీజే సౌండ్ సిస్టంలో తనకి నచ్చిన పాట వేయలేదని మనస్తాపానికి గురై ఓ యువకుడు ఏకంగా ఆత్మహత్య చేసుకున్నాడు. శ్రీకాకుళం జిల్లా నందిగాం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నందిగాం మండలం పెంటూరులో గురువారం వినాయక నిమజ్జనానికి డీజే సౌండ్ సిస్టంలు ఏర్పాటు చేసుకున్నారు. గ్రామానికి చెందిన సనపల సాయికుమార్(18) గణపతి విగ్రహం వెంట డ్యాన్సులు చేసుకుంటూ అందరితో పాటే వెళ్లాడు. అయితే రాత్రి 11 గంటల సమయంలో డీజేలో తనకు నచ్చిన పాట వేయలేదని ఇంటికి వెళ్లిపోయాడు. సాయికుమార్ తల్లిదండ్రులు కూడా నిమజ్జన కార్యక్రమంలో ఉండటంతో ఇంట్లో ఎవరూ లేరు. ఆ సమయంలో యువకుడు ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. నిమజ్జనంలో కుమారుడు కనిపించకపోయే సరికి తండ్రి సోమేశ్వరరావు ఇంటికి వెళ్లి చూడగా ఉరికి వేలాడుతూ కనిపించాడు. వెంటనే బంధువుల సాయంతో బాలుడిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు చెప్పారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుడి తండ్రి సోమేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నందిగాం ఎస్‌ఐ మహ్మద్‌అమీర్‌అలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తొందరపాటులో యువకుడు తీసుకున్న నిర్ణయంతో కుటుంబంలో విషాదం నెలకొంది.

## క్లుప్తంగా...

### విశాఖ శారదా పీఠాధిపతుల చాతుర్మాస్య దీక్ష విరమణ


భగవద్గీత పారాయణం చేస్తున్న స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర

సింహాచలం (పెందుర్తి): విశాఖ శ్రీ శారదాపీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి ఉత్తరాఖండ్‌లోని రిషికేష్ వేదికగా జూలై 3 నుంచి చేపట్టిన చాతుర్మాస్య దీక్ష శుక్రవారంతో ముగిసింది. దీక్ష ముగింపు సందర్భంగా ఉదయం గంగాతీరంలో పవన సంస్కారం అనంతరం స్నానమాచరించారు. గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆశ్రమానికి చేరుకుని శాస్త్రోక్తంగా దీక్షను విరమించారు. భగవద్గీత పారాయణం చేశారు. ఆ తర్వాత వీరభద్ర మందిరాన్ని సందర్శించి స్వామికి విశేషంగా అభిషేకం నిర్వహించారు. చాతుర్మాస్య దీక్ష ముగియడంతో పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి శనివారం సాయంత్రానికి విశాఖ చేరుకుంటారు. కాగా, విశాఖ శారదా పీఠాధిపతులు ఏటా చాతుర్మాస్య దీక్షను రిషికేష్ వేదికగా చేపట్టడం ఆనవాయితీ వస్తోంది. దీక్షా సమయంలో లోక కల్యాణార్థం విశేష పూజలు, వైదిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోంది.

### అరకు అందాలు అద్భుతం: జస్టిస్ ఎన్.మాల


జస్టిస్ మాలకు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

అరకులోయ రూరల్ (అల్లూరి సీతారామరాజు జిల్లా): ప్రముఖ పర్యాటక కేంద్రం అరకులోయ అందాలు అద్భుతమని మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.మాల అన్నారు. శుక్రవారం ఆమె కుటుంబ సమేతంగా కిరండూల్ పాసింజర్‌లో అరకులోయ చేరుకున్నారు. స్థానిక సీఐ రుద్రశేఖర్, సిబ్బంది ఆమెకు యండపల్లివలస రైల్వేస్టేషన్‌లో స్వాగతం పలికారు. ఆమె మాట్లాడుతూ అరకులోయ పరిసర ప్రాంతాల వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా ఉందన్నారు. ఎటుచూసినా పచ్చదనం, ప్రకృతి మరపురాని అనుభూతిని ఇచ్చిందన్నారు. గిరిజన మ్యూజియం, పద్మాపురం గార్డెన్, బొర్రా గుహలు, కాఫీ ప్లాంటేషన్, కటిక జలపాతాన్ని సందర్శించనున్నట్లు చెప్పారు.

### ముగిసిన శ్రీ పద్మావతి అమ్మవారి పవిత్రోత్సవాలు

చంద్రగిరి (తిరుపతి జిల్లా): తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో 3 రోజుల పాటు జరిగిన పవిత్రోత్సవాలు శుక్రవారం మహాపూర్ణాహుతితో ముగిశాయి. చివరిరోజు తెల్లవారుజామున అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలను నిర్వహించి అమ్మవారిని వజ్రవైఢూర్యాలతో అలంకరించారు. మధ్యాహ్నం శాస్త్రోక్తంగా మహాపూర్ణాహుతి, శాంతి హోమం, కుంభప్రోక్షణ, నివేదన చేపట్టారు. అనంతరం శ్రీకృష్ణస్వామి ముఖ మండపంలో అమ్మవారితో పాటు శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్‌కు శాస్త్రోక్తంగా స్నపనతిరుమంజనం నిర్వహించారు. పద్మపుష్కరిణి అభివృద్ధి పనులు జరుగుతోన్న కారణంగా శ్రీకృష్ణస్వామి ముఖ మండపంలోనే గంగాళంలో చక్రస్నానం చేపట్టారు.

### ఏపీ గ్రామాల్లోకి వైద్య సేవలు విస్తరణ అభినందనీయం

- కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ హర్ష్ మంగ్లా

సాక్షి, అమరావతి : మారుమూల గ్రామాల్లోకి సైతం సీఎం వైఎస్ జగన్ వైద్య సేవల్ని విస్తరించడం అభినందనీయమని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ హర్ష్ మంగ్లా అన్నారు. ప్రత్యేకించి పల్లెల్లో స్పెషలిస్ట్ డాక్టర్ల సేవల్ని కూడా అందిస్తున్నారని ప్రశంసించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీలో నిర్వహించిన స్వచ్ఛంద రక్తదాన శిబిరంలో హర్ష్ మంగ్లా పాల్గొన్నారు. మారుమూల గ్రామాల్లో సైతం ప్రజలకు ఉచిత వైద్య సేవల్ని అందించే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు కార్యక్రమాల్ని చేపడుతున్నాయన్నారు.

### చేతివృత్తులకు చేయూత

- కేంద్ర సహాయ మంత్రి దర్శన జర్దోష్


లక్కబొమ్మల తయారీని పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి దర్శన జర్దోష్

యలమంచిలి (అనకాపల్లి జిల్లా): హస్తకళలకు కేంద్రం అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తుందని కేంద్ర రైల్వే, టెక్స్‌టైల్స్ సహాయమంత్రి దర్శన జర్దోష్ అన్నారు. శుక్రవారం ఆమె ఏటికొప్పాకలో లక్కబొమ్మల తయారీ కేంద్రాలను సందర్శించారు. సహజ సిద్ధమైన రంగులతో తయారు చేసిన లక్కబొమ్మలు అబ్బురపరిచేలా ఉన్నాయని అభినందించారు. ఆర్టిజన్ సొసైటీ భవనంలో హస్త కళాకారులతో సమావేశం నిర్వహించారు. యలమంచిలి ఎమ్మెల్యే రమణమూర్తిరాజు, మాజీ ఎమ్మెల్సీ మాధవ్, జేసీ జాహ్నవి, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి పాల్గొన్నారు.

కర్మలు చేయడంలోనే నీకు అధికారం ఉన్నది.
కర్మ ఫలాలపైన ఎప్పుడూ లేదు. కర్మ ఫలానికి కారకుడివి కావద్దు.
అలాగని కర్మలు చెయ్యడము మానవద్దు.
– హిందూ ధర్మం



సాక్షి
శనివారం, 30 సెప్టెంబర్ 2023

# మనిషికేమైంది?

ఈ వారం మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో, దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన రెండు వేర్వేరు ఉదంతాలు మన సమాజం ఉనికిని ప్రశ్నిస్తున్నాయి. ఇక్కడ మానవత్వం ఉందా, కన్నుమూసిందా అన్న సందేహాన్ని రేకెత్తిస్తున్నాయి. ఉజ్జయిని నగర వీధుల్లో మొన్న సోమవారం ఉదయం ఒంటిపై సరైన బట్టలు కూడా లేకుండా నెత్తురోడుతున్న పన్నెండేళ్ల బాలిక తనను కాపాడాలంటూ ఇల్లిల్లూ తిరిగి విన్నవించుకున్నా ఒక్కరంటే ఒక్కరు స్పందించలేదు. ఇలా రెండున్నర గంటలు గడిచి ఆమె స్పృహ కోల్పోయి రోడ్డుపై పడిపోగా ఒక ఆశ్రమం నుంచి బయటికొస్తున్న యువకుడు గమనించి చొరవ తీసుకున్నాడు. తన పైపంచె తీసి కప్పి ఆమెను ఆసుపత్రిలో చేర్చి పోలీసులకు సమాచారం అందించాడు. ఆమెపై అత్యంత దారుణంగా అత్యాచారం జరిగిందని వైద్య పరీక్షలో తేలింది. బహుశా ఆ యువకుడు కూడా స్పందించకపోయి వుంటే రక్తస్రావంతో ఆమె మరణించేది కూడా. ఎందుకంటే అత్యాచారం చేసిన దుర్మార్గుడు ఆమె అవయవాలను తీవ్రంగా గాయపరిచాడు. గర్భాశయానికైతే అత్యవసరంగా శస్త్ర చికిత్స చేయాల్సి వచ్చింది కూడా. దశాబ్దం క్రితం ఢిల్లీలో నిర్భయ అనుభవించిన నరక యాతననే ఈ బాలిక కూడా చవిచూసింది. తాను ఉజ్జయిని ఎలా చేరిందో చెప్పలేని స్థితిలో ఉంది. బాలిక తప్పిపోయిందని అంతక్రితం ఆమె తాత సాత్నాలో ఫిర్యాదు చేశాడంటున్నారు. ఉజ్జయినికి 720 కిలోమీటర్ల దూరంలోని సాత్నా నుంచి ఆ బాలికను తరలించిందెవరు అన్నది ఇంకా తేల్చాల్సి వుంది. ఘటనకు సంబంధించి ప్రధాన నిందితుడితోపాటు మరో అయిదుగురిని అరెస్టు చేశారు. దేశ రాజధాని నగరంలో మంగళవారం జరిగిన ఉదంతం కూడా అమానుషమైనది. ప్రసాదం దొంగిలించాడన్న అనుమానంతో మతిస్థిమితం లేని ఒక ముస్లిం యువకుణ్ణి అందరూ ఏకమై కరెంటు స్తంభానికి కట్టి, తీవ్రంగా కొట్టి ప్రాణం తీశారు. ఒంటినిండా గాయాలతో తీవ్ర రక్తస్రావమై అతను మరణించాడని శవపరీక్షలో తేలింది. ఈ ఉదంతంలో అరెస్టయిన ఏడుగురూ పాతికేళ్ల లోపువారే కాగా, అందులో ఒకడు మైనర్. ఈ రెండు ఉదంతాల్లోనూ సమాజం ప్రేక్షక పాత్ర వహించింది. బాధితులను ఆదుకోవాలన్న స్పృహ లేకుండా ప్రవర్తించింది.

ఉజ్జయిని నగరానికి ఉజ్వల చరిత్ర వుంది. ఒకనాడది వైభవోపేతంగా వర్ధిల్లిన సాంస్కృతిక కేంద్రం. క్రీస్తుపూర్వం నాలుగో శతాబ్దంలో మౌర్య చంద్రగుప్తుడి విశాల సామ్రాజ్యంలో భాగం. తన తండ్రి బిందుసారుడి కాలంలో అశోకుడు స్వయంగా పర్యవేక్షించిన ప్రాంతం. నాలుగో శతాబ్దంలో రెండో చంద్రగుప్త విక్రమాదిత్యుడి రాజధాని. అది కాళిదాస మహాకవీంద్రుడు నడయాడిన నేల. అక్కడే శూద్రకుడు, ధన్వంతరి, వరరుచి, వరాహమిహిరుడు, బ్రహ్మగుప్తుడు వంటివారు వివిధ శాస్త్రాల్లో ఉద్దండ పండితులుగా ప్రఖ్యాతి గడించారు. అంతటి గొప్ప చరిత్ర కలిగినచోట పట్టపగలు నగర వీధుల్లో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతూ ఒక బాలిక కాపాడమని అర్థిస్తే ఆడ, మగ అందరూ తలుపులేసుకున్నారంటే... పదో పరకో ఇచ్చి తమ అపరాధ భావనను కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నించారంటే ఎలాంటి వారికైనా మనసు వికలమవుతుంది. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులను ఆసుపత్రికి తరలించటానికీ, కనీసం పోలీసులకు ఫోన్ చేసి చెప్పటానికీ ఎవరూ ముందుకు రాకపోవటం తరచు గమనిస్తూనే ఉంటాం. చట్టపరమైన ఇబ్బందుల్లో చిక్కుకుంటామనీ, కోర్టుల చుట్టూ తిరగాల్సివస్తుందనీ ఇప్పటికీ అనేకులు వెనకడుగేయటం కనబడుతూనే ఉంటుంది. కానీ అర్ధనగ్న స్థితిలో ఆపన్నహస్తం కోసం ఎదురుచూసిన బాలికకు వైద్య సాయం అందేలా చూడటం సంగతి అటుంచి కనీసం ఒంటిని కప్పుకోవటానికి బట్టలిచ్చేందుకు కూడా ఎవరూ సిద్ధపడకపోవటం దిగ్భ్రాంతి కలిగిస్తుంది. ఈ అమానవీయతకు సీసీ టీవీ కెమెరాలు సాక్ష్యంగా నిలిచాయి.

సమాజం మొత్తాన్ని కాపలా కాయటం ఏ ప్రభుత్వానికైనా అసాధ్యమన్నది వాస్తవం. లక్షల్లో జనాభా ఉండేచోట వందల్లో మాత్రమే రక్షకభటులుంటారు. అయితే ఉన్న ఆ కొద్దిమందీ కూడా కొన్ని సందర్భాల్లో నేరగాళ్లకు సాయపడుతున్నారనీ, రాజకీయ ప్రాపకం కోసం చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారనీ ఆరోపణలు ఎదుర్కొంటూనే ఉన్నారు. రెండున్నర గంటలపాటు ఆ బాలిక ఎక్కడో మారుమూల పల్లెటూరులో కాదు... కేంద్రం స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేస్తున్న నగర వీధుల్లో అత్యంత దారుణమైన పరిస్థితుల్లో సంచరిస్తున్నప్పుడు ఒక్క కానిస్టేబులైనా ఆమెను గమనించి ఆదుకోలేకపోవటం పోలీసుల పనితీరును పట్టిచూపిస్తోంది. ఇక గోవధ జరిగిందనో, జరగబోతున్నదనో అనుమానంతో కొందరు దుండగులు మారణాయుధాలతో దాడిచేసి చంపుతున్న ఉదంతాల్లో నేరగాళ్లకు ప్రభుత్వాల ఆశీస్సులుంటున్న సంగతి బహిరంగ రహస్యం. కానీ సమాజం ఏమైపోతోంది? పట్టపగలు కళ్లెదుట జరుగుతున్న దురంతాలపై కూడా కనీస స్పందన కొరవడటం, సహానుభూతి వ్యక్తం కాకపోవటం ఏమిటి? ఎన్నికల్లో ఓటేయటంతోనే పౌరులుగా తమ బాధ్యత తీరిందని జనం అనుకుంటున్నారా? కుల మత చట్రాల్లో, రాజకీయ రొదలో కూరుకుపోయి మనుషులుగా తమ నైతిక బాధ్యతను విస్మరిస్తున్నారా? ఎవరికి వారే ప్రశ్నించుకోవాలి. ఆపత్సమయాల్లో మానవీయతను ప్రదర్శించటం, సహానుభూతి వ్యక్తపరచటం, బాధితులకు అండగా నిలవటం మనుషుల కనీస లక్షణాలని తెలుసుకోలేని సమాజం శవప్రాయమైనది. అలాంటిచోట ఎవరికీ రక్షణ ఉండదు. సమాజం సంఘటితంగా ఉన్నప్పుడే, అన్యాయాన్ని ప్రశ్నించే తత్వాన్ని ఒంటబట్టించుకున్నప్పుడే ఇలాంటి దురంతాలకు అడ్డుకట్ట పడుతుంది.

## గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** బ.పాడ్యమి ప.2.03 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** రేవతి రా.12.07 వరకు, తదుపరి అశ్వని, **వర్జ్యం:** ప.12.44 నుండి 2.14 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.53 నుండి 7.29 వరకు, **అమృతఘడియలు:** రా.9.49 నుండి 12.21 వరకు

**సూర్యోదయం:** 5.53
**సూర్యాస్తమయం:** 5.51
**రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు
**యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు

# సంక్షోభాన్ని పెంచిన ఆ అంతర్యుద్ధం

విశ్లేషణ



మేజర్ జనరల్ అశోక్ కె. మెహతా (రిటైర్డ్)

**జీ20 శిఖరాగ్ర సదస్సు విజయవంతం కావడంపై భారత్‌లో వెల్లువెత్తిన ఉత్సాహం... సంఘర్షణలతో అట్టుడుకుతున్న మణిపుర్‌ను వ్యూహాత్మకంగా విస్మరించడానికి దారితీసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీవ్ర నిష్క్రియాత్మకత వల్లే ఈశాన్య ప్రాంతంలో ఇంత పతనం సంభవించింది. మయన్మార్‌లో 28 నెలల నాటి అంతర్యుద్ధం పాక్షికంగా మణిపుర్ మంటలను పెంచి పోషించింది. ఫలితంగా 200 మందికి పైగా మరణించారు, వేలాది మంది నిరాశ్రయులయ్యారు. 4,000 ఆయుధాల చోరీ జరిగింది. మయన్మార్ నుండి వచ్చిన శరణార్థుల వెల్లువతో పాటు, కుకీలు లేని ఇంఫాల్ లోయ, మైతేయిలు లేని కుకీ–నివాస కొండ ప్రాంతాలు అనే జాతి ప్రక్షాళన మణిపుర్‌ను నిలువునా విభజించింది.**

కుకీలు, మైతేయిల జాతి ప్రక్షాళన ధోరణి మణిపుర్‌ను నిట్టనిలువున చీల్చింది. తీవ్రమైన ఈ విభజనే, విద్రోహం(ఇన్‌సర్జెన్సీ) మళ్లీ చెలరేగుతుందన్న భయాలను రేకెత్తించింది. రాష్ట్ర ఆయుధాగారాల నుండి కొల్లగొట్టిన ఆయుధాలు అందుబాటులో ఉండటమే ఈ భయాలకు కారణం. గత నెలలో అస్సాం రైఫిల్స్ డైరెక్టర్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ పీసీ నాయర్ ఇలా చెప్పారు: ''పరిస్థితి అసాధారణంగా ఉంది. మేము ఎప్పుడూ ఇలాంటి పరిస్థితిని ఎదుర్కోలేదు.'' ఇంఫాల్‌లోని నాలుగు జిల్లాల్లో గల 39 పోలీస్ స్టేషన్లలోని 16 స్టేషన్లలో సాధారణ స్థితి ఏర్పడినట్లు చూపడానికి కేంద్ర హోం మంత్రి అమిత్ షా, సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని మార్చి 25న ఉపసంహరించుకున్న తర్వాత పరిస్థితి ఇలా ఉంది. ఈ చర్యను మళ్లీ వెనక్కి తీసుకోలేదు.

''విద్రోహాన్ని గణనీయంగా తగ్గించేశాం. దాదాపుగా లేదు'' అని మాజీ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ జనరల్ ఎం.ఎం. నరవణే చెప్పారు. ఈ పరిస్థితి ఉత్తరం వైపు సైన్యాన్ని తిరిగి సమతుల్యం చేయడానికి, అలాగే ఈశాన్య ప్రాంతంలో సైనిక చర్యల బాధ్యతను అస్సాం రైఫిల్స్‌కు బదిలీ చేయడానికి వీలు కల్పిస్తుంది. ఇది సాధారణ ఆచరణకు భిన్నం. ఒక్క 1965, 1971 యుద్ధాల సమయంలో మాత్రమే ఇలా చేశారు.

మయన్మార్‌లో మిలిటరీ జుంటాకూ, దానిని వ్యతిరేకిస్తున్న శక్తుల (నేషనల్ యూనిటీ గవర్నమెంట్–ఎన్‌యూజీ, ఇంకా ప్రతిఘటన)కూ మధ్య అంతర్యుద్ధం దాని మూడవ సంవత్సరంలోకి ప్రవేశించింది. నాగాలాండ్, మిజోరాం, మణిపుర్‌లకు సమీపంలోని సగాయింగ్ ప్రాంతం, చిన్ రాష్ట్రం ప్రధాన పోరాట వేదికలుగా ఉంటున్నాయి. సైనిక జుంటా ఈ ప్రాంతంలో అధికారం కోల్పోయినందున, అది నాపాం బాంబులను ప్రయోగించడం, గ్రామాలను దోచుకోవడం, తగలబెట్టడంతోపాటు వైమానిక బాంబులను ఆశ్రయిస్తోంది. పర్యవసానంగా, దాదాపు 60,000 మంది చిన్, కుకి, జోమి శరణార్థులు మిజోరం, మణిపుర్‌లకు పారిపోయారు. వీరిలో కొందరు ఎన్‌యూజీకి చెందిన శాసనసభ్యులు కూడా ఉన్నారు. మయన్మార్‌తో 1,600 కి.మీ. పొడవైన అంతగా గస్తీ ఉండని సరిహద్దుతోపాటు, ఇరువైపులా 16 కి.మీ. మేర స్వేచ్ఛా కదలికలకు అనుమతిస్తున్న పాలన కారణంగా ఆయుధాలు, మాదక ద్రవ్యాలు, బంగారం, విలువైన రాళ్లు మణిపూర్‌లోకి అక్రమంగా రవాణా అవుతున్నాయి.

'గోల్డెన్ ట్రయాంగిల్' గుర్తుందిగా? మాదకద్రవ్యాల అక్రమ రవాణా మణిపుర్‌కు కొత్తేమీ కాదు. భద్రతా సిబ్బందికి కూడా ఇందులో ప్రమేయం ఉన్నదన్న ఆరోపణలు ఉన్నాయి. 2013 ఫిబ్రవరిలో రూ.6 కోట్ల విలువైన డ్రగ్స్‌తో దొరికిన సైనిక కల్నల్‌ను అరెస్టు చేశారు. సెప్టెంబర్ 15న 'గోవా క్రానికల్'లో ప్రచురితమైన కథనంలో, మణిపుర్‌లోని జఠిలమైన మాదకద్రవ్యాల వ్యాపార నెట్‌వర్క్ వివరాలను ఇచ్చారు. 2021 నుంచి మణిపుర్‌లో గసగసాల సాగు 33 శాతం పెరిగిందని ఐరాస నివేదిక పేర్కొంది. ఇది కుకీలకు నగదు పండించే పంట అని మైతేయిలు ఆరోపిస్తున్నారు. కానీ గోవా క్రానికల్ కథనం ప్రకారం, ముస్లిం పంగల్లతో సహా ప్రతి సమాజానికీ ఈ పంటలో వాటా ఉంది.



భారతదేశ 'యాక్ట్ ఈస్ట్ పాలసీ'ని మయన్మార్ వివాదం తీవ్రంగా దెబ్బతీసింది. ఇది ఆసియాన్ (ఆగ్నేయాసియా దేశాల సంఘం)తో వాణిజ్యం, పరస్పర చర్యలను ముందుకు తీసుకెళ్లేందుకు రూపొందించిన విధానం. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ సెప్టెంబర్ ప్రారంభంలో మీడియాతో మాట్లాడుతూ, ''భారతదేశ అత్యంత ప్రతిష్ఠాత్మకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు ఆగ్నేయాసియాతో ఉన్నాయి. మయన్మార్ అంతర్గత భద్రతా వ్యవస్థ విచ్ఛిన్నమైపోయిన కారణంగా అవి పెద్ద సవాళ్లను ఎదుర్కొంటున్నాయి,'' అని చెప్పారు. మిజోరం మార్గంలో తిరుగుబాటు సోకిన రాఖైన్ రాష్ట్రం గుండా వెళుతున్న దాదాపు రెండు దశాబ్దాల నాటి మల్టీమోడల్ కలాదాన్ ప్రాజెక్టును అరాకాన్ సైన్యం (మయన్మార్) కాలానుగుణంగా నిరోధిస్తూ వచ్చింది. మణిపుర్‌లోని మోరేతో థాయ్‌లాండ్‌లోని మయీ సాట్‌తో కలిపే భారతదేశం, మయన్మార్, థాయ్‌లాండ్ త్రైపాక్షిక హైవే ప్రాజెక్టును సగాయింగ్(మయన్మార్) ప్రాంతంలో జరిగిన పోరాటాల కారణంగా నిలిపివేశారు. ఈ నెలలోనే జరిగిన ఆసియాన్ విదేశాంగ మంత్రుల సమావేశంలో జైశంకర్ మయన్మార్ విదేశాంగ మంత్రి థాన్ స్వేతో సమావేశమయ్యారు. భారతదేశం, మయన్మార్ సరిహద్దుకు సమీపంలో జరిగిన పోరాటాలు, వైమానిక దాడులు కలిగిస్తున్న ప్రమాదకరమైన ప్రభావాల గురించి థాన్ స్వేకి వివరించారు.

'ఎన్‌యూజీ'కి చెందిన పీపుల్స్ డిఫెన్స్ ఫోర్సెస్ (పీడీఎఫ్) సగాయింగ్ ప్రాంతంలో ఆధిపత్యం చలాయిస్తోంది. అంతర్యుద్ధ ప్రతిష్టంభన కొనసాగుతున్న నేపథ్యంలో 'అన్ని ఫలాలను జుంటా బుట్టలో' ఉంచే విధానాన్ని ఢిల్లీ సమీక్షించుకోవాలి. దేశ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల నిర్మాణాన్ని సులభతరం చేయడానికి చిన్ నేషనల్ ఫ్రంట్, అరకాన్ సైన్యాన్ని భారత ఏజెన్సీలు సిద్ధం చేయాలి. ప్రజాస్వామ్య శక్తులతో సంబంధాలను పునరుద్ధరించడం, ఆయుధాల సరఫరాతో సహా ఎన్‌యూజీ/పీడీఎఫ్‌తో సమాచార మార్గాలను ఏర్పాటు చేయడం ఆచరణీయమైన ఎంపికలు.

ఇది సమస్యను నిరోధించవలసిన చర్యను ఆలస్యంగా చేపట్టడం లాంటిదే అయినప్పటికీ, భారతదేశ యాక్ట్ ఈస్ట్ పాలసీకి కీలకంగా ఉన్న మణిపుర్ సమస్యకు తక్షణ చికిత్స అవసరం. వాస్తవానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మణిపుర్‌ను రక్తసిక్తం చేయడానికి అనుమతించాయి, కొత్త తిరుగుబాట్లకు బీజాలు నాటడానికి అనుమతించాయి. అంతకుమించి సైన్యం, అస్సాం రైఫిల్స్, ఇతర భద్రతా దళాల నిష్పాక్షికతకు సవాలు విసిరే అవాంఛనీయమైన దుఃస్థితిలో ఉంచాయి.

ఒక సీఆర్పీఎఫ్ భద్రతా సలహాదారు మణిపుర్ సీఎం బీరెన్ సింగ్‌కు మార్గనిర్దేశం చేస్తుండగా, భద్రతా దళాల ప్రత్యేక రక్షణ చట్టం పరిధిలోకి రాని ప్రాంతాల్లో పౌర అధికారులకు సైన్యం, కేంద్ర పారామిలటరీ బలగాలు సాయం చేస్తున్నాయి. కుకీల పట్ల పక్షపాతం చూపుతున్నాయని ఆరోపిస్తూ అస్సాం రైఫిల్స్‌పై మణిపుర్ పోలీసులు రెండు ఎఫ్ఐఆర్‌లు దాఖలు చేయడం, అస్సాం రైఫిల్స్‌ను తొలగించాలని మైతేయిలు డిమాండ్ చేయడం, మరోవైపున నిషేధిత ఉగ్రవాద గ్రూపులను సైన్యం, అస్సాం రైఫిల్స్ విడుదల చేయడంపై లేవనెత్తుతున్న ప్రశ్నలు మణిపుర్ వాస్తవికతను ప్రతిబింబిస్తున్నాయి.

ఇప్పుడు ఆర్మీ, అస్సాం రైఫిల్స్ ప్రధాన పని లూటీకి గురైన ఆయుధాలను తిరిగి పొందడమే. వివిధ ప్రదేశాలలో ఆయుధ డిపాజిట్ పెట్టెలను ఉంచినప్పటికీ, మెజారిటీ ప్రజలు వాటి పక్కన సెల్ఫీలు తీసుకుంటున్నారు. మణిపుర్, ఈశాన్య ప్రాంతాలపై జరుగుతున్న సెమినార్లలో పరిస్థితిని వివరించడానికి వాడుతున్న మాటలు: 'అరాచకం', 'మరో కంబోడియా', 'సమాజాల మధ్య పూర్తి అపనమ్మకం'. ఆశ్చర్యకరంగా, ప్రధానమంత్రి లాగే, ఆర్మీ చీఫ్ గానీ, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ గానీ మణిపుర్‌ను ఇంతవరకూ సందర్శించలేదు. జరుగుతున్న తిరుగుబాటును మొగ్గలోనే తుంచివేసే విషయంలో ప్రభుత్వం తన రాజకీయ సంకల్ప లేమిని ప్రస్ఫుటంగా చూపిందని అక్కడి నిపుణులు అంటున్నారు. ఈశాన్యం నుండి 25 మంది లోక్‌సభ ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది బీజేపీ, దాని మిత్రపక్షాలకు చెందినవారే. మణిపుర్‌కు చెందిన ఇద్దరు ఉన్నారు. ఈ ప్రాంతంలో తిరుగుబాట్లు ఎప్పటినుంచో ఉన్నాయి. రాజకీయ పరిష్కారం సాధించాలంటే, ముందుగా చేయాల్సిన విధులు: హింసను అరికట్టడం, రాష్ట్రపతి పాలన విధించడం.

వ్యాసకర్త సైనిక వ్యవహారాల వ్యాఖ్యాత
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!




సోషల్ మీడియా

### భిన్నత్వంతో సామరస్యం



కన్‌ఫ్యూషియస్ (తత్వవేత్త) 2,574వ జయంతి (సెప్టెంబర్ 28) సందర్భంగా, తూర్పు చైనాలోని షాండాంగ్ ప్రావిన్స్‌లో ఆయన జీవించిన కుఫు నగరంలో జరిగిన ఉత్సవానికి హాజరయ్యాను. చైనా నాగరికత బలమంతా కన్‌ఫ్యూషియస్ ప్రవచించిన 'సామరస్యం'లో ఉంది. పాశ్చాత్యుల 'జీరో–సమ్' సిద్ధాంతం (ఒకరు గెలిస్తే ఇంకొకరు ఓడిపోవడం) కన్నా, 'ఏకరూపత లేకుండానే సామరస్యం' అనే భావన చాలా గొప్పది.

– హు షిజిన్, సంపాదకుడు

### అంతా కలా?



1. నేను లేచాను. 2. కాలేజీకి వెళ్లాను. 3. ఆమెను చూశాను. 4. దగ్గరికి వెళ్లి కౌగిలించుకున్నాను. 5. ముద్దాడాను. నిజానికి దీని అసలు క్రమం ఇది: 3, 4, 5, 1, 2.

– జేవియర్, వ్యంగ్య వ్యాఖ్యాత

### కలిసి ఆడుదాం!



పాకిస్తాన్ క్రికెట్ జట్టుకు ఇండియాలో దక్కిన స్వాగతానికి సంతోషం కలిగింది. క్రీడల్లోని అందం అది. దాదాపుగా ఒక దశాబ్దంగా మనం ఏం కోల్పోతున్నామో ఇది ఒకలాంటి ఆలోచన ఇస్తుంది.

– షోయబ్ అఖ్తర్, మాజీ క్రికెటర్

### లిట్మస్ పరీక్ష



నిజమైన స్నేహితులు ముఖాన వెక్కిరించి, వెనక పొగుడుతారు. అబద్ధపు స్నేహితులు ముఖాన పొగిడి, వెనక చెడ్డగా మాట్లాడుతారు. నువ్వు అక్కడ లేనప్పుడు నీ గురించి వాళ్లు ఏం మాట్లాడారన్న దాన్నిబట్టి నీ స్నేహితులు ఎవరో తెలుసుకోవచ్చు.

– అలెక్స్ హార్మోజీ, రచయిత

### దేవుడా...!



బలోచిస్తాన్‌లోని ముస్తాంగ్ ప్రాంతంలో జరిగిన పేలుడులో చనిపోయిన నా సోదరుల కోసం నా హృదయం విలపిస్తోంది. అల్లాహ్ నిలయంలో జరిగిన ఆత్మాహుతి దాడికి ఎవరు బాధ్యులు? బలోచ్ ప్రజల దీనస్థితిని ఐక్యరాజ్యసమితి, అమెరికా గమనించాలి. వారిని కాపాడాలి. పాకిస్తాన్ సైన్యం విఫలమైంది.

– జహీరా బలోచ్, యాక్టివిస్ట్


### మితమే హితమా?



చాలామంది తన వయసు భారతీయ మహిళల్లాగే మా అమ్మ కూడా మితంగా భోంచేస్తుంది. పాశ్చాత్య ప్రమాణాల ప్రకారం ఇది చాలినంత కాదు. కానీ ఆమెకిప్పుడు 80 ఏళ్లు, ఐదుగురు సంతానం, ఇప్పటికీ నేను సిగ్గుపడేలా పనిచేస్తుంటుంది. పోషణ శాస్త్రాన్ని మనం పునఃపరిశీలించుకోవాలి.

– శ్రీధర్ వెంబు, ఆంత్రప్రెన్యూర్

### కావేరిని కాపాడుకుందాం!



తల్లి కావేరికి మనం ఏ రాష్ట్రం వాళ్లమో తెలియదు. కానీ ఆమె క్రమంగా క్షీణిస్తోంది. వేసవి నెలల్లో ఎండిపోతోంది. భారీ స్థాయి వృక్షాధారిత వ్యవసాయాన్ని చేపట్టడం, 83,000 చదరపు కిలోమీటర్ల కావేరీ పరివాహక ప్రాంతంలో మొక్కలు పెంచడం వల్ల మాత్రమే కావేరీ సమృద్ధిగా ఏడాదంతా పారుతుంది. తగ్గిన నీళ్ల కోసం పోట్లాడటం మాని, కావేరీ తల్లిని శక్తిమంతం చేద్దాం.

– జగ్గీ వాసుదేవ్, ఆధ్యాత్మిక గురువు

ఇన్ బాక్స్

## అనువాదకులకూ ఒక రోజు!

1990 తరువాత ప్రపంచీకరణ వేగం పుంజుకుంది. మనిషి గ్లోబల్ సిటిజన్‌గా ఎదగాల్సిన అవసరం, పరిస్థితి ఏర్పడింది. శాస్త్రవేత్తలు జరుపుతున్న నిరంతర పరిశోధనల వల్ల సరికొత్త ఆవిష్కరణలు జరుగుతున్నాయి. ఫలితంగా కొత్త రంగాలు అభివృద్ధి చెంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సమాచార మార్పిడి పెరిగింది. ఒక భాషలోని భావాలు మరో భాష మాట్లాడే ప్రజలకు అర్థమవ్వాలంటే కచ్చితంగా అనువాదం అవసరం. అలా గత పదేళ్లలో అనువాదకుల అవసరం ప్రపంచ దేశాలకు ఎక్కువైంది. దీంతో ఎన్నో అనువాద సంస్థలు సేవలు ప్రారంభించాయి. వాటిలో ఎంతో మంది అనువాదకులు వివిధ భాషలకు మధ్య వారధిలా పనిచేస్తున్నారు. వారందరి సేవలను గుర్తిస్తూ 'అంతర్జాతీయ అనువాద దినోత్సవా'న్ని ప్రతిపాదించారు. ఈ దినాన్ని బైబిల్ అనువాదకుడు 'సెయింట్ జెరోమ్'కు అంకితమిచ్చారు.

సెయింట్ జెరోమ్‌ని ప్రపంచ అనువాదకుల పితామహుడిగా పిలుస్తారు. ఈయన ఇటలీకి చెందిన ప్రీస్ట్. గ్రీకు భాషలో ఉన్న బైబిల్‌ను లాటిన్ భాషలోకి అనువాదం చేశారు. ఈయన సెప్టెంబర్ 30, క్రీస్తు పూర్వం 420లో బెత్లెహామ్ నగరానికి సమీపంలో మరణించారు. ఆయన జన్మించిన తేదీ ఎవరికీ తెలియదు. అందుకే ఆయన చనిపోయిన రోజునే, ఆయన గౌరవార్థం అంతర్జాతీయ అనువాద దినోత్సవంగా ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. గత కొన్నేళ్ల లోకలైజేషన్ భారీగా పెరిగింది. ప్రపంచంలో అనువాదకుల సంఖ్య భారీగా పెరుగుతూ వస్తోంది. దీంతో యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీలో అనువాద దినోత్సవాన్ని జరుపుకోవాలని నిర్ణయించారు. తొలిసారి అనువాద దినోత్సవాన్ని 2017, సెప్టెంబర్ 30న నిర్వహించారు.

ప్రస్తుతం అనువాదకులకు మంచి ఆదరణ లభిస్తోంది. ఒక భాషలో విషయాన్ని మూల భావం మారకుండా అనువాదం చేయాలంటే ఎంతో సాధన అవసరం. ఆధునిక కాలంలో ఇంగ్లిష్ భాషతో పాటు, ఫ్రెంచ్, జర్మనీ, హిందీ తదితర భాషలకు ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ ఉంది. అనువాదకులకు కేవలం రెండు లేదా మూడు భాషలపై పట్టు ఉంటే సరిపోదు. వివిధ భాషలు మాట్లాడే ప్రజల చరిత్ర, సంస్కృతిపై కూడా పట్టు ఉండాలి. అనువాదం 'మానవత్వం యొక్క బహు ముఖాలను ఆవిష్కరిస్తుంది' అనే థీమ్‌తో ఈ ఏడాది ఈ దినోత్సవం జరుపుతున్నారు.

– ఎమ్. రాం ప్రదీప్ । జనవిజ్ఞాన వేదిక ప్రతినిధి, తిరువూరు

## ఈ వాస్తవం వక్రీకరించలేనిది!

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంను ప్రవేశ పెట్టినపుడు కొందరు మేధావులు, తెలుగు భాషా పరిరక్షకుల రూపంలో వ్యతిరేకించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల భాషను ప్రవేశ పెడితే అమ్మలాంటి తెలుగు భాషకు అన్యాయం జరుగుతుందని ఆంధ్రా నుంచి అమెరికా వరకు గగ్గోలు పెట్టారు. ఎప్పుడూ ప్రభుత్వ బడుల వంక కన్నెత్తి చూడని ఈ వర్గాలు తమ పిల్లలకు మాత్రం తెలుగంటే ఏంటో తెలియని పాఠశాలల్లోనే చదువులు చెప్పించి ఆంగ్ల భాషా నైపుణ్యవంతుల్ని చేశారు. తెలుగు మాట్లాడితే శిక్ష తప్పదని బహిరంగంగా బోర్డులు పెట్టే కార్పొరేట్ పాఠశాలల్లో తమ పిల్లలకు చదువు చెప్పించిన ఈ తెలుగు భాషా ఉద్ధారకులు వారి ఆశయ సాధనకు అణగారిన వర్గాలు చదివే ప్రభుత్వ పాఠశాలను వేదికలుగా ఎంచుకోవడమనే విపరీత ధోరణిని మనం ఏపీలో చూశాం.

కానీ నేడు ప్రపంచాన్ని నివ్వెరపరుస్తూ ఏపీలోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన పది మంది విద్యార్థులు తమ ఆంగ్ల భాషా నైపుణ్యాన్నీ, విశ్వజనీయ ఆలోచనలనూ అమెరికాలోని ఐక్యరాజ్య సమితి, ప్రపంచ బ్యాంక్ వంటి ప్రతిష్ఠాత్మక వేదికలపై ప్రదర్శిస్తున్నారు. అమెరికా అధ్యక్ష భవనం వైట్ హౌస్‌లోకీ అడుగుపెట్టారు. ఇదంతా చూస్తున్న వారెవ్వరైనా ఆంగ్ల భాషా నైపుణ్యం ఆవశ్యకతనూ, ఏపీ ప్రభుత్వ దార్శనికతనూ అంగీకరించక తప్పదు.

ఐక్యరాజ్య సమితి నిర్వహించే ఓ ప్రతిష్ఠాత్మక సదస్సులో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొనడం దేశ చరిత్రలో ఇదే ప్రథమమైతే, ప్రతిష్ఠాత్మక ఘట్టంలో మారు మూల ప్రాంతాల్లోని రైతు కూలీ, ఆటో డ్రైవర్, సెక్యూరిటీ గార్డు, కౌలు రైతు, మెకానిక్, కేబుల్ ఆపరేటర్ వంటి అతి పేదల పిల్లలుండటం గమనించదగిన విషయం. అంతర్జాతీయ మేధావులనూ ఆశ్చర్యపరచిన పేద బిడ్డల ఆంగ్ల భాషా ప్రతిభ అణగారిన వర్గాల నిజమైన సాధికారతకు నిదర్శనం.



అమెరికాలోని వైట్ హౌస్ ముందు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల భాష, సీబీఎస్ఈ సిలబస్ ప్రవేశపెట్టడం ఓ సాధారణ నిర్ణయంగానే ఒక వర్గం భావించింది. కానీ ఆ నిర్ణయంతోపాటు 'నాడు–నేడు', 'జగనన్న అమ్మఒడి', 'జగనన్న విద్యా కానుక', 'జగనన్న గోరుముద్ద' వంటి పథకాల రూపంలో అణగారిన వర్గాలకు అంతర్జాతీయ అవకాశాలు చేరువ చేసే మహా సంకల్పం దాగి ఉందని గుర్తించలేకపోయింది. అణగారిన వర్గాల నిజమైన సాధికారిత, ఆత్మగౌరవానికి ఆంగ్లం గొప్ప మార్గమని మహాత్మా జ్యోతిరావ్ పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ మనకు చాటి చెప్పారు. వారి ఆశయాలను సార్థకం చేస్తూ నేడు ఏపీ ప్రభుత్వం చేపడుతున్న ఆదర్శ సంస్కరణల ఫలాలు ఐక్యరాజ్య సమితి సదస్సు రూపంలో బహిర్గతమయ్యాయి. రానున్న రోజుల్లో అవి మరింతగా తేజరిల్లుతాయి. ఇప్పటి వరకు కొందరికే సొంతమైన సూటు, బూటు, అంతర్జాతీయ అవకాశాలు అందరికీ చేరువవుతాయి. అందమైన మేడలు, మౌలిక వసతుల వృద్ధి కంటే మానవ వనరుల అభివృద్ధే నిజమైన అభివృద్ధికి కొలమానం. పేద వర్గాల సాధికారిత అస్త్రాలైన ఆంగ్లభాషా నైపుణ్యం, అంతర్జాతీయ అవకాశాలు, ఆత్మగౌరవం వంటి వాటిని సమాధి చేసి దానిపై తెలుగు భాషను బ్రతికిద్దామనే కుట్ర... అణగారిన వర్గాల సాధికారితకు ఏపీ ప్రభుత్వం చేపడుతున్న ఈ మహాయజ్ఞంలో ఆహుతయ్యింది అనడానికి ఐక్యరాజ్యసమితి సదస్సులో మన విద్యార్థుల ప్రతిభే నిదర్శనం!

– డా॥ నూతక్కి అశోక్ కుమార్
బాబూ జగ్జీవన్‌రామ్ అధ్యయన కేంద్రం, నాగార్జున యూనివర్సిటీ । 97053 46919

## సత్యప్రతిష్ఠ

ఆంధ్ర మహా భారతం ఆది పర్వం చతుర్థాశ్వాసంలో శకుంతల, దుష్యంతుడికి ధర్మబోధ చేస్తూ, అన్ని ధర్మాల్లోకి సత్యమే గొప్ప ధర్మమని చెప్తుంది.

**సర్వ తీర్థాభిగమనంబు సర్వ వేద**
**సమధిగమము సత్యంబుతో సరియు గావు**
**ఎరుగుమెల్ల ధర్మంబుల కెందు పెద్ద**
**యండ్రు సత్యంబు ధర్మజ్ఞులైన మునులు**

ఇంతటి మహత్వపూర్ణమైన సత్య ప్రభావం గురించి పతంజలి మహర్షి యోగదర్శనం సాధనపాదం ముప్పై ఆరవ సూత్రంలో ఇలా అంటాడు:

**'సత్యప్రతిష్ఠాయాం క్రియాఫలాశ్రయత్వామ్'**




ఎవరు సత్యమునందు ప్రతిష్ఠితులవుతారో, ఎవరు సత్యాన్ని నిష్ఠతో త్రికరణశుద్ధిగా, అనగా మనసా వాచా కర్మణా ఆచరిస్తారో, వారు చేసే పనుల మీద, వాటి ఫలితముల మీద, వారికి అధికారం ఏర్పడుతుంది. వారి వాక్కుకు పటిమ కలుగుతుంది. వారి పలుకు అమోఘమవుతుంది. 'ఆరోగ్యవంతుడవు అగుము' అంటే రోగి వెంటనే ఆరోగ్యవంతుడవుతాడు. 'సుఖ పడుము' అంటే దుఃఖితుడు సుఖపడతాడు. 'వర్షం కురవాలి' అంటే కురుస్తుంది. అలా వారు ఏది అంటే అది జరుగుతుంది.

శ్రీమద్రామాయణం యుద్ధకాండలోని సీతమ్మ తల్లి పాతివ్రత్య పరీక్షా వృత్తాంతం ఇందుకు నిదర్శనం. సీత అగ్నిప్రవేశం చేస్తూ ప్రతిజ్ఞాపూర్వకంగా ఒక మాట అంటుంది. 'నా హృదయం ఎప్పుడూ రాముని యందే స్థిరంగా ఉండినట్లయితే, లోక సాక్షి అయిన ఈ అగ్ని నన్ను అన్ని విధాల రక్షించుగాక' అని. సీత అన్నమాట సత్యం అని రుజువు చేస్తూ అగ్ని దేవుడు చితిని తోసి వేసి, సీతను తన అంకంపై కూర్చుండ బెట్టుకొని పైకి వస్తాడు. సీత అగ్ని ప్రవేశం చేసే ముందు ఎలాగున్నదో అలాగే ఉన్నది. సీత పలికిన సత్యవచనం ప్రకారం అగ్నివల్ల ఆమె అన్ని విధాలా రక్షించబడింది.

పతంజలి సూత్రీకరించిన ఈ విషయాన్ని బుద్ధుడి కాలం పాలీ భాషలో 'సచ్చకిరియ' (సంస్కృతం: సత్యక్రియ)గా వ్యవహరించేవారు. 519 సంఖ్యగల 'సంబుల జాతక' కథలో ఇందుకు నిదర్శనం కనిపిస్తుంది. ఈ కథలో యువరాణి తను పతివ్రత అయితే, భర్త కుష్ఠు వ్యాధి నయం కావాలని అంటుంది. ఆమె పలికిన సత్యవచనం వల్ల భర్త వ్యాధి తక్షణం నయం అవుతుంది.

– దీవి సుబ్బారావు

# దోపిడీ చేసి సానుభూతి నాటకమా?

## ప్రజల సొమ్మును దోచేసి అడ్డంగా దొరికిన గజదొంగ చంద్రబాబు

- బలమైన సాక్ష్యాధారాలు ఉండటంతోనే ఆయన్ను కోర్టు రిమాండ్‌కు పంపింది
- ఇది దేశానికి అరిష్టమన్నట్లుగా టీడీపీ, ఎల్లో మీడియా దుష్ప్రచారం
- తెలుగుదేశం నేతలు, 'పచ్చ' మీడియాపై వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి మండిపాటు
- స్కిల్ స్కాం కేసులో ఎలాంటి రాజకీయ కక్షలేదు
- కక్ష సాధించాలనుకుంటే అధికారంలోకి వచ్చిన వెంటనే అరెస్టుచేసే వాళ్లం
- టీడీపీ నేతలు, ఎల్లో మీడియా ప్రచారాన్ని నమ్మవద్దని ప్రజలకు వినతి

సాక్షి, అమరావతి :స్కిల్ స్కాంలో ప్రభుత్వ ఖజానాను దోచేసి అడ్డంగా దొరికిపోయిన గజదొంగ టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబును అరెస్టుచేయడం దేశానికి అరిష్టమన్నట్లుగా ఆ పార్టీ నేతలతో కూడిన దొంగల ముఠా పచ్చి అబద్ధాలు వల్లిస్తోందని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. ఇటు రాష్ట్రంలో అటు ఢిల్లీలో గత 20 రోజులుగా ఆ ముఠా ఏం మాట్లాడినా వాటిని ప్రచురించి, ప్రసారం చేస్తూ ఐదుకోట్ల మంది ప్రజల చెవుల్లో పువ్వులు పెట్టడానికి ఎల్లో మీడియా శక్తివంచన లేకుండా కృషిచేస్తోందని ఎద్దేవా చేశారు. లక్ష మంది గోబెల్స్ కలిస్తే చంద్రబాబు అవుతాడని.. ఆయనకు రామోజీరావు, రాధాకృష్ణలు కలిస్తే గోబెల్స్ ముఠా అవుతుందంటూ ఘాటుగా విమర్శించారు. ఈ దొంగలందరూ కలిసిన టీడీపీని తోడు దొంగల పార్టీగా సజ్జల అభివర్ణించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దొంగే బాధితుడన్నట్లుగా భ్రమింపజేయడం ద్వారా ప్రజల సానుభూతి పొందేందుకు ప్రయత్నించడం ఘోరమన్నారు.



కక్ష సాధించాలనుకుంటే ప్రాథమిక ఆధారాలతో అధికారంలోకి వచ్చిన తొలిరోజుల్లోనే చంద్రబాబును అరెస్టుచేయించే వారన్నారు. స్కిల్ స్కాంలో ప్రభుత్వ ఖజానా నుంచి రూ.371 కోట్లు దోచేయడానికి చంద్రబాబే సూత్రధారి అనడానికి బలమైన సాక్ష్యాధారాలు దొరకడంతోనే సీఐడీ పోలీసులు ఆయన్ను అరెస్టుచేశారని.. వాటి ఆధారంగానే ఆయనను కోర్టు రిమాండ్‌పై జైలుకు పంపిందని సజ్జల గుర్తుచేశారు. న్యాయవ్యవస్థ చంద్రబాబును జైలుకు పంపితే.. అది అక్రమ కేసు అంటూ రాష్ట్రపతికి ఫిర్యాదుచేసే స్థాయికి టీడీపీ చేరిందంటూ విమర్శించారు. స్కిల్ స్కాం సహా అన్ని కుంభకోణాలపై అసెంబ్లీలో చర్చిద్దామంటే.. టీడీపీ ఎమ్మెల్యేలు భయపడి అసెంబ్లీ నుంచి పారిపోయారని ఆయన ఎద్దేవా చేశారు. గజదొంగకు మద్దతుగా నిరసన ప్రదర్శనలు చేయడమేంటని ప్రశ్నించారు. చంద్రబాబు కుంభకోణాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించి.. టీడీపీని వేధిస్తున్నారన్న భావనను తీసుకురావడానికి మేధావుల ముసుగులో మొన్న సీబీఐ మాజీ డైరెక్టర్.. నిన్న మణిపూర్ మహిళతో ఆ పార్టీ నేతలు, ఎల్లో మీడియా ప్రకటనలు ఇప్పిస్తున్నారని.. వాటిని నమ్మవద్దని ప్రజలకు సజ్జల విజ్ఞప్తి చేశారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

### అధికారం అంటే దోచుకోవడం కాదు..

- అధికారం అంటే దోచుకోవడమన్నది టీడీపీ సిద్ధాంతం. అధికారం అంటే ప్రజలకు సేవ చేయడం అన్నది సీఎం జగన్ సిద్ధాంతం.
- హెరిటేజ్‌లో 2 శాతం వాటా అమ్మితే రూ.400 కోట్లు వస్తాయని భువనేశ్వరి అన్నారు. రెండెకరాల ఆసామీ చంద్రబాబుకు హెరిటేజ్‌లో కేవలం 2 శాతం వాటా అమ్మితే రూ.400 కోట్లు ఎలా వచ్చాయో ప్రజలు ఆలోచించాలి.
- చంద్రబాబు అక్రమాలపై సీఐడీ విచారణ చేస్తోంది. ఇంకా కొత్త కేసులు కూడా నమోదుచేయవచ్చు. ఆ కేసుల్లో అరెస్టుచేస్తారనే లోకేశ్ రాష్ట్రానికి రావడం లేదని అంటున్నారు.
- పారిశ్రామికవేత్త అదానీని సీఎం జగన్ క్యాంపు కార్యాలయంలో కాకుండా రోడ్డు మీద కలుస్తారా? చంద్రబాబు చెట్టుకింద కూర్చుని పారిశ్రామికవేత్తలతో చర్చలు జరిపాడా? ముఖ్యమంత్రిని ఒక ప్రముఖ పారిశ్రామికవేత్త కలిస్తే కూడా రాజకీయం చేయాలని ఎల్లో మీడియా చూడటం హేయం.

### ప్రజా ధనాన్ని దోచేసిన గజదొంగ బాబు..

- టీడీపీ సర్కార్ హయాంలో జరిగిన ఏ స్కాంకైనా చంద్రబాబే సూత్రధారి. స్కిల్ స్కాం ఒప్పందాన్ని కొవ్వొత్తి కాంతిలో ఒప్పందం చేసుకున్నారట.. మరి చంద్రబాబు కనిపెట్టిన సెల్‌ఫోన్ లైట్ లేదా?
- ఫైబర్ గ్రిడ్‌లో ఈవీఎంల దొంగ వేమూరి హరికృష్ణప్రసాద్‌ను ముందుపెట్టి.. అక్రమంగా టెరాసాఫ్ట్‌కు పనులు కట్టబెట్టి.. రూ.114 కోట్లు కొట్టేసినట్లు ఆధారాలున్నాయి.
- రాజధాని అమరావతిలో అసైన్డ్ భూములకు పరిహారం ఇవ్వబోమని తొలుత పేదలను బెదిరించి, భయపెట్టి.. ఆ తర్వాత వాటిని కారుచౌకగా కాజేశారు.
- చంద్రబాబుపై కక్షపూరితంగా కేసు పెట్టారంటూ వామపక్షాలు మాట్లాడుతుండటాన్ని బట్టి చూస్తే.. వారు ఎంతకు అమ్ముడుపోయారన్నది అర్థమవుతుంది.
- అక్రమాలకు పాల్పడకపోతే చంద్రబాబు ఎందుకు పెండ్యాల శ్రీనివాస్, యోగేష్ గుప్తా, కిలారు రాజేష్‌లను పారిపోయేలా చేశాడు?
- లోకేశ్ ఢిల్లీలో ఎందుకు కూర్చున్నాడు? ఇక్కడుండి పార్టీని చూసుకోవచ్చు కదా?

## పీడీఐ ఆధారంగానే భవిష్యత్‌లో గ్రామాలకు నిధులు

**పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ సీఎస్ రాజశేఖర్**

సాక్షి, అమరావతి: పంచాయతీ డెవలప్‌మెంట్ ఇండెక్స్(పీడీఐ), గ్రామ అభివృద్ధి సూచికల ఆధారంగానే రానున్న రోజుల్లో గ్రామాలకు వివిధ అభివృద్ధి కార్యక్రమాల పేరుతో ప్రభుత్వాలు నిధులు విడుదల చేసే అవకాశం ఉందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ సీఎస్ బి.రాజశేఖర్ చెప్పారు. అందువల్ల పీడీఐ–గ్రామ అభివృద్ధి సూచికలను వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా రూపొందించాలని ఆయన సూచించారు. ఐక్యరాజ్య సమితి నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్తగా 'పంచాయతీ డెవలప్‌మెంట్ ఇండెక్స్–గ్రామ అభివృద్ధి సూచికలు' కార్యక్రమాన్ని చేపట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా పేదరికం లేని సమృద్ధి స్థాయిలో జీవనోపాధులు కలిగి ఉండే గ్రామాలు, క్లీన్ అండ్ గ్రీన్ గ్రామాలు తదితర 9 విభాగాల్లో 17 సూచికలకు సంబంధించి 577 కీలక అంశాలపై క్షేత్ర స్థాయిలో ప్రజల జీవన ప్రమాణాల వివరాలను పీడీఐల పేరుతో గ్రామాల వారీగా సేకరణ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ మేరకు రాష్ట్రంలోని 13వేలకు పైగా ఉన్న గ్రామ పంచాయతీల వారీగా పీడీఐల రూపకల్పనపై శుక్రవారం పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక కమిషనర్ సిరి, వ్యవసాయశాఖ కమిషనర్ హరికిరణ్, మహిళా, శిశు సంక్షేమశాఖ కమిషనర్ జానకీదేవి పాల్గొన్నారు.

## క్లుప్తంగా...

### అరకు కాఫీ రైతులకు 'వాల్‌మార్ట్' సహకారం



సాక్షి, విశాఖపట్నం : కాఫీ సాగులో రైతులకు ఉన్నత ప్రమాణాలను అందించేందుకు ఇప్పటికే సహకారం అందిస్తున్న వాల్‌మార్ట్ ఫౌండేషన్.. తమ సేవల్ని మరింత విస్తృతం చేసేందుకు అడుగులు వేస్తోందని సంస్థ సీవోవో జూలీ గెహ్రిక్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో అరకు కాఫీ సాగు చేస్తున్న రైతులకు ఇప్పటికే డిజిటల్ వ్యవసాయ సలహా, మార్కెట్ కనెక్టివిటీ, అధిక దిగుబడి తదితర సలహాలిస్తూ మెరుగైన ఆదాయాన్ని ఆర్జించేందుకు దోహదపడుతున్నామని పేర్కొన్నారు. కాఫీ సాగులో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చేలా టెక్నోసర్వ్ భాగస్వామ్యంతో చిన్నకారు రైతులకు వాల్యూ చైన్ మార్కెట్‌ని పరిచయం చేస్తున్నామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో వాల్‌మార్ట్ సంస్థ ద్వారా 500 గ్రామాల్లోని 10 వేల మంది కాఫీ రైతులకు సహకారం అందిస్తున్నట్లు వివరించారు.

### 5న స్టీల్‌ప్లాంట్ రక్షణకు భారీ బహిరంగ సభ

**పాల్గొననున్న సీతారాం ఏచూరి**

డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణకు సీపీఎం చేపట్టిన 11 రోజుల బైక్ యాత్ర అక్టోబర్ 5న విశాఖలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చ్ (కూర్మన్నపాలెం) వద్ద ముగియనుంది. దీన్ని పురస్కరించుకొని నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు సీపీఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి హాజరు కానున్నట్లు సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు సీహెచ్ నరసింగరావు తెలిపారు. ఈ మేరకు జగదాంబ జంక్షన్ సమీపాన గల నండూరి ప్రసాదరావు భవన్‌లో సీపీఎం విశాఖ జిల్లా కమిటీ నిర్వహించిన సమావేశంలో బహిరంగ సభ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు.


### సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం..

**బేడ బుడగ జంగాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎలమర్తి మధు**



సాక్షి,అమరావతి: బేడ బుడగ జంగం కులస్తులంతా సీఎం జగన్ వెంటే ఉంటారని బేడ బుడగ జంగాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎలమర్తి మధు స్పష్టం చేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం వద్ద శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇటీవల అసెంబ్లీలో సీఎం జగన్ బేడా బుడగ జంగం కులస్తులను ఎస్సీలుగా గుర్తించాలని తీర్మానం ప్రవేశ పెట్టి కేంద్రానికి పంపడంపై హర్షం వ్యక్తం చేశారు. సీఎం జగన్ చేసి ఈ సహాయానికి రాష్ట్రంలోని బేడ బుడగ జంగం కులస్తులు రుణపడి ఉంటారని చెప్పారు.


### రూ.30 వేల లంచంతో పట్టుబడిన సర్వేయర్



కనిగిరి రూరల్: భూమిని సబ్ డివిజన్ చేసి సర్వే రిపోర్టు ఇచ్చేందుకు రూ.30 వేలు లంచం తీసుకుంటూ ప్రకాశం జిల్లా కనిగిరి మండల సర్వేయర్ అల్లం రంగస్వామి శుక్రవారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఈ వివరాలను ఏసీబీ డీఎస్పీ వి.శ్రీనివాసరావు మీడియాకు వెల్లడించారు. కనిగిరి మండలం వంగపాడుకు చెందిన కాకర్ల శ్రీనివాసులకు ఓ అన్న, తమ్ముడు ఉన్నారు. ముగ్గురికి 2.42 ఎకరాల చొప్పున భూమి పిత్రార్జితంగా వచ్చింది. అయితే ఆ భూమిని సబ్ డివిజన్ చేసుకునేందుకు గురువాజీపేట గ్రామ సచివాలయంలో ఈనెల 11న దరఖాస్తు చేసుకున్నారు. సర్వే చేసేందుకు రంగస్వామి రూ.60 వేలు డిమాండ్ చేశాడు. చివరకు రూ.50 వేలకు ఒప్పుకొని ముందు రూ. 30 వేలు, తర్వాత రూ. 20 తీసుకునేలా బేరం కుదుర్చుకున్నాడు. కానీ, సర్వేయర్‌కు లంచం ఇవ్వడం ఇష్టంలేక ఆ అన్నదమ్ములు ఈనెల 25న ఏసీబీని ఆశ్రయించారు. వారి సూచనల మేరకు కాకర్ల శ్రీనివాసులు శుక్రవారం మధ్యాహ్నం రూ.30 వేల నగదును సర్వేయర్‌కు అందజేశాడు. అతను ఆ నగదు తీసుకొన్న సమయంలో ఏసీబీ సిబ్బంది రంగంలోకి దిగి నగదును స్వాధీనం చేసుకున్నారు. సర్వేయర్‌ను అరెస్టు చేశారు.

### మీ మామ పాపాలే ఆయనకు శాపాలు

**ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి**



సాక్షి, విశాఖపట్నం : టీడీపీ ప్రభుత్వంలో ప్రజాధనాన్ని మీ మామ చంద్రబాబు దోచుకు తిన్నాడని.. ఆనాడు చేసిన పాపాలే నేడు ఆయనకు శాపాలై జైల్లో ఉన్నాడని ఆయన కోడలు నారా బ్రాహ్మణిని ఉద్దేశించి ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి అన్నారు. ప్రజల వద్దకు వెళ్లి చేసిన తప్పులకు లెంపలేసుకుంటే ప్రజలు క్షమిస్తారని.. కానీ, అవినీతికి పాల్పడి అడ్డంగా దొరికిపోయిన దొంగ చంద్రబాబు అరెస్టుకు నిరసనగా చప్పట్లు, గరిటెలు, పళ్లాలతో నిరసన తెలియజేయమని ప్రజలకు పిలుపునివ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. విశాఖలో శుక్రవారం ఎమ్మెల్సీ మీడియాతో మాట్లాడారు.

# వైఎస్సార్‌సీపీ జెండా ఎగరాలి

- క్లీన్ స్వీప్ లక్ష్యంగా ముందడుగు వేద్దాం
- వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డి



సాక్షి, తిరుపతి: వైఎస్సార్‌సీపీ బలంగా ఉందని, మరో మారు క్లీన్ స్వీప్ లక్ష్యంగా ముందడుగు వేయాలని పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డి పిలుపునిచ్చారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం తిరుపతి జిల్లాకి వచ్చిన ఆయన పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. మొదటి రోజు శుక్రవారం శ్రీకాళహస్తి, వెంకటగిరి, తిరుపతి, గూడూరు శాసన సభ నియోజకవర్గాల పార్టీ సమీక్ష సమావేశాలను విడివిడిగా నిర్వహించి నేతలకు దిశానిర్దేశం చేశారు. తిరుపతి జిల్లాలో 2019లో లాగానే 2024 ఎన్నికల్లో ఏడు అసెంబ్లీ, తిరుపతి లోక్ సభ స్థానాన్ని కైవసం చేసుకుని పార్టీని గెలిపించుకోవాలన్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితులు, సంస్థాగత నిర్మాణం, సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు తదితర అంశాలపై చర్చించారు. వైఎస్ జగన్‌ని మరోసారి ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

**బాలాయపల్లి పీహెచ్‌సీకి రూ.2.5 కోట్లు**

వెంకటగిరి నియోజకవర్గం బాలాయపల్లి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రూ.2.5. కోట్లు మంజూరు చేస్తున్నట్టు విజయసాయిరెడ్డి తెలిపారు. ఈ సమీక్ష సమావేశాలలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్, ఎమ్మెల్యే, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యేలు బియ్యపు మధుసూదన్‌రెడ్డి, వరప్రసాద్‌రావు, ఎమ్మెల్సీలు మేరిగ మురళీధర్, చంద్రశేఖర్, సిపాయి సుబ్రమణ్యం పాల్గొన్నారు.

# తప్పు చేస్తే శిక్ష అనుభవించాల్సిందే

- ధర్నాలు, ఆందోళనలతో కేసుల నుంచి తప్పించుకోలేరు
- ప్రజల ఆస్తికి ప్రజాప్రతినిధులు కస్టోడియన్లుగా ఉండాలి
- రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ



మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

విజయనగరం: ప్రజాస్వామ్యంలో తప్పు చేస్తే శిక్ష అనుభవించాల్సిందేనని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. శుక్రవారం ఇక్కడ జరిగిన వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతిపక్ష నేత చంద్రబాబుపై ఎన్నో కేసులు ఉన్నాయని, సాంకేతిక అంశాలను అడ్డుపెట్టుకుని స్టేలు తెచ్చుకుని కాలం గడిపేస్తున్నారని చెప్పారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో మాత్రం అడ్డంగా దొరికిపోయారని తెలిపారు. చంద్రబాబు ఆయనపై పెట్టిన సెక్షన్లు సరికాదని చెప్పుకుంటున్నారే తప్ప, ఏ తప్పూ చేయలేదని, నిజాయితీపరుడినని ఎందుకు చెప్పడంలేదని ప్రశ్నించారు. పైగా, ప్రజల నుంచి సానుభూతి పొందేందుకు ప్రయత్నిస్తున్నారని, ఆయనేమైనా దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహాత్మాగాంధీ వారసుడా అంటూ మండిపడ్డారు. ధర్నాలు, ఆందోళనలతో భయపెట్టి కేసుల నుంచి తప్పించుకోలేరన్నారు. అదే జరిగితే దోపిడీ కేసుల్లో అరెస్టైన వారంతా అదే పని చేస్తారని అన్నారు. ప్రజాప్రతినిధులు ప్రజల ఆస్తికి కస్టోడియన్‌గా ఉండాలే తప్ప అధికార దర్పంతో దోచుకు తినకూడదని చెప్పారు. చంద్రబాబు తప్పు చేయకపోతే ఆ విషయాన్ని అసెంబ్లీలో చెప్పకుండా టీడీపీ ఎమ్మెల్యేలు ఎందుకు పారిపోయారని ప్రశ్నించారు. చంద్రబాబు ప్రజలను ప్రభావితం చేస్తారన్న భయంతోనే అరెస్టు చేశారంటూ టీడీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని మంత్రి ఖండించారు. ఆయన అంత ప్రభావితం చేసే నాయకుడైతే 2019 ఎన్నికల్లో ఎందుకు ఓడిపోయారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు చెప్పినవన్నీ అమలు చేశారని, అందులోభాగంగానే 11వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తున్నట్లు తెలిపారు. సీఎం వైఎస్ జగన్ బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారులకు అందించడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు, కొనుగోలు శక్తి పెంచుతున్నారని చెప్పారు. జెడ్పీ చైర్మన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, శాసన సభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

# 33 ఏళ్ల సర్వీసు తరువాత పదవీ విరమణ చేయిస్తారనడం అవాస్తవం

- ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్ రావత్

సాక్షి, అమరావతి: సీపీఎస్ ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం గ్యారెంటీ పెన్షన్‌తో మేలు చేసేందుకు ఇటీవల అసెంబ్లీలో ప్రభుత్వం ఆమోదించిన ఆంధ్రప్రదేశ్ గ్యారెంటీ పెన్షన్ పథకం (జీపీఎస్) బిల్లులోని నిబంధనలను వక్రీకరిస్తూ ఉద్యోగులను తప్పుదోవ పట్టించేలా ఎల్లో మీడియా (ఈనాడు, ఆంధ్రజ్యోతి) కథనాలు ప్రచురించిందని రాష్ట్ర ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.రావత్ మండిపడ్డారు. ఆ కథనాల్లో పేర్కొన్నట్లు 33 ఏళ్ల సర్వీసు తరువాత ఉద్యోగులను పదవీ విరమణ చేయిస్తారనడం పూర్తిగా అవాస్తవమని శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన స్పష్టం చేశారు. సభ ఆమోదించిన జీపీఎస్ బిల్లులో అలాంటి ప్రత్యేక నిబంధన లేదన్నారు. ఓపీఎస్‌లో ఉన్న తరహాలోనే జీపీఎస్ బిల్లులో కూడా పదవీ విరమణకు, స్వచ్ఛంద పదవీ విరమణకు, వైద్య పరంగా పదవీ విరమణకు, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం ద్వారా రిటైర్మెంట్‌కు అర్హతలను పేర్కొన్నట్లు ఆయన తెలిపారు. పూర్తి పెన్షన్ పొందడానికి 33 సంవత్సరాలు సర్వీసు అవసరమని, సూపర్ న్యూమర్‌యాన్యుమేషన్‌కు కనీసం పదేళ్ల అర్హత సర్వీస్, స్వచ్ఛంద పదవీ విరమణకు కనీసం 20 సంవత్సరాలు సర్వీస్ అర్హత ఉండాలని ఓపీఎస్ నిబంధనల్లో ఉన్నాయని, ఇప్పుడు జీపీఎస్ బిల్లులో కూడా అవే నిబంధనలు పొందుపరిచినట్లు రావత్ స్పష్టం చేశారు. ఎల్లో మీడియా కథనాలతో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఉద్యోగులు వాటిని నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.

# ప్రజాస్వామ్యంలో నిజాయితీ అవసరం

- చంద్రబాబు తప్పు చేయలేదని బహిరంగ చర్చకు రాగలరా : మంత్రి బొత్స
- అసైన్డ్ భూముల కుంభకోణం దారుణం : మంత్రి ధర్మాన ప్రసాదరావు
- దోచుకోవడంలో 40 ఇయర్స్ ఇండస్ట్రీ చంద్రబాబుది : మంత్రి సీదిరి అప్పలరాజు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): స్కిల్‌స్కామ్‌లో వేల కోట్ల అవినీతికి చంద్రబాబే సూత్రధారి.. పాత్రధారి కాబట్టే ఐటీ, ఈడీ అధికారులు పట్టుకుని దొంగతనం బయటపెట్టారని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో ఆర్డినేటర్, శ్రీకాకుళం జిల్లా ఇన్‌చార్జి మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. చంద్రబాబు తప్పు చేయలేదని టీడీపీ నేతలు బహిరంగ చర్చకు రాగలరా.. అని సవాల్ విసిరారు. శ్రీకాకుళంలోని అంబేడ్కర్ ఆడిటోరియంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అధ్యక్షతన నిర్వహించారు. బొత్స మాట్లాడుతూ వ్యవస్థలను మేనేజ్ చేయగలనను కున్న బాబుకు జైలు తప్పలేదన్నారు. తాను వోక్స్‌వ్యాగన్ కేసులో సీబీఐ దర్యాప్తునకు సహకరించానని, తాను తప్పు చేయలేదు కాబట్టే ధైర్యంగా ఎదుర్కోగలిగానన్నారు. ప్రజాస్వామ్యంలో నిజాయతీ చాలా అవసరమన్నారు. వ్యవస్థలను ఎంత మేనేజ్ చేసినా దొంగ ఎప్పుడైనా దొరక్క తప్పదని చెప్పారు. ఏపీలో ప్రజల కొనుగోలు శక్తి పెరగడంతో జీడీపీ పెరిగిందన్నారు. పార్టీ వ్యతిరేక కార్యక్రమాలు ఎవ్వరైనా చేస్తే క్షమించేది లేదన్నారు. 2024 ఎన్నికల్లో ప్రతి గ్రామాన వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయడమే మనముందున్న లక్ష్యమని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

**పూర్తిస్థాయిలో దర్యాప్తు**

మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీలకు నివసించడానికి కేటాయించిన అసైన్డ్ భూములను రాజధాని ప్రాంతంలో వేర్వేరు పేర్లతో చంద్రబాబు అండ్ కో తినేయడానికి చూశారన్నారు. దుబాయ్, అమెరికాలో ఉండే బాబు బినామీలు ఆ భూములు కాజేశారని ఆరోపించారు. నాటి ప్రభుత్వంలో జరిగిన అన్యాయాలు అరాచకాలపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరుగుతోందన్నారు. ఇలాంటి దొంగ చంద్రబాబు కోసం హైదరాబాద్ నుంచి కొవ్వొత్తులు, బనియన్లు తెప్పించి ఏపీలో ప్రజలకు ఇచ్చి ఇష్టం లేకున్నా వారితో ధర్నాలు, రోడ్డుపై బైఠాయింపు వంటి కార్యక్రమాలు చేసి సానుభూతి పొందాలని ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. పశుసంవర్ధక శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ చంద్రబాబు 40 ఏళ్ల ఇండస్ట్రీ అంటే ప్రజాధనాన్ని ఎలా దోచుకోవాలో.. ఎలా దాచుకోవాలో అన్నది బాగా నేర్చుకున్నారన్నారు. ఇలాంటి అక్రమాలు, అన్యాయాలు ఎన్నాళ్లు దాగిపోవని, తప్పు చేసేవాడు ఎంతటివాడైనా శిక్ష తప్పదన్నారు.

# ప్రభుత్వ భూములూ మింగేశారు!

▶ మొదటి పేజీ తరువాయి

చంద్రబాబు బృందం భూదోపిడీకి పాల్పడటం 'సాక్షి' పరిశోధనలో వెలుగులోకి వచ్చింది. ఏకంగా 328 ఎకరాల ప్రభుత్వ భూమిని 522 మంది బినామీల పేరిట హస్తగతం చేసుకున్నారు. అనంతరం భూసమీకరణ ప్యాకేజీ కింద రూ.760.25 కోట్లను కాజేశారు. చంద్రబాబు, నారాయణ, లోకేశ్ అసైన్డ్ భూ దోపిడీలో ఆ అవినీతి పర్వం ఇదిగో ఇలా ఉంది....

**రెండు కేటగిరీలుగా వర్గీకరించి..**

రాజధాని పేరుతో అమరావతి పరిధిలో సర్వే చేయించిన చంద్రబాబు, నారాయణ దృష్టి ఆ ప్రాంతంలోని ప్రభుత్వ భూములపై పడింది. అసైన్డ్ భూములను 1 నుంచి 4 కేటగిరీల కింద విభజించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేద రైతులను బెదిరించి తీసుకోగా ఎవరి ఆధీనంలోనూ లేని ప్రభుత్వ భూములను దక్కించుకునేందుకు మరో పన్నాగం పన్నారు. ఆ ప్రభుత్వ భూములన్నీ గుర్తు తెలియని రైతుల ఆధీనంలో ఉన్నట్లు రికార్డుల్లో చూపించారు. వాటిని అసైన్డ్ భూముల జాబితాలో 5, 6 కేటగిరీల కింద పేర్కొన్నారు. అన్యాక్రాంతమైనప్పటికీ అభ్యంతరాలు లేని భూములను కేటగిరీ 5 కింద, అన్యాక్రాంతమై అభ్యంతరాలున్న భూములను కేటగిరీ 6 కింద చూపిస్తూ జీవో 41 జారీ చేశారు. ఆ భూములకు భూసమీకరణ ప్యాకేజీని ప్రకటించారు. కేటగిరీ 5 కింద భూములకు 500 చ.గజాల నివాస స్థలం, 100 చ.గజాల వాణిజ్య స్థలాన్ని ప్యాకేజీగా పేర్కొన్నారు. కేటగిరీ 6 కింద భూములకు 260 చ.గజాల నివాస స్థలాన్ని ప్యాకేజీగా ఇస్తామని ప్రకటించారు. అంతేకాదు ఎకరా కంటే తక్కువ ఉన్న భూములకు కూడా కనీసం ఎకరా ప్యాకేజీ వర్తిస్తుందని జీవోలో పేర్కొన్నారు.



### 328 ఎకరాలు... రూ.760.25 కోట్ల ప్యాకేజీ

అనంతరం అసలు కథను తెరపైకి తెచ్చారు. అమరావతి పరిధిలో కేటగిరీ 5 కింద 237.60 ఎకరాలను గుర్తించారు. ఆ భూములన్నీ 295 మంది ఆధీనంలో ఉన్నట్టుగా చూపించారు. ఇక కేటగిరీ 6 కింద 90.52 ఎకరాలను చూపించారు. ఆ భూములు 227 మంది స్వాధీనంలో ఉన్నట్టుగా కనికట్టు చేశారు. వాస్తవానికి ఆ రెండు కేటగిరీల భూములు ఎవరి ఆధీనంలోనూ లేవు. కానీ ఆ భూములు 522 మంది తమ బినామీల ఆధీనంలో ఉన్నట్టుగా చూపించి భూసమీకరణ ప్యాకేజీని కొల్లగొట్టారు. అమరావతిలో ప్యాకేజీ ప్రకటించే నాటికి నివాస స్థలం చ.గజం రూ.30 వేలు, వాణిజ్య స్థలం చ.గజం రూ.50 వేలు చొప్పున మార్కెట్ ధర పలికింది. అమరావతి నిర్మాణం పూర్తయితే మార్కెట్ ధర మరింత పెరుగుతుంది.

- అప్పటి ధరనే తీసుకుంటే కేటగిరీ 5 కింద ఒక్కొక్కరికీ రూ.1.50 కోట్ల విలువైన నివాస స్థలం, రూ.50 లక్షలు విలువైన వాణిజ్య స్థలం వెరసి రూ.2 కోట్లు చొప్పున ప్యాకేజీ దక్కింది. ఆ ప్రకారం కేటగిరీ 5 కింద ఉన్న 295 మంది రూ.590 కోట్ల విలువైన స్థలాలను పొందారు.
- కేటగిరీ 6 కింద ఒక్కొక్కరికీ రూ.75 లక్షలు విలువైన నివాస స్థలం ఇచ్చారు. ఆ ప్రకారం 227 మందికి రూ.170.25 కోట్ల విలువైన స్థలాలు దక్కాయి.
- మొత్తం మీద కేటగిరీ 5, 6లలో రైతులుగా చూపించిన తమ బినామీలు 522 మంది ముసుగులో చంద్రబాబు, నారాయణ రూ.760.25 కోట్ల విలువైన స్థలాలను కొల్లగొట్టినట్లు స్పష్టమైంది.

### ఆ గ్రామాల్లో ఒక్కరూ లేరు

అమరావతి భూదోపిడీపై దర్యాప్తు జరుపుతున్న సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) దర్యాప్తులో అసైన్డ్ భూకుంభకోణం ఆధారాలతో సహా వెలుగులోకి వచ్చింది. రెవెన్యూ కార్యాలయాల్లో ఉన్న భూముల రికార్డులు, సీఆర్‌డీఏ భూసమీకరణ ప్యాకేజీ ప్రకటించిన రైతుల జాబితాలను సిట్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కేటగిరీ 5, 6లలో చూపించిన 522 మంది రైతుల్లో ఒక్కరు కూడా అమరావతి గ్రామాల్లోనే లేకపోవడం విస్మయం కలిగిస్తోంది. అంటే ప్రభుత్వ భూములను ఆక్రమించిన రైతులెవరూ లేరు. భూసమీకరణ ప్యాకేజీ కింద రాజధానిలో అత్యంత విలువైన స్థలాలను కాజేసేందుకే చంద్రబాబు ముఠా ఈ పన్నాగానికి పాల్పడిందన్నది ఆధారాలతోసహా నిర్ధారణ అయ్యింది.

# తినేది లంచాలు.. మోగించేది కంచాలా?

### అవినీతి చేసి అవి కొట్టడమేంటి?

- ఐదేళ్లు అడ్డంగా తినేసిన బకాసురులంతా కంచాలు ఎవరి మీద మోగిస్తున్నారు?
- విజిళ్లు ఎవరి మీద ఊదుతారు? హారన్లు ఎవరిని ఉద్దేశించి కొడతారు?
- బాబు మద్దతుదారులంతా రాష్ట్రపతి, మోదీ, అమిత్ షా కార్యాలయాల ముందు నిలబడి కొట్టాలి
- మంత్రి అంబటి రాంబాబు



సాక్షి, అమరావతి :స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో అవినీతికి పాల్పడి, అడ్డంగా దొరికిపోయి ప్రజల ముందు తలదించుకుని సిగ్గుపడాల్సిన వారు కంచాలు మోగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం ఆశ్చర్యంగా ఉందని నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఎద్దేవా చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అవినీతి చేసి కంచాలు కొట్టడం ఏమిటని.. తినేది లంచాలు.. మోగించేది కంచాలా? అంటూ ఆయన ప్రశ్నించారు. సిగ్గుపడాల్సిన చోట, తలదించుకోవాల్సిన చోట కూడా తల ఎగరేస్తున్నారని ఆయన మండిపడ్డారు. అంబటి ఆ ప్రకటనలో ఇంకా ఏమన్నారంటే..

- టీడీపీ నేతల అహంకారాన్ని ప్రజలు మరింత అణచాల్సిన అవసరం ఉంది.
- 2014 నుంచి 2019 వరకు మోగించిన అవినీతి మోత కారణంగానే చంద్రబాబుకు ఇప్పుడు ఇంట్లో ఈగల మోత జైల్లో దోమల మోత.. అన్న పరిస్థితి వచ్చింది.
- చంద్రబాబును అరెస్టుచేసింది రాష్ట్ర సీఐడీ అన్నది ఎంత నిజమో, కోర్టులు తిరస్కరించటం వల్లే చంద్రబాబు ఈరోజు రిమాండ్‌లో ఖైదీగా ఉన్నారన్నది కూడా అంతే నిజం.
- ఐదేళ్లు అడ్డంగా తినేసిన బకాసురులంతా కలిసి కంచాలు ఎవరి మీద మోగిస్తున్నారు? విజిళ్లు ఎవరి మీద ఊదుతారు? హారన్లు ఎవరిని ఉద్దేశించి కొడతారు?
- సీఎం జగన్ తన నాలుగేళ్ల పాలనలో పేదలకు డీబీటీ ద్వారా రూ.2.35 లక్షల కోట్లు బదిలీ చేస్తే.. అదే స్థాయిలో బడ్జెట్, నిధులు ఉన్నా ఆ సొమ్మంతా టీడీపీ హయాంలో ఉఫ్ అని ఊదేసినందుకు గుర్తుగా టీడీపీ వారంతా విజిళ్లు ఊదుతారా?
- అలాగే, అవినీతి చేసి హైదరాబాద్ నుంచి పారిపోయి వచ్చి, బస్సులో పడుకున్నానని ఆడిన డ్రామాలకు గుర్తుగా హారన్లు మోగిస్తారా?
- ఇక చంద్రబాబు అవినీతిని ఈడీ కూడా నిర్ధారించి నలుగురిని అరెస్టు చేసింది. కాబట్టి, ఢిల్లీలో దాక్కున్న లోకేశ్ ఆ ఈడీ ఆఫీసు ముందు నిలబడి, ఇది అక్రమం అని కంచాలు కొడితే బాగుంటుంది.
- రాష్ట్రపతి, మోదీ, అమిత్ షా కార్యాలయాల ముందు నిలబడి, తమ ఎంపీలు, పురందేశ్వరి, సీపీఐ నారాయణ, రామకృష్ణ, రేవంత్‌రెడ్డి, సుజనాచౌదరి, సీఎం రమేష్, సత్యకుమార్, రేణుకాచౌదరి, కూనంనేని సాంబశివరావు, బీవీ రాఘవులు, జయప్రకాష్ నారాయణ, వీళ్లందరినీ ఢిల్లీలో నిలబెట్టుకుని ఈడీ అరెస్టు అక్రమమని, స్కిల్ స్కామేలేదని కంచాలు కొడితే బాగుంటుంది. విజిల్స్ ఊదితే ఇంకా బాగుంటుంది. హారన్లు కొడితే మరింత బాగుంటుంది.
- అలాగే, కేంద్ర ఆర్థికమంత్రి ఇంటి ముందు, ప్రధానమంత్రి ఇంటి ముందు, ఢిల్లీలోని ఐటీ శాఖ ప్రధాన కార్యాలయం ముందు కూడా బాబుకు మద్దతిచ్చే వారంతా కంచాలు, గిన్నెలు, తపాళాలు, గరిటెలు, గ్లాసులు అన్నీ తీసుకెళ్లి కొడితే బాగుంటుంది.
- వీలుంటే నల్ల చొక్కాలతో ప్రదర్శన చేసి, వాట్ ఐ యామ్ సేయింగ్ అంటూ గతంలో కొట్టిన డైలాగుల్ని రిపీట్ చేస్తే బాగుంటుంది.

## క్లుప్తంగా...

### మహిళా రిజర్వేషన్ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

**న్యూఢిల్లీ:** చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన మహిళా రిజర్వేషన్ బిల్లుపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం ఆమోద ముద్ర వేశారు. ఈ మేరకు కేంద్ర న్యాయ శాఖ శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేసింది. బిల్లును ఇకపై అధికారికంగా రాజ్యాంగ(106వ సవరణ) చట్టంగా వ్యవహరిస్తారు. అంటే మహిళా రిజర్వేషన్ బిల్లు రాష్ట్రపతి ఆమోదంతో పూర్తిస్థాయి చట్టంగా మారింది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన తేదీ నుంచి అధికారిక గెజిట్ నోటిఫికేషన్ ద్వారా అమల్లోకి వస్తుంది. నారీశక్తి వందన్ అధినియమ్ పేరిట కేంద్ర ప్రభుత్వం ఇటీవల పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లు లోక్‌సభ, రాజ్యసభలో ఆమోదం పొందిన సంగతి తెలిసిందే.

### శృంగారానికి సమ్మతి వయసు మార్చొద్దు

**కేంద్రానికి లా కమిషన్ సూచన**

**న్యూఢిల్లీ:** శృంగార కార్యకలాపాల్లో పాల్గొనే విషయంలో 'సమ్మతి వయసు'ను తగ్గించాలన్న వాదనను లా కమిషన్ వ్యతిరేకించింది. ఈ విషయంలో ఎలాంటి మార్పులు చేయొద్దని కేంద్ర ప్రభుత్వానికి తెలియజేసింది. లైంగిక హింస నుంచి చిన్నారులకు రక్షణ కల్పించేందుకు తీసుకొచ్చిన పోక్సో చట్టం ప్రకారం.. శృంగారానికి సమ్మతి వయసు ప్రస్తుతం 18 ఏళ్లుగా ఉంది. దీన్ని 16 ఏళ్లకు తగ్గించాలన్న వినతులు వచ్చాయి. లా కమిషన్ తన నివేదికను తాజాగా కేంద్రప్రభుత్వానికి సమర్పించింది. పోక్సో చట్టం ప్రకారం 18 ఏళ్లలోపు వయసు వారంతా బాలలే. వారిపై అత్యాచారానికి, లైంగిక నేరాల కు పాల్పడితే 20 ఏళ్లకుపైగా జైలు శిక్ష విధించవచ్చు.

### దశల వారీగా ఈ-ఎఫ్ఐఆర్‌ల రిజిస్ట్రేషన్

**కేంద్రానికి లా కమిషన్ నివేదిక**

**న్యూఢిల్లీ:** దేశంలో ఈ-ఎఫ్ఐఆర్‌ల (ఎలక్ట్రానిక్ ప్రాథమిక సమాచార నివేదిక) రిజిస్ట్రేషన్ ప్రక్రియను దశల వారీగా అమల్లోకి తీసుకురావాలని లా కమిషన్ సూచించింది. ఈ మేరకు తన నివేదికను ఇటీవల కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. తొలుత మూడేళ్ల వరకు జైలు శిక్ష పడే నేరాల్లో ఈ-ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయాలని వెల్లడించింది. ఈ-ఎఫ్ఐఆర్‌ల రిజిస్ట్రేషన్ కోసం దేశవ్యాప్తంగా కేంద్రీకృత జాతీయ పోర్టల్ ఏర్పాటు చేయాలని సూచించింది.

### 'జాహ్నవి' మృతిపై అనుచిత వ్యాఖ్యలు.. విధుల నుంచి అధికారి తొలగింపు

**సియాటెల్:** అమెరికాలో రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన తెలుగు విద్యార్థిని కందుల జాహ్నవి(23)పై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలున్న పోలీసు అధికారిపై వేటు పడింది. పోలీస్ అధికారి డేనియల్ ఆడెరర్‌ను గస్తీ విధుల నుంచి తొలగించినట్లు సియాటెల్ పోలీస్ విభాగం గురువారం ధ్రువీకరించింది. అతడికి ఎలాంటి బాధ్యతలను అప్పగించలేదని కూడా తెలిపింది. అయితే, అడెరర్‌పై చర్యలు ఎప్పుడు తీసుకున్నదీ వెల్లడించలేదు. జనవరి 23వ తేదీన సియాటెల్‌లో కెవిన్ డేవ్ పోలీసు అధికారి నడుపుతున్న వాహనం ఢీకొని రోడ్డు దాటుతున్న కందుల జాహ్నవి ప్రాణాలు కోల్పోయింది. సమాచారం అందుకున్న మరో అధికారి డేనియల్ అడెరర్ చులకన చేస్తూ మాట్లాడటంపై తీవ్ర దుమారం చెలరేగింది. అడెరర్ బాడీ కెమెరా రికార్డింగ్ ఆధారంగా ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు సియాటెల్ పోలీస్ విభాగం పేర్కొంది.

### 'ఇండియా' కూటమిలోనే ఉంటాం: కేజ్రీవాల్

**న్యూఢిల్లీ:** ప్రతిపక్ష ఇండియా కూటమి నుంచి తాము బయటకు వచ్చే ప్రసక్తే లేదని ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తేల్చిచెప్పారు. ఇండియా కూటమిలోనే భాగస్వామిగా ఉంటామని చెప్పారు. ఆయన శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. కూటమి ధర్మానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. విపక్ష కూటమి తరఫున ప్రధానమంత్రి అభ్యర్థిగా మీ పేరును ఎందుకు ప్రకటించడం లేదని ప్రశ్నించగా... తామే ప్రధానమంత్రి అని దేశంలోని 140 మంది భారతీయులు భావించేలా ఒక వ్యవస్థను తయారు చేయాల్సిన అవసరం ఉందని కేజ్రీవాల్ బదులిచ్చారు. కేవలం ఒక వ్యక్తిని కాదని, పౌరులందరినీ అభివృద్ధిలోకి తీసుకురావాలని చెప్పారు.


### 'ఇండియా'కు మద్దతు

**న్యూఢిల్లీ:** విపక్ష ఇండియా కూటమికి 18 చిన్న పార్టీలు, 50కి పైగా పౌర సంఘాలు మద్దతు ప్రకటించాయి. త్వరలో జరగనున్న పలు రాష్ట్రాల అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల్లో ఆ కూటమిలోని పార్టీల తరఫున పోటీ చేసే అభ్యర్థులకు మద్దతివ్వాలని నిర్ణయించాయి. 'ఇండియా గెలుస్తుంది: ప్రజాస్వామ్యం, సామ్యవాదం, సామాజిక న్యాయం కోసం జాతీయ సదస్సు' పేరుతో వాటి నేతలు శుక్రవారం ఇక్కడ భేటీ అయ్యారు. ముఖ్యంగా విపక్ష అభ్యర్థులు స్వల్ప తేడాతో ఓడిపోతున్న 100 నుంచి 150 లోక్‌సభ స్థానాల్లో ఈసారి వారికి దన్నుగా నిలుస్తామని స్వరాజ్ ఇండియా నేత యోగేంద్ర యాదవ్ పేర్కొన్నారు. 20కి పైగా రాష్ట్రాల నుంచి ప్రతినిధులు సదస్సుకు హాజరైనట్లు చెప్పారు.

### 'వాలంటీర్' విభాగం చీఫ్‌గా వాగ్నర్ కమాండర్: పుతిన్

**మాస్కో:** ఉక్రెయిన్ లో సైనిక లోటును పూడ్చుకునేందుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నానా ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగా తమ సైన్యం తాలూకు 'వాలంటీర్ విభాగం చీఫ్‌గా వాగ్నర్ మాజీ కమాండర్ ఆండ్రే ట్రొషెవ్‌ను నియమించారు. ప్రధానంగా కిరాయి సైన్యం అయిన వాగ్నర్ గ్రూప్ చీఫ్ యెవ్‌గనీ ప్రిగోజిన్ ఇటీవల విమాన ప్రమాదంలో అనుమానాస్పద రీతిలో మరణించడం తెలిసిందే.

# పెద్ద టెలీస్కోప్!



**గ్రహాంతరవాసుల గుట్టు విప్పేందుకు శరవేగంగా సిద్ధం చేస్తున్న నాసా**

**జేమ్స్ వెబ్ కంటే 4 రెట్లు పెద్దది!**

ఈ అనంత విశ్వంలో మనం ఒంటరి జీవులమేనా? లేక ఇతర గ్రహాల్లోనో, లేదంటే విశ్వాంతరాల్లో సుదూరాల్లోనో మరెక్కడైనా జీవముందా? ఉంటే వాళ్లు మనలాంటి ప్రాణులేనా? మనిషిని ఎంతోకాలంగా వెంటాడుతున్న ఈ ప్రశ్నలకు సమాధానం కనిపెట్టే ప్రయత్నాలకు మరోసారి తెర లేచింది. ఇందుకోసం ప్రపంచంలోకెల్లా అతి పెద్ద ఆప్టికల్ టెలీస్కోప్ అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా ఆధ్వర్యంలో శరవేగంగా రూపుదిద్దుకుంటోంది..!

**ఏమిటీ జీఎంటీ? జయింట్ మగలాన్ టెలీస్కోప్ (జీఎంటీ)**

విశ్వంలో సుదూరంలో ఉన్న నక్షత్రాలు తదితరాల రసాయన విశ్లేషణ ద్వారా వాటి లోగుట్టును కనిపెట్టేందుకు అత్యధిక సామర్థ్యంతో కూడిన ఈ టెలీస్కోప్ నాసా ఆధ్వర్యంలో సిద్ధమవుతోంది...

- దీని ఉపరితలం వైశాల్యమే ఏకంగా 368 చదరపు మీటర్లు!
- జీఎంటీకు ఏడు అతి పెద్ద పట్టకాల సమూహాన్ని బిగిస్తున్నారు. వీటి పొడవు 24.5 మీటర్లు.
- వీటిలో కీలకమైన చివరి, ఏడో ప్రాథమిక పట్టకం పాలిషింగ్ పని చివర్లో ఉందిప్పుడు.

**20 టన్నుల ఆప్టికల్ గ్లాస్!**

- జీఎంటీ తాలూకు పట్టకాల తయారీ పని అరిజోనా యూనివర్సిటీలోని రిచర్డ్ ఎఫ్.కారిస్ మిర్రర్ ల్యాబ్‌లో పెద్ద ఎత్తున జరుగుతోంది.
- ఇందుకోసం ఏకంగా 20 టన్నుల అత్యంత శుద్ధమైన ఆప్టికల్ గ్లాస్‌ను వాడుతున్నారు.
- దాన్ని 1,185 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత వద్ద వేడి చేస్తున్నారు.
- ఈ గ్లాస్ కరిగిన కొద్దీ బయటి కొసవైపు కుంభాకారపు పట్టకంగా రూపుదాలుస్తుంది.
- తర్వాత దాన్ని 3 నెలల పాటు చల్లబరుస్తారు.
- అనంతరం పాలిషింగ్ చేస్తారు.
- చివరగా ఏడు అద్దాలనూ కలగలిపి ఒకే పెద్ద పట్టకంగా బిగిస్తారు.
- అప్పుడిక ప్రస్తుతం అందుబాటులో ఉన్న అత్యాధునిక టెలీస్కోప్‌లన్నింటి కంటే జీఎంటీ కనీసం 4 రెట్లు హెచ్చు రిజల్యూషన్, 200 రెట్లు అధిక సున్నితత్వంతో పనిచేసే టెలిస్కోప్‌గా మారుతుంది.
- జేమ్స్‌వెబ్‌తో సహా ఇప్పటిదాకా అందుబాటులో ఉన్న ఏ టెలీస్కోప్‌కూ ఇంత పెద్ద పట్టకం లేదు. అయితే ఇన్ ఫ్రారెడ్ కాంతిలో విశ్వాన్ని పరిశీలించే శక్తి ఇప్పుడు తయారవుతున్న జీఎంటీతో సహా ఏ టెలీస్కోప్‌కూ లేదు. ఆ సామర్థ్యం ఇప్పటిదాకా జేమ్స్ వెబ్ కు మాత్రమే సొంతం.
- జీఎంటీ పొడవు 39 మీటర్లు. దీని తయారీకి 2,100 టన్నుల స్టీలు వాడుతున్నారు!

**జీవం ఉనికిని గుర్తించడంలో కీలకం...**

సుదూరాల్లోని గ్రహాలు, శకలాలు తదితర గోళాల్లో ఉపరితలాలను ముందెన్నడూ లేనంత స్పష్టంగా పరిశీలించేందుకు జీఎంటీ తోడ్పడుతుందని సైంటిస్టులు చెబుతున్నారు. 'ముఖ్యంగా భూమి మాదిరిగానే వాటిమీద పర్వతమయ ప్రాంతాలు ఉన్నదీ లేనిదీ తెలుస్తుంది. తద్వారా వాటిమీద జీవం ఉనికి తాలూకు జాడ కూడా చిక్కుతుంది' అని వారు అంటున్నారు.

**కొసమెరుపు:**

ఈ జీఎంటీ టెలీస్కోప్ పూర్తిగా తయారై అందుబాటులోకి రావడానికి కనీసం మరో ఆరేళ్లన్నా పట్టొచ్చట. అంటే, దశాబ్దాంతం దాకా వేచి చూడాల్సిందే!

నేషనల్ డెస్క్, సాక్షి



మస్తుంగ్‌లో బాంబు పేలుడు దృశ్యం

## పాక్‌లో ఆత్మాహుతి దాడులు.. 58 మంది మృతి

**మరో 100 మందికి గాయాలు**

**కరాచీ:** మసీదుల్లో మిలాదునబి వేడుకలే లక్ష్యంగా పాకిస్తాన్‌లో శుక్రవారం జరిగిన రెండు వేర్వేరు ఆత్మాహుతి దాడుల్లో 58 మంది మృత్యువాతపడగా మరో 100 మందికి పైగా గాయాలపాలయ్యారు. బలూచిస్తాన్ ప్రావిన్స్ మస్తుంగ్ జిల్లా కేంద్రంలోని ఓ మసీదులో ప్రార్థనల సమయంలో జరిగిన బాంబు దాడిలో 54 మంది చనిపోయారు. మరో 100 మంది గాయపడ్డారు. మృతుల్లో డీఎస్పీ నవాజ్ గష్కోరి కూడా ఉన్నారు. గుర్తు తెలియని దుండగుడు డీఎస్పీ నవాజ్ కారు పక్కనే నిలబడి తనను తాను పేల్చేసుకున్నాడని అధికారులు తెలిపారు. క్షతగాత్రుల్లో సుమారు 20 మంది పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. అదేవిధంగా, ఖైబర్ ఫంఖ్తున్వా ప్రావిన్స్ హంగు నగరంలోని దవోబా పోలీస్ ఠాణాలోకి అయిదుగురు ఉగ్రవాదులు ప్రవేశించారు. భద్రతా బలగాలతో జరిగిన ఎదురు కాల్పుల్లో ఒక ఉగ్రవాది హతం కాగా మరో నలుగురు పారిపోయారు. వారిలో ఒకరు పక్కనే ఉన్న మసీదులోకి చేరుకుని తనను పేల్చేసుకున్నాడు. ఈ దాడిలో మసీదులో ఉన్న నలుగురు ప్రాణాలు కోల్పోగా మరో 12 మంది గాయపడ్డారు. మిగతా ముగ్గురు ఉగ్రవాదుల కోసం వేట సాగుతోందని పోలీసులు చెప్పారు. ఈ దాడులకు తాము కారణం కాదంటూ తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్తాన్ తెలిపింది. ఉగ్ర సంస్థ ఇస్లామిక్ స్టేట్(ఐఎస్)కు చెందిన కీలక కమాండర్‌ను భద్రతా బలగాలు కాల్చి చంపిన మరునాడే ఈ ఘటన చోటుచేసుకోవడంతో ఐఎస్ పాత్రపై అనుమానాలు తలెత్తుతున్నాయి.

# 2029 నుంచే జమిలి ఎన్నికలు!

- ఫార్ములాను ప్రతిపాదిస్తున్న లా కమిషన్
- కొన్ని రాష్ట్రాల శాసనసభల కాలపరిమితిని పొడిగించాలి
- మరికొన్ని రాష్ట్రాల శాసనసభల కాలపరిమితిని తగ్గించాలి
- ఉమ్మడి ఓటర్ల జాబితాతోనే అన్ని రకాల ఎన్నికలు
- కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయనున్న లా కమిషన్

**న్యూఢిల్లీ:** లోక్‌సభతోపాటు అన్ని రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించడంపై దేశవ్యాప్తంగా చర్చ సాగుతోంది. జమిలి ఎన్నికలు వచ్చే ఏడాది సాధ్యం కాదని లా కమిషన్ తేల్చిచెప్పినట్లు సమాచారం. కేంద్ర ప్రభుత్వ సిఫార్సు మేరకు జమిలి ఎన్నికల సాధ్యాసాధ్యాలపై జస్టిస్ రితూ రాజ్ అవస్థీ నేతృత్వంలోని లా కమిషన్ అధ్యయనం చేస్తోంది. 2029 నుంచి లోక్‌సభతోపాటు రాష్ట్రాల అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడానికి వీలుగా కమిషన్ ఓ ఫార్ములాను ప్రతిపాదిస్తున్నట్లు తెలిసింది. దాని ప్రకారం.. కొన్ని రాష్ట్రాల శాసనసభల కాలపరిమితిని పొడిగించాలి. మరికొన్ని రాష్ట్రాల శాసనసభల కాలపరిమితిని తగ్గించాలి. ఈ ఫార్ములాతోజమిలి ఎన్నికలు నిర్వహించడం సులువేనని లా కమిషన్ నిర్ణయానికి వచ్చినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. జమిలి ఎన్నికలపై అధ్యయనానికి మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం ఒక ఉన్నత స్థాయి కమిటీని సైతం ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.

**ఉమ్మడి ఓటర్ల జాబితాతో మేలు**

ఓటర్ల జాబితా విషయంలోనూ లా కమిషన్ కీలక సిఫార్సును తెరపైకి తీసుకొస్తోంది. లోక్‌సభ, శాసనసభలు, స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రస్తుతం వేర్వేరు ఓటర్ల జాబితాలను ఉపయోగిస్తున్నారు. వీటిని కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్రాల ఎన్నికల సంఘాలు రూపొందిస్తున్నాయి. అన్ని రకాల ఎన్నికలకు ఒక ఉమ్మడి ఓటర్ల జాబితా ఉండాలన్నదే లా కమిషన్ ఉద్దేశమని సమాచారం. దీనివల్ల ఖర్చు, మానవ వనరుల వినియోగం గణనీయంగా తగ్గుతాయని అభిప్రాయపడుతోంది. ఉమ్మడి ఎన్నికల జాబితా కోసం ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని చెబుతోంది. జమిలి ఎన్నికల ప్రక్రియలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేయడానికి ఓటర్లు పోలింగ్ బూత్‌కు కేవలం ఒకే ఒక్కసారి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని లా కమిషన్ సూచిస్తోంది. అంటే ఒకే పోలింగ్ బూత్‌లో ఒకేసారి రెండు ఎన్నికల్లో ఓట్లు వేసేలా ఏర్పాట్లు ఉండాలని చెబుతోంది. జమిలి ఎన్నికలపై లా కమిషన్ సిఫార్సులు కొన్ని అనధికారికంగా బయటకు వచ్చినప్పటికీ తుది నివేదిక ఇంకా సిద్ధం కాలేదు. ఇంకా కొన్ని అంశాలపై మరింత అధ్యయనం చేయాల్సి ఉందని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి.

**ఏడాది వ్యవధిలో రెండు దశలు**

లోక్‌సభ, శాసనసభలతోపాటు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై అధ్యయనం బాధ్యతను రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని కమిటీకి కేంద్ర ప్రభుత్వం అప్పగించింది. లా కమిషన్ మాత్రం ఏక కాలంలో లోక్‌సభ, శాసనసభల ఎన్నికలు నిర్వహించడంపై అధ్యయనం చేస్తోంది. కోవింద్ కమిటీ ఏర్పాటు నేపథ్యంలో లా కమిషన్ కూడా మూడు రకాల ఎన్నికలపై దృష్టి పెట్టినట్లు సమాచారం. లోక్‌సభ, శాసనసభల ఎన్నికలను ఒక దశలో, స్థానిక సంస్థల ఎన్నికలను రెండో దశలో నిర్వహించాలని లా కమిషన్ అభిప్రాయపడుతోంది.

# వరల్డ్ కప్ కాదు.. టెర్రర్ కప్

## భారత్‌లో విధ్వంసానికి ఖలిస్తాన్ ఉగ్రవాది గురుపట్వంత్ సింగ్ పన్నూ హెచ్చరికలు

- ప్రజల ఫోన్లకు ప్రి-రికార్డెడ్ వాయిస్ మెసేజ్
- హరిదీప్ సింగ్ నిజ్జర్ హత్యకు ప్రతీకారం తీర్చుకుంటాం
- అక్టోబర్ 5న ప్రపంచ టెర్రర్ కప్ ప్రారంభమవుతుందని హెచ్చరిక

**అహ్మదాబాద్:** కరడుగట్టిన ఖలిస్తాన్ ఉగ్రవాది, నిషేధిత సిఖ్స్ ఫర్ జస్టిస్(ఎస్ఎఫ్‌జే) సంస్థ అధినేత గురుపట్వంత్ సింగ్ పన్నూపై గుజరాత్ పోలీసుల ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో అక్టోబర్ 5 నుంచి ప్రారంభమయ్యే క్రికెట్ ప్రపంచ కప్ 'ప్రపంచ టెర్రర్ కప్'గా మారతుందంటూ సోషల్ మీడియాలో పన్నూ చేసిన హెచ్చరికలను పోలీసులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా బెదిరింపులకు పాల్పడినందుకు అతడిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని అహ్మదాబాద్ సైబర్ క్రైమ్ విభాగం పోలీసు అధికారులు శుక్రవారం వెల్లడించారు. ముందే రికార్డు చేసిన ఓ వాయిస్ మెసేజ్‌ను విదేశీ ఫోన్ నంబర్‌తో సోషల్ మీడియాలో పన్నూ పోస్టు చేశాడని తెలిపారు. +447418343648 అనే నంబర్‌తో దేశవ్యాప్తంగా చాలామందికి ఈ మెసేజ్ అందిందని పేర్కొన్నారు. మెసేజ్ అందుకున్న వారు ఈ విషయాన్ని తమ దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. సబ్ఇన్‌స్పెక్టర్ హెచ్.ఎన్. ప్రజాపతి ఫిర్యాదు మేరకు పన్నూపై కేసు పెట్టినట్లు వివరించారు. +44 అనేది యునైటెడ్ కింగ్‌డమ్(యూకే) కోడ్ కావడం గమనార్హం. అయితే, ఇంటర్నెట్ కాల్ టెక్నాలజీతో ఇలా విదేశీ ఫోన్ నంబర్ల నుంచి సందేశం వస్తున్నట్లు తప్పుదోవ పట్టించవచ్చని నిపుణులు చెబుతున్నారు. అందుకే పన్నూ హెచ్చరికల మెసేజ్ ఎక్కడి నుంచి వస్తోందన్న దానిపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

**...ఇట్లు గురుపట్వంత్ సింగ్ పన్నూ**

విదేశీ ఫోన్ నంబర్‌తో వచ్చిన కాల్‌ను రిసీవ్ చేసుకున్న తర్వాత ప్రి-రికార్డెడ్ వాయిస్ మెసేజ్ వినిపిస్తోందని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీసు జీతూ యాదవ్ తెలియజేశారు. ''అమర వీరుడు హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్యకు కచ్చితంగా ప్రతీకారం తీర్చుకుంటాం. మీ బుల్లెట్లకు వ్యతిరేకంగా బ్యాలెట్లు ఉపయోగిస్తాం. మీరు సాగిస్తున్న హింసాకాండకు వ్యతిరేకంగా ఓట్లు వేస్తాం. అక్టోబర్ 5వ తేదీని గుర్తు పెట్టుకోండి. ఆ రోజు క్రికెట్ ప్రపంచ కప్ కాదు, ప్రపంచ టెర్రర్ కప్ ప్రారంభమవుతుంది. సిఖ్స్ ఫర్ జస్టిస్ ఆధ్వర్యంలో ఖలిస్తాన్ జెండాలతో అహ్మదాబాద్‌ను ముట్టడిస్తాం.. ఇట్లు గురుపట్వంత్ సింగ్ పన్నూ'' అంటూ ఆ సందేశంలో హెచ్చరికలు వినిపిస్తున్నాయని వెల్లడించారు. అహ్మదాబాద్ నగర ప్రజలకు గత రెండు రోజులుగా ఈ మెసేజ్ వస్తోందన్నారు.

**ఎవరీ పన్నూ?**



సిక్కుల కోసం భారత్‌లో ఖలిస్తాన్ అనే ప్రత్యేక దేశం ఏర్పాటే తన జీవితాశయమని ప్రకటించుకున్న గురుపట్వంత్ సింగ్ పన్నూ పంజాబ్ రాష్ట్రంలో అమృత్‌సర్ సమీపంలోని ఖంజోత్ అనే గ్రామంలో జన్మించాడు. న్యాయ విద్య అభ్యసించాడు. అనంతరం కెనడాకు వలస వెళ్లి, అక్కడే స్థిరపడ్డారు. కెనడా పౌరసత్వం కూడా సంపాదించాడు. సిఖ్స్ ఫర్ జస్టిస్ అనే సంస్థను స్థాపించాడు. భారత్‌కు వ్యతిరేకంగా కార్యకలాపాలు సాగిస్తున్నాడు. భారత్‌లో జరిగిన పలు ఉగ్రవాద దాడుల్లో అతడి హస్తం ఉన్నట్లు గుర్తించారు. ఖలిస్తాన్ ఉద్యమానికి మద్దతుగా కెనడాతోపాటు అమెరికా, యూకే, ఆస్ట్రేలియా తదితర దేశాల్లో ర్యాలీలు నిర్వహించాడు. ఖలిస్తాన్‌కు అనుకూలంగా వివిధ దేశాల ప్రభుత్వాల మద్దతును కూడగట్టడానికి లాబీయింగ్ చేస్తున్నాడు. హరిదీప్ సింగ్ నిజ్జర్ హత్యపై పన్నూ తీవ్రంగా రగిలిపోయాడు. కెనడాలోని హిందువులంతా దేశం విడిచి వెళ్లిపోవాలని కొన్ని రోజుల క్రితం హెచ్చరికలు జారీ చేశాడు. 2020 జూలైలో పన్నూను భారత ప్రభుత్వం ఉగ్రవాదిగా ప్రకటించింది. ప్రస్తుతం అతడు కెనడాలో అజ్ఞాతంలో ఉన్నాడు.

## భారత వ్యతిరేక కార్యకలాపాల అడ్డాగా కెనడా



బ్లింకెన్‌తో జైశంకర్

**వాషింగ్టన్:** కెనడాలో ఖలిస్తాన్ వేర్పాటువాద నేత హర్‌దీప్ సింగ్ నిజ్జర్ మృతి, దానికి సంబంధించిన రగడపై అమెరికాతో లోతుగా చర్చించినట్టు విదేశాంగ మంత్రి ఎస్.జై శంకర్ తెలిపారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన గురువారం ఆ దేశ విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్‌తో భేటీ అయ్యారు. హత్యపై కెనడా జరుపుతున్న దర్యాప్తుకు పూర్తిగా సహకరించాలని బ్లింకెన్ ఈ సందర్భంగా సూచించినట్టు విదేశాంగ శాఖ ఉన్నతాధికారి ఒకరు శుక్రవారం పేర్కొన్నారు. అనంతరం దీనిపై జై శంకర్ స్పందించారు. భారత్ లక్ష్యంగా వేర్పాటువాదం, హింస, వ్యవస్థీకృత నేరాలు, మనుషుల అక్రమ రవాణా వంటివాటికి కెనడా కొన్నేళ్లుగా అడ్డాగా మారుతోందని మండిపడ్డారు. 'పైగా అక్కడి ప్రభుత్వం కూడా కొన్నేళ్లుగా అలాంటి వాటిని అనుమతిస్తున్న ధోరణి కనబరుస్తోంది. ట్రూడో సర్కారు రాజకీయ అనివార్యతలే ఇందుకు కారణం' అని ఆరోపించారు. 'కెనడాలో భారత దౌత్యవేత్తలను బాహాటంగా బెదిరించే దుస్థితి నెలకొంది! కార్యాలయాలకు వెళ్లడం కూడా రిస్కుగా మారింది. అందుకే ఆ దేశానికి వీసా సేవలను కూడా ఆపేయాల్సి వచ్చింది' అని జైశంకర్ వివరించారు.

## సన్నిహిత సంబంధాలకే మొగ్గు: ట్రూడో



**టొరంటో:** ప్రపంచ రాజకీయాల్లో కీలకంగా మారి, ప్రబల ఆర్థిక శక్తిగా ఎదుగుతున్న భారత్‌తో సన్నిహిత సంబంధాలను మెరుగుపర్చుకునేందుకు కట్టుబడి ఉన్నామని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో చెప్పారు. అదేసమయంలో, ఖలిస్తాన్ వేర్పాటువాది నిజ్జర్ హత్య ఘటనకు సంబంధించిన వాస్తవాల వెల్లడిలో సహకారానికి భారత్ ముందుకురావాలని కోరారు. భారత్‌పై బలమైన ఆరోపణలున్నప్పటికీ సన్నిహితంగా ఉండేందుకే ప్రాధాన్యం ఇస్తామన్నారు. మాంట్రియల్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. 'ప్రపంచ వేదికపై కీలకంగా మారిన భారత్‌తో కెనడా, మిత్ర దేశాలు నిర్మాణాత్మకంగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతో ఉందని భావిస్తున్నా. ఆర్థిక శక్తిగా ఎదుగుతున్న భారత్ అంతర్జాతీయ రాజకీయాల్లో తనవంతు పాత్ర పోషిస్తోంది. అందుకే భారత్‌తో సన్నిహిత సంబంధాల కొనసాగింపునకు కట్టుబడి ఉన్నాం' అని చెప్పారు. అదే సమయంలో చట్టపాలన కలిగిన దేశంగా, నిజ్జర్ హత్యకు సంబంధించిన పూర్తి వాస్తవాలను వెలుగులోకి తెచ్చేందుకు భారత్ తమతో కలిసి పని చేయాలని భావిస్తున్నామన్నారు. భారత్ విదేశాంగ మంత్రి జైశంకర్‌తో వాషింగ్టన్‌లో జరిగే సమావేశంలో ఇదే విషయాన్ని బ్లింకెన్ ప్రస్తావిస్తారని కూడా బైడెన్ ప్రభుత్వం చెప్పిందన్నారు.

## ఈయన పొట్టలో ఏమున్నాయంటే.. ఇయర్ ఫోన్లు.. స్క్రూలు, లాకెట్లు..!



కుల్దీప్ పొట్టలో నుంచి తీసిన వస్తువులు

**మోగా:** ఇయర్ ఫోన్లు..స్క్రూలు, నట్లు, బోల్టులు, చైన్, లాకెట్లు..మంత్రగాడు గాల్లో నుంచి పుట్టించినట్లుగా, మెజీషియన్ తన టోపీలో నుంచి తీస్తున్నట్లుగా డాక్టర్లు ఓ వ్యక్తి పొట్టలో నుంచి వీటన్నిటినీ బయటకు తీశారు. పంజాబ్‌లోని మోగాకు చెందిన కుల్దీప్ సింగ్(40) రెండేళ్లుగా కడుపు నొప్పి, వాంతులతో బాధపడుతున్నాడు. ఎన్ని ఆస్పత్రులకు తిరిగినా నయం కాలేదు. ఇటీవల మోగాలోని మెడిసిటీ ఆస్పత్రికి వెళ్లాడు. అక్కడ కుల్దీప్‌కు వైద్యులు ఎక్స్ రే పరీక్ష చేశారు. అతడి కడుపులో రకరకాల లోహపు వస్తువులు ఉండటం చూసి వారు ఆశ్చర్యపోయారు. గురువారం కుల్దీప్ సింగ్‌కు దాదాపు మూడు గంటల పాటు ఆపరేషన్ చేసి, ఇయర్ ఫోన్లు..స్క్రూలు, నట్లు, బోల్టులు, చైన్, లాకెట్లు వంటి రకరకాల వస్తువుల్ని బయటకు తీశారు.

## మేనకా గాంధీకి ఇస్కాన్ రూ.100 కోట్ల పరువు నష్టం నోటీస్

**కోల్‌కతా:** ఇస్కాన్ గోశాలల్లో గోవులను కబేళాలకు అమ్మేస్తున్నారంటూ ఆరోపించిన బీజేపీ ఎంపీ మేనకా గాంధీకి శుక్రవారం రూ.100 కోట్ల పరువు నష్టం నోటీసు పంపినట్లు ఇస్కాన్(ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ కృష్ణ కాన్సియస్‌నెస్) తెలిపింది. ఆరోపణలు చేస్తున్నట్లుగా ఉన్న కేంద్ర మాజీ మంత్రి మేనకా గాంధీ తేదీ లేని వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. 'ఆనంద్‌పూర్‌లోని గోశాలకు వెళ్లినట్లు మేనకా గాంధీ చెబుతున్నారు. అక్కడుండే భక్తులకు గానీ, సభ్యులకు గానీ ఆ గోశాల వద్ద ఆమె కనిపించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. అక్కడికి వెళ్లి చూడకుండానే అక్కడి పరిస్థితులపై ఆమె ఎలా మాట్లాడగలరు? ఆమె ఆరోపణలు పూర్తిగా నిరాధారాలు' అని కోల్‌కతా ఇస్కాన్ ఉపాధ్యక్షుడు రాధారామ్ దాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇలాంటి దురుద్దేశపూరిత ఆరోపణల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇస్కాన్ భక్తులు, మద్దతుదారులు, శ్రేయోభిలాషులు తీవ్ర వేదనకు గురయ్యారని తెలిపారు. ఇస్కాన్‌కు వ్యతిరేకంగా జరిగే తప్పుడు ప్రచారాన్ని తాము ఉపేక్షించేది లేదన్నారు.

## టీవీ లైవ్ షోలో కొట్టుకున్న పాక్ నేతలు

**ఇస్లామాబాద్:** టీవీలో ఇద్దరు నేతల చర్చా కార్యక్రమం అది. పరస్పర విమర్శలు చేసుకున్నారు. ఆగ్రహంతో ముష్టిఘాతాలు కురిపించుకున్నారు. ప్రజాదరణ పొందిన పాకిస్తానీ టాక్ షో 'కల్ తక్' ఈ ఘటనకు వేదికైంది. ఇద్దరు నేతల డిష్యుం..డిష్యుం..వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఇద్దరి తీరును నెటిజన్లు తప్పుపట్టారు. గొడవను ఆపలేకపోయిన నిర్వాహకుల తీరును సైతం ఎండగట్టారు. పాకిస్తాన్ తెహ్రీక్-ఇ--ఇన్సాఫ్ చీఫ్, మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ తరఫున షేర్ అఫ్జల్ మర్వాత్ అనే లాయర్, మరో మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్‌కు చెందిన పాకిస్తాన్ ముస్లిం లీగ్‌కు చెందిన సెనేటర్ అఫ్నాన్ ఉల్లా టీవీ చర్చలో పాల్గొన్నారు. మిలటరీతో తెరవెనుక సంప్రదింపులు జరుపుతున్నారంటూ ఇమ్రాన్ ఖాన్‌పై అఫ్నాన్ ఉల్లా ఆరోపణలు చేశారు. ప్రతి ఆరోపణలకు బదులుగా మర్వాత్ లేచి ఖాన్ తలపై గట్టిగా బాదారు. అఫ్నాన్ కూడా మర్వాత్‌పై పిడిగుద్దులు కురిపించారు. లైవ్ షోలోనే ఇదంతా జరిగిపోయింది. నిర్వాహకులు విడదీసేందుకు ప్రయత్నించినా వారిద్దరూ కొట్టుకుంటూనే ఉన్నారు. వీరి వ్యవహారం చూసి జనం నిశ్చేష్టులయ్యారు.

## పీటీఐ చైర్మన్‌గా శాంత్ కుమార్



**న్యూఢిల్లీ:** ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా(పీటీఐ)చైర్మన్‌గా ది ప్రింటర్స్(మైసూర్)కు చెందిన కేఎస్ శాంత్ కుమార్(62) ఎన్నికయ్యారు. పీటీఐ వైస్ చైర్మన్‌గా హిందుస్తాన్ టైమ్స్ సీఈవో ప్రవీణ్ సోమేశ్వర్ ఎన్నికయ్యారు. అవీక్ సర్కార్ స్థానంలో శాంత్ కుమార్ బాధ్యతలు చేపడతారు. శుక్రవారం ఢిల్లీలోని పీటీఐ ప్రధాన కార్యాలయంలో జరిగిన పీటీఐ బోర్డు సభ్యుల వార్షిక సమావేశం కార్యవర్గాన్ని ఎన్నుకుంది. ఈ కార్యవర్గం ఏడాదిపాటు కొనసాగుతుంది. శాంత్ కుమార్ 1983 నుంచి ది ప్రింటర్స్ (మైసూర్) ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్య బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు.

## కర్ణాటక బంద్ సక్సెస్

**సాక్షి, బెంగళూరు:** తమిళనాడుకు కావేరి జలాలను విడుదల చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం కన్నడ ఒక్కూట చేపట్టిన కర్ణాటక రాష్ట్ర బంద్ విజయవంతమైంది. చెదురుమదురు ఘటనలు మినహాయించి రాష్ట్రవ్యాప్తంగా శాంతియుతంగా జరిగింది. ఆస్పత్రులు, మెడికల్ షాపులు, పాల బూత్‌లు, అంబులెన్స్‌లు, పెట్రోల్ బంక్‌లు తదితర నిత్యవసర సేవలు యథావిధిగా కొనసాగాయి. ఆటో, క్యాబ్‌లు, సరకు రవాణా వాహనాలు, ప్రైవేటు వాహనాలు, థియేటర్లు, మాల్స్, సూపర్ మార్కెట్లు, వీధి దుకాణాలు, ఆభరణాల షాప్‌లు మూతపడ్డాయి. తమిళనాడు నుంచి వచ్చే బస్సులను మధ్యలోనే ఆపేశారు. బెంగళూరు కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని కర్ణాటక రక్షణ వేదిక కార్యకర్తలు ముట్టడించారు. వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బంద్‌కు కన్నడ చలనచిత్ర పరిశ్రమ సంఘీభావం తెలిపింది.

## పచ్చిమిరప కరకరా నములుతూ...



మండ్య: రాష్ట్ర బంద్ నేపథ్యంలో వినూత్న తరహాలో ఆందోళనలు కొనసాగాయి. మండ్య నగరంలోని జిల్లా హిత రక్షణ సమితి నేతలు రోడ్డుపై బైఠాయించి పచ్చి మిరప కాయలు తింటూ తమ నిరసన వ్యక్తం చేశారు. తమిళనాడుకు వెంటనే నీటిని నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

## న్యూస్‌రీల్

### బంద్‌కు న్యాయవాదుల మద్దతు



నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

దొడ్డబళ్లాపురం: కావేరి జల వివాదం నేపథ్యంలో శుక్రవారం పిలుపునిచ్చిన కర్ణాటక బంద్‌కు దొడ్డబళ్లాపురంలో న్యాయవాదుల సంఘం మద్దతు ప్రకటించింది. శుక్రవారం ఉదయం విధులు బహిష్కరించి కోర్టు బయటకు వచ్చిన న్యాయవాదులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం తాలూకా కార్యాలయానికి వెళ్లి సంఘం తరపున మనవి పత్రం అందించారు.

### మావటీలకు అల్పాహార విందు

మైసూరు: మైసూరు దసరా ఉత్సవాల్లో ప్రధాన ఘట్టం జంబూసవారీలో పాల్గొనే ఏనుగుల వెంట వచ్చిన మావటీలు, కాపలాదారులు, వారి కుటుంబ సభ్యులకు శుక్రవారం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి హెచ్.సి మహదేవప్ప అల్పాహార విందు ఇచ్చారు. ప్యాలెస్ ఆవరణలో ప్యాలెస్ మండలి ఆధ్వర్యంలో తాత్కాలిక ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేసి మావటీలు, కాపలాదారులు, వారి కుటుంబ సభ్యులకు వైద్యులు ఆరోగ్య పరీక్షలు చేశారు. అనంతరం వారిని మంత్రి పలుకరించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం వారికి ఓళిగలు, నెయ్యి, తట్టె ఇడ్లీ, సాంబారు, చెట్నీ, మసాల దోసె, సాగు, వడ, టమాట బాత్, కేసరిబాత్‌ను మంత్రి స్వయంగా వడ్డించారు. వారితో కలిసి అల్పాహారం తిన్నారు. మంత్రి మాట్లాడుతూ ఈ ఏడాది మావటీలు, కాపలాదారులు, వారి కుటుంబ సభ్యులు 250 మంది వచ్చారన్నారు. వారికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. చిన్నారుల కోసం టెంట్‌లో తాత్కాలిక పాఠశాల ఏర్పాటు చేసి ఉపాధ్యాయులను నియమించినట్లు తెలిపారు.

### ఎస్సీ జాబితాలోకి చేర్చాలి

- సీఎంను కోరిన కటిక సముదాయం నేతలు

బనశంకరి: తమ సమాజాన్ని ఎస్సీ జాబితాలోకి చేర్చాలని రాష్ట్ర కటిక సమాజ కమిటీ డిమాండ్ చేసింది. ఈమేరకు నాయకులు శుక్రవారం సీఎం కృష్ణా కార్యాలయంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. కటుక, కటిక ఇతర పేర్లతో తమ సమాజాన్ని పిలుస్తుంటారని, సముదాయ ప్రజలు ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడ్డారన్నారు. ఢిల్లీ, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రలో తమ సముదాయాన్ని ఎస్సీ జాబితాలోకి చేర్చారన్నారు. రాష్ట్రంలో కూడా ఎస్సీ జాబితాలోకి చేర్చడానికి సిఫార్సు చేయాలని కోరారు. కటిక సమాజనేతలు మాజీ ఎమ్మెల్సీ ఆర్‌కే.సిద్రామణ్ణ, మాజీమంత్రి హెచ్.ఎం.రేవణ్ణ, ముఖ్యమంత్రి కార్యదర్శి నసీర్‌అహ్మద్ పాల్గొన్నారు.

### విహారయాత్ర విషాదాంతం

- తండ్రీ కుమారుడు జల సమాధి



డ్యాం వద్ద గుమికూడిన స్థానికులు

యశవంతపుర: విహారయాత్రకు బయల్దేరిన ఓ కుటుంబంలోని తండ్రీకుమారుడు జల సమాధి అయ్యారు. ఈ విషాద ఘటన దావణగెరె జిల్లా హరిహర తాలూకా దేవరబెళకెరె పికప్ డ్యాంలో జరిగింది. మిట్లకట్టె గ్రామానికి చెందిన చంద్రు(42) తన భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి శుక్రవారం దేవరబెళకెరె పికప్ డ్యాంకు వెళ్లారు. ఇద్దరు చిన్నారులతో ఈత కొట్టిద్దామని నీటిలోకి దింపారు. పిల్లలు నీట మునగడంతో చంద్రు అప్రమత్తమై ఒకరిని ఒడ్డుకు తెచ్చాడు. మరో బాలుడు శౌర్య(9)ని బయటకు తెచ్చే క్రమంలో అస్వస్థతకు గురయ్యాడు. స్థానికులు స్పందించి చంద్రుని దావణగెరె జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అగ్నిమాపక దళం సిబ్బంది గాలించి బాలుడు శౌర్య మృతదేహాన్ని వెలికి తీశారు.

# బంద్ ప్రశాంతం



ఫ్రీడం పార్కులో కన్నడ సంఘాల ఆందోళన



నాగసంద్ర వద్ద నిర్మానుష్యంగా ఉన్న తుమకూరు రోడ్డు



బెంగళూరులో డిపోలకే పరిమితమైన బీఎంటీసీ బస్సులు

- కదం తొక్కిన కన్నడ సంఘాలు
- రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, ర్యాలీలు
- స్తంభించిన రాకపోకలు



చామరాజనగరలో మూతపడిన దుకాణాలు



కన్నడబావుటాతో ఆటో డ్రైవర్ నిరసన

శివాజీనగర: తమిళనాడుకు కావేరి నీరు విడుదల చేయటాన్ని ఖండిస్తూ కన్నడ సంఘాల ఒక్కూట శుక్రవారం ఇచ్చిన రాష్ట్ర బంద్ ప్రశాంతంగా ముగిసింది. బెంగళూరు నగర, బెంగళూరు గ్రామీణ, మైసూరు, మండ్య, రామనగర, చామరాజనగర, హాసన, చిక్కమంగళూరు, కోలారు, చిత్రదుర్గ, తుమకురు, హుబ్లీ-ధారవాడతో పాటుగా అనేక జిల్లాల్లో బంద్ విజయవంతమైంది. దావణగెర, బిజాపుర, బాగలకోట, శివమొగ్గ, రాయచూరు, కొప్పళ, బళ్లారి, బీదర్, బెళగావి, గదగ్, కల్బుర్గి, హావేరి జిల్లాల్లో బంద్‌కు మిశ్రమ స్పందన వ్యక్తమైంది. కరావళి జిల్లాలైన దక్షిణ కన్నడ, ఉడుపి, ఉత్తర కన్నడ, కొడుగు జిల్లాల్లో బంద్‌కు అంతగా స్పందన వ్యక్తం కాలేదు. కర్ణాటక బంద్‌తో రాజధాని బెంగళూరుతో పాటు పలు జిల్లాల్లో వ్యాపార లావాదేవీలు స్తంభించాయి. సామాన్య ప్రజల జీవనం అస్తవ్యస్తంగా మారింది. వాహన సంచారం తగ్గింది. బస్సులు సంచరించినా ప్రయాణికుల సంఖ్య చాలా తక్కువగా ఉంది. పాత మైసూరు భాగం జిల్లాల్లో పాఠశాల-కాలేజీలకు సెలవు ప్రకటించారు. ప్రభుత్వ కార్యాలయాలు తెరుచుకున్నా హాజరు శాతం తగ్గింది.

**బంద్‌కు మద్దతు**

బంద్‌కు కన్నడ సినీ పరిశ్రమ, వాణిజ్య సంఘ-సంస్థలు, వర్తకుల సంఘం, ఆభరణాల దుకాణాల యజమానుల సంఘం, ప్రైవేట్ వాహనాల సంఘం, ఆటోరిక్షా, ట్యాక్సీ సంఘాలు మద్దతు ఇచ్చాయి. భారీ భద్రత బంద్ నేపథ్యంలో రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో కూడా ప్రతిఘటనా ధర్నాలు జరిగాయి. కన్నడ సంఘాలతో పాటుగా వివిధ సంఘాలు తమిళనాడుకు కావేరి నీరు విడుదల చేయటాన్ని ఖండిస్తూ ధర్నాలు చేపట్టారు. రాజధాని బెంగళూరులో టౌన్‌హాల్ నుంచి ఫ్రీడం పార్కు వరకు కన్నడ ఒక్కూట వాటాళ్ నాగరాజ్ నేతృత్వంలో నిరసన ర్యాలీ చేపట్టగా, అన్ని ప్రముఖ కన్నడ సంఘాల నాయకులు పాల్గొన్నారు. కన్నడ చలనచిత్ర వాణిజ్య మండలి ఆధ్వర్యంలో గురురాజ కల్యాణమండపంలో నటుడు శివరాజ్‌కుమార్ నేతృత్వంలో ధర్నా నిర్వహించగా కన్నడ సినీరంగానికి చెందిన నటి, నటులు, కళాకారులు పాల్గొన్నారు.

**నిర్మానుష్యంగా బెంగళూరు నగరం**

బెంగళూరులో అన్ని వాణిజ్య వ్యాపార సంస్థలు మూతబడ్డాయి. వాహనాల సంచారం స్తంభించింది. సినిమా థియేటర్, మాల్, హోటల్స్ బంద్ అయ్యాయి. రోడ్లపై ప్రజల సంచారం పూర్తిగా తగ్గిపోయి నగరం నిర్మానుష్యంగా మారింది. మెట్రో సంచారం ఉన్నా ప్రయాణించేవారి సంఖ్య చాలా తక్కువగా ఉంది. రైళ్ల ద్వారా బెంగళూరుకు వచ్చిన ప్రయాణికులు ఆటో, ట్యాక్సీలు లభించక ఇబ్బందికి గురయ్యారు. విమానాశ్రయానికి వెళ్లేవారు ఇబ్బందికి గురయ్యారు. వివిధచోట్ల కన్నడ సంఘాలు బైక్ ర్యాలీలు నిర్వహించాయి. కేపీసీసీ కార్యాలయం ఎదురుగా బైక్‌లో వచ్చిన కన్నడ కార్యకర్తలు ధర్నా నిర్వహించి కావేరి తమదేనని నినాదాలు చేశారు. ఫ్రీడం పార్కులో కూడా జనశక్తి కేంద్రం పదాధికారులు ధర్నా చేపట్టారు.



బెంగళూరులో మూతపడిన సినిమా థియేటర్



బైక్‌పై పొట్టేలును తీసుకొచ్చిన నిరసనకారుడు



మైసూరులో నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న నటుడు ఉపేంద్ర



మైసూరులో నిర్మానుష్యంగా మారిన బస్టాండ్



జనసంచారం లేక బోసిపోయిన మైసూరు కేఆర్ సర్కిల్



బెంగళూరులో ఆందోళనకారులను అరెస్ట్ చేసి తరలిస్తున్న దృశ్యం



ఓకళీపురం వద్ద రోడ్డుపై క్రికెట్ ఆడుతున్న చిన్నారులు



చింతామణి: ఒంటిపై ఆవుపేడతో నిరసన



బెంగళూరులో టౌన్‌హాల్ వద్ద పోలీసు బందోబస్తు

## ఆందోళనకారులను అడ్డుకున్న పోలీసులు

బనశంకరి: కర్ణాటకబంద్‌కు మద్దతు ఇస్తూ శుక్రవారం కన్నడ సంఘాల నాయకులు టౌన్‌హాల్‌వద్దకు చేరుకుని అక్కడ సమావేశం నిర్వహించి ఊరేగింపుగా ఫ్రీడం పార్కుకు వెళ్లాలని తీర్మానించారు. అయితే ఉద్యమకారులను పోలీసులు అడ్డుకున్నారు. కర్ణాటక రక్షణావేదిక ప్రవీణ్‌శెట్టితో పాటు అనేకమంది నాయకులను అరెస్ట్ చేసి పోలీస్‌వ్యాన్, బీఎంటీసీ బస్సుల్లో వారిని ఫ్రీడం పార్కుకు తరలించారు.

**పోరాటదారులపై ప్రభుత్వం నిఘా పెట్టింది**

కరవే అధ్యక్షుడు ప్రవీణ్‌శెట్టి మాట్లాడుతూ తమపై ప్రభుత్వం నిఘాపెట్టిందని, పోరాటం నిలిపివేయాలని ఒత్తిడి చేస్తోందని, తమ ఇళ్లకు నోటీస్ అంటించిందని తెలిపారు. తామేమి దోపిడీదారులం కాదని, రాజకీయనేతలు తరహాలో గొడవలు చేయడంలేదన్నారు. కావేరీనీటి విడుదలను తమిళనాడుకు ఆపేస్తే తమ పోరాటం నిలిపివేస్తామన్నారు. కన్నడ పోరాటదారులపై తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నారని, తమకు తమ కుటుంబాలకు కావేరి పట్ల ప్రేమ ఉందని, ఈ కారణంతో పోరాటం చేస్తున్నామన్నారు.

**బీఎంటీసీ బస్సులపై రాళ్లురువ్విన ఆందోళనకారులు**

కర్ణాటకబంద్ చేపట్టిన నేపథ్యంలో నగరంలో బీఎంటీసీ బస్సుపై ఆందోళనకారులు రాళ్లు రువ్వి అద్దాలు పగలు గొట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. టౌన్‌హాల్ వద్దకు చేరుకుని ఊరేగింపు చేయడానికి ప్రయత్నించిన ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకుని వాహనాల్లో ఫ్రీడంపార్కు కు తరలించారు.

## ఉద్యమాలను ప్రభుత్వమే అణచివేస్తోంది

- వాటాళ్ నాగరాజ్

శివాజీనగర: కర్ణాటక గూండా పోలీసుల రాష్ట్రమైందని కన్నడ ఒక్కూట అధ్యక్షుడు వాటాళ్ నాగరాజ్ ధ్వజమెత్తారు. శుక్రవారం డాలర్స్ కాలనీలో తన ఇంటిలో బుర్ఖా ధరించి తలపై ఖాళీ బిందె పెట్టుకొని బయటకు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. కావేరి జలాల పరిరక్షణకు తాము ఉద్యమబాట పట్టగా ఆందోళనకార్యక్రమాలను ప్రభుత్వం అణచివేసే పని చేస్తున్నదని ఆరోపించారు. లక్షలాది మంది పోలీసులను నియమించి ఆందోళనలను అణచివేస్తోందని మండిపడ్డారు. శుక్రవారం అఖండ కర్ణాటక బంద్ విజయవంతమైందని, రాష్ట్ర ప్రజలకు ధన్యవాదాలు సమర్పిస్తున్నామన్నారు. ప్రతిఘటనా ర్యాలీకి అవకాశమే లేదని చెప్పటం ద్వారా హోం మంత్రి పరమేశ్వర్ కన్నడ వ్యతిరేక ధోరణిని అనుసరించారని మండిపడ్డారు.

**5న కన్నంబాడి ఆనకట్ట ముట్టడి**

కావేరి నది నీరు తమిళనాడుకు విడుదల చేయాలని ప్రాధికార ఇచ్చిన తీర్పును ఖండిస్తూ అక్టోబర్ 5న కన్నం బాడి ఆనకట్టను ముట్టడిస్తామని కన్నడ సంఘాల నాయకులు తెలిపారు. ఇప్పటికే బెంగళూరు బంద్, కర్ణాటక బంద్ నిర్వహించామని, సమస్య పరిష్కారానికి ఆందోళనలు కొనసాగిస్తామని తెలిపారు.



బెళగావిలో శుక్రవారం మేఘమథనం ప్రక్రియను ప్రారంభిస్తున్న మంత్రి సతీష్‌జార్కిహొళి

## సీడబ్ల్యూఆర్‌సీ ఆదేశాలు ధిక్కరిస్తే ప్రభుత్వానికి ముప్పు

బనశంకరి: తమిళనాడుకు కావేరినీరు విడుదలచేయాలనే సీడబ్ల్యూఆర్‌సీ ఆదేశాలను ధిక్కరిస్తే తమ ప్రభుత్వాన్ని తొలగించే ప్రమాదం ఉందని ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం రైతులు, కూలీకార్మికులు, కన్నడ పరసంఘాలు, పోరాటదారుల కమిటీ సీఎంను కలిసింది. సీఎం స్పందిస్తూ తమిళనాడుకు నీరు విడుదలచేయకపోతే తలెత్తే ముప్పును వారికి వివరించారు. నీరు విడుదల చేయరాదని తమ అభిప్రాయమని, అయితే మనం ఇలా చేస్తే కేంద్ర ప్రభుత్వం తమ జలాశయాలను స్వాధీనం చేసుకోవచ్చు, కోర్టు ధిక్కరణ కింద ప్రభుత్వాన్ని డిస్మిస్ చేయవచ్చని సిద్దరామయ్య వారికి వివరించారు. శుక్రవారం సాయంత్రం విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తి, మాజీ అడ్వకేట్ జనరల్స్, జలవనరులు నిపుణులతో సీఎం సమావేశం నిర్వహించారు.

## ముఖ్యమంత్రిని కలిసిన కురుబూరు



సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న కరుబూరు శాంతకుమార్ తదితరులు

బనశంకరి: కావేరి వివాదం నేపథ్యంలో శుక్రవారం సీఎం కార్యాలయం కృష్ణాలో రాష్ట్ర చెరకు పంటదారుల రాష్ట్రాధ్యక్షుడు కరుబూరు శాంతకుమార్, సీఎం చంద్రు ముఖ్యమంత్రి సిద్దరామయ్యను కలిశారు. ఈ సందర్భంగా వారితో సీఎం మాట్లాడుతూ...కావేరి నీటి పంపకాలకు సంబంధించి రెండు కమిటీలు వేశామని అన్నారు. సాధారణ పరిస్థితిలో 177.25 టీఎంసీల నీరు ఏడాదిలో విడుదల చేయాలనే ఆదేశం ఉంది. మన రాష్ట్రానికి 284.85 టీఎంసీల నీరు అవసరం ఉందని వారికి చెప్పారు. కర్ణాటక ప్రజలు, రైతుల తరపున ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కురుబూరు శాంతకుమార్ కోరారు.

## నవంబర్ ఆఖరులోగా నివేదిక

- సీఎంతో వేతన సంఘం కమిషన్ ఛైర్మన్ భేటీ

శివాజీనగర: 7వ రాష్ట్ర వేతన కమిషన్ అధ్యక్షుడు సుధాకర్ రావు, సభ్యుల బృందం శుక్రవారం ముఖ్యమంత్రి సిద్దరామయ్యను తన కార్యాలయం కృష్ణాలో భేటీ చేసి పలు అంశాలను తెలియజేసింది. 7వ వేతన కమిషన్ నవంబర్ ఆఖరులోగా వేతన పెంపుపై నివేదికను సమర్పించనుంది. ఈసందర్భంగా కార్యదర్శులు పి.బీ.రామమూర్తి, శ్రీకాంత్ బీ.వనహళ్లి, హెప్సిబా రాణి కుర్లపాటి పాల్గొన్నారు.

# పేలిన గ్యాస్ సిలిండర్

- ఆరుగురికి తీవ్ర గాయాలు
- కుప్పకూలిన టాప్

తుమకూరు: గ్యాస్ సిలిండర్ పేలి ఆరుగురు తీవ్రంగా గాయపడిన ఘటన తుమకూరు జిల్లా శిర నగరంలోని మధుగిరి రోడ్డులో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు... మోహల్లాకు చెందిన నజీర్ ఇంటిలో రెండు సిలిండర్లలో ఒక సిలిండర్ నుంచి గ్యాస్ లీకైంది. ఇది గుర్తించని కుటుంబ సభ్యులు వంట చేయడానికి యత్నించడంతో ఒక్కసారిగా సిలిండర్ పేలి ఇంటిలో ఉన్న ఆరుగురు గాయపడ్డారు. సిలిండర్ ధాటికి ఇంటి పైకప్పు, గోడలు కుప్పకూలాయి. గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి విషమించడంతో వారిని బెంగళూరు తరలించారు. ఘటన స్థలాన్ని ఎమ్మెల్యే జయచంద్ర, ఎస్పీ అశోక్ పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



పేలుడు ధాటికి కూలిన భవనం



శుక్రవారం బెళగావిలోని కపిలేశ్వర చెరువులో నేత్రపర్వంగా గణేష్ నిమజ్జనం

## వ్యాపారిని అడ్డుకుని నగదు దోపిడీ

మైసూరు: సినీఫక్కీలో దుండగులు ఓ బంగారు వ్యాపారిని దోచుకున్న ఘటన చామరాజనగర జిల్లా గుండ్లుపేటె తాలూకాలో చోటుచేసుకుంది. వివరాలు... కేరళకు చెందిన రహీమ్ బంగారు వ్యాపారి. గురువారం సాయంత్రం స్నేహితుడు రహీమ్‌తో కలిసి మైసూరు వచ్చి నగల వ్యాపారం ముగించుకుని ఇన్నోవా కారులో బయలుదేరారు. సినీఫక్కీలో దుండగులు వారిని లారీతో పాటు ఓ కారులో వెంబడిస్తూ వచ్చారు. అగతగౌడనహళ్లి గేట్ వద్దకు రాగానే లారీని అడ్డుపెట్టి వారి వద్ద ఉన్న రూ. 44 లక్షల నగదు లాక్కొని ఉడాయించారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## క్లుప్తంగా

### విరబూసిన బ్రహ్మకమలం



బ్రహ్మకమలానికి పూజలు చేస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: నగరంలో బ్రహ్మకమలం విరబూసింది. ఏడాదికి ఒకసారి విరబూసే బ్రహ్మకమలం కేవలం కొన్ని గంటల వ్యవధి లోనే తన స్వరూపాన్ని కోల్పోతుంది. శుక్రవారం నగరంలోని శ్రీరామనగర్ కాలనీలో అయ్యనగౌడ, గౌరమ్మల నివాసంలో బ్రహ్మకమలం విరబూయడంతో ప్రత్యేక పూజలు జరిపారు.

### మాజీ ఎమ్మెల్యేకు సన్మానం



సురేష్‌బాబును సన్మానిస్తున్న అభిమానులు

కంప్లి: తాను ఏనాడూ క్షేత్ర ప్రజలకు దూరం కాలేదని, గత ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును శిరసావహించానని మాజీ ఎమ్మెల్యే సురేష్‌బాబు తెలిపారు. గురువారం క్షేత్రంలోని పలు గ్రామాల్లో పర్యటించిన సందర్భంగా గతవారం వీఎస్‌ఎస్‌ఎన్ సహకార సంఘం ఎన్నికల్లో అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా గెలుపొందిన బీజేపీ మద్దతు అభ్యర్థులను అభినందించారు. అనంతరం సురేష్ బాబును నూతన అధ్యక్షులు బీ.రమేష్ పూలమాలతో సన్మానించారు. మాజీ వీఎస్‌ఎస్‌ఎన్ అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, అభిమానులు పాల్గొన్నారు.

### భర్త మందలించాడని భార్య బలవన్మరణం

బళ్లారి రూరల్: భర్త మందలించాడని జిల్లాలోని సండూరు తాలూకా భుజంగనగర్‌లో పురుగుల మందు తాగి ఓ మహిళ బలవన్మరణానికి పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలు.. భుజంగనగర్‌కు చెందిన శైలజ(38) అనే మహిళ గురువారం తనను భర్త మందలించడంతో మనస్తాపం చెంది పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి సండూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విమ్స్‌లో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందింది. కాగా మృతురాలికి భర్త, పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై సండూరు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

### చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులుగా మహారుద్రగౌడ



కార్యవర్గాన్ని సత్కరిస్తున్న సభ్యులు

బళ్లారిటౌన్: జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా పీ.మహారుద్రగౌడ ఎంపికయ్యారు. కార్యదర్శిగా సురేష్‌బాబు, సీనియర్ ఉపాధ్యక్షులుగా యశ్వంత్‌రాజ్ నాగిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఏ.మంజునాథ, దొడ్డనగౌడ, సొంతా గిరిధర్, సంయుక్త కార్యదర్శులుగా మర్చేడ్ మల్లికార్జునగౌడ, శ్రీరామచంద్ర, కోశాధికారులుగా ఎంపికైన పాలన్న, నాగళ్లి రమేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

### డివిజన్ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

కంప్లి: కురుగోడు తాలూకా సోమలాపుర ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి బాలుర ఖోఖో క్రీడల్లో ప్రథమ స్థానం పొంది కల్బుర్గి డివిజన్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈసందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ శారీరక, మానసిక అభివృద్ధికి సహకరించే క్రీడలపై క్రీడాకారులు ఎక్కువ ఆసక్తి చూపి పాఠశాల కీర్తి ప్రతిష్టలను మరింత పెంచాలని కోరారు.

### కాగడాల ర్యాలీ



కాగడాలతో ర్యాలీ చేపట్టిన దృశ్యం

రాయచూరు రూరల్: మన్సలాపూర్‌లో ఏఐడీవైఓ, ఏఐడీఎస్ఓ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ 136వ జయంతిని ఘనంగా జరిపారు. జయంతిని పురస్కరించుకుని గురువారం రాత్రి జిల్లాధ్యక్షుడు చెన్నబసవ నేతృత్వంలో భగత్‌సింగ్ చిత్రపటాన్ని చేతబూని గ్రామంలో కాగడాలతో ర్యాలీ చేపట్టారు. భగత్‌సింగ్ పోరాట పటిమను కొనియాడారు.

### ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

రాయచూరు రూరల్: మానవుడు వయస్సు పెరుగుతున్న కొద్దీ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా ఎస్పీ నిఖిల్ అన్నారు. ఆయన శుక్రవారం గంజ్ రహదారిలోని బెట్టదూరు ఆస్పత్రి వద్ద ఏర్పాటు చేసిన ప్రపంచ హృదయ దినోత్సవ జాతాను ప్రారంభించి మాట్లాడారు. ఏ సమయంలో మనిషికి గుండెపోటు వస్తుందో తెలియదని, దీని నియంత్రణకు వైద్యుల వద్ద సకాలంలో పరీక్షలు చేయించుకుని చికిత్స పొందితే అరికట్టడానికి వీలవుతుందన్నారు. అనంతరం నగర ప్రజలను జాగృతపరిచేందుకు సైకిల్ జాతాను చేపట్టారు.

# స్వచ్ఛందంగా బంద్‌కు మద్దతు

- మూతపడిన దుకాణాలు, వాణిజ్య సముదాయాలు
- కదం తొక్కిన కన్నడ సంఘాల నాయకులు, కార్యకర్తలు



బోసిపోయిన కోలారు బస్టాండు



కోలారులోని ఎంజీ రోడ్డులో దుకాణాలు మూసివేసిన దృశ్యం

కోలారు: తమిళనాడుకు కావేరి నీటిని వదలడాన్ని ఖండిస్తూ వివిధ సంఘాలు చేపట్టిన కర్ణాటక బంద్‌కు కోలారులో ఉత్తమ స్పందన లభించింది. దుకాణాలు, వాణిజ్య సముదాయాలు, హోటళ్లు, సినిమా థియేటర్లు బంద్ అయ్యాయి. బస్సులు రోడ్డెక్కలేదు. ప్రభుత్వ కార్యాలయాలు తెరచి ఉన్నా ఖాళీగా కనిపించాయి. కేఎస్‌ఆర్టీసీ బస్టాండు నిర్మానుష్యంగా మారింది. ప్రధాన రహదారులు జనసంచారం లేక బోసిపోయాయి. వ్యాపారులు బంద్‌కు స్వచ్ఛందంగా మద్దతు తెలిపారు. వివిధ సంఘాల కార్యకర్తలు ఉదయం 6 గంటలకే రహదారులపైకి వచ్చి ఆందోళన ప్రారంభించారు. కేఎస్‌ఆర్టీసీ డిపో వద్దకు వెళ్లి బస్సులు బయటకు రాకుండా అడ్డుకున్నారు. ఆస్పత్రులు, పాల బూత్‌లు, మెడికల్ షాపులు మాత్రం తెరచి ఉంచారు. వచ్చి వెళ్లే వాహనాలను అడ్డుకున్న ఆందోళనకారులు వాటిని తిప్పి పంపారు. నగరంలోని కేఎస్‌ఆర్టీసీ బస్టాండు సర్కిల్ వద్ద కన్నడ పర సంఘాల కార్యకర్తలు రక్తంతో సంతకాలు చేసిన వస్త్రాన్ని ప్రదర్శించారు. బంద్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా 1500 మంది పోలీసులను, 4 కెఎస్‌ఆర్‌పి ప్లాటూన్‌లను, 15 డిఏఆర్ వాహనాలను బందోబస్తుకు ఏర్పాటు చేశారు.

**కేజీఎఫ్‌లో...**

కేజీఎఫ్: నగరంలో కర్ణాటక బంద్‌కు ఉత్తమ స్పందన లభించింది. బంద్ సందర్భంగా దుకాణాలు స్వచ్ఛందంగా మూసివేశారు. నగరంలో వాహన సంచారం లేదు. హోటల్, థియేటర్‌లు బంద్ అయ్యాయి, కన్నడ పర, రైతు సంఘాలతో పాటు వివిధ సంఘాలకు చెందిన కార్యకర్తలు నగరంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కావేరి నీటిని తమిళనాడుకు వదలరాదని పట్టుపట్టారు.

**మాలూరులో...**

మాలూరు: మాలూరులో బంద్‌కు మిశ్రమ స్పందన లభించింది. ఉదయం బంద్ నిర్వాహకులు బైక్‌ల్లో పట్టణంలో సంచరించి అనంతరం మారికాంబ సర్కిల్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం 11 గంటలకు యథావిధిగా వాహనాల సంచారం మొదలైంది. దుకాణాలను ఒక్కొక్కటిగా తెరవడం ప్రారంభించి మధ్యాహ్నం సమయానికి సాధారణ పరిస్థితి నెలకొంది.

**శ్రీనివాసపురంలో ...**

శ్రీనివాసపురం: పట్టణంలో కర్ణాటక బంద్‌కు స్పందన కరువైంది. దుకాణాలు, హోటళ్లు యథావిధిగా తెరిచి ఉంచారు. దుకాణాలను బంద్ చేయడానికి సంఘాలు ముందుకు రాలేదు. పలు సంఘాల కార్యకర్తలు బస్టాండు సర్కిల్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించి వెళ్లిపోయారు. ప్రభుత్వ కార్యాలయాలు, వాహనాల సంచారం యథావిధిగా ఉండింది.

**కావేరి నీటిని తమిళనాడుకు వదలొద్దు**

రాయచూరు రూరల్: కావేరి నీటిని తమిళనాడుకు విడుదల చేయరాదని జయ కర్ణాటక, రైతు సంఘాలు డిమాండ్ చేశాయి. శుక్రవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళననుద్దేశించి అధ్యక్షుడు శివకుమార్ యాదవ్, జ్యోతి మాట్లాడుతూ ఈఏడాది సరైన వర్షాలు కురవక కేఆర్‌ఎస్ జలాశయంలో నీటి నిల్వ తక్కువగా ఉందన్నారు. రాష్ట్రంలోని రైతులు వ్యవసాయానికి సరిపడా నీరు లేని సమయంలో ప్రభుత్వం తమిళనాడుకు నీటిని విడుదల చేయడం సరికాదన్నారు. ప్రతి రోజూ 3000 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయకుండా నిలుపుదల చేయాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు రవి, కరుణాకర్‌రెడ్డి, వసంత్, మారెప్ప, అశోక్ కుమార్ జైన్‌లున్నారు. కాగా కావేరి నీటి విడుదలపై శుక్రవారం రాష్ట్ర బంద్‌కు ఇచ్చిన పిలుపునకు రాయచూరులో స్పందన కరువైంది. రైతు, కన్నడ పర సంఘాలు నగరంలో కేవలం ఆందోళనలను చేపట్టి వినతిపత్రాలు సమర్పించారు.



కోలారు బస్టాండు సర్కిల్ వద్ద రక్తాక్షరాలతో సంతకం చేసి నిరసన ప్రకటిస్తున్న దృశ్యం



కేజీఎఫ్‌లో తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఆందోళనకారులు



మాలూరులో ధర్నా నిర్వహిస్తున్న ఆందోళనకారులు



రాయచూరులో వినతిపత్రం సమర్పిస్తున్న కార్యకర్తలు

## బోసిపోయిన రాచనగరి



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



ఖాళీగా దర్శనమిస్తున్న బస్టాండ్

మైసూరు: రాష్ట్ర బంద్ రాచనగరిలో సంపూర్ణంగా జరిగింది. విద్యా సంస్థలు, దుకాణాలు పూర్తిగా మూసివేశారు. రోడ్లన్నీ ఖాళీగా కనిపించాయి. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

**నగరంలో బైక్ ర్యాలీ**

మైసూరు నగరంలో కావేరి నీటి పోరాట కమిటీ భారీ బైక్ ర్యాలీ నిర్వహించింది. నగర బీజేపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీవత్స ఆధ్వర్యంలో వందలాది మంది నగరంలోని చామరాజపురంలోని బీజేపీ కార్యాలయం నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు.

**చామరాజనగరలో నిరసనల వేడి**

రాష్ట్ర బంద్ నేపథ్యంలో చామరాజనగరలో భారీ మద్దతు లభించింది. అన్ని దుకాణాలు, విద్యా సంస్థలు మూసివేశారు. ప్రజలు ఇళ్లకే పరిమితం కావడంతో రోడ్లన్నీ బోసిపోయాయి. ఆందోళనకారులు శ్రీభువనేశ్వరి సర్కిల్ వద్ద తమిళనాడు వెళ్లే మార్గంలో అర్ధనగ్న ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా మంజునాథ్ అనే రైతు తన కండువాతో ఉరి వేసుకోవడానికి యత్నించాడు. పోలీసులు అతన్ని అడ్డుకుని ఆస్పత్రికి తరలించారు.

## హంపీని సమగ్రంగా అభివృద్ధి చేస్తాం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జిల్లాధికారి తదితరులు

హొసపేటె: హంపీలో పర్యాటకులకు అత్యాధునిక సౌకర్యాలను అందించడానికి, సమగ్ర అభివృద్ధికి రూ.90 కోట్ల వ్యయంతో ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నట్లు జిల్లాధికారి ఎంఎస్ దివాకర్ తెలిపారు. జిల్లా అధికార యంత్రాంగం, పర్యాటక శాఖ, ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, ఫెడరేషన్ ఆఫ్ హంపీ టూరిస్ట్ గైడ్‌ల సహకారంతో ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకల్లో భాగంగా హంపీలోని గజశాల ప్రాంగణంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. హంపీకి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు పూర్తి సమాచారం అందించడంతో పాటు హంపీలో విమానాశ్రయం ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు. అత్యాధునిక మరుగుదొడ్లు, మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. హంపీలో వివిధ ప్రాంతాల్లో 7–8 స్థలాలను ఒకే రోజు వీక్షించేందుకు అన్ని రకాలుగా వ్యవస్థ ఏర్పాటు చేస్తామన్నారు. కేఎంఆర్‌సీ ద్వారా రూ.90 కోట్ల ప్రణాళికను సిద్ధం చేసి ప్రతిపాదనలను సమర్పించనున్నట్లు తెలిపారు. పర్యాటక శాఖ నిర్వహించే వివిధ పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. రిటైర్డ్ లెక్చరర్ డాక్టర్ హెచ్.ఎం.చంద్రశేఖర శాస్త్రి హంపీ చారిత్రక వారసత్వంపై ఉపన్యసించారు. ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా సూపరింటెండెంట్ నిహిల్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

## యువతి విషయమై వ్యక్తి హత్య



హతుడు భైరారెడ్డి (ఫైల్)



ప్రధాన నిందితుడు నవీన్ (ఫైల్)

మాలూరు: యువతి విషయమై ప్రారంభమైన గొడవ హత్యకు దారి తీసిన ఘటన తాలూకాలోని లక్కూరు గ్రామంలోని అశోక్ వైన్స్ వద్ద చోటు చేసుకుంది. చిక్కతిరుపతి జీపీ జగదేనహళ్లి గ్రామానికి చెందిన భైరారెడ్డి(34) హత్యకు గురైన వ్యక్తి. లక్కూరు జీపీలోని కోడిహళ్లి గ్రామానికి చెందిన నవీన్(25) హత్య చేసిన వ్యక్తి. భైరారెడ్డి హొసకోటె తాలూకా మాకనహళ్లి గ్రామం వద్ద ఉన్న ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడు. తనకు పరిచయం ఉన్న కుటుంబానికి చెందిన యువతి జోలికి వెళ్లవద్దని నవీన్ అనే యువకుడు భైరారెడ్డిని హెచ్చరించాడు. అయినా భైరారెడ్డి పెడచెవిన పెట్టిన నేపథ్యంలో శుక్రవారం అశోక్ వైన్స్ వద్ద ఉన్న భైరారెడ్డిపై నవీన్, అతని స్నేహితుడితో కలిసి దాడి చేసి కళ్లలో కారం పొడి చల్లి వెంటపడి మారణాయుధాలతో నరికి హత్య చేశాడు. విషయం తెలిసిన వెంటనే ఎస్పీ ఎం నారాయణ, మాలూరు ఇన్‌స్పెక్టర్ వసంతకుమార్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. నవీన్, అతని స్నేహితుడు మంజునాథ్‌లను అరెస్టు చేసి జ్యుడిషియల్ కస్టడీకి పంపారు.

## స్వచ్ఛ రక్షణ అందరి బాధ్యత



కార్యక్రమంలో పాల్గొన్న మేయర్, ఉపమేయర్ తదితరులు

బళ్లారిఅర్బన్: స్వచ్ఛతను కాపాడటం మన అందరి బాధ్యత అని మేయర్ త్రివేణి అన్నారు. శుక్రవారం జిల్లా గ్రంథాలయం ఆవరణలో గాంధీ జయంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన స్వచ్ఛత కార్యక్రమాన్ని ప్రారంభించి ఆమె మాట్లాడారు. జాతిపిత మహాత్మాగాంధీ 154వ జయంతి సందర్భంగా ఉదయం 7 గంటల నుంచి నూతన జిల్లాధికారి కార్యాలయ భవనం ఎదురుగా గల కన్నడ సంస్కృతి శాఖ కార్యాలయ ప్రాంగణంలో ఈ శ్రమదాన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈనెల 30న కౌళగల్లు రోడ్డు విద్యానగర్ సర్కిల్, ఎయిర్‌పోర్ట్ ప్రాంతంలో, అక్టోబర్ 1న ట్యాంక్‌బండ్ రోడ్డులోని రంగమందిర, ఏపీఎంసీ సర్కిల్ ప్రాంతాల్లో స్వచ్ఛతా కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఉపమేయర్ జానకి, కార్పొరేటర్లు, కమిషనర్ ఖలీల్ సాబ్, అధికారులు పాల్గొన్నారు.

## కొలువుల పేరుతో రూ.కోట్లు లూటీ

- నిరుద్యోగ మహిళలకు శఠగోపం



ఈరమ్మ(ఫైల్)

రాయచూరు రూరల్: గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ టికెట్లను ఇప్పిస్తామని చైత్రా కుందాపుర టికెట్ గ్యాంగ్ కేసు, మంత్రుల పేర్లతో అప్పులు నిరుద్యోగులకు ఉద్యోగాలిప్పిస్తామని మోసగించిన ఉదంతాలు కనుమరుగు కాకమునుపే అంగన్‌వాడీల్లో కార్యకర్తల ఉద్యోగాలిప్పిస్తామని రూ.లక్షల్లో డబ్బు దండుకుని శఠగోపం పెట్టిన ఘటన జిల్లాలో వెలుగు చూసింది. 2021 కోవిడ్ సమయంలో మహిళా శిశు అభివృద్ధి సంక్షేమ శాఖలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తల నియామకాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో నగరానికి చెందిన ఈరమ్మ అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు మోసగించి సింధనూరు తాలూకా రౌడకుంద, అరగినమర క్యాంప్ వంటి ప్రాంతాల్లో అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టింగ్‌కు నకిలీ ఉత్తర్వులు ఇచ్చారు. ఆ సమయంలో అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లకుండా ఇంటిలోనే ఉండాలని చెప్పి రెండు నెలల వేతనాలు వేసి చేతులు దులుపుకున్నారు. చివరికి గత మూడేళ్ల నుండి వేతనాలు రాకపోవడంతో ఆశ్చర్యపోయిన బాధితులు నిజం తెలుసుకుని తాము ఇచ్చిన డబ్బులు వాపస్ ఇవ్వాలని కోరగా రూ.1.22 కోట్లకు ఫేక్ చెక్‌లను ఇచ్చి పరారైంది. ఈనేపథ్యంలో కేసు దర్యాప్తు చేపట్టిన ఈరమ్మను జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు.

## భక్తిశ్రద్ధలతో నవచండికా హోమం



హోమం నిర్వహిస్తున్న దృశ్యం



బనశంకరీ అమ్మవారికి అలంకరణ

బనశంకరి: దాక్షాయణి, శాంతస్వరూపిణి, భక్తుల కొంగుబంగారమైన బనశంకరీదేవి జయంత్యుత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం వేకువజామున సుప్రభాతసేవ అనంతరం ప్రధాన అర్చకులు ఏ.చంద్రమోహన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పంచామృతాభిషేకం, ప్రత్యేకపూజ, అలంకరణ ప్రత్యేక పూలఅలంకరణచేపట్టారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో యాగశాలలో వేదికార్చన, నవచండికాహోమం , మహాపూర్ణాహుతి, కుమారికాపూజ, సుహాసినిపూజ, దంపతి పూజ, మహామంగళహారతి చేపట్టారు. మధ్యాహ్నం శాకాంబరి అమ్మవారి రాజవీధి ఉత్సవం, సాయంత్రం ఉయ్యాలోత్సవం చేపట్టారు. మాజీ మంత్రి ఆర్.అశోక్ బనశంకరీ అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై నిమ్మకాయల ప్రమిదలతో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ వ్యవస్థాపక సమితి అధ్యక్షుడు ఏహెచ్.బసవరాజ్, కార్యనిర్వహణాధికారి లక్ష్మీ, సమితి సభ్యులు వీ.వెంకటేశ్, రవికుమార్, ఎల్.శోభాఅంజనప్ప, సుగుణాబాలకృష్ణ, బీ.చంద్రు పాల్గొన్నారు.

### పరిశుభ్రతపై జాగృతి జాతా



జాగృతి జాతాను నిర్వహిస్తున్న దృశ్యం

హొసపేటె: తాలూకా పంచాయతీ తరఫున శుక్రవారం మలపనగుడి జీపీలో స్వచ్ఛత వారోత్సవాల్లో భాగంగా పరిశుభ్రతపై జాగృతి జాతాను నిర్వహించారు. అనంతరం టీపీ ఈఓ ఎం.ఉమేష్ ఆధ్వర్యంలో శ్రమదానం చేపట్టారు. పంచాయతీలోని నాలుగు గ్రామాలకు చెందిన 120 మంది ప్రజాప్రతినిధులు పాల్గొని సుమారు 2 గంటల పాటు శ్రమదానం చేసి గ్రామంలోని ప్రభుత్వ స్థలాలను శుభ్రం చేశారు. దుకాణాలు, హోటళ్ల యజమానులు తమ దుకాణాల నుంచి కొనుగోలు చేసిన టెంకాయ పీచు, ఇతర కవర్లు, డబ్బాలను రోడ్లపై పారేయకుండా వాటిని నిల్వ చేసి ఉంచుకొని చెత్తవాహనాల్లోనే వేయాలని సూచించారు. అనంతరం జీపీ సభ్యుడు వెంకటేష్ గ్రామస్తులకు స్వచ్ఛత ప్రతిజ్ఞను బోధించారు. జెడ్పీ ప్లానింగ్ డైరెక్టర్ అశోక్ తోటద్, సహాయ ప్రణాళిక అధికారి లక్ష్మీకాంత్, జీపీ అధ్యక్షురాలు చంద్రమ్మ, పక్కీరస్వామి, ఉపాధ్యక్షుడు హొసళ్లి దొరె, పీడీఓ హనుమంతప్ప పాల్గొన్నారు.

### అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శ్రీకారం



భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే గవియప్ప, అధికారులు

హొసపేటె: జిల్లా వెనుకబడిన వర్గాల సంక్షేమ శాఖ, జెడ్పీ నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శుక్రవారం నగరంలో ఎమ్మెల్యే హెచ్‌ఆర్.గవియప్ప భూమిపూజ, ప్రారంభోత్సవాలు చేశారు. ఆర్టీఓ కార్యాలయం ఆవరణలో రూ.2.5 కోట్లతో మంజూరైన పోస్ట్‌మెట్రిక్ బాలుర వసతిగృహ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. నగరంలోని 60 పడకల మాతా శిశు ఆస్పత్రి ప్రాంగణంలో జిల్లా పంచాయతీ యాక్షన్ ప్లాన్ కింద నిర్మించిన నూతన జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ అధికారి కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ శంకర్‌నాయక్, జిల్లా ఆర్‌సీహెచ్ అధికారి డాక్టర్ జంబయ్యనాయక్, ఎంపీపీ దొడ్డమని, ధర్మనగౌడ, భాస్కర్, అధికారులు పాల్గొన్నారు.

### కావేరి నీటి విడుదలపై నిరసన



ఆందోళన చేస్తున్న కన్నడ సంఘాల కార్యకర్తలు

హొసపేటె: తమిళనాడుకు కావేరి నీటి విడుదలను నిరసిస్తూ శుక్రవారం చేపట్టిన కర్ణాటక బంద్ ప్రశాంతంగా ముగిసింది. బంద్ సందర్భంగా నగరంలో ఆర్‌టీసీ బస్సులు, ఆటోలు, ప్రైవేట్ వాహనాలు యథావిధంగా సంచరించాయి. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, బ్యాంకులు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, హోటళ్లు, దుకాణాలు యథావిధంగా తెరచి ఉంచారు. ఆందోళనకారులు బంద్‌ను నగరంలో ప్రశాంతంగా చేపట్టారు. బంద్ ర్యాలీని నగరంలో గాంధీ సర్కిల్ నుంచి ప్రారంభించి పునీత్ సర్కిల్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా దివంగత పునీత్ రాజ్‌కుమార్ గన్‌మ్యాన్, వివిధ కన్నడ సంఘాలు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### వంతెనల నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే హంపయ్య నాయక్

రాయచూరు రూరల్: తుంగభద్ర ఎడమ కాలువపై వంతెనల నిర్మాణానికి మాన్వి ఎమ్మెల్యే హంపయ్య నాయక్ భూమిపూజ చేశారు. శుక్రవారం మాన్వి తాలూకా వడవాటి వద్ద కృష్ణా భాగ్య జల నిగమ మండలి ఆధ్వర్యంలో రూ.5 కోట్లతో 8 వంతెనల నిర్మాణాలకు ఆయన భూమిపూజ చేసి మాట్లాడారు. వంతెనలను నాణ్యతగా నిర్మించాలని ఈఈ అనిల్‌కు సూచించారు. ఈసందర్భంగా జెడ్పీ మాజీ అధ్యక్షుడు శివబసప్ప, అధికారులున్నారు. అనంతరం మల్లట్‌లోని ఓ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని విద్యార్థులతో కలిసి ఆరగించారు.

### ఘనంగా దర్గా గంధోత్సవం



చింతామణి: తాలూకాలోని మురగమల్ల గ్రామంలో అమ్మాజాన్, భావాజాన్ ఉరుసు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గంధోత్సవం నిర్వహించారు. హిందూ, ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు.

### లారీ ఢీకొని మహిళ మృతి

మైసూరు: లారీ ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన మైసూరు నగరంలోని మండకల్లి వద్ద చోటుచేసుకుంది. మైసూరు తాలూకా ఉద్దూరు గ్రామానికి చెందిన సణ్ణమ్మ (55) మృతురాలు. సణ్ణమ్మ తన సోదరికి ఇంటికి వచ్చి అక్కడి నుంచి తన ఇంటికి వెళ్లే క్రమంలో రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలతో సణ్ణమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

**పాము కాటుకు రైతు...**

పాముకాటుతో రైతు మృతి చెందిన ఘటన మైసూరు తాలూకా జయపుర గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన శివణ్ణ నాయక (46) మృతుడు. శివణ్ణ వ్యవసాయ పనుల్లో ఉండగా పాము కాటేసింది. అతన్ని సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

### తమిళనాడు సీఎం దిష్టిబొమ్మ దహనం

కృష్ణరాజపురం: హొసకోటె పట్టణంలో వివిధ కన్నడ పోరాట సంఘాల నాయకులు ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. కావేరి జలాలను పరిరక్షించాలని నినాదాలు చేశారు. జాతీయ రహదారిపైకి వచ్చి వాహనాల రాకపోకలు అడ్డుకున్నారు. తమిళనాడుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమిళనాడు సీఎం స్టాలిన్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

### కాలువలో పడి చిన్నారి గల్లంతు

బనశంకరి: కాలువలో పడి బాలిక గల్లంతైన ఘటన అరకలగూడు పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. అరకలగూడు తాలూకా మదురనహళ్లి సుప్రిత (5) శుక్రవారం సెలవు కావడంతో ఇతర పిల్లలతో కలిసి హారంగి జలాశయం వద్దకు వెళ్లింది. ప్రమాదశాత్తు బలనాలేదండకాలువలో పడిపోయింది. తోటి స్నేహితులు గట్టిగా అరవడంతో సమీపంలోని వారు వచ్చి చేసే లోపే బాలిక కొట్టుకుని పోయింది. పోలీసులు గజఈతగాళ్ల సాయంతో గాలిస్తున్నారు.

### ప్రశాంతంగా నిమజ్జనం

హుబ్లీ: ఓ వైపు డీజేల హోరు, బాణసంచా శబ్దాలు, యువకుల నృత్యాలు, భక్తిపరవశులైన ప్రజల మధ్య ఈ ఏడాది వినాయక నిమజ్జనోత్సవ ఘట్టం భారీ బందోబస్తు మధ్య గురువారం అర్ధరాత్రి వరకు కొనసాగి ప్రశాంతంగా ముగిసింది. శుక్రవారం వాస్తవంగా 11వ రోజు నిమజ్జనం ఉండాల్సి ఉన్నా పున్నమి రోజున నిమజ్జనోత్సవం చేయడం అంతమంచిది కాదన్న నమ్మకంతో గురువారమే ఈ నిమజ్జనోత్సవ కార్యక్రమాలను పటిష్టమైన బందోబస్తు మధ్య ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ఘనంగా నెరవేర్చారు. సుమారు ఈ వేడుకలో ప్రముఖ కూడళ్లలో కొలువైన భారీ వినాయక విగ్రహాల ఊరేగింపు ప్రదర్శనను సాయంత్రం 7 గంటలకే ప్రారంభించి ప్రధాన వీధుల గుండా తరలించి అంతిమంగా నిమజ్జన కార్యక్రమాన్ని పూర్తి చేశారు. కాగా పోలీసులు నచ్చజెప్పి డీజే శబ్దాల హోరును రాత్రి 10 గంటలకే ముగించారు.

## క్లుప్తంగా

### అలరించిన నాట్య ప్రదర్శన



నృత్య ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

గౌరిబిదనూరు: సంగీత నృత్యాలకు ఆధ్యాత్మికతతో అనుబంధం ఉందని దిక్సూచి నాట్యాలయ నృత్య ఉపాధ్యాయురాలు భాగ్యశ్రీ తెలిపారు. బైపాస్ వినాయక ఉత్సవాలలో గురువారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో ఆయన పాల్గొని మాట్లాడారు. కళలకు ప్రాధాన్యత ఇస్తూ ఉత్సవాల్లో కళా ప్రదర్శనలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం వినాయకుడి వృత్తాంతాన్ని సీనియర్ కళాకారులైన హరిప్రియ, శృజన బృందం భరతనాట్య ప్రదర్శన ద్వారా భక్తులకు వివరించారు.

### ఇద్దరు నిందితుల అరెస్ట్

యశవంతపుర: ఒక ముఠా నాయకుడిని హత్య చేయటానికి పథకం వేసిన మరో ముఠాకు చెందిన ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారు. మంగళూరు బంట్వాళ తాలూకా ఫరంగిపేటకు చెందిన తస్లీమ్(34), హైదరాలి అలియాస్ హైదు(26)ను సీసీబీ పోలీసులు అరెస్ట్ చేశారు. తస్లీమ్ 10 రోజుల క్రితం జైలు నుంచి విడుదలయ్యాడు. గోవులను రవాణా చేసే మరో ముఠాకు చెందిన నాయకుడిని హత్య చేసేందుకు పథకం రచిస్తుండగా పోలీసులు అరెస్ట్ చేశారు.

# పలకరింపే పదివేలు..!

మనిషి జీవితంలో వృద్ధాప్యం అనేది చివరి దశ. ఈ దశలో వారికి అనేక శారీరక, మానసిక సమస్యల ఉంటాయి. ఆ వృద్ధులకు విశ్రాంతి నివ్వండి. కాసింత ప్రేమనివ్వండి. ఒంటరితనాన్ని దూరం చేయండి. జీవితమంటే మమకారం నింపండి. ఎందుకు బతికున్నామా అన్న భావన మాత్రం రానివ్వకండి. అంతకు మించి ఆ పెద్దలేం కొరుకొంటారు పాపం! వృద్ధులకు తగిన సేవలు అందించాలన్న లక్ష్యంతో అక్టోబరు 1న జరుపుకునే ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ ప్రత్యేక కథనం...

- వృద్ధాప్యం కారాదు శాపం
- కాసింత ప్రేమ, కాసింత ఆత్మీయత
- మలి వయసులో కోరుకునేది ఆ రెండే

**సందర్భం** | రేపు ప్రపంచ వృద్ధుల దినోత్సవం



శివాజీనగర: కుటుంబం కోసం జీవితాన్ని ధారపోశారు. దశాబ్దాల పరుగులో అలసిసొలసిపోయారు. ఎన్ని ఎదురు దెబ్బలు రుచి చూశారో అయినా కుంగిపోలేదు. యవ్వనంలో ఎన్ని ఎత్తు పల్లాలు ప్రయాణించారో, ఎన్ని అవమానాలు తట్టుకున్నారో అయినా ఓడిపోలేదు. జీవితాన్ని కాచి వడపోసిన అనుభవ సంపన్నులు. మిన్ను విరిగి మీదపడినా చలించని ధైర్యవంతులు. ప్రపంచాన్ని చదివిన బుద్ధి జీవులు, అరవై-డెబ్బై ఏళ్ల మేరు పర్వతాలు ఇప్పుడు వేరు తెగిన వృక్షాల్లా కూలిపోతున్నారు. జీవితంలో చిత్తుగా ఓడిపోతున్నారు. నిస్సహాయులై కన్నీళ్లు పెడుతున్నారు. వారిని ఊరడించండి, ఉత్సాహం నింపండి. మేమున్నామని ధైర్యం చెప్పండి. ఆరేడు దశాబ్దాల జీవితం, బోలెడన్ని అనుభవాలు, జ్ఞాపకాలు, సవాళ్లు, సగర్వ విజయాలు ఎవరికి చెప్పుకోవాలి? ఆ ఒంటరితనం, నిర్లక్ష్యం, భావోద్వేగాలు పంచడానికి ఓ మనిషంటూ లేని ఏకాకితనం మానసిక రుగ్మతలకు దారితీస్తోంది. బలవన్మణాలకు కారణం అవుతోంది.

**ప్రత్యేక చట్టాలు రావాలి :**

అనేక మంది వయో వృద్ధులు పాలనా బాధ్యతలు నిర్వర్తిస్తున్నా దేశంలో వయోధికులకు ఓ సామాజిక భద్రత వ్యవస్థంటూ లేకపోవడం దురదృష్టకరమని, ఇందుకు ప్రత్యేక చట్టాలు రావాలని వృద్ధులు అంటున్నారు. కుటుంబంలో కూడా స్వార్థం పెరిగిందని, తన భార్య, బిడ్డలను మాత్రమే శ్రద్ధగా చూసుకొంటున్నారని రిటైర్డ్ ఉద్యోగులు, వయో వృద్ధులు డాక్టర్ జ్ఞానేంద్రప్ప, రంగన్న డెవిడ్, పుట్టరామారాధ్య, ఎం.సీ.బాలకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను ఇంట్లో శ్రద్ధగా చూసుకోలేక వృద్ధాశ్రమాల్లో ఉంచటం కూడా నేడు అధికమైంది. ప్రభుత్వ పథకాలను వృద్ధులకు సక్రమంగా అందేటట్లు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేద వృద్ధురాలు దురుగమ్మ, మల్లమ్మ అంటున్నారు.



చిరునవ్వుతో పలకరిస్తే చాలు..



వాహ్యాళి చేస్తున్న వయోవృద్ధులు



విశ్రాంత వయోవృద్ధులు డాక్టర్ జ్ఞానేంద్రప్ప, ఎం.సీ.బాలకృష్ణ, పుట్టరామారాధ్య

**పెద్దలను ప్రేమిద్దాం, గౌరవిద్దాం:**

వాళ్లేం రాచమర్యాదలు అడగటం లేదు. విలాసాలు, వైభోగాలూ కోరుకోవడం లేదు. మనిషిగా గుర్తిస్తే చాలంటున్నారు. ప్రేమగా పలకరిస్తే అదే భాగ్యమంటున్నారు. పొద్దున్నే చిరునవ్వుల గుడ్ మార్నింగ్, మధ్యాహ్నం భోంచేశారా అన్న పలకరింపు. నీరసంగా కనిపిస్తే ఆరోగ్యం ఎలా ఉంది? అన్న పరామర్శ, రాత్రి కాసేపు లోకాభిరామాయణం. వాళ్ల ఒంటరితనాన్ని దూరం చేద్దాం. భర్త తన తల్లిదండ్రులను అమితంగా ప్రేమిస్తుంటే, భార్య కూడా గౌరవిస్తుంది. పిల్లలూ అభిమానిస్తారు. ఆ సంస్కారం కుటుంబ పెద్ద నుంచే మొదలు కావాలి.



ప్రేమను పంచి అక్కున చేర్చుకోవాలి

### విజయేంద్రను బీజేపీ అధ్యక్షుడిగా చేయాలి

యశవంతపుర: మాజీ ముఖ్యమంత్రి యడియూరప్ప కుమారుడు విజయేంద్రను బీజేపీ రాష్ట్రశాఖ అధ్యక్షుడిని చేయాలని మాజీ మంత్రి ఎంపీ రేణుకాచార్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన దావణగెరెలో విలేకర్లతో మాట్లాడారు. ప్రతిపక్ష నాయకుడిని బీజేపీ ఎంపిక చేయలేదు. బీజేపీకి ఓటమికి కారణంగా అధ్యక్షుడిగా ఉన్న నళీన్‌కుమార్ కటీల్ రాజీనామా చేయలేదు. ఆత్మావలోకనం చేసుకొని విజయేంద్రను అధ్యక్షుడిగా నియమించాలని డిమాండ్ చేశారు.

### అంధుల క్రికెట్ జట్టు సభ్యులకు గవర్నర్ సన్మానం

బనశంకరి: అంధుల క్రికెట్ జట్టు సభ్యులను గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ శుక్రవారం సన్మానించారు. అంధుల ప్రపంచ కప్ గెలిచిన క్రీడాకారులను రాజ్‌భవన్‌కు ఆహ్వానించి సన్మానించారు. భారత మహిళా అంధుల క్రికెట్ జట్టులో కర్ణాటకకు చెందిన ముగ్గురు క్రికెటర్లు, పురుషుల క్రికెట్ జట్టుకు చెందిన కర్ణాటకకు చెందిన ముగ్గురు ఆటగాళ్లను గవర్నర్ అభినందించారు. ప్రపంచస్థాయిలో భారత్‌కు గౌరవం తీసుకువచ్చారని అన్నారు. ఈ సందర్భంగా అంధుల మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్ వర్ష, సభ్యులు దీపికా, గంగవ్వకు తలా రూ.51 వేల నగదు, పురుషుల జట్టు ప్రకాష్, సునీల్‌కుమార్, బసప్ప ఒడ్డగోల్‌కు తలా రూ.41 వేలు ప్రోత్సాహ నగదు అందించారు. ఈ సందర్భంగా క్రికెట్ అసోసియేషన్ ఫర్ బ్లైండ్ ఇండియా అధ్యక్షుడు మహంతేశ్ తదితరులు పాల్గొన్నారు.

### రౌడీషీటర్ హత్య

శివాజీనగర: ఓ రౌడీని ఇంట్లో నుంచి బయటికి లాక్కొచ్చి చాకుతో పొడిచి హత్య చేశారు. ఈఘటన డీజే హళ్లి పోలీస్ స్టేషన్ వ్యాప్తిలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. డీజే హళ్లి మోదీ రోడ్డులో సయ్యద్ సుహేల్ (పప్పాయి సుహేల్ 28) నివాసం ఉంటున్నాడు. ఇతనిపై జేసీ నగర పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ నమోదైంది. రాత్రి 9.30 గంటల సమయంలో ఇంట్లో ఉండగా ఆరేడు మంది వ్యక్తులు వచ్చి అతన్ని బయటికి తీసుకెళ్లి ఇంటి సమీపంలోనే చాకుతో పొడిచి ఉడాయించారు. బాధితుడిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. డీజేహళ్లి పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి నిందితుల కోసం గాలింపు చేపట్టారు. పాతకక్షలతో ఈ హత్య జరిగిందని, హతుడిపై వివిధ పోలీస్ స్టేషన్లలో ఆరు కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు.

# రామనగరలో బంద్ విజయవంతం



రామనగరలో బీజేపీ, జేడీఎస్ పార్టీల ఆధ్వర్యంలో ఆందోళన

- హోరెత్తిన నినాదాలు
- ప్రశాంతంగా ముగిసిన ఆందోళనలు

దొడ్డబళ్లాపురం: తమిళనాడుకు కావేరి జలాలు విడుదల చేయడాన్ని నిరసిస్తూ కన్నడ భాషా సంఘాలు పిలుపునిచ్చిన కర్ణాటక బంద్‌కు రామనగరలో పూర్తి మద్దతు లభించింది. రామనగర పట్టణంలోని బస్టాండులో జేడీఎస్, బీజేపీ పార్టీలు కలిసి ఆందోళన చేపట్టాయి. బెంగళూరు-మైసూరు రహదారిపై బైఠాయించి కాసేపు రాస్తారోకో చేపట్టారు. రాష్ట్ర రైతుల శ్రేయస్సు పట్టించుకోని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఇద్దరూ రాజీనామా చేయాలని డిమాండు చేసారు. మరోవైపు రామనగర ఐజూరు సర్కిల్‌లో వందలాదిగా చేరిన కన్నడ భాషా సంఘాల కార్యకర్తలు రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు. ఖాళీ కుండలు చేపబట్టి నీళ్లు లేవంటూ గుండెలు బాదుకున్నారు. సాయంత్రం లోపు నీరు విడుదల చేయడం ఆపకపోతే డ్యాం పగలగొడతామని హెచ్చరించారు.

**చిక్కబళ్లాపురంలో మిశ్రమ స్పందన**

చిక్కబళ్లాపురం: తమిళనాడుకు కావేరి నీటి విడుదలను వ్యతిరేకిస్తూ కన్నడ సంఘాలు ఇచ్చిన రాష్ట్ర బంద్‌కు చిక్కబళ్లాపురం నగరంలో మిశ్రమ స్పందన వచ్చింది. నగరంలోని బీబీ రోడ్డు, ఎంజీ రోడ్లలో దుకాణాలు యథావిధిగా తెరిచారు. కూరగాయల మార్కెట్, పూల మార్కెట్ వ్యాపారాలు కొనసాగాయి. బంద్ సందర్భంగా బస్టాండ్లలో ప్రయాణికులు తక్కువగా కనిపించారు. అనంతరం ఆందోళనకారులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

**ప్రధాని జోక్యం చేసుకోవాలి**

యశవంతపుర: కావేరి నదీ జలాల వివాదంలో ప్రధాని జోక్యం చేసుకోవాలని శాండల్‌వుడ్ హీరో శివరాజ్ కుమార్ అన్నారు. రాష్ట్ర బంద్‌సందర్భంగా నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ...దశాబ్దాలుగా కావేరి నదీ జలాలపై వివాదం నడుస్తోందని, దీనికి సామరస్య పరిష్కారం చూపాలన్నారు. ఆందోళనలో నటులు దునియా విజయ్, సంగీత దర్శకుడు హంసలేఖ, పూజాగాంధీ తదితరులు పాల్గొన్నారు.

**కావేరిపై రాజకీయాలు**

మండ్య: తమిళనాడుతో స్నేహం కోసం కావేరి జలాల విషయంలో రాష్ట్ర సర్కార్ రాజకీయాలు చేస్తోందని రచయిత చక్రవర్తి సూలిబెలె మండిపడ్డారు. మండ్య నగరంలోని సర్ ఎంవీ విగ్రహం వద్ద రైతు హిత రక్షణ సమితి ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. జలాశయంలో నీరు మొత్తం ఖాళీ అవుతున్న వేళ ఇక్కడి ప్రజలు, రైతుల పరిస్థితి ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**మండ్యలో బంద్ సంపూర్ణం**

మండ్య: తమిళనాడుకు కావేరి నీటి విడుదలను వ్యతిరేకిస్తూ చేపట్టిన రాష్ట్ర బంద్ మండ్యలో విజయవంతమైంది. మండ్య నగరంతో పాటు మద్దూరు, శ్రీరంగ పట్టణం, పాండవపుర తాలూకాల్లో సంపూర్ణ మద్దతు లభించింది. నాగమంగళ, కేఆర్‌పేటలో బందకు మిశ్రమ స్పందన వచ్చింది. మండ్యలో అన్ని దుకాణాలు స్వచ్ఛందంగా మూసివేశారు. కన్నడ సంఘాలు రోడ్లపైకి వచ్చి ధర్నాలు, ఆందోళనలు చేశారు.

**ధర్నాలో నటుడు ప్రేమ్**

మండ్యలో జరిగిన బంద్‌లో నటుడు, దర్శకుడు ప్రేమ్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తనకు ఊహ తెలిసినప్పటి నుంచి కావేరి వివాదం నడుస్తోందని, ఈ ఏడాది వర్షాలు లేకపోయినా నీరు విడుదల ఎలా చేస్తారని మండిపడ్డారు. అన్ని పార్టీల నేతలు ఒక్కతాటిపైకి వచ్చి కావేరికి పరిష్కారం చూపాలన్నారు.

**తుమకూరులో మూతపడిన దుకాణాలు**

తుమకూరు: కావేరి నీటిని తమిళనాడుకు విడుదల చేయటాన్ని వ్యతిరేకిస్తూ కన్నడ సంఘాల రాష్ట్ర బంద్‌కు తుమకూరు నగరంలో విశేష స్పందన కనిపించింది. జిల్లాతో పాటు తాలూకాలోని అన్ని దుకాణాలు మూతపడ్డాయి. తుమకూరు నగరంలో రోడ్లన్నీ బోసిపోయాయి. కన్నడ సంఘాల నేతలు ర్యాలీ నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వంతో పాటు తమిళనాడుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఫోటో ఉంచి దండలు వేసి శ్రద్ధాంజలి ఘటించి నిరసన తెలిపారు. అనంతరం ఆందోళనకారులు జిల్లా అధికారి కార్యాలయం చేరుకుని వినతిపత్రం అందజేశారు.

**రైతుల ధర్నా :**

కర్ణాటక బంద్ నేపథ్యంలో రైతు సంఘాలు తుమకూరు నగరంలో భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించారు. నగరంలోని టౌన్‌హాల్ సర్కిల్ వద్దకు చేరుకున్న రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గోవిందరాజు నేతృత్వంలో రైతులు, రైతు నాయకులు వందల సంఖ్యలో జిల్లా అధికారి కార్యాలయం చేరుకుని భారీ ర్యాలీ ధర్నా చేపట్టి తమిళనాడుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

**కరవే బైక్ ర్యాలీ, ధర్నా**

బొమ్మనహళ్లి: బొమ్మనహళ్లిలో రాష్ట్ర బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా కర్ణాటక రక్షణ వేదిక (ప్రవీణ్ కుమార్ శెట్టి) విభాగం ఆధ్వర్యంలో బొమ్మనహళ్లిలో భారీ బైక్ ర్యాలీ, ధర్నాలు నిర్వహించారు. ఇక్కడి స్వామి వివేకానంద సర్కిల్ వద్ద తమిళనాడు సీఎం స్టాలిన్ ఫోటోలను చించి నిరసన తెలిపారు. ఇక నగర కర్ణాటక రక్షణ వేదిక కార్యదర్శి మహేష్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు కన్నడ జెండాలను పట్టుకుని కావేరి నమ్మదు, రక్తాన్నయినా ఇస్తాం, కావేరి నీరు ఇవ్వమని నినాదాలు చేశారు.

**చింతామణిలో పొర్లుదండాలు**

చింతామణి: చింతామణిలో నగరంలో బంద్ విజయవంతమైంది. ఉదయం నుంచి కరవే కార్యకర్తలు ద్విచక్ర వాహనాల్లో తిరుగుతూ దుకాణాలు మూయించారు. తాలూకా కార్యాలయం ఎదుట కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పొర్లుదండాలు పెడుతూ నిరసన తెలిపారు. ఆందోళనలో కరవే నాయకులు మోహన్, నారాయణస్వామి, ప్రకాష్, గౌడ తదితరులు పాల్గొన్నారు.

**నేను సైతం...**

శివాజీనగర: మండ్య జిల్లాలో కావేరి జలాల కోసం ఉధృతంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. బంద్ నేపథ్యంలో మండ్య నుంచి పాదయాత్ర ద్వారా వచ్చిన రాంబో అనే శునకం అందరిని ఆకట్టుకుంది. ఫ్రీడం పార్కులో కొనసాగుతున్న ఆందోళనలో శునకం పాల్గొని నోటితో ప్లకార్డులు పట్టుకుని నేను సైతం అంటూ అందరి దృష్టిని ఆకట్టుకుంది.

**మినరల్ వాటర్‌తో స్నానం:**

ధర్నాలో పాల్గొన్న ఓ వ్యక్తి ఫ్రీడం పార్కు ముందు మినరల్ వాటర్‌తో స్నానం చేసి వినూత్నంగా ధర్నా చేపట్టి తన ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. కావేరి నీరు లేదు, దీంతో మినరల్ వాటర్‌తో స్నానం చేసే పరిస్థితి వచ్చిందని అసహనం వ్యక్తం చేశాడు.

**గౌరిబిదనూరులో బంద్ పాక్షికం**

గౌరిబిదనూరు: తమిళనాడుకు నీటిని విడుదల చేయడాన్ని వ్యతిరేకిస్తూ కన్నడ సంఘాలు పిలుపు మేరకు శుక్రవారం చేపట్టిన రాష్ట్ర బంద్ నగరంలో పాక్షికంగా జరిగింది. తాలూకాలో బీజేపీ, జేడీఎస్, రైతు సంఘాలు, ప్రజా సంఘర్ష సమితి, జయ కర్ణాటక తదితర సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ సర్కిల్లో మానవహారం ఏర్పాటు చేసి రాస్తారోకో నిర్వహించారు. దుకాణాలు మూసివేశారు. ఆర్టీసీ బస్సులు యథావిధిగా తిరిగాయి. ఆందోళనలో బీజేపీ నేత మార్కెట్ మోహన్, జయ కర్ణాటక ప్రదీప్, ప్రజా సంఘర్ష సమితి రాజు, రైతుసంఘం లోకేశగౌడ, కన్నడ సంఘాల ప్రభు, జయణ్ణ తదితరులు పాల్గొన్నారు.

**రక్తం ఇస్తాం..కావేరి నీరు ఇవ్వం**

మండ్య : తాము రక్తాన్ని అయినా ఇస్తామని, కావేరి జలాలను మాత్రం తమిళనాడుకు ఇచ్చేది లేదని జనపర వేదిక నాయకులు పేర్కొన్నారు. తమిళనాడుకు నీరు విడుదల చేయడాన్ని నిరసిస్తూ మండ్య నగరంలోని జెసీ సర్కిల్‌లో ధర్నా చేస్తున్న ఆందోళనకారుల వద్దకు మండ్య జిల్లా మళవళ్లికి చెందిన శ్రీనివాస్ అనే కార్యకర్త వచ్చి తన చెయ్యిని బ్లేడుతో కొసుకోని నిరసన వ్యక్తం చేశారు.



బంద్ సందర్భంగా నిరసన కార్యక్రమంలో నటులు శివరాజ్ కుమార్, దర్శన్ తదితరులు



మండ్యలో బైక్ ర్యాలీ



చిక్కబళ్లాపురంలోని బిబి రోడ్డులో యథావిధిగా వాహనాల సంచారం



బొమ్మనహళ్లిలో కరవే ఆందోళన



గౌరిబిదనూరులో తహసీల్దార్‌కు వినతిపత్రం



చింతామణిలో కరవే పొర్లుదండాలు



తుమకూరులో కన్నడ సంఘాల ర్యాలీ

# ఇంటి స్థలం పేరుతో టోకరా

- మాజీ కార్పొరేటర్, మాజీ డీఎస్పీపై కేసు

మైసూరు: నకిలీ దాఖలాలతో వంచనకు పాల్పడినట్లు ఆరోపణలపై మైసూరు పాలికె మాజీ కార్పొరేటర్ సోమసుందర్, విశ్రాంత డీఎస్పీ విజయ్ కుమార్‌పై లక్ష్మీపురం పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. పోలీసులు సోమసుందర్‌ను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. మైసూరులోని బొగాదికి చెందిన వెంకటరాజు ఇంటి స్థలం కోసం స్నేహితుడు దినేష్‌తో కలిసి అన్వేషణ చేస్తుండగా సోమసందర్‌ను పరియ చయం చేశాడు. మైసూరు నగరాభివృద్ధి ప్రాధికారలో సంప్రదించి ఇంటి స్థలం మంజూరు చేయిస్తానని సోమసుందర్ నమ్మబలికి ఆనందనగర లేఔట్‌కు వెంకటరాజును తీసుకెళ్లాడు. అక్కడ ఒక స్థలాన్ని చూపించి ఫొటోలు తీసుకున్నాడు. అనంతరం పాలికె స్థలం మంజూరు చేసినట్లుగా నకిలీ దస్తావేజులు అందించి రూ.12 లక్షలు తీసుకున్నాడు. ఇంటి స్థలం పన్ను చెల్లించేందుకు వెళ్లిన సమయంలో ఆ దస్తావేజులు నకిలీవని తేలింది. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## హోసూరు వార్తలు..

### గదుల నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వై. ప్రకాష్

హోసూరు: డెంకణీకోట తాలూకా తళి నియోజకవర్గంలోని బేళగొండపల్లి ప్రభుత్వ ఉన్నతోన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి శుక్రవారం హోసూరు ఎమ్మెల్యే వై. ప్రకాష్ భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. రూ. 1.69 కోట్లతో 8 తరగతి గదులు నిర్మించనున్నారు. కార్యక్రమంలో కార్యవర్గ కమిటీ సభ్యుడు గిరీష్, పంచాయతీ అధ్యక్షుడు మంజునాథ్, యూనియన్ కౌన్సిలర్ చంద్రప్ప, ప్రభాకర్, నారాయణస్వామి, యల్లప్ప, శంకరప్ప తదితరులు పాల్గొన్నారు.

### నిప్పంటుకొని వివాహిత మృతి

కెలమంగలం: నిప్పంటుకొని మహిళ మృతి చెందిన ఘటన తళి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు... కర్ణాటక రాష్ట్రం బెంగళూరు జేపీ నగర ప్రాంతానికి చెందిన గణేష్ జయదేవ్. ఇతని భార్య రాధిక జయదేవ్ (55). రెండు రోజుల క్రితం డెంకణీకోట తాలూకా తళి సమీపంలోని చూడసంద్రం గ్రామంలో నివాసముంటున్న మిత్రుడి ఇంటికెళ్లారు. ఈ సమయంలో రాధిక టీ చేసేందుకు గ్యాస్ స్టవ్‌ను వెలిగించడంతో నిప్పంటుకుని తీవ్రంగా గాయపడింది. ఆమెను బెంగళూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. తళి పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

### ఫిర్యాదుల స్వీకరణకు స్పందన



కార్యక్రమంలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

క్రిష్ణగిరి: జిల్లా కేంద్రం క్రిష్ణగిరి కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్ శరయు అధ్యక్షతన జరిగిన ఫిర్యాదుల స్వీకరణకు స్పందన లభించింది. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు, రైతు సంఘ నాయకులు పాల్గొని సమస్యలపై 209 అర్జీలు అందజేశారు. గత నెలలో స్వీకరించిన 266 అర్జీలకు సంబంధించి 229 సమస్యలను పరిష్కరించారు. తాజాగా రాజకాల్వల ఆక్రమణలు, చెరువుల శుద్ధీకరణ, రోడ్ల నిర్మాణం, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, పంట రుణాలు, ఏనుగుల దాడుల్లో నష్టపోయిన రైతులకు పరిహారం, ఇంటి పట్టాలు, పశువులకు వైద్య చికిత్సల కోసం శిబిరాలు తదితర అంశాలపై రైతులు అర్జీలు సమర్పించారు. సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అధికారులు భూపతి, క్రిష్ణన్, శ్రీనివాసన్, ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు.

# బంద్‌తో సరిహద్దులో ఉద్రిక్తత



సరిహద్దులో మోహరించిన పోలీసు బలగాలు



అత్తిపల్లి వద్ద కరవే ఆందోళన



బస్సు సంచారం నిలిచిపోవడంతో అత్తిపల్లి వద్ద చంటి పిల్లలతో ఇబ్బందులు పడుతున్న ఓ తల్లి

హోసూరు: కావేరి జలాలను తమిళనాడుకు విడుదల చేయడాన్ని వ్యతిరేకిస్తూ కన్నడ సంఘాలు చేపట్టిన రాష్ట్ర బంద్‌తో రెండు రాష్ట్రాల సరిహద్దుల్లో ఉద్రిక్తత నెలకొంది. కర్ణాటక బంద్ ప్రకటించడంతో తమిళనాడులోని వివిధ జిల్లాల నుంచి బెంగళూరు వైపు వెళ్లే 450కి పైగా ఆర్టీసీ బస్సులు హోసూరులో ఆగిపోయాయి. తమిళనాడుకు వ్యతిరేకంగా వివిధ కన్నడ సంఘాలు ఇరు రాష్ట్రాల సరిహద్దు అత్తిపల్లి వద్ద ఆందోళనకు దిగాయి. పెద్ద ఎత్తున కర్ణాటక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారులను అరెస్ట్ చేశారు. తమిళనాడు నుంచి కర్ణాటక వైపు వెళ్లే వాహనాలను తమిళనాడు సరిహద్దులో పోలీసులు అడ్డుకొని తమిళనాడు రిజిస్ట్రేషన్ వాహనాలను వెనక్కి తిప్పి పంపారు. ఓ వైపు కన్నడ సంఘాల ఆందోళనలు, మరోవైపు తమిళనాడుకు చెందిన వాహనాలను పోలీసులు అడ్డుకోవడంతో హోసూరు - బెంగళూరు జాతీయ రహదారి అత్తిపల్లి వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. బెంగళూరు వైపు వెళ్లాల్సిన ప్రజలు, వ్యాపారులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

# గ్రామాలకు బస్ సర్వీస్‌లు ప్రారంభం

కెలమంగలం: కెలమంగలం సమితిలో పలు గ్రామాలకు శుక్రవారం నుంచి బస్సు సర్వీస్‌లు నడిచాయి. దీంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ బస్సుకు విశేష పూజలు నిర్వహించారు. కెలమంగలం యూనియన్‌లోని చిన్నట్టి, తావరకెరె, ఒన్నుగురికి, మునేదపురం, రామాపురం, గట్టూరు, వసంతపురం, మల్లేపాళ్యం గ్రామాలకు బస్సులు లేకపోవడంతో ఆ ప్రాంత ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు పడేవారు. తమ గ్రామాలకు బస్సులు నడపాలని స్థానికులు జెక్కేరి పంచాయతీ అధ్యక్షుడు రాజేష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఆయన సంబంధిత అధికారులతో చర్చించి శుక్రవారం నుంచి ఆయా గ్రామాలకు బస్సు సౌకర్యాన్ని కల్పించారు.

### ఉద్యోగి దుర్మరణం

హోసూరు: ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ప్రైవేట్ ఉద్యోగి మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడిన ఘటన మత్తిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు... తిరుపత్తూరు జిల్లా సుందరంపల్లి గ్రామానికి చెందిన లింగేశ్వరన్ (34) హోసూరు పారిశ్రామికవాడ జూజువాడి ప్రాంతంలో నివాసముంటూ అదే ప్రాంతంలోని ప్రైవేట్ పరిశ్రమలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. గురువారం సాయంత్రం ద్విచక్రవాహనంలో మత్తంఅగ్రహారం వద్ద వెళ్తుండగా ఎదురుగా వచ్చిన మరో బైక్ ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలతో లింగేశ్వరన్ ఘటనా స్థలంలోనే మృతి చెందగా మరో బైకిస్టు దుబారక్ (23) కూడా తీవ్రంగా గాయపడ్డాడు.

### దోపిడీకి యత్నిస్తున్న ఆరుగురు అరెస్ట్

హోసూరు: ఇళ్లల్లో దోపిడీలకు యత్నిస్తున్న ఆరుగురిని పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. హోసూరు పట్టణ పోలీసులు గురువారం సాయంత్రం తేరుపేటలోని శ్రీ చంద్రచూడేశ్వరస్వామి కొండ ప్రాంతంలో గస్తీ తిరుగుతుండగా ఆ ప్రాంతంలో కొంత మంది యువకులు అనుమానాస్పదంగా పోలీసుల కంటపడ్డారు. వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేయగా దోపిడీలకు యత్నిస్తున్నట్లు బయటపడింది. నిందితులు సంజయ్, శక్తివేల్, ధనశేఖర్, మరో ముగ్గురిని అరెస్ట్ చేసి విచారణ చేస్తున్నారు.

### బకాయి చెల్లించలేదని..

హోసూరు: బాకీ చెల్లించలేదని ఓ వ్యక్తిని హత్య చేసిన ఉదంతం బాగలూరు పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. బేరికె సమీపంలోని ముద్దుగురికి గ్రామానికి చెందిన తిమ్మరాయప్ప కొడుకు తిమ్మరాజ్(27) అదే ప్రాంతానికి చెందిన తిరుమలేష్ వద్ద రూ. 50 వేలు అప్పు తీసుకొన్నాడు. అప్పులో కొంచెం చెల్లించినట్లు సమాచారం. మిగిన డబ్బు వెంటనే చెల్లించాలని తిరుమలేష్ తీవ్ర ఒత్తిడి చేస్తూ వచ్చాడు. దీంతో వీరి మధ్య గొడవ జరిగింది. గురువారం సాయంత్రం తిమ్మరాజ్‌ను మామిడి తోటకు తీసుకెళ్లారు. ముందు జాగ్రత్తగా తిమ్మరాజ్ కత్తితో వెళ్లాడు. ఈ సమయంలో తిరుమలేష్, అతని అనుచరులు కిషోర్, 18 ఏళ్ల బాలుడు.. తిమ్మరాజ్ వద్ద ఉన్న కత్తిని లాక్కొని అతనిపై దాడి చేసి హత్య చేశారు. అనంతరం నిందితులు బాగలూరు పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని తిమ్మరాజ్ మృతదేహాన్ని స్వాధీనపరుచుకొని క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నిందితులను అరెస్ట్ చేసి విచారణ చేస్తున్నారు.

## క్లుప్తంగా...

### గుండుకు రూ.వెయ్యి
నిరసన కోసం టీడీపీ ఆఫర్


గుండు గీయించుకున్నందుకు రూ.1,000 ఇచ్చారని చెబుతున్న ఆటో డ్రైవర్

హిందూపురం: చంద్రబాబు అరెస్టుపై టీడీపీ చేపడుతున్న నిరసన కార్యక్రమాలకు ప్రజల నుంచి స్పందన కరువైంది. దీంతో ఆ పార్టీ నేతలు డబ్బిచ్చి జనాన్ని పిలిపించుకుంటున్నారు. శుక్రవారం శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలో టీడీపీ శిబిరం వద్ద శిరోముండనంతో నిరసన తెలిపే కార్యక్రమం చేపట్టారు. ఐదారుగురికి గుండు కొట్టించి శిబిరంలో కూర్చోబెట్టారు. ఇందుకోసం ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున చెల్లించారు. స్వయాన గుండు గీయించుకున్న ఓ వ్యక్తి ఈ విషయాన్ని వెల్లడించాడు. ఇదేరీతిలో నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి మహిళలను భోజనంతో పాటు రూ.500 చెల్లించి ర్యాలీలకు రప్పించుకున్నారు. ప్రస్తుతం హిందూపురంలో 'పెయిడ్ నిరసనలు' హాట్‌టాపిక్‌గా మారాయి.

### సీఎం జగన్‌ది సంక్షేమ స్టీరింగ్: మంత్రి రోజా



తిరుపతి అర్బన్: అభివృద్ధిలో అందరూ ఏపీ వైపు చూసేలా సంక్షేమ పథకాలు అనే స్టీరింగ్‌ను సీఎం వైఎస్ జగన్ కొనసాగిస్తున్నారని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. తిరుపతి కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన వైఎస్సార్ వాహన మిత్ర 5వ విడత కార్యక్రమానికి శుక్రవారం ఆమె హాజరై మీడియాతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ అన్ని వర్గాల వారిని తన కుటుంబంగా భావిస్తూ అందరికీ సంక్షేమ ఫలాలను అందిస్తూ పేద ప్రజల కన్నీళ్లు తుడుస్తున్నారని కొనియాడారు. లోకేశ్ ఏ తప్పు చేయకుంటే ముందస్తు బెయిల్‌కు ఎందుకు దరఖాస్తు చేసుకున్నారని ప్రశ్నించారు.

### 'స్కిల్' స్కాం జరిగిందా.. లేదా అనేది కోర్టులు తేలుస్తాయి
- సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి



మడకశిర: స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం జరిగిందా.. లేదా.. అనేది కోర్టులు తేలుస్తాయని, ఉద్యమాలు చేస్తే ఎలాంటి పరిష్కారం దొరకదని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యుడు ఎన్.రఘువీరారెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం శ్రీ సత్యసాయి జిల్లా నీలకంఠాపురంలో మీడియాతో మాట్లాడుతూ చట్టం తన పని తాను చేసుకోనివ్వాలని చెప్పారు. ప్రధానమంత్రి, కేంద్ర హోంమంత్రికి తెలిసే చంద్రబాబు అరెస్టు జరిగిందని పేర్కొన్నారు. చంద్రబాబు గతంలో అన్ని కేసుల్లోనూ స్టేలు తెచ్చుకున్నారని గుర్తుచేశారు. ఈ కేసులో అరెస్టు చేస్తారని తెలిసినా ఎందుకు ముందస్తు బెయిల్ తీసుకోలేదని ప్రశ్నించారు. ఎంఎస్ స్వామినాథన్ మృతి రైతాంగానికి తీరని లోటని పేర్కొన్నారు.

### ఐఆర్ఆర్‌లో రూ.7 కోట్ల భూమి కోల్పోయా: నారాయణ



సాక్షి, రాజమహేంద్రవరం: రాజధాని పరిధిలో ఇన్నర్ రింగ్ రోడ్డు (ఐఆర్ఆర్) వల్ల రూ.7కోట్ల విలువైన 40 సెంట్లు తన సొంత భూమిని కోల్పోయానని మాజీ మంత్రి పొంగూరు నారాయణ చెప్పారు. సొంత భూమిని కోల్పోయిన తాను ఎలా అవినీతికి పాల్పడతానని ఆయన ప్రశ్నించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో కేసులో అరెస్టయి రాజమండ్రి సెంట్రల్ జైల్లో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబును శుక్రవారం ములాఖత్ ద్వారా నారాయణతో పాటు నారా భువనేశ్వరి, బ్రాహ్మణి కలిశారు. జైలు వద్ద నారాయణ విలేకరులతో మాట్లాడుతూ తాను 2001లో కృష్ణా జిల్లా ఈడ్పుగల్లులో కొనుగోలు చేసిన భూమిని ఐఆర్ఆర్‌లో కోల్పోయానని చెప్పారు. ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ మృతికి చంద్రబాబు సంతాపం తెలియజేశారని చెప్పారు. కాగా, చంద్రబాబు జైలు జీవితం 20వ రోజుకు చేరుకుంది.

### బాబు దోచుకునేందుకు సృష్టించిందే రాజధాని
1,097వ రోజు దీక్షలో బహుజన నేతలు


రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: చంద్రబాబు దోచుకునేందుకు సృష్టించిందే అమరావతి రాజధాని అని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. మూడు రాజధానులకు మద్దతుగా గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో బహుజన పరిరక్షణ సమితి చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 1,097వ రోజుకు చేరాయి. నాయకులు మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో షెల్ కంపెనీలు సృష్టించి నిధులు కొల్లగొట్టారన్నారు. నాయకులు పులి దాసు, మాదిగాని గురునాథం, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ సంక్షేమ పథకాలు ఆదర్శనీయం

## ఉచిత పథకాలను వృథా అనడం సరికాదు
- అవి ప్రభుత్వాల కనీస బాధ్యత సంక్షేమం లేకపోతే అభివృద్ధే లేదు.. రెండింటినీ వేర్వేరుగా చూడలేం
- 'సంక్షేమం–అభివృద్ధి' అంశంపై సదస్సులో మేధావులు

ఏఎన్‌యూ: సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతి, సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని, అవి లేకపోతే ఆ వర్గాల అభివృద్ధే లేదని పలువురు విద్యావేత్తలు, ఆర్థికవేత్తలు అన్నారు. ఓపెన్ మైండ్స్ సంస్థ ఆధ్వర్యంలో 'సంక్షేమం–అభివృద్ధి' అనే అంశంపై ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో శుక్రవారం నిర్వహించిన సదస్సులో వారు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. అణగారిన వర్గాల సాధికారితకు సంక్షేమ పథకాలు అందించడం ప్రభుత్వాల కనీస బాధ్యత అని రాజ్యాంగం చెబుతోందని.. ఆంధ్రప్రదేశ్ లాంటి రాష్ట్రాల్లో అమలవుతున్న పలు ఉచిత పథకాలను వృథా అని కొందరు విమర్శించడం అర్థరహితమని చెప్పారు. అభివృద్ధి చెందిన ఫ్రాన్స్‌లో 31 శాతం, అమెరికాలో 30 శాతం, స్కాండినేవియాలో 29 శాతం నిధులు సంక్షేమానికి ఖర్చుచేస్తున్నారని.. మన దేశంలో 20 శాతం సంక్షేమానికి ఖర్చుచేస్తుండగా మన రాష్ట్రంలో 22 శాతం ఖర్చుచేస్తున్నారని వారు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎవరెవరు ఏమన్నారంటే..

### సంక్షేమం లక్ష్యమే అభివృద్ధి..



ప్రభుత్వాలు అమలుచేసే సంక్షేమం ధ్యేయమే అభివృద్ధి.. అభివృద్ధి లక్ష్యమే సంక్షేమం. ఈ రెండింటినీ వేర్వేరుగా చూడటం సరికాదు. సంక్షేమంపై ప్రభుత్వం చేస్తున్న ఖర్చులో అభివృద్ధి, మానవ వనరుల వృద్ధి దాగి ఉన్నాయని గుర్తించాలి. విద్య, వైద్యం, ఇల్లు, మంచి ఆహారం, నీరు వంటి కనీస వసతులు కల్పించడం ప్రభుత్వాల కనీస బాధ్యత. ఆ బాధ్యత నెరవేర్చడంలో ఏపీ ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తోంది. ప్రజలకు కల్పించే పలురకాల ఉచిత పథకాలు వృథా, అనవసర ఖర్చు అనడం అర్థరహితం. ఏపీలో 2016లో 11.7 శాతం పేదరికం ఉంటే 2021–22కి అది 6 శాతానికి తగ్గింది.

– డాక్టర్ ఎస్ రాజశేఖర్‌రెడ్డి, ఓపెన్ మైండ్స్ సంస్థ అధ్యక్షుడు, మాజీ మెంబర్ సెక్రటరీ అండ్ సీఈఓ, ఏపీహెచ్ఈఆర్ఎంసీ

### రానున్న రోజుల్లో మరిన్ని విప్లవాత్మక సంస్కరణలు..



గడచిన నాలుగున్నరేళ్లలో ఏపీ ప్రభుత్వం అనేక ఆదర్శవంతమైన పథకాలు అమలుచేసింది. రానున్న రోజుల్లో మరిన్ని విప్లవాత్మక సంస్కరణలు అమలుచేసేందుకు సీఎం నిర్దిష్టమైన ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. వచ్చే ఏడాదిలో 8–10 తరగతులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి అంతర్జాతీయ సాంకేతిక విద్యను అందించనున్నారు. నిజమైన అభివృద్ధిని కాంక్షించే వారు సంక్షేమాన్ని స్వాగతించాల్సిందే.

– ఆచార్య ఈ. శ్రీనివాసరెడ్డి, అకడమిక్ డీన్, ఏఎన్‌యూ

### విద్యపై ఖర్చు భావితరాలపై పెట్టుబడే..



ప్రభుత్వం విద్యపై ఖర్చుచేస్తున్న నిధులు భావితరాలపై, దేశంపై పెడుతున్న పెట్టుబడే. దీనిని ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా స్పష్టంచేశారు. విలువైన మానవ వనరులను తయారుచేసేందుకు, సామాజిక అసమానతలు రూపుమాపేందుకు, జాతీయ ఆర్థికాభివృద్ధికి, పేదరిక నిర్మూలనకు, సామాజిక, సాంకేతిక అభివృద్ధికి విద్య దోహదం చేస్తుంది. ఇన్ని అంశాలతో ముడిపడి ఉన్న విద్యకు అధిక ప్రాధాన్యమిస్తున్న ఏపీ ప్రభుత్వాన్ని అభినందించి తీరాలి. ఏపీ ప్రభుత్వం అమలు చేస్తున్న ద్విభాషా పుస్తకాల విధానాన్ని ప్రధాని మోదీ స్వయంగా అభినందించారు. ప్రపంచంలో చాలా ఫ్యూడల్ దేశాలు కూడా ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తుంటే దార్శనికతతో ఏపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమాన్ని విమర్శించడం అర్థరహితం. పాఠశాల విద్యకు సంబంధించిన చాలా సంస్కరణల్లో జాతీయ గణాంకాల కంటే ఏపీ అగ్రస్థానంలో ఉంది. ఎయిడెడ్ విద్యా సంస్థలను ప్రభుత్వంలో విలీనం చేయడం ఆదర్శవంతమైన సంస్కరణ. అంతర్జాతీయ విద్య, బోధనా ప్రమాణాలకు అధిక ప్రాధాన్యమివ్వడం హర్షణీయం. – ఆచార్య జంధ్యాల బీజీ తిలక్, మాజీ వైస్ చాన్సలర్ ఎన్‌యూఈపీఏ, న్యూఢిల్లీ

### రాజనీతిజ్ఞులు మంచి మార్పు కోసం పాటుపడతారు..



రాజకీయ నాయకులు ఓట్ల కోసం పథకాలు అమలు చేస్తే రాజనీతిజ్ఞులు మంచి మార్పుకోసం పాటుపడతారు. ఏపీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మంచి మార్పు కోసం పాటుపడుతున్న రాజనీతిజ్ఞుడు. అణగారిన వర్గాల సాధికారిత, ప్రపంచ స్థాయి అవకాశాల కల్పన, మానవ వనరుల అభివృద్ధి, పేదరికం నిర్మూలనకు దోహదం చేసే అన్ని సంస్కరణలు, పథకాలు ఏపీలో చిత్తశుద్ధితో అమలుచేస్తున్నారు. అణగారిన వర్గాలకు అవకాశాలు కల్పిస్తే ప్రపంచస్థాయి అద్భుతాలు సృష్టిస్తారనే వాస్తవాన్ని ఏపీ ప్రభుత్వం చాటిచెప్పింది. రానున్న రోజుల్లో మన దేశంలో యువ సంపద తగ్గే ప్రమాదం ఉంది. ప్రస్తుతం ఉన్న యువతను ప్రయోజకులుగా తీర్చిదిద్దటంలో అన్ని రాష్ట్రాలకు ఏపీ ఆదర్శంగా నిలుస్తోంది.

– టి.జి. తిలక్, ప్రముఖ జర్నలిస్ట్, రాజకీయ విశ్లేషకులు

### ఏపీలో నిజమైన అభివృద్ధి



ప్రపంచంలో పురాతన కాలం నుంచి సాగిన ఆదర్శ పాలనలన్నీ సంక్షేమానికి ప్రాధాన్యమిచ్చాయి. ఇప్పటివరకు అనేక అభివృద్ధి అంశాల్లో దేశానికి కేరళ ఆదర్శంగా నిలిస్తే కేరళకు ఆదర్శవంతమైన సంస్కరణలు కూడా ప్రస్తుతం ఏపీలో అమలవుతున్నాయి. ఏపీలో జరుగుతున్న నిజమైన అభివృద్ధిని క్షేత్రస్థాయిలో యూనివర్సిటీలు అధ్యయనం చేసి సమాజానికి తెలియజేయాలి.

– ఆచార్య పి. రాజశేఖర్, వీసీ, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ

### పథకాలే కాదు వాటి అమలూ ఆదర్శనీయం..



ఏపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలే కాదు వాటి అమలునూ ఆదర్శవంతంగా చేస్తోంది. నిరక్షరాస్యత నిర్మూలన ద్వారా పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం ఖర్చుచేస్తోంది. పేదలను శాశ్వత అభివృద్ధి వైపు నడిపించే గొప్ప మార్గం విద్య మాత్రమే. దానిని సీఎం జగన్ చిత్తశుద్ధితో అమలుచేస్తున్నారు. ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలల వైపు వెళ్లాలంటేనే చాలామంది ఇష్టపడే వారు కాదు. కానీ, నేడు ఏపీలో పాఠశాలల ముందు నిలబడి ఫొటోలు దిగుతున్నారు. నాడు–నేడు, అమ్మఒడి, జగనన్న విద్యా కానుక, జగనన్న గోరుముద్ద వంటి సంక్షేమ కార్యక్రమాల్లో ఎంతో దార్శనికమైన సమగ్రాభివృద్ధి దాగి ఉంది.

– ఆచార్య ఎస్. వెంకట్రావు, వీసీ, అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, శ్రీకాకుళం

### సంక్షేమ పథకాలు కనీస బాధ్యత..



ఏపీలో అమలుచేస్తున్న అనేక సంక్షేమ పథకాలు కొందరు విలాసాలని అంటున్నారు. అది సరికాదు. ప్రభుత్వం తన కనీస బాధ్యతను నెరవేరుస్తోంది. ఆహారం, వసతి, మంచి దుస్తులు వంటి ప్రాథమిక అవసరాలు తీర్చడం ప్రభుత్వాల బాధ్యత అనేది అందరూ గుర్తించాలి. విద్యపై ప్రభుత్వం పెడుతున్న పెట్టుబడి అభివృద్ధిలో భాగమే. విద్య, ఆరోగ్యం వంటి రంగాలకు ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యమివ్వడం వల్ల ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి. ఏపీలో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడం ఎంతో దార్శనికమైన నిర్ణయం.

– ఆచార్య బి. కరుణ, రిజిస్ట్రార్, ఏఎన్‌యూ

# ప్రజారోగ్యానికి 'రక్ష'

## 'జగనన్న ఆరోగ్య సురక్ష'ను వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం జగన్


జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రజలు వైద్యం కోసం ఇబ్బంది పడకుండా చేయిపట్టుకుని నడిపించే కార్యక్రమాన్ని 'జగనన్న ఆరోగ్య సురక్ష' ద్వారా చేపడుతున్నామని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమం ప్రజారోగ్య రంగంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా కలెక్టర్ వరకూ ప్రతి ఒక్కరూ ఇందులో భాగస్వాములయ్యారని తెలిపారు. శుక్రవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని సీఎం జగన్ వర్చువల్‌గా ప్రారంభించి మాట్లాడారు.

**ప్రివెంటివ్ కేర్‌లో నూతన అధ్యాయం**

ఫ్యామిలీ డాక్టర్ విధానం రూపంలో ప్రివెంటివ్ కేర్‌లో నూతన ఒరవడికి నాంది పలికాం. తాజాగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం రూపంలో ప్రివెంటివ్ కేర్‌లో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుడుతున్నాం. దేశంలో ఎవరూ, ఎప్పుడూ ఇలాంటి కార్యక్రమాలు చేయలేదు. మనం ధైర్యంగా, సాహసోపేతంగా చేస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా 10,032 వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్‌ను, 542 వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను అందుబాటులోకి తెగలిగాం. వీటిలో పూర్తి స్థాయిలో వనరులన్నీ సమకూర్చాం. ప్రతి మండలంలో రెండు పీహెచ్‌సీలు ఉండేలా చర్యలు చేపట్టాం. పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు, ఒక 104 వాహనాన్ని సమకూర్చాం. పీహెచ్‌సీల్లోని వైద్యులకు ఆ మండలంలోని గ్రామాలను విభజించి వైద్య సేవలు అందించేలా చూస్తున్నాం. ఇద్దరు వైద్యుల్లో ఒకరు పీహెచ్‌సీలో సేవలు అందిస్తుంటే మరొకరు 104 అంబులెన్స్‌లో తనకు కేటాయించిన గ్రామానికి వెళ్లి సేవలు అందిస్తున్నారు. ఇలా తనకు కేటాయించిన గ్రామాలను ప్రతి వైద్యుడు నెలలో రెండు సార్లు సందర్శిస్తున్నారు. క్రమం తప్పకుండా ఓ గ్రామానికి వైద్యుడు వెళ్లడం వల్ల ఆర్నెల్లలో గ్రామంలోని ప్రతి ఒక్కరి ఆరోగ్యంపై అవగాహన ఏర్పడుతుంది. తద్వారా ఆయా గ్రామాల్లో ప్రజలకు వైద్య పరంగా ఏ అవసరాలున్నాయనేది గుర్తించి మెరుగైన వైద్య సంరక్షణ చర్యలు చేపడుతున్నాం.

**అప్పులపాలయ్యే పరిస్థితులు రాకుండా**

దురదృష్టవశాత్తూ ఏదైనా జబ్బు బారినపడితే పేద, మధ్యతరగతి కుటుంబాల ప్రజలు అప్పుల పాలయ్యే పరిస్థితులు రాకుండా డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అండగా ఉంటున్నాం. టీడీపీ హయాంలో కేవలం 1,056 ప్రొసీజర్స్‌కు పరిమితం కాగా ఇప్పుడు 3256కు ప్రొసీజర్స్‌ను పెంచాం. గతంలో 915 నెట్‌వర్క్ ఆసుపత్రులుంటే ఈ రోజు 2,200 పైచిలుకు ఆస్పత్రులున్నాయి. ప్రజలు వైద్యం కోసం అప్పులపాలు కాకుండా ఉండాలనే ఈ చర్యలన్నీ చేపట్టాం.

**ప్రజారోగ్య రంగంలో కీలక పాత్ర**

ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటినీ జల్లెడ పడుతున్నాం. ఆ ఇంట్లో ఎలాంటి అనారోగ్య సమస్యలున్నా గుర్తించేలా సర్వే నిర్వహిస్తున్నాం. ఇంటి దగ్గరే 7 రకాల పరీక్షలు చేసి వివిధ సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తిస్తున్నాం. అనంతరం గ్రామంలో ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసి స్పెషలిస్టు డాక్టర్‌లతో చికిత్స అందిస్తున్నాం. రోగం నయం అయ్యే దాకా సంబంధిత వ్యక్తిని చేయిపట్టి నడిపిస్తాం. ఆరోగ్యశ్రీ, వైఎస్సార్ ఆరోగ్య ఆసరాపై ప్రజల్లో పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలి. అనారోగ్య సమస్య వస్తే ఆరోగ్యశ్రీ కింద ఉచిత వైద్య సేవలు ఏరకంగా పొందాలనే విషయాలను వివరించాలి. వైద్య సేవలు పొందడంలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే ఫిర్యాదు ఎలా చేయాలో కూడా తెలియచేయాలి. అవసరమైన మందులు అందేలా, ఆ మేరకు పర్యవేక్షణ ఉండేలా తగిన రీతిలో ఆరోగ్య సురక్ష ద్వారా మ్యాపింగ్ చేయాలి. క్యాన్సర్, డయాలసిస్ రోగులకు ఖరీదైన మందులు ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఉచితంగా అందిస్తాం.

**ప్రతి ఒక్కరు బాధ్యతగా భావించాలి**

ఐదు దశలను క్రోడీకరిస్తూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ఇప్పటికే అన్ని స్థాయిల్లో అవగాహన కల్పించాం. గ్రామస్థాయి నుంచి నెట్ వర్క్ అంతా కనెక్ట్ అయింది. ప్రతి ఒక్కరు తమ విధులను బాధ్యతగా భావించాలి. కార్యక్రమంలో భాగస్వాములు అవ్వాలి. ప్రతి పేదవాడికి తోడుగా ఉన్నామన్న భరోసా ఇవ్వాలి. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్, ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ (ఆశా), అసోసియేషన్ ఆఫ్ నెట్ వర్క్ హాస్పిటల్స్ ఆఫ్ ఏపీ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) భాగస్వామ్యం అయ్యాయి. వీరందరికీ నా తరఫున కృతజ్ఞతలు. ఈ కార్యక్రమంలో మంత్రి విడదల రజనీ, సీఎస్ డాక్టర్ జవహర్ రెడ్డి, వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ సాంబశివారెడ్డి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

### ఐదు దశలుగా 'జగనన్న ఆరోగ్య సురక్ష'

**మొదటి దశ:** మొదటి దశ ఈ నెల 15 నుంచి ప్రారంభమైంది. ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, గృహ సారథులు, సీఎం జగన్ ప్రభుత్వం పట్ల అభిమానం, ప్రేమ ఉన్న వారెవరైనా ఇందులో పాల్గొనవచ్చు. వీరు గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించాలి. ఏ వైద్య పరీక్షలు నిర్వహిస్తారు? ఎలాంటి వైద్య సేవలు అందిస్తారు? అనే వివరాలు ప్రజలకు చెప్పాలి. అనంతరం సీహెచ్‌వో, ఏఎన్ఎం, ఆశావర్కర్లు ఆయా ఇళ్లకు వచ్చి ఆరోగ్యంపై వాకబు చేస్తారని, ఏడు రకాల టెస్టులు నిర్వహించేందుకు వీలుగా వారి వద్ద కిట్స్ ఉంటాయని తెలియచేయాలి.

**రెండో దశ:** గ్రామంలోని విలేజ్ క్లినిక్‌లో ఒక భాగానికి సీహెచ్‌వో, మరొక భాగానికి ఏఎన్ఎం బాధ్యత తీసుకుని ఆశావర్కర్లు, వలంటీర్లతో మమేకమై ప్రతి ఇంటిని జల్లెడ పడతారు. ప్రతి ఇంట్లోనూ బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ పరీక్షలు చేస్తారు. అవసరాన్ని బట్టి యూరిన్, మలేరియా, డెంగీ, కఫం పరీక్షలు చేపడతారు. ఇలా ఏడు రకాల టెస్టింగ్ ఎక్విప్‌మెంట్ తీసుకెళ్లి ప్రతి ఇంటికీ వెళ్లి ప్రతి ఒక్కరి ఆరోగ్యంపై వాకబు చేస్తారు. ఆరోగ్యశ్రీ యాప్ ద్వారా మ్యాపింగ్ చేస్తారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని ఎలా వినియోగించుకోవాలో వివరిస్తారు. స్మార్ట్ ఫోన్‌లో ఆరోగ్యశ్రీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునేలా అవగాహన కల్పిస్తారు. గర్భిణిలు, బాలింతలు, చిన్నారుల్లో రక్తహీనత నివారణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. వారికి మందులు ఇవ్వడమే కాకుండా మ్యాపింగ్ చేసి ఫుడ్ సప్లిమెంటేషన్ కోసం చర్యలు చేపడతారు.

**మూడో దశ:** గ్రామం, పట్టణంలో హెల్త్ క్యాంపునకు మూడు రోజుల ముందు వలంటీర్లు, గృహసారథులు, ఔత్సాహికులు, ప్రభుత్వం పట్ల, ఆరోగ్యశ్రీ పథకం మీద మమకారం ఉన్నవారంతా ఏకమై ప్రతి ఇంటికీ వెళతారు. గ్రామం/పట్టణంలో హెల్త్ క్యాంపు ఎప్పుడు నిర్వహిస్తారన్న దానిపై వివరాలు అందిస్తారు. హెల్త్ క్యాంపులో పాల్గొనాలని సూచిస్తారు. రెండో దశలో ఇచ్చిన టోకెన్ నెంబర్లు ఉన్నవాళ్లు తప్పకుండా క్యాంపులో హాజరవ్వాలని వివరిస్తారు. టోకెన్ లేకపోయినా వైద్యం అవసరమైన వారు కూడా హెల్త్ క్యాంపులకు రావచ్చని తెలియజేస్తారు.


**నాలుగో దశ:** హెల్త్ క్యాంపుల నిర్వహణ ఈ దశలో ఉంటుంది. గ్రామం/పట్టణంలో హెల్త్ క్యాంపు నిర్వహించే రోజు వలంటీర్లు, ప్రజాప్రతినిధులు, ఆశావర్కర్లు, సీహెచ్‌వోలు, ఔత్సాహికులు మమేకమవుతారు. క్యాంప్ వద్దకు వచ్చిన ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు అందేలా చూస్తారు. మందులు సమకూర్చడం, ఇతర సహాయ సహకారాలు అందిస్తారు. సంబంధిత వ్యక్తులను విలేజ్ క్లినిక్స్ వారీగా ఫ్యామిలీ డాక్టర్, ఏఎన్ఎంలకు మ్యాప్ చేస్తారు. మ్యాప్ అయిన వ్యక్తులకు తర్వాతి రోజుల్లో తగిన వైద్యం అందించే చర్యలు తీసుకుంటారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఆరోగ్యశ్రీ కింద ఉచిత వైద్యం అందించడం, చికిత్స అనంతరం మందులు, రెగ్యులర్ ఫాలో అప్ చేపడతారు.

**ఐదో దశ:** ఈ దశలో ప్రజలను చేయిపట్టుకుని నడిపిస్తాం. సురక్ష క్యాంపుల్లో గుర్తించిన వారికి నయం అయ్యేంత వరకూ చేయూత నిస్తాం. ఆయా వ్యక్తుల పర్యవేక్షణ బాధ్యతలను వలంటీర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, సీహెచ్‌వోలు తీసుకుంటారు. చికిత్స అందించడంతోపాటు క్రమం తప్పకుండా ఆరోగ్యంపై వాకబు చేస్తారు.

# లోకేశ్ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను మూసివేసిన హైకోర్టు

## ఐఆర్ఆర్ కేసులో లోకేశ్‌కు సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ నోటీసు ఇస్తామని ఏజీ నివేదన

### అవసరమైనప్పుడు విచారణకు రావాలని కోరతామని వెల్లడి
- ఏజీ వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం
- లోకేశ్ పిటిషన్‌లో తదుపరి ఉత్తర్వులు అవసరం లేదని హైకోర్టు స్పష్టీకరణ
- దర్యాప్తునకు సహకరించాలని లోకేశ్‌కు ఆదేశం



సాక్షి, అమరావతి : అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మాటున సాగించిన భూ దోపిడీపై సీఐడీ నమోదు చేసిన కేసులో 14వ నిందితుడిగా ఉన్న మాజీ మంత్రి నారా లోకేశ్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు మూసివేసింది. లోకేశ్‌కు సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ కింద నోటీసు జారీ చేసి, అవసరమైనప్పుడు విచారణకు రావాలని కోరతామని సీఐడీ తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ హైకోర్టుకు వివరించారు. ఈరోజు వరకు ఆయన అరెస్టు విషయంలో భయపడాల్సిన అవసరంలేదని చెప్పారు. దర్యాప్తు ప్రయోజనాల దృష్ట్యా లోకేశ్ విచారణ విషయంలో హైకోర్టు ఏ షరతులైనా విధించవచ్చని తెలిపారు. ఏజీ వాదనలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు, వాటిని రికార్డ్ చేసింది. తప్పనిసరిగా సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏను అనుసరించే ముందుకు వెళతామని ఏజీ స్పష్టంగా చెప్పిన నేపథ్యంలో, లోకేశ్ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తదుపరి ఉత్తర్వులు అవసరం లేదని స్పష్టం చేసింది. అందువల్ల పిటిషన్‌ను మూసివేస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అమరావతి మాస్టర్ ప్లాన్, ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ డిజైన్ల ముసుగులో అప్పటి ప్రభుత్వ పెద్దలు సాగించిన భూదోపిడీపై మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు సీఐడీ కేసు నమోదు చేసింది. ఇందులో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, మంత్రి పొంగూరు నారాయణ, చంద్రబాబు సన్నిహితులు, వ్యాపారవేత్తలు లింగమనేని రమేష్, లింగమనేని వెంకట సూర్య రాజశేఖర్, రామకృష్ణ హౌసింగ్ లిమిటెడ్ డైరెక్టర్ అంజనీ కుమార్ తదితరులను నిందితులుగా చేర్చింది. చంద్రబాబు కుమారుడు, అప్పటి మంత్రి లోకేశ్‌ను సైతం 14వ నిందితునిగా చేర్చింది. ఈ నేపథ్యంలో ముందస్తు బెయిల్ కోరుతూ లోకేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై శుక్రవారం సీఐడీ తరఫున ఏజీ శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ.. లోకేశ్‌పై కేసులో సెక్షన్లను సవరించామని తెలిపారు. అవినీతి నిరోధక చట్టం కింద మరిన్ని సెక్షన్లు చేర్చామని వివరించారు. దర్యాప్తు అధికారి చట్ట ప్రకారం నడుచుకుంటారని తెలిపారు. లోకేశ్‌కు సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ కింద నోటీసు ఇవ్వాలని దర్యాప్తు అధికారి నిర్ణయించారన్నారు. ఈ సమయంలో న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ.. అరెస్టు గురించి ఆందోళన చెందుతున్నారా అని లోకేశ్ తరఫు న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్‌ను ప్రశ్నించారు. అరెస్ట్ చేస్తారని అనుకుంటే ఎప్పుడైనా న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చునన్నారు. దర్యాప్తునకు సహకరించాలని స్పష్టం చేశారు. దీనికి దమ్మాలపాటి శ్రీనివాస్ స్పందిస్తూ.. ఏజీ చెప్పిన వివరాలను రికార్డ్ చేయాలని కోరారు. అరెస్టు విషయంలో కనిపించని ఆందోళన ఉందన్నారు. వరుసగా సెలవులు వస్తున్నాయని తెలిపారు. సీఐడీ అనుసరించే విధానం (మోడస్ ఆపరెండీ) వేరుగా ఉంటుందని, సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ నోటీసు ఇచ్చిన తరువాత కూడా అరెస్ట్ చేసేందుకు వెనుకాడబోదని తెలిపారు.

**పాలనాపరంగా తప్పుడు నిర్ణయాలు తీసుకున్నారు**

మోడస్ ఆపరెండీ అన్న పదం ఉపయోగించడంపై ఏజీ శ్రీరామ్ అభ్యంతరం తెలిపారు. ఈ పదం నిందితులకు మాత్రమే వర్తిస్తుందని స్పష్టం చేశారు. లోకేశ్‌పై నమోదు చేసిన సెక్షన్లన్నింటినీ ఏజీ చదివి వినిపించారు. ఈ సెక్షన్లన్నీ వర్తిస్తాయా అని న్యాయమూర్తి ప్రశ్నించారు. పాలనాపరంగా లోకేశ్‌తో పాటు అప్పటి ప్రభుత్వ పెద్దలు పలు తప్పుడు నిర్ణయాలు తీసుకున్నారని, అందువల్ల ఆ సెక్షన్లన్నీ ఆయనకు వర్తిస్తాయని తెలిపారు. దర్యాప్తునకు సహకరించాలని లోకేశ్‌ను ఆదేశించాలని కోర్టును కోరారు. దమ్మాలపాటి స్పందిస్తూ.. దర్యాప్తు అధికారి పిటిషనర్‌ను విచారణకు పిలవాలనుకుంటే ముందే ఆ విషయాన్ని తెలిపి సహేతుక సమయాన్ని ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ముందు రోజు నోటీసు ఇచ్చి, మరుసటి రోజు హాజరు కావాలంటే కష్టమని చెప్పారు.

# 'స్కిల్' కుంభకోణం కేసులో 4 వరకు లోకేశ్‌ను అరెస్ట్ చేయొద్దు

- సీఐడీకి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేష్‌రెడ్డి ఆదేశం
- తదుపరి విచారణ అదే రోజుకు వాయిదా

సాక్షి, అమరావతి : స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ హైకోర్టులో శుక్రవారం అత్యవసరంగా పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి విచారణ జరిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి అక్టోబర్ 4వ తేదీ వరకు లోకేశ్‌ను అరెస్టు చేయవద్దని సీఐడీని ఆదేశించారు. తదుపరి విచారణను అదే రోజుకు వాయిదా వేశారు.

సీఐడీ తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ.. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో లోకేశ్‌ను ఇప్పటివరకు నిందితునిగా చేర్చలేదని కోర్టుకు నివేదించారు. నిందితుడు కానప్పుడు అరెస్ట్ చేయడమన్న ప్రశ్నే తలెత్తదన్నారు. కేవలం భయాందోళనతోనే ఈ పిటిషన్ దాఖలు చేశారని వివరించారు. ఇప్పటికైతే అరెస్ట్ గురించి ఆందోళన అవసరం లేదన్నారు. ఒకవేళ అరెస్టు చేయాలనుకుంటే ఎప్పుడో చేసి ఉండేవాళ్లమని, తాము ఏం చేసినా చట్ట ప్రకారం చేస్తామని చెప్పారు. చంద్రబాబు అరెస్టు సందర్భంగా సీఐడీ దాఖలు చేసిన రిమాండ్ రిపోర్టులో అంశాల ఆధారంగా వాళ్లు భయాందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. టీడీపీకి లోకేశ్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారని, ఆయన తండ్రి అధ్యక్షుడిగా ఉన్నారని చెప్పారు. టీడీపీ బ్యాంకు ఖాతాల్లోకి పెద్ద మొత్తంలో డబ్బు జమ అయిందని, ఆ డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందో తమ వద్ద ఆధారాలున్నాయని వివరించారు. ఆ రిమాండ్ రిపోర్టును ఆధారంగా 20 రోజుల తరువాత ఇప్పుడు పిటిషన్ దాఖలు చేశారన్నారు. లోకేశ్ చెబుతున్న కారణాల్లో సదుద్దేశం కనిపించడం లేదని, సంబంధం లేని అంశాలన్నింటినీ లేవనెత్తుతున్నారని చెప్పారు. నిందితునిగా చేర్చకుండానే బెయిల్ ఇవ్వాలంటూ ఎలా కోర్టుకొస్తారని ప్రశ్నించారు. కొంత సమయం ఇస్తే పూర్తి వివరాలను కోర్టు ముందుంచుతామన్నారు. బుధవారం లేదా గురువారం విచారణ జరిపినా అభ్యంతరం లేదని, అప్పటివరకు ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వొద్దని ఏజీ కోర్టుకు నివేదించారు.

అంతకు ముందు లోకేశ్ తరఫున సీనియర్ న్యాయవాదులు సిద్దార్థ లూథ్రా, దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. తాము మధ్యంతర ముందస్తు బెయిల్ కోరుతున్నామన్నారు. చంద్రబాబు రిమాండ్ సందర్భంగా దాఖలు చేసిన రిమాండ్ రిపోర్టులో స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అంతిమ లబ్ధిదారులు చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యులని పేర్కొందని, సీఐడీ ఉద్దేశాన్ని ఇది స్పష్టం చేస్తోందని చెప్పారు. చంద్రబాబునే సీఐడీ అధికారులు ఈ కేసులో అక్రమంగా, అన్యాయంగా ఇరికించారని, తప్పుడు కేసు బనాయించారని అన్నారు. లోకేశ్ విషయంలో కూడా అదే రీతిలో చేస్తారని, సీఐడీని విశ్వసించే పరిస్థితి లేదని అన్నారు. 4వ తేదీ వరకు అరెస్టు నుంచి రక్షణ కల్పించాలని, కావాలంటే ఆ తరువాత విచారణ జరిపి ముందస్తు బెయిల్‌పై ఏ నిర్ణయమైనా తీసుకోండని కోర్టును అభ్యర్థించారు.



# ఆవులే ఆమె సర్వస్వం

## డాక్టర్ పద్మ జీవనయానం

**"ఆవు పైన ప్రేమ...
లెక్చరర్ ఉద్యోగాన్ని వదులుకునేలా..
నగరం నుంచి పల్లెతల్లికి దగ్గరయ్యేలా
కొండకోనల వెంట ప్రయాణించేలా
వరదలను తట్టుకొని నిలబడేలా చేసింది"
అని వివరిస్తుంది డాక్టర్ చెన్నమనేని పద్మ.
హైదరాబాద్‌లో పుట్టి పెరిగినా, వృత్తి ఉద్యోగాల్లో కొనసాగుతున్నా ఊరు ఆమెను ఆకట్టుకుంది. 200 ఆవులకు సంరక్షకురాలిగా మార్చింది. పదేళ్లుగా చేసిన ఈ ప్రయాణంలో నేర్చుకున్న విషయాలను, వరించిన జాతీయస్థాయి అవార్డులను వివరించారు పద్మ.**

''నా చిన్ననాటి రోజులకు ఇప్పటికీ ఆహారంలోనూ, వాతావరణంలోనూ చాలా తేడా కనిపించేది. తెలుగు లెక్చరర్‌గా హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఉన్న ఎయిడెడ్ గర్ల్స్ కాలేజీలో ఉద్యోగం చేసేదాన్ని. వ్యవసాయం, ఆహారం ప్రాముఖ్యతను నేను చదువు చెప్పే అమ్మాయిలకు ప్రత్యక్షంగా చూపాలనుకున్నాను. మా నాన్నగారి ఊరు జగిత్యాలకు ఎప్పుడో ఒకసారి వెళ్లేదాన్ని. ఊరి ప్రయాణం, అక్కడి వాతావరణం నాకు బాగా నచ్చేది. ఇదే విషయాన్ని మా క్లాస్ అమ్మాయిలకు చెప్పి, ఆసక్తి ఉన్నవాళ్లు పేర్లు ఇస్తే, తీసుకెళతాను అని చెప్పాను. ఒకేసారి యాభైమంది పేర్లు ఇచ్చారు. వారందరికీ బస్ ఏర్పాటు చేసి, తీసుకెళ్లాను. వ్యవసాయంలో ఏమేం పనులు ఉంటాయో అన్నీ పరిచయం చేశాను. అక్కడి గోశాలకు తీసుకెళితే పిల్లలంతా కలిసి, లక్ష గొబ్బెమ్మలు తయారు చేశారు.

### ఎరువుగా గొబ్బెమ్మలు

కొన్నిరోజుల తర్వాత గోశాల వాళ్లు గొబ్బెమ్మలను తీసుకెళ్లమని చెప్పారు. అప్పటివరకు ఆలోచన చేయలేదు. కానీ, వాటిని హైదరాబాద్ తీసుకొచ్చి ఏం చేయాలో అర్థం కాలేదు. ఏదైతే అది అయ్యిందని వ్యాన్‌లో లక్షగొబ్బెమ్మలను తీసుకొచ్చి, ఇంట్లో పెట్టించాను. ఎక్కడ చూసినా గొబ్బెమ్మలే. ఇంట్లోవాళ్లు ఏంటిదంతా అన్నారు. కొన్ని రోజులు వాటిని అలాగే చూస్తూ ఉన్నాను. గోమయాన్ని ఎరువుగా వాడితే పంట బాగా వస్తుంది. అయితే, నగరంలో ఇదెలా సాధ్యం అవుతుంది అనుకున్నాను. రూఫ్ గార్డెన్‌వాళ్లకు ఇస్తే అనే ఆలోచన వచ్చిన వెంటనే వాట్సప్ గ్రూపుల్లో గొబ్బెమ్మలు కావాల్సిన వాళ్లు తీసుకెళ్లొచ్చు మొక్కలకు ఎరువుగా అని మెసేజ్ చేశాను. రెండు, మూడు రోజుల్లో మొత్తం గొబ్బెమ్మలు ఖాళీ అయ్యాయి.

### ఆవుల కొనుగోలు...

ఊరు వెళ్లినప్పుడల్లా దారిలో గోవుల గుంపు ఉన్న చోట ఆగి, కాసేపు అక్కడ ఉండి వెళ్లడం ఒక అలవాటుగా ఉండేది. అలా ఒకసారి 80 ఏళ్ల వ్యక్తి నా అడ్రస్ కనుక్కొని వచ్చాడు. తన దగ్గర ఉన్న ఆవులను బతికించలేకపోతున్నానని, పిల్లలు వాటిని వదిలించుకోమని చెబుతున్నారని ఏడ్చాడు. నాకేం చేయాలో అర్థం కాలేదు. అంత పెద్ద వ్యక్తి గోవుల గురించి బాధపడుతుంటే చూడలేకపోయాను. ఏదైతే అది అవుతుందని 55 గోవులను అతను చెప్పిన మొత్తానికి నా పొదుపు మొత్తాల నుంచి తీసి, కొనేశాను.

### అర్థం చేసుకుంటూ...

కొనడంలో ధైర్యం చేశాను కానీ, ఆ ఆవులను ఎలా సంరక్షించాలో అర్థం కాలేదు. వర్కర్లను, వాటికి గ్రాసం ఏర్పాటు చేయడం తలకు మించి భారమైంది. వాటిని చూసుకోవడానికి ఉద్యోగం మానేశాను. అయినవాళ్లంతా తప్పు పట్టారు. 'కాలేజీకి త్వరలో ప్రిన్సిపల్ కాబోతున్నావ్.. ఇలాంటి టైమ్‌లో ఉద్యోగం వదులుకొని ఇదేం పని' అన్నారు. కానీ, ఆవు లేని వ్యవసాయం లేదు. ఆవు లేకుండా మనిషి జీవనం లేదనిపించేది నాకు. ఇంట్లోవాళ్లకు చెప్పి జగిత్యాలలోనే ఆవులతో ఉండిపోయాను. కానీ, ఊళ్లో అందరినుంచీ కంప్లైంట్లే! ఆవులు మా ఇళ్ల ముందుకు వస్తాయనీ, వాకిళ్లు పాడుచేస్తున్నా



గోవులతో...



యని, పోలీసు కేసులు కూడా అయ్యాయి. ఆ ఊళ్లో పుట్టి పెరిగిన దాన్ని కాదు కాబట్టి, నాకెవరూ సపోర్ట్ చేసేవాళ్లు లేరు. దీంతో ఆవులను తీసుకొని గోదావరి నదీ తీరానికి వెళ్లిపోయాను. అక్కడ ఓ పది రోజులు గడిచాయో లేదో విపరీతమైన వానలు, వరదలు. ఆ వరదలకు కొన్ని ఆవులు కొట్టుకుపోయాయి కూడా. నాకైతే బతుకుతానన్న ఆశ లేదు. ఎటు చూసినా బురద, పాములు.. కృష్ణుడిని వేడుకున్నాను. 'ఈ ఆవులు నీవి, నీవే కాపాడుకో..' అని వేడుకున్నాను. అక్కణ్ణుంచి బోర్నపల్లి అటవీ ప్రాంతంలో 15 రోజులు ఆవులతో గుట్టలపైనే ఉన్నాను. మూగజీవాల గురించి, ప్రకృతి గురించి నాకేమీ తెలియదు. ఏం జరిగినా వెనక్కి వెళ్లేది లేదు అనుకున్నాను. నా మొండితనం ప్రకృతిని అర్థం చేసుకునేలా చేసింది. ఎప్పుడో వీలున్నప్పుడు హైదరాబాద్ వచ్చి వెళ్లేదాన్ని. మా ఇద్దరు అబ్బాయిలు జీవితాల్లో సెటిల్ అయ్యారు. ఇక నా జీవితం ఆవులతోనే అనుకున్నాను. కరోనా టైమ్‌లో మా కుటుంబం అంతా హైదరాబాద్‌లో ఉంది. నేను గోవులతో అడవుల్లో ఉన్నాను. ఓసారి కుటుంబం అంతా కూర్చుని ఆవులు కావాలా, మేం కావాలో తేల్చుకోమన్నారు. ఆవులే కావాలి అన్నాను. నాకు ఉన్న ఈ ఇష్టాన్ని గమనించిన మా వారు తను చేస్తున్న సెంట్రల్‌గవర్నమెంట్ జాబ్ నుంచి వీఆర్ఎస్ తీసుకొని వచ్చేశారు. తన పొదుపు మొత్తాలను కూడా ఆవుల సంక్షేమానికి వాడాం.

### మహిళలకు ఉపాధి...

ప్రతి యేటా ఆవుల సంఖ్య పెరుగుతూ ఇప్పుడు 200 వరకు చేరింది. 50 ఆవులను గుట్టల ప్రాంతాల వారికి ఉచితంగా ఇచ్చేశాను. మిగతా వాటి గోమయంతో పళ్లపొడి నుంచి వందరకాల ఉత్పత్తులను తయారు చేయిస్తున్నాను. ఇక్కడి గిరిజన ప్రాంత స్త్రీలు వీటి తయారీలో పాల్గొంటున్నారు. గోమయ ప్రమిదలు, పిడకలు, యజ్ఞసమిధలు.. ఇలా ఎన్నో వీటి నుంచి తయారు చేస్తున్నాం. చిన్నా పెద్ద టౌన్లలో గోమయం ఉత్పత్తుల తయారీలో వర్క్‌షాప్స్ నిర్వహిస్తున్నాం. ఈ ఉత్పత్తులతో ఎగ్జిబిషన్స్ ఏర్పాటు చేసి, నగర ప్రజలకు చేరువ చేస్తుంటాను. వీటి ద్వారా వచ్చే ఆదాయాన్ని గిరిజన మహిళలకు ఇస్తుంటాను. పట్టణాల్లో ఉన్నవాళ్లు ఎవరైనా వచ్చి ఆవులను చూసుకోవచ్చని 'స్వధర్మ' పేరుతో ఆన్‌లైన్‌లో ప్రాజెక్ట్ స్టార్ట్ చేశాను. వీడియోలు చూసి ముందు చాలా మంది ఉత్సాహం చూపారు. కానీ, చివరకు ముగ్గురు మాత్రమే వచ్చారు. వీడియోల్లో ఆవులను, ఇక్కడి వాతావరణం చూడటం వేరు. కానీ, నేరుగా ఈ పరిస్థితులను ఎదుర్కోవడం వేరు. 'మేమూ వస్తాం, కానీ బెడ్‌రూమ్ ఉందా, అటాచ్డ్ బాత్‌రూమ్ ఉందా' అని అడుగుతుంటారు. కానీ, మేమున్న చోట అలాంటి వసతులేవీ లేవు. దొరికినవి తింటూ, ఆవులతోనే జీవనం సాగిస్తూ ఉంటాం. ఆరు నెలలు గుట్ట ప్రాంతాల్లో, ఆరు నెలలు గోదావరి నదీ తీర ప్రాంతాల వెంబడి తిరుగుతుంటాను. ఈ జీవనంలో ఓ కొత్త వెలుగు, స్వచ్ఛత కనిపిస్తుంటుంది.

### నేర్చుకున్న వైద్యం..

మనుషుల మాదిరిగానే ఆవులు కూడా ఎంతో ప్రేమను చూపుతాయి. జబ్బు పడతాయి. వాటికి ఆరోగ్యం బాగోలేకపోతే 'నన్ను చూడు' అన్నట్టుగా దగ్గరగా వచ్చి నిలబడతాయి. కనిపించకపోతే బెంగ పెట్టుకుంటాయి. వాటికి జబ్బు చేస్తే సీనియర్ డాక్టర్స్‌ని పిలిపించి చికిత్స చేయిస్తుంటాను. నేనే వాటి జబ్బుకు తగ్గ చికిత్స చేయడం కూడా నేర్చుకున్నాను. ఆవులకు సంబంధించి మురళీధర గో విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేస్తున్నాను. దీని ద్వారా రేపటి తరం పిల్లలకు మూగజీవాల విలువ... ముఖ్యంగా ఆవు గొప్పతనాన్ని తెలియజేయాలనుకుంటున్నాను'' అని వివరించారు పద్మ.

– నిర్మలారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

### వరించిన అవార్డులు

పట్టణప్రాంతాల వారిని పల్లెకు తీసుకెళ్లి చేయిస్తున్న సేవకు 2012లో నేషనల్ సర్వీస్ స్కీమ్ అవార్డ్‌ను రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేతుల మీదుగా అందుకున్నాను. 2013లో చైనాలో జరిగే యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్‌కి ప్రభుత్వం టాప్ 100 మెంబర్స్‌ని పంపించారు. వారిలో నేనూ ఒకరిగా ఆ సోషల్ యాక్టివిటీస్‌లో



● అవార్డు అందుకుంటూ...

పాల్గొనడం మర్చిపోలేనిది. ఈ యేడాది ఇందిరాగాంధీ అవార్డు సెలక్షన్‌కి కమిటీ మెంబర్‌గా ఆహ్వానం అందుకున్నాను. నిస్వార్థంగా చేసే సేవ ఏ కొద్దిమందికైనా ఉపయోగపడినా చాలు. రైతులు ఎవరైనా ఆవు కావాలని వస్తే వారి వివరాలన్నీ తీసుకొని, ఉచితంగా అందజేస్తున్నాం.

---

అదర్ సైడ్

**లైట్స్, కెమెరా, యాక్షన్ అనేవి సుప్రసిద్ధ నటి దియా మీర్జాకు సుపరిచిత పదాలు.
అయితే ఆమెకు సంబంధించి ఈ పదాలు సినీ స్టూడియోలకే పరిమితం కాలేదు.
తన కంటి కెమెరాతో ప్రకృతిని చూస్తుంది. పర్యావరణ నష్టానికి సంబంధించిన విధ్వంస చిత్రాలపై నలుగురి దృష్టి పడేలా 'లైట్స్' ఫోకస్ చేస్తోంది. తన వంతు కార్యాచరణగా క్లైమేట్ యాక్షన్ అంటూ నినదిస్తోంది...**



– దియా మీర్జా

# లైట్స్... కెమెరా... క్లైమేట్ యాక్షన్

నటిగా సుపరిచితురాలైన దియా మీర్జా గ్లామర్ ఫీల్డ్ నుంచి పర్యావరణ స్పృహకు సంబంధించిన ప్రచారం వైపు అడుగులు వేసింది. 'క్లైమేట్ యాక్టివిస్ట్'గా ఎన్నో కార్యక్రమాలను నిర్వహిస్తోంది. యూఎన్ ఎన్విరాన్‌మెంట్ గుడ్‌విల్ అంబాసిడర్‌గా ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది పర్యావరణ ఉద్యమకారులతో కలిసి పనిచేస్తోంది.

పర్యావరణానికి సంబంధించిన చర్చలు జరిగే ఇంట్లో పెరిగిన దియాకు సహజంగానే పర్యావరణ విషయాలపై ఆసక్తి మొదలైంది. దీనికితోడు స్కూల్లో టీచర్ ద్వారా విన్న పర్యావరణ పాఠాలు కూడా ఆమె మనసుపై బలమైన ప్రభావాన్ని వేశాయి. ఇక కాలేజీ రోజుల్లో పర్యావరణ సంబంధిత చర్చాకార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేది.

'ప్రకృతిపై ప్రేమ అనే విలువైన బహుమతిని తల్లిదండ్రులు నాకు ఇచ్చారు' అంటున్న దియ చిన్నప్పుడు చెట్లు, కొండలు ఎక్కేది. పక్షుల గానాన్ని ఎంజాయ్ చేసేది. మర్రిచెట్టు ఊడలతో ఉయ్యాల ఊగేది. ఉడతలతో గంతులు వేసేది. ఇల్లు దాటి చెట్ల మధ్యకు వెళ్లినప్పుడల్లా తనకు మరో ప్రపంచంలోకి వెళ్లినట్లుగా ఉండేది.

బాలీవుడ్‌లోకి అడుగుపెట్టాక దియాకు పర్యావరణ సంబంధిత అంశాలపై ఎన్నో సామాజిక సంస్థలతో కలిసి పనిచేసే అవకాశం దొరికింది. ఆ సంస్థలతో కలిసి పనిచేయడం ద్వారా ఎన్నో విషయాలపై అవగాహన ఏర్పడింది. ఆ అవగాహనతోనే పర్యావరణ సంబంధిత కార్యక్రమాలలో పాల్గొనాలని నిర్ణయించుకుంది.

'ప్రజలకు మేలు చేసేదే పర్యావరణానికి మేలు చేస్తుంది' అనే నినాదంతో పర్యావరణ ఉద్యమాలలో భాగం అయింది.

'వాతావరణంలో మార్పు అనేది భవిష్యత్‌కు సంబంధించిన విషయం మాత్రమే కాదు వర్తమానాన్ని కలవరపెడుతున్న విషయం. ప్రకృతిమాత చేస్తున్న మేలును గుర్తుంచుకోలేకపోతున్నాం. పర్యావరణ సంరక్షణ అనేది కేవలం ప్రభుత్వం, స్వచ్ఛందసంస్థలు, శాస్త్రవేత్తలకే పరిమితమైనది కాదు. అన్ని వర్గాల ప్రజలు, అన్ని వయసుల వారు శాస్త్రీయ విషయాలపై అవగాహన పెంచుకోవాలి' అంటుంది దియ.

వాయు కాలుష్యానికి సంబంధించిన అధ్యయనం దియాను ఆందోళనకు గురి చేసింది. 'వాయు కాలుష్యం అనగానే ఢిల్లీ గురించే ఎక్కువగా మాట్లాడతాం. అయితే లక్నో నుంచి ముంబై వరకు ఎన్నో పట్టణాలలో వాయు కాలుష్య సమస్య తీవ్రంగా ఉంది' అంటున్న దియా తన ఎజెండాలో 'స్వచ్ఛమైన గాలి'కి అధిక ప్రాధాన్యత ఇచ్చింది.

ఇక ఆమెను కలవరపెట్టిన మరో సమస్య ప్లాస్టిక్. షూటింగ్ నిమిత్తం మహా పట్టణాల నుంచి మారుమూల పల్లెటూళ్లకు వెళ్లినప్పుడు ప్లాస్టిక్ కనిపించని చోటు అంటూ ఉండేది కాదు.

'ప్లాస్టిక్ వస్తువులకు ప్రత్యామ్నాయాలను అన్వేషిస్తున్నప్పుడు వాటికి సంబంధించిన కంపెనీలు మన దేశంలోనే ఉన్నాయనే విషయాన్ని తెలుసుకున్నాను. బ్యాంబు బ్రష్‌లు, ఇయర్ బడ్స్ వాడుతున్నాను. నా దగ్గర ఆకర్షణీయమైన బ్యాంబు పోర్టబుల్ స్పీకర్ ఉంది' అంటున్న దియా తాను వాడుతున్న ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ వస్తువులను స్నేహితులకు కూడా పరిచయం చేస్తుంది.

పర్యావరణ సంరక్షణకు సంబంధించిన ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు పర్యావరణ స్పృహతో కూడిన జీవనవిధానాన్ని ప్రచారం చేయడానికి ఎకో–ఫ్రెండ్లీ సంస్థల్లో పెట్టుబడులు పెడుతుంది దియా మీర్జా. తాను పెట్టుబడులు పెట్టిన అయిదు కంపెనీలు మన దేశానికి చెందినవి. మహిళల నాయకత్వంలో నడుస్తున్నవి.

'నేను కష్టపడి సంపాదించిన డబ్బు, పొదుపు మొత్తాలను పర్యావరణ హిత కంపెనీలలో పెట్టుబడి పెట్టడం గర్వంగా ఉంది' అంటుంది దియా.

దియా మీర్జాకు సొంత నిర్మాణ సంస్థ ఉంది. ఆ ప్రొడక్షన్ హౌజ్ ద్వారా ప్రజల్లో మార్పును తీసుకువచ్చే చిత్రాలను వినోదం మేళవించి తీయాలనుకుంటోంది.

### అవును... ఈరోజే మంచిరోజు



**అత్యుత్తమ రోజు అంటే ఈ రోజే... అనే సామెత ఉంది. మంచి పని చేయడానికి మరో రోజుతో పనిలేదు. మన భూమిని కాపాడుకోడానికి ప్రతిరోజూ విలువైన రోజే. పిల్లలను పార్క్‌లు, వనాల దగ్గరకు తీసుకువెళ్లడం ద్వారా వారికి ప్రకృతి పట్ల ఆసక్తి కలిగించవచ్చు. పచ్చటి గడ్డిలో పాదరక్షలు లేకుండా నడిపించడం, అప్పుడే మొదలైన వానలో కొంచెంసేపైనా గంతులేసేలా చేయడం...ఇలా చిన్న చిన్న పనుల ద్వారానే వారిని ప్రకృతి నేస్తాలుగా తీర్చిదిద్దవచ్చు. పిల్లలకు వినోదం అంటే సినిమాలు మాత్రమే కాదు. ప్రకృతితో సాన్నిహిత్యానికి మించి పిల్లలకు వినోదం ఏముంటుంది!**

– దియా మీర్జా, నటి,
క్లైమేట్ యాక్టివిస్ట్

---

బ్యూటిప్స్

# చేయమన్నారని చేసేయకండి

వారానికి మూడుసార్లు లేదా రోజూ తలస్నానం చేయండి, జుట్టుకు మంచిది అని చెబుతుంటారు. చెప్పారు కదాని చేసేయకండి. ఎందుకంటే మన జుట్టు తత్వాన్ని బట్టి తలస్నానం చేయాలి లేదంటే ఉన్న జుట్టు కూడా ఊడిపోవచ్చు సుమీ.

● పదేపదే జుట్టుని కడగడం వల్ల... జుట్టు పొడిగా మారిపోతుంది. అందువల్ల జుట్టు తత్వాన్ని బట్టి తలస్నానం చేయాలి.

● భరించలేనంత జిడ్డుకారుతుంటే రోజూ తలస్నానం చేయాలి.

● పని ప్రదేశంలో బాగా చెమటలు పడుతుంటే రోజూ తలస్నానం చేయాలి. అయితే షాంపుతో కాకుండా సాధారణ నీటితో తలను కడగాలి. ఇలా తగు జాగ్రత్తలు తీసుకుంటూ తలస్నానం చేస్తే కురులు ఆరోగ్యంగా అందంగా ఉంటాయి.



● మాడు నూనె కారుతుంటే తలస్నానం చేయడం మంచిది కాదు. తలలో సహజ సిద్ధంగా విడుదలయ్యే నూనెలు జుట్టుకు చాలా ముఖ్యం. జిడ్డుగా ఉందని పదేపదే తలస్నానం చేస్తే మాడు పొడి బారి చుండ్రు, ఇతర సమస్యలు చుట్టుముడతాయి.

---

# బొమ్మల భాష

## సైన్స్ చిత్రకారుడు మన్నాన్ ప్రస్థానం



**అక్షరం పుట్టక ముందే చిత్రం రూపుదిద్దుకుంది.
ప్రపంచంలో సైగల తర్వాత భాష బొమ్మలదే.
పది వాక్యాల విషయాన్ని ఒక బొమ్మ చెప్తుంది.
ఆ బొమ్మలతోనే శాస్త్రాన్ని బోధిస్తే ఎలా ఉంటుంది?
విజ్ఞాన శాస్త్రం వినోద శాస్త్రమవుతుంది.
ఆనందంగా మెదడుకు చేరుతుంది.
మరిచిపోలేని జ్ఞానంగా మిగులుతుంది.**

అధ్యయనానికి అక్షర రూపమిస్తే మహాగ్రంథమవుతుంది. అధ్యయనానికి చిత్రరూపమిస్తే అద్భుతమైన చిత్రకావ్యం అవుతుంది. అలాంటి వందల చిత్రకావ్యాలకు రూపమిచ్చారు అబ్దుల్ మన్నాన్. డెబ్బై ఏళ్ల మన్నాన్ ఐదు వేలకు పైగా బొమ్మలు వేశారు. ''నా వయసులో నుంచి మూడేళ్లు తగ్గిస్తే నాలోని చిత్రకారుడి వయసది. నా బొమ్మల్లో ఒక్కొక్క థీమ్‌తో కొన్ని వందల చిత్రాలున్నాయి. ఆ చిత్రాల్లో ఒక్కటి చేజారినా చిత్రకావ్యంలో అనుసంధానత లోపిస్తుంది. అందుకే నా బొమ్మలను ఎవరికీ ఇవ్వలేదు, డబ్బు కోసం అమ్మనూ లేదు'' అన్నారు అబ్దుల్ మన్నాన్.

### బొమ్మల చదువు!

మా సొంతూరు ఆంధ్రప్రదేశ్, మచిలీపట్నం, బంటుమిల్లి దగ్గర చిన పాండ్రాక. ఐదవ తరగతి వరకు అక్కడే చదువుకున్నాను. ఆ తర్వాత నా చదువు గుడివాడలో సాగింది. ఏఎన్నార్ కాలేజ్‌లో బీఎస్సీ చదివాను. బొమ్మల మీదున్న ఆసక్తి కొద్దీ చెన్నైకి వెళ్లి 'శంతనుస్ చిత్ర విద్యాలయం'లో ఆర్ట్ డిప్లమో చేశాను. చెన్నైలోనే బాలమిత్ర, బాలభారతి, బుజ్జాయి వంటి పిల్లల పత్రికల్లో ఇలస్ట్రేటర్‌గా ఐదారేళ్లపాటు ఉద్యోగం చేశాను. అక్కడి నుంచి నా అడుగులు సినీఫీల్డ్ వైపు పడ్డాయి. అసిస్టెంట్ ఆర్ట్ డైరెక్టర్‌గా సుమారు ఐదేళ్లు చేశాను. చెన్నైలో కవి సమ్మేళనాలు ఎక్కువగా జరిగేవి. మహాలక్ష్మి క్లబ్‌లో తెలుగు వాళ్ల కార్యక్రమాలు జరిగేవి. దాదాపుగా అన్నింటికీ హాజరయ్యేవాడిని. అలా శ్రీశ్రీ., దేవులపల్లి కృష్ణశాస్త్రి, ఆరుద్ర వంటి కవులతోపాటు సినీ పరిశ్రమలో ఎన్టీఆర్, ఏఎన్నార్, ఆర్ నారాయణమూర్తి వంటి చాలామందితో పరిచయాలయ్యాయి. దక్షిణాది భాషలు వచ్చాయి. ఇలా కొంత వైవిధ్యంగానే మొదలైంది నా కెరీర్.








### వైవిధ్యత ఆకట్టుకుంది!

సైన్స్ చిత్రాల చిత్రకారుడిగా మారడానికి బీజం పడింది మాత్రం ఇంటర్‌లోనే. డార్విన్ సిద్ధాంతం 'ఆరిజిన్ ఆఫ్ స్పీసీస్' చదవడం నా మెదడులో కొత్త ప్రపంచానికి ఆవిష్కారం జరిగింది. అలాగే మరో పుస్తకం 'ఫేమస్ ఫైవ్ హండ్రెడ్ ఆర్టిస్ట్స్ ఇన్ ద వరల్డ్'. ప్రపంచంలోని చిత్రకారులను చదివినప్పుడు పికాసో నుంచి డావిన్సీ వరకు ప్రపంచ ప్రఖ్యాత చిత్రకారులెవ్వరూ సైన్స్ ఇతివృత్తంగా బొమ్మలు వేయలేదని అవగతమైంది. దాంతో ఆ ఖాళీని పూరించాలనుకున్నాను. అలా నా చిత్రాలకు సైన్స్, నేచర్ ప్రధానమైన టాపిక్స్ అయ్యాయి. జీవ వైవిధ్యత నన్ను కట్టి పడేసే అంశం. దాంతో ప్రతి జీవి గురించి క్షుణ్ణంగా అధ్యయనం చేశాను. డార్విన్ సిద్ధాంతం చదివినప్పుడు కలిగిన సందేహాలకు సమాధానాల కోసం లెక్కలేనన్ని పుస్తకాలు చదివాను. ఉదాహరణకు క్యాట్ ఫ్యామిలీ గురించి మాట్లాడాల్సి వస్తే ఏ ఖండంలో ఎలాంటి జాతి క్యాట్‌లుంటాయో అనర్గళంగా చెప్పగలను. శిలాజాలను అధ్యయనం చేసి ఆ ప్రాణి ఊహాచిత్రాన్ని వేయడం, ఎండమిక్ స్పీసీస్ బొమ్మలేయడంలో అనంతమైన సంతృప్తి కలగడం మొదలైంది. ఇక ఆ అలవాటును కొనసాగించాను.









### సైన్స్ పాఠాల బోధన!

నా వృత్తి ప్రవృత్తి రెండూ సైన్స్‌లోనే వెతుక్కున్నాను. ఎనిమిదవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థులకు సైన్స్ పాఠాలు చెప్పేవాడిని. నా భార్య గవర్నమెంట్ టీచర్. నేను జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో ట్యుటోరియల్స్ నిర్వహించాను. స్కూళ్లలో డ్రాయింగ్ టీచర్‌గా పిల్లలకు బొమ్మలు వేయడం నేర్పించాను. నేను అందుకున్న అవార్డులకంటే నా విద్యార్థులు అందుకున్న అవార్డులే ఎక్కువ. నేను పీటీరెడ్డి అవార్డు, మూడు జాతీయ స్థాయి అవార్డులందుకున్నాను. నా బొమ్మలు ఆహ్లాదం కోసం చూసేవి కాదు. అవి అధ్యయన మాధ్యమాలు. శాతవాహన, కాకతీయ యూనివర్సిటీలు, వైజాగ్‌లో కాలేజీలు, కరీంనగర్ ఉమెన్స్ కాలేజ్, చాలాచోట్ల స్కూళ్లలోనూ ప్రదర్శనలు నిర్వహించాను'' అని తన చిత్రప్రస్థానాన్ని వివరించారు అబ్దుల్ మన్నాన్.

**– వాకా మంజులారెడ్డి,** సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటోలు : అనిల్ కుమార్ మోర్ల

### 'చిత్ర' ప్రమాదాలు

చిత్రకారుడు తన దేహానికి గాయమైనా పట్టించుకోడు. కానీ తన బొమ్మలకు ప్రమాదం వాటిల్లితే ప్రాణం పోయినట్లు విలవిలలాడుతాడు. అందుకు నా జీవితమే పెద్ద ఉదాహరణ. నా చిత్రకార జీవితంలో మూడు ప్రమాదాలను ఎదుర్కొన్నాను. గుడివాడలో ఇల్లు అగ్ని ప్రమాదానికి గురయ్యి చిన్నప్పటి నుంచి వేసిన బొమ్మలన్నీ కాలిపోయాయి. మరోసారి చెన్నైలో ఇంట్లో దొంగలు పడి నా పెయింటింగ్స్ పెట్టెను కూడా దోచుకుపోయారు. ఇక మూడవది హైదరాబాద్‌లో. ఈ ఏడాది వరదల్లో టోలిచౌకిలోని మా ఇంట్లో మూడు రోజులు నీళ్లు నిలిచిపోయాయి. అప్పుడు తడిసిపోయినవి పోగా మళ్లీ వేసిన బొమ్మలు ఐదు వందలు ఎగ్జిబిషన్‌కు సిద్ధంగా ఉన్నాయి. ఒక్కొక్క ప్రమాదం తర్వాత నాలోని చిత్రకారుడు మళ్లీ మళ్లీ పుట్టాడు.

– అబ్దుల్ మన్నాన్, సైన్స్ చిత్రకారుడు



## భారత చెస్ జట్ల శుభారంభం

ఆసియా క్రీడల చెస్ టీమ్ ఈవెంట్‌లో భారత పురుషుల, మహిళల జట్లు శుభారంభం చేశాయి. శుక్రవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో భారత పురుషుల జట్టు 3.5–0.5తో మంగోలియాపై... భారత మహిళల జట్టు 3.5–0.5తో ఫిలిప్పీన్స్‌పై గెలుపొందాయి. భారత పురుషుల జట్టుకు ఆడుతున్న తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్‌తోపాటు ప్రజ్ఞానంద, విదిత్ తమ గేముల్లో గెలుపొందగా... దొమ్మరాజు గుకేశ్ తన గేమ్‌ను 'డ్రా' చేసుకున్నాడు. భారత మహిళల జట్టుకు ఆడుతున్న ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారికతోపాటు వైశాలి, సవితాశ్రీ తమ గేముల్లో నెగ్గగా... వంతిక అగర్వాల్ తన గేమ్‌ను 'డ్రా' చేసుకుంది.

## భారత స్విమ్మర్లకు నిరాశ

ఆసియా క్రీడల నుంచి భారత స్విమ్మర్లు రిక్తహస్తాలతో వెనుదిరిగారు. శుక్రవారంతో స్విమ్మింగ్ ఈవెంట్స్ ముగియగా... భారత స్విమ్మర్లు కాంస్యం కూడా గెలవలేకపోయారు. శుక్రవారం పురుషుల 200 మీటర్ల బటర్‌ఫ్లయ్ ఈవెంట్ ఫైనల్లో సజన్ ప్రకాశ్ ఐదో స్థానంలో... 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ ఫైనల్లో అద్వైత్ ఏడో స్థానంలో నిలిచారు. మహిళల 800 మీటర్ల ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో హైదరాబాద్ స్విమ్మర్ వ్రితి అగర్వాల్ హీట్స్‌లో ఐదో స్థానంలో నిలిచింది.

# పతకాల మోత...

**పతకాల పట్టిక (టాప్-10)**

| దేశం | స్వ | ర | కాం | మొ |
|---|---|---|---|---|
| చైనా | 105 | 63 | 32 | 200 |
| జపాన్ | 27 | 35 | 37 | 99 |
| దక్షిణ కొరియా | 26 | 28 | 48 | 102 |
| భారత్ | 8 | 12 | 13 | 33 |
| థాయ్‌లాండ్ | 8 | 3 | 9 | 20 |
| ఉజ్బెకిస్తాన్ | 7 | 10 | 15 | 32 |
| హాంకాంగ్ | 5 | 13 | 18 | 36 |
| చైనీస్ తైపీ | 5 | 6 | 9 | 20 |
| ఇరాన్ | 3 | 10 | 10 | 23 |
| ఉత్తర కొరియా | 3 | 6 | 4 | 13 |

నోట్: స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం.

**ఒకే రోజు భారత్‌కు ఎనిమిది పతకాలు**
- షూటింగ్‌లో రెండు స్వర్ణాలు, మూడు రజతాలు
- టెన్నిస్ డబుల్స్‌లో రజతం
- అథ్లెటిక్స్, స్క్వాష్‌లో కాంస్యాలు

- మెరిసిన తెలంగాణ షూటర్ ఇషా సింగ్
- 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో రెండు రజతాలు

- పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ ఈవెంట్‌లో భారత జట్టు ప్రపంచ రికార్డు


ఇషా సింగ్, పలక్

చైనా గడ్డపై భారత క్రీడాకారుల పతకాల వేట అప్రతిహతంగా కొనసాగుతోంది. పోటీల ఆరో రోజు భారత్ ఏకంగా ఎనిమిది పతకాలతో అదరగొట్టింది. ఇందులో రెండు స్వర్ణాలు, నాలుగు రజతాలు, రెండు కాంస్య పతకాలు ఉన్నాయి. పురుషుల డబుల్స్ టెన్నిస్‌లో సాకేత్ మైనేని–రామ్‌కుమార్ జోడీ రజతం నెగ్గింది. మహిళల స్క్వాష్ టీమ్ ఈవెంట్‌లో భారత జట్టు సెమీస్‌లో ఓడి కాంస్యం సాధించింది. అథ్లెటిక్స్ మహిళల షాట్‌పుట్ ఈవెంట్‌లో కిరణ్ బలియాన్ కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. ఫలితంగా పతకాల పట్టికలో భారత్ నాలుగో స్థానానికి ఎగబాకింది. 1986 సియోల్ ఆసియా క్రీడల్లో ఐదో స్థానంలో నిలిచిన భారత్ ఆ తర్వాత మళ్లీ టాప్–5లోకి రావడం ఇదే తొలిసారి. తదుపరి అథ్లెటిక్స్, ఆర్చరీ, రెజ్లింగ్, హాకీ, బ్యాడ్మింటన్, వెయిట్‌లిఫ్టింగ్‌లోనూ మరిన్ని పతకాలు వచ్చే అవకాశముండటంతో భారత్ ఈసారి నాలుగో స్థానంతో ఆసియా క్రీడలను దిగ్విజయంగా ముగించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

హాంగ్జౌ: ఆసియా క్రీడల్లో మరోసారి భారత తుపాకీ గురి అదిరింది. శుక్రవారం భారత షూటర్లు రెండు స్వర్ణాలు, మూడు రజత పతకాలతో మెరిపించారు. ముందుగా పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ ఈవెంట్‌లో ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్, స్వప్నిల్ కుసాలె, అఖిల్ షెరాన్‌లతో కూడిన భారత జట్టు 1769 పాయింట్లు స్కోరు కొత్త ప్రపంచ రికార్డు సృష్టించింది. అంతేకాకుండా స్వర్ణ పతకాన్ని కూడా సొంతం చేసుకుంది. 2022లో 1761 పాయింట్లతో అమెరికా నెలకొల్పిన ప్రపంచ రికార్డును భారత జట్టు బద్దలు కొట్టింది. క్వాలిఫయింగ్‌లో స్వప్నిల్ (10 పాయింట్ల షాట్‌లు 33), ఐశ్వరీ ప్రతాప్ సింగ్ (10 పాయింట్ల షాట్‌లు 27) 591 పాయింట్ల చొప్పున స్కోరు చేసి వరుసగా తొలి రెండు స్థానాల్లో నిలిచి వ్యక్తిగత విభాగం ఫైనల్‌కు అర్హత పొందారు. అఖిల్ షెరాన్ 587 పాయింట్లు సాధించి ఐదో స్థానంలో నిలిచాడు. అయితే ఒక దేశం నుంచి గరిష్టంగా ఇద్దరు షూటర్లు మాత్రమే ఫైనల్లో ఆడాలి. దాంతో అఖిల్ ఫైనల్‌కు దూరమయ్యాడు. టాప్–8లో నిలిచిన షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో ఐశ్వరీ ప్రతాప్ సింగ్ 459.7 పాయింట్లు సాధించి రెండో స్థానంలో నిలిచి రజత పతకం గెల్చుకున్నాడు. స్వప్నిల్ 438.9 పాయింట్లతో నాలుగో స్థానంతో సరిపెట్టుకున్నాడు.

**పలక్ 'పసిడి'...**

మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ టీమ్, వ్యక్తిగత ఈవెంట్లలో భారత షూటర్లు అద్భుత ప్రతిభతో ఆకట్టుకున్నారు. పలక్, ఇషా సింగ్, దివ్యలతో కూడిన భారత జట్టు 1731 పాయింట్లు స్కోరు చేసి రజత పతకం దక్కించుకుంది. క్వాలిఫయింగ్‌లో తెలంగాణ షూటర్ ఇషా సింగ్ 579 పాయింట్లు సాధించి ఐదో స్థానంలో, పలక్ 577 పాయింట్లు సాధించి ఏడో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత పొందారు. ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో పలక్ 242.1 పాయింట్లు స్కోరు చేసి పసిడి పతకం సొంతం చేసుకోగా... ఇషా సింగ్ 239.7 పాయింట్లతో రజత పతకాన్ని గెల్చుకుంది. పాకిస్తాన్ షూటర్ తలత్ కిష్మలా 218.2 పాయింట్లతో కాంస్య పతకం సాధించింది. ఈ ఆసియా క్రీడల్లో ఇషా సింగ్ ఓవరాల్‌గా నాలుగు పతకాలు సాధించడం విశేషం.

## 72 ఏళ్ల తర్వాత...

- మహిళల షాట్‌పుట్‌లో భారత్‌కు తొలి పతకం
- కిరణ్ బలియాన్ ఘనత



సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. ఆసియా క్రీడల అథ్లెటిక్స్ మహిళల షాట్‌పుట్ ఈవెంట్‌లో భారత్‌కు 72 ఏళ్ల తర్వాత మళ్లీ పతకం లభించింది. శుక్రవారం జరిగిన షాట్‌పుట్ ఈవెంట్‌లో భారత్‌కు చెందిన 24 ఏళ్ల కిరణ్ బలియాన్ మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సొంతం చేసుకుంది. కిరణ్ ఇనుప గుండును 17.36 మీటర్ల దూరం విసిరింది. ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ ప్రాంతానికి చెందిన ట్రాఫిక్ పోలీస్ హెడ్ కానిస్టేబుల్ కూతురైన కిరణ్ తొమ్మిదేళ్ల క్రితం ఈ ఆటలో ప్రవేశించింది. 1951లో న్యూఢిల్లీ వేదికగా జరిగిన తొలి ఆసియా క్రీడల్లో మహిళల షాట్‌పుట్ క్రీడాంశంలో ఆంగ్లో ఇండియన్ బార్బరా వెబ్‌స్టర్ కాంస్య పతకం గెల్చుకుంది. ఆ తర్వాత ఈ క్రీడాంశంలో కిరణ్ బలియాన్ రూపంలో భారత్‌కు రెండో పతకం లభించడం విశేషం. లిజియావో గాంగ్ (చైనా; 19.58 మీటర్లు) స్వర్ణం... జియాయువాన్ సాంగ్ (చైనా; 18.92 మీటర్లు) రజతం సాధించారు. భారత్‌కే చెందిన మరో షాట్‌పుటర్ మన్‌ప్రీత్ కౌర్ (16.25 మీటర్లు) ఐదో స్థానంలో నిలిచింది. మహిళల హ్యామర్ త్రో ఈవెంట్‌లో భారత క్రీడాకారిణులు తాన్యా చౌధరీ (60.50 మీటర్లు) ఏడో స్థానంలో, రచనా కుమారి (58.13 మీటర్లు) తొమ్మిదో స్థానంలో నిలిచి నిరాశపరిచారు. మహిళల 20 కిలోమీటర్ల నడక రేసులో ప్రియాంక గోస్వామి (1గం:43ని:7 సెకన్లు)... పురుషుల 20 కిలోమీటర్ల నడక రేసులో వికాశ్ సింగ్ (1గం:27ని:33 సెకన్లు) ఐదో స్థానంలో నిలిచారు.


పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ ఈవెంట్‌లో కొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పి స్వర్ణ పతకాన్ని సాధించిన భారత షూటర్ల బృందం స్వప్నిల్ కుసాలె, ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్, అఖిల్ షెరాన్

## సాకేత్-రామ్ జోడీకి రజతం




పురుషుల టెన్నిస్ డబుల్స్ విభాగంలో సాకేత్ మైనేని–రామ్‌కుమార్ రామనాథన్ జంట భారత్‌కు రజత పతకం అందించింది. ఫైనల్లో సాకేత్–రామ్‌కుమార్ ద్వయం 4–6, 4–6తో జేసన్ జంగ్–యు సియో సు (చైనీస్ తైపీ) జంట చేతిలో ఓటమి చవిచూసింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సాకేత్‌కిది ఆసియా క్రీడల్లో మూడో పతకం. 2014 ఇంచియోన్ ఆసియా క్రీడల్లో సాకేత్ పురుషుల డబుల్స్‌లో సనమ్ సింగ్‌తో కలిసి రజతం... మిక్స్‌డ్ డబుల్స్‌లో సానియా మీర్జాతో కలిసి స్వర్ణ పతకం సాధించాడు. మరోవైపు మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్ బోపన్న–రుతుజా భోస్లే (భారత్) జోడీ ఫైనల్లోకి దూసుకెళ్లింది. సెమీఫైనల్లో బోపన్న–రుతుజా ద్వయం 6–1, 3–6, 10–4తో 'సూపర్ టైబ్రేక్'లో చాన్ హావో చింగ్–యు సియో సు (చైనీస్ తైపీ) జోడీపై గెలిచింది. నేడు జరిగే ఫైనల్లో లియాంగ్ ఎన్ షువో–హువాంగ్ సుంగ్ హావో (చైనీస్ తైపీ)లతో బోపన్న–రుతుజా తలపడతారు.

## 37 ఏళ్ల తర్వాత మళ్లీ పతకం

**సెమీస్‌లో భారత పురుషుల బ్యాడ్మింటన్ జట్టు**



అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న భారత పురుషుల బ్యాడ్మింటన్ జట్టు ఆసియా క్రీడల్లో 37 ఏళ్ల తర్వాత మళ్లీ సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. తద్వారా కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేసుకుంది. అత్యంత సులువైన 'డ్రా' పొందిన భారత పురుషుల జట్టు క్వార్టర్ ఫైనల్లో నేపాల్ జట్టుపై 3–0తో గెలిచింది. తొలి సింగిల్స్‌లో లక్ష్య సేన్ 21–5, 21–8తో ప్రిన్స్ దహల్‌పై... రెండో సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్ 21–4, 21–3తో సునీల్ జోషిపై... మూడో సింగిల్స్‌లో మిథున్ మంజునాథ్ 21–2, 21–17తో బిష్ణు కతువాల్‌పై నెగ్గారు. నేడు జరిగే సెమీఫైనల్లో దక్షిణ కొరియాతో భారత్ ఆడుతుంది. భారత పురుషుల జట్టు ఇప్పటి వరకు ఆసియా క్రీడల్లో మూడుసార్లు సెమీఫైనల్లో ఓడిపోయి (టెహ్రాన్; 1974లో, న్యూఢిల్లీ; 1982లో, సియోల్; 1986లో) కాంస్య పతకాలు సాధించింది. మరోవైపు భారత మహిళల జట్టు కథ ముగిసింది. క్వార్టర్ ఫైనల్లో భారత్ 0–3తో థాయ్‌లాండ్ చేతిలో ఓడిపోయింది. తొలి మ్యాచ్‌లో పీవీ సింధు 21–14, 15–21, 14–21తో చోచువోంగ్ చేతిలో... రెండో మ్యాచ్‌లో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ 19–21, 5–21తో జాంగ్‌కోల్ఫాన్–రవింద ప్రజోంగ్‌జయ్ చేతిలో... మూడో మ్యాచ్‌లో అష్మిత చాలిహా 9–21, 16–21తో బుసానన్ చేతిలో పరాజయం పాలయ్యారు.

## నిఖత్ 'డబుల్' ధమాకా

**పతకంతోపాటు పారిస్ ఒలింపిక్స్ బెర్త్ ఖరారు**



తన పంచ్ పవర్ ఎలా ఉంటుందో భారత మహిళా స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్ మరోసారి చాటుకుంది. ఆసియా క్రీడల్లో తొలిసారి పాల్గొంటున్న ఈ తెలంగాణ బాక్సర్ 50 కేజీల విభాగంలో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేసుకోవడంతోపాటు వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్ క్రీడలకు అర్హత సాధించింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో నిఖత్ కేవలం 53 సెకన్లలో రిఫరీ స్టాప్స్ కంటెస్ట్ (ఆర్‌ఎస్‌సీ) పద్ధతిలో విజయాన్ని అందుకుంది. హనన్ నాసర్ (జోర్డాన్)తో జరిగిన ఈ బౌట్‌లో నిఖత్ సంధించిన పంచ్‌లకు ఆమె ప్రత్యర్థి బెంబేలెత్తిపోయింది. దాంతో మూడు నిమిషాల నిడివి గల తొలి రౌండ్‌లో 53 సెకన్లు ముగియగానే రిఫరీ బౌట్‌ను నిలిపివేసి నిఖత్‌ను విజేతగా ప్రకటించారు. గత ఏడాది బర్మింగ్‌హమ్ కామన్వెల్త్ గేమ్స్‌లో.. 2022, 2023 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకాలు గెలిచిన నిఖత్ ఆసియా క్రీడల పతకాన్ని కూడా ఖాయం చేసుకుంది. 'క్వార్టర్ ఫైనల్లో గెలవడంతోపాటు తొలిసారి ఒలింపిక్స్ క్రీడలకు అర్హత సాధించినందుకు చాలా ఆనందంగా ఉంది. నా తదుపరి లక్ష్యం పారిస్ ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించడమే' అని 27 ఏళ్ల నిఖత్ వ్యాఖ్యానించింది. ఆదివారం జరిగే సెమీఫైనల్లో చుథామట్ రక్సత్ (థాయ్‌లాండ్)తో నిఖత్ తలపడుతుంది. మరోవైపు 57 కేజీల విభాగంలో పర్వీన్ క్వార్టర్ ఫైనల్ చేరగా... పురుషుల 80 కేజీల విభాగంలో లక్ష్య చహర్ ఓడిపోయాడు. పర్వీన్ 5–0తో జిచున్ జు (చైనా)పై నెగ్గగా... లక్ష్య చహర్ 1–4తో ఒముర్‌బెక్ (కిర్గిస్తాన్) చేతిలో ఓటమి పాలయ్యాడు.

## స్క్వాష్‌లో మహిళల జట్టుకు కాంస్యం
## పసిడి పోరుకు పురుషుల జట్టు



ఆసియా క్రీడల స్క్వాష్ క్రీడాంశంలో భారత జట్లకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. జోష్నా చినప్ప, తన్వీ ఖన్నా, అనాహత్ సింగ్, దీపిక పల్లికల్‌లతో కూడిన భారత మహిళల జట్టు సెమీఫైనల్లో 1–2తో డిఫెండింగ్ చాంపియన్ హాంకాంగ్ జట్టు చేతిలో ఓడిపోయి కాంస్య పతకాన్ని దక్కించుకుంది. తొలి మ్యాచ్‌లో తన్వీ ఖన్నా 6–11, 7–11, 3–11తో చాన్ సిన్ యుక్ చేతిలో ఓడిపోగా... రెండో మ్యాచ్‌లో జోష్నా చినప్ప 7–11, 11–7, 9–11, 11–6, 11–8తో హో జె లోక్‌పై గెలిచి స్కోరును 1–1తో సమం చేసింది. నిర్ణాయక మూడో మ్యాచ్‌లో అనాహత్ సింగ్ 8–11, 7–11, 10–12తో లీ కా యి చేతిలో ఓడిపోయింది. 2010 ఆసియా క్రీడల్లో కాంస్యం నెగ్గిన భారత జట్టు 2014, 2018 క్రీడల్లో రజతం సాధించింది. మరోవైపు భారత పురుషుల జట్టు 2–0తో డిఫెండిగ్ చాంపియన్ మలేసియాను ఓడించి పసిడి పతక పోరుకు అర్హత సాధించింది. తొలి మ్యాచ్‌లో అభయ్ సింగ్ 11–3, 12–10, 9–11, 11–6తో అదీన్ ఇద్రాకీపై... రెండో మ్యాచ్‌లో సౌరవ్ ఘోషాల్ 11–8, 11–6, 10–12, 11–3తో ఎన్జీ ఎయిన్‌పై గెలిచారు. నేడు జరిగే ఫైనల్లో పాకిస్తాన్‌తో భారత్ ఆడుతుంది.

## భారత మహిళల హాకీ జట్టుకు రెండో గెలుపు

ఆసియా క్రీడల మహిళల హాకీలో భారత జట్టు వరుసగా రెండో విజయం నమోదు చేసింది. తొలి మ్యాచ్‌లో సింగపూర్‌పై 13–0తో నెగ్గిన టీమిండియా... శుక్రవారం జరిగిన రెండో లీగ్ మ్యాచ్‌లో 6–0తో మలేసియా జట్టును ఓడించింది. భారత్ తరఫున మోనిక (7వ ని.లో), వైస్ కెప్టెన్ దీప్ గ్రేస్ ఎక్కా (8వ ని.లో), నవ్‌నీత్ కౌర్ (11వ ని.లో), వైష్ణవి విఠల్ ఫాల్కే (15వ ని.లో), సంగీత కుమారి (24వ ని.లో), లాల్‌రెమ్‌సియామి (50వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. ఆదివారం జరిగే తమ తదుపరి మ్యాచ్‌లో దక్షిణ కొరియాతో భారత్ ఆడుతుంది.



# అన్ని అస్త్రాలతో సిద్ధం

- నేడు భారత్ తొలి వామప్ పోరు
- ఇంగ్లండ్‌తో ఆడనున్న టీమిండియా
- మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్–1లో ప్రత్యక్ష ప్రసారం

**వన్డే ప్రపంచకప్ మరో 5 రోజుల్లో**



గువహటి: ఆసియా కప్‌లో విజేత, ఆపై ఆస్ట్రేలియా లాంటి పటిష్టమైన జట్టుపై సిరీస్ విజయం... సరిగ్గా చెప్పాలంటే వన్డే వరల్డ్ కప్‌కు ముందు భారత జట్టుకు సరైన సన్నాహకం లభించింది. కొత్తగా టీమిండియా ప్రాక్టీస్ మ్యాచ్‌లో పరీక్షించుకునేందుకు ఏమీ లేదు. వరల్డ్ కప్ జట్టులోని ఆటగాళ్లంతా సత్తా చాటి తమ స్థానాలను ఖాయం చేసుకోగా, చివరి నిమిషంలో జట్టుతో చేరిన అశ్విన్ కూడా ఆసీస్‌తో తొలి రెండు వన్డేల్లో తన విలువేంటో చూపించాడు. అయితే ప్రపంచకప్‌కు ముందు మరో అగ్రశ్రేణి జట్టుతో పోరు అంటే ఉదాసీనతకు తావు లేకుండా మరోసారి తమ అస్త్రాలను చక్కదిద్దుకునేందుకు ఉపకరిస్తుంది. ఈ నేపథ్యంలో నేడు తమ తొలి వామప్ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌తో భారత్ తలపడనుంది. తమ రెండో వామప్ మ్యాచ్‌లో చిన్న జట్టయిన నెదర్లాండ్స్ ప్రత్యర్థి కావడంతో ఈ తొలి పోరు టీమిండియాకు సరైన సాధన కానుంది. రాజ్‌కోట్ నుంచి నేరుగా గువహటి చేరిన భారత జట్టుకు శుక్రవారం ఆప్షనల్ ప్రాక్టీస్‌కు అవకాశం ఇచ్చారు. అయితే నలుగురు భారత ఆటగాళ్లు గిల్, ఇషాన్ కిషన్, శార్దుల్ ఠాకూర్, అశ్విన్ దీనికి హాజరయ్యారు.

అశ్విన్ తన ఆటకు మరింత పదును పెట్టుకుంటూ సుదీర్ఘ సమయం పాటు ప్రాక్టీస్ చేశాడు. వామప్ మ్యాచే అయినా ఇంగ్లండ్‌లాంటి భారీ హిట్టర్లు ఉన్న టీమ్‌పై అతను ఎలా ప్రభావం చూపిస్తాడనేది ఆసక్తికరం. తుది జట్టులో ఎనిమిదో స్థానం కోసం పిచ్ పరిస్థితులను బట్టి అశ్విన్, శార్దుల్ మధ్యే పోటీ ఉంది. ఈ నేపథ్యంలో శార్దుల్ కూడా తన బౌలింగ్‌లో సత్తా చాటాల్సి ఉంది. ఆసీస్‌తో చివరి మ్యాచే ఆడిన రోహిత్, కోహ్లి... ఆ మ్యాచ్‌కు దూరమైన గిల్, పాండ్యా మరింత ప్రాక్టీస్ కోసం కచ్చితంగా ఈ మ్యాచ్ బరిలోకి దిగవచ్చు. నిబంధనల ప్రకారం 11 మంది బ్యాటింగ్, 11 మంది బౌలింగ్ చేయవచ్చు కాబట్టి అందరినీ పరీక్షించుకునేందుకు కూడా ఇది తగిన అవకాశం. మరోవైపు 38 గంటల పాటు ప్రయాణించిన తర్వాత గురువారం రాత్రి గువహటి చేరిన ఇంగ్లండ్ జట్టు సభ్యులు తీవ్ర అలసటతో ఉన్నారు. వారు కోలుకొని మ్యాచ్‌లో సత్తా చాటగలరా లేక ప్రధాన ఆటగాళ్లంతా మైదానంలోకి దిగకుండా తప్పుకుంటారా చూడాలి. జేసన్ రాయ్‌లాంటి హిట్టర్ స్థానంలో చివరి నిమిషంలో చోటు దక్కించుకున్న హ్యారీ బ్రూక్‌కు వరల్డ్ కప్ పెద్ద పరీక్ష. వామప్‌లో అతను భారత స్పిన్నర్లను ఎలా ఎదుర్కోగలడనేది ఆసక్తికరం. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ తరఫున ఒక్క సెంచరీ చేసిన మ్యాచ్ మినహా మిగతా అన్నింటిలో అతను విఫలమయ్యాడు. పదో నంబర్ వరకూ బ్యాటింగ్ చేయగల ఆటగాళ్లు ఉండటం ఆ జట్టు బలం. ఇటీవల సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌ను ఇంగ్లండ్ 2–1తో గెలుచుకుంది.

# పరుగుల జోరులో కివీస్‌దే పైచేయి

- తొలి వామప్ మ్యాచ్‌లో విజయం
- ఐదు వికెట్లతో ఓడిన పాకిస్తాన్
- రిజ్వాన్ సెంచరీ వృథా




సాక్షి, హైదరాబాద్: ఊహించినట్లుగానే ఉప్పల్ స్టేడియం భారీ స్కోర్లకు వేదికైంది. బ్యాటింగ్‌కు బాగా అనుకూలంగా ఉన్న పిచ్‌పై పాకిస్తాన్, న్యూజిలాండ్ జట్లు పరుగుల వరద పారించాయి. అయితే చివరకు ఛేదనలో సత్తా చాటిన కివీస్‌దే పైచేయి అయింది. శుక్రవారం రాజీవ్‌గాంధీ స్టేడియంలో జరిగిన తొలి వామప్ మ్యాచ్‌లో న్యూజిలాండ్ ఐదు వికెట్ల తేడాతో పాకిస్తాన్‌ను ఓడించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 345 పరుగులు చేసింది. మొహమ్మద్ రిజ్వాన్ (94 బంతుల్లో 103 రిటైర్డ్‌హర్ట్; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీ సాధించగా... కెప్టెన్ బాబర్ ఆజమ్ (84 బంతుల్లో 80; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు), సౌద్ షకీల్ (53 బంతుల్లో 75; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధసెంచరీలు చేశారు. చివర్లో ఆగా సల్మాన్ (23 బంతుల్లో 33 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) కూడా ధాటిగా ఆడాడు. అనంతరం న్యూజిలాండ్ 43.4 ఓవర్లలో 5 వికెట్లకు 346 పరుగులు సాధించి గెలిచింది. రచిన్ రవీంద్ర (72 బంతుల్లో 97; 16 ఫోర్లు, 1 సిక్స్), మార్క్ చాప్‌మన్ (41 బంతుల్లో 65 నాటౌట్; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు), డరైల్ మిచెల్ (57 బంతుల్లో 59 రిటైర్డ్ నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), కేన్ విలియమ్సన్ (50 బంతుల్లో 54 రిటైర్డ్ నాటౌట్; 8 ఫోర్లు) విజయంలో కీలక పాత్ర పోషించారు. భద్రతా కారణాలతో పోలీసు యంత్రాంగం సూచనల కారణంగా ఈ మ్యాచ్‌కు ప్రేక్షకులను అనుమతించలేదు. ఖాళీ మైదానంలో ఇరు జట్ల బ్యాటర్లు భారీ షాట్లు బాదారు. ఈ స్టేడియంలో అక్టోబర్ 3న పాకిస్తాన్, ఆస్ట్రేలియా మధ్య మరో వామప్ మ్యాచ్ జరుగుతుంది.




**తొలి మ్యాచ్‌కు విలియమ్సన్ దూరం**

పాక్‌తో వామప్ మ్యాచ్‌లో సత్తా చాటినా... అసలు పోరు సమయానికి విలియమ్సన్ పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండే అవకాశం కనిపించడం లేదు. అందుకే అక్టోబర్ 5న ఇంగ్లండ్‌తో జరిగే వరల్డ్ కప్ ఆరంభ మ్యాచ్‌కు అతను దూరమయ్యాడు.

**శ్రీలంకకు బంగ్లాదేశ్ షాక్**

గువహటి: మరో వామప్ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ ఏడు వికెట్లతో శ్రీలంకను ఓడించింది. శ్రీలంక 49.1 ఓవర్లలో 263 పరుగులకు ఆలౌటైంది. నిసాంక (68), ధనంజయ (55) అర్ధ సెంచరీలు చేయగా... మెహదీ హసన్ 3 వికెట్లు పడగొట్టాడు. అనంతరం బంగ్లాదేశ్ 42 ఓవర్లలో 3 వికెట్లకు 264 పరుగులు సాధించి నెగ్గింది. తన్‌జీద్ (84), మిరాజ్ (67 నాటౌట్), లిటన్ దాస్ (61) కలిసి జట్టును గెలిపించారు. మరోవైపు తిరువనంతపురంలో దక్షిణాఫ్రికా, అఫ్గానిస్తాన్ మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది.

## స్టాక్ మార్కెట్లు

| దేశీ సూచీలు | | |
|---|---|---|
| సెన్సెక్స్ ▲ | 320 | 65,828 |
| నిఫ్టీ ▲ | 115 | 19,638 |

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

| విదేశీ సూచీలు (శుక్ర రెండు రాత్రి 11.30 గంటలకు) | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 13,218 | ▲ | 17 |
| డోజోన్స్ | 33,536 | ▼ | 130 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,608 | ▲ | 6 |
| డాక్స్ | 15,387 | ▲ | 63 |
| షాంఘై (గురువారం ముగింపు) | 3,110 | ▲ | 3 |
| నికాయ్ | 31,858 | ▼ | 15 |

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

| బులియన్ రూ.లలో – ముంబై | | | |
|---|---|---|---|
| బంగారం (24 క్యారెట్) | 57,719 | ▼ | 279 |
| బంగారం (22 క్యారెట్) | 57,488 | ▼ | 278 |
| వెండి (కేజీ) | 71,603 | ▲ | 1,171 |

| ఫారెక్స్ రేట్లు రూ.లలో | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఒకటి | 82.53 | 84.39 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఒకటి | 100.34 | 103.16 |
| € | యూరో | ఒకటి | 86.56 | 89.45 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఒకటి | 55.67 | 57.98 |
| AUS | ఆస్ట్రేలియా డాలర్ | ఒకటి | 52.01 | 55.29 |
| S$ | సింగపూర్ డాలర్ | ఒకటి | 60.76 | 63.69 |
| SAR | సౌదీ రియాల్ | ఒకటి | 21.19 | 22.81 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | ఒకటి | 21.71 | 23.51 |
| ¥ | చైనా యువాన్ | ఒకటి | 10.25 | 12.33 |

# ఆరు కంపెనీలుగా వేదాంతా

**బిలియనీర్ అనిల్ అగర్వాల్ గ్రూప్.. వేదాంతా రిసోర్సెస్.. సరికొత్త ప్రణాళికలకు తెరతీసింది. వీటి ప్రకారం డైవర్సిఫైడ్ దిగ్గజం వేదాంతా లిమిటెడ్ ఆరు లిస్టెడ్ కంపెనీలుగా విడిపోనుంది. ఇక మైనింగ్ దిగ్గజం హిందుస్తాన్ జింక్ విభిన్న విభాగాల కార్పొరేట్ నిర్మాణాన్ని పూర్తిస్థాయిలో సమీక్షించనుంది. తద్వారా ఓవైపు రుణ భారాన్ని తగ్గించుకోవడం, మరోపక్క వాటాదారులకు అధిక విలువను రాబట్టడం లక్ష్యాలుగా పెట్టుకుంది. వివరాలు చూద్దాం..**

### కీలక వ్యాపారాల విడదీత, లిస్టింగ్



**న్యూఢిల్లీ:** డైవర్సిఫైడ్ దిగ్గజం వేదాంతా లిమిటెడ్ కీలక బిజినెస్‌లను ప్రత్యేక కంపెనీలుగా విడదీయనుంది. అల్యూమినియం, ఆయిల్– గ్యాస్, స్టీల్, ఫెర్రస్ మెటల్స్, బేస్ మెటల్స్ పేరుతో ఐదు విభాగాలను విడదీసేందుకు ప్రణాళికలు వేసింది. వీటిని విడిగా లిస్ట్ చేయడం ద్వారా వాటాదారులకు మరింత విలువ చేకూర్చనున్నట్లు వేదాంతా తాజాగా వెల్లడించింది. దీనిలో భాగంగా సరళతర విభజనకు తెరతీయనుంది. వెరసి వేదాంతా వాటాదారులకు తమవద్దగల ప్రతీ 1 షేరుకీ విడదీయనున్న 5 కంపెనీలకు చెందిన ఒక్కో షేరు చొప్పున కేటాయించనున్నారు. ఆపై వీటిని స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్ చేయనున్నట్లు వేదాంతా తెలియజేసింది. వెరసి వేదాంతాసహా.. ఆరు లిస్టెడ్ కంపెనీలకు తెరలేవనుంది. ఇక మరోవైపు హిందుస్తాన్ జింక్‌సహా.. కొత్తగా ఏర్పాటు చేసిన స్టెయిన్‌లెస్ స్టీల్, సెమీకండక్టర్ డిస్‌ప్లే బిజినెస్‌లలో 65 శాతం చొప్పున వాటాను కలిగి ఉండనుంది. ఈ మొత్తం ప్రణాళికల అమలును 12–15 నెలలలోగా పూర్తిచేయాలని వేదాంతా భావిస్తోంది. గ్రూప్‌నకు మాతృ సంస్థ వేదాంతా రిసోర్సెస్.. హోల్డింగ్ కంపెనీగా కొనసాగనుంది.

**హింద్ జింక్ కార్పొరేట్ సమీక్ష**

వేదాంతా గ్రూప్ కంపెనీ హిందుస్తాన్ జింక్ పూర్తిస్థాయిలో కార్పొరేట్ నిర్మాణాన్ని సమీక్షించనుంది. కంపెనీ విలువలో మరింత వృద్ధికి వీలుండటంతో కార్పొరేట్ నిర్మాణ సమీక్షకు బోర్డు నిర్ణయించినట్లు మైనింగ్ దిగ్గజం హిందుస్తాన్ జింక్ వెల్లడించింది. ప్రధానంగా జింక్, లెడ్, సిల్వర్, రీసైక్లింగ్ బిజినెస్‌లను ప్రత్యేక చట్టబద్ధ సంస్థలుగా ఏర్పాటు చేసే లక్ష్యంతో ఉన్నట్లు తెలియజేసింది. కంపెనీకిగల భిన్న విభాగాల పరిమాణం, కార్యకలాపాలు, వృద్ధి అవకాశాలను పరిగణనలోకి తీసుకుని తాజా ప్రతిపాదనలకు తెరతీసినట్లు వివరించింది. వీటిలో బిజినెస్ అవసరాలరీత్యా మూలధన నిర్మాణం, పెట్టుబడి కేటాయింపుల విధానాలు, కీలక అంశాలపై ప్రత్యేక దృష్టి తదితర అంశాలున్నట్లు తెలియజేసింది. తద్వారా విభిన్న బిజినెస్‌లు తమ మార్కెట్ పొజిషన్‌ను వినియోగించుకుని దీర్ఘకాలిక వృద్ధి సాధించేందుకు వీలు కల్పించనున్నట్లు తెలియజేసింది. వెరసి అన్ని రకాల వాటాదారులకు విలువ చేకూర్చే వ్యూహంతో ఉన్నట్లు పేర్కొంది.

**నిధుల సమీకరణ..**

ప్రతీ ప్రత్యేక విభాగాన్నీ ఒక్కొక్క కంపెనీగా విడదీయడం ద్వారా వేదాంతా గ్రూప్ కార్పొరేట్ నిర్మాణాన్ని సరళతరంగా మార్చివేయనుంది. ఆయా రంగాలపై పూర్తిస్థాయిలో దృష్టిసారించే బాటలో స్వతంత్ర సంస్థలుగా ఏర్పాటు చేయనుంది. దీంతో సావరిన్ వెల్త్‌ఫండ్స్ తదితర గ్లోబల్ ఇన్వెస్టర్లతోపాటు.. సంస్థాగత, రిటైల్ ఇన్వెస్టర్లకు పెట్టుబడి అవకాశాలను కల్పించే యోచనలో ఉంది. వెరసి దేశ ఆర్థిక వృద్ధిని అవకాశాలుగా మలచుకునే ప్యూర్‌ప్లే కంపెనీలలో పెట్టుబడులకు వ్యూహాత్మక ఇన్వెస్టర్లను ఆకట్టుకోనుంది. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తున్న భారత్‌లో కమోడిటీలకు భారీ డిమాండ్ కనిపించనున్నట్లు వేదాంతా భావిస్తోంది. ఇటీవలే సెమీకండక్టర్లు, డిస్‌ప్లే తయారీలోకి సైతం ప్రవేశించింది.

**బిజినెస్‌ల విడదీత వార్తలతో ఎన్‌ఎస్‌ఈలో వేదాంతా షేరు 7 శాతం దూసుకెళ్లి రూ. 223 వద్ద నిలవగా.. హిందుస్తాన్ జింక్ 3.5 శాతం జంప్‌చేసి రూ. 308 వద్ద ముగిసింది.**

# ఐదేళ్ల రికరింగ్ డిపాజిట్ రేటు పెంపు

- 6.5% నుంచి 6.7 శాతానికి అప్
- మిగిలిన చిన్న పొదుపు స్కీమ్‌ల రేట్లు యథాతథం



**న్యూఢిల్లీ:** ఐదేళ్ల రికరింగ్ డిపాజిట్ పథకంపై వడ్డీ రేటును కేంద్రం శుక్రవారం 6.5 శాతం నుంచి 6.7 శాతానికి పెంచింది. అన్ని ఇతర చిన్న పొదుపు పథకాల రేట్లను యథాతథంగా ఉంచింది. డిసెంబర్ త్రైమాసికానికి సంబంధించి తాజా రేట్ల విధానంపై ఆర్థికశాఖ ఒక సర్క్యులర్ జారీ చేసింది. డిసెంబర్ త్రైమాసికానికి యథాతథంగా కొనసాగుతున్న మిగిలిన పొదుపు పథకాల రేట్లు ఇలా...

| స్కీమ్ | వడ్డీ(%ల్లో) |
|---|---|
| సేవింగ్ డిపాజిట్ | 4 |
| ఏడాది టర్మ్ డిపాజిట్ | 6.9 |
| రెండు, మూడేళ్ల టర్మ్ డిపాజిట్ | 7.0 |
| ఐదేళ్ల టర్మ్ డిపాజిట్ | 7.5 |
| సీనియర్ సిటిజన్ సేవింగ్స్ | 8.2 |
| మంత్లీ ఇన్‌కమ్ అకౌంట్ | 7.4 |
| నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ | 7.7 |
| పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ | 7.1 |
| కిసాన్ వికాస్ పత్ర | 7.5 |
| సుకన్య సమృద్ధి యోజన | 8.0 |

# ఇంధన, మెటల్ షేర్లు మెరిశాయ్

- కలిసొచ్చిన ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల రికవరీ
- 19,600 ఎగువకు నిఫ్టీ
- సెన్సెక్స్ లాభం 320 పాయింట్లు
- సూచీలకు 3 వారాల్లో అతిపెద్ద లాభం



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్ సెప్టెంబర్ నెలకు లాభాలతో వీడ్కోలు పలికాయి. ఇటీవల పతనంలో భాగంగా కనిష్ట స్థాయిలకు దిగివచ్చిన ఇంధన, మెటల్, బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగాల షేర్లలో వాల్యూ బైయింగ్ సూచీలను లాభాల బాట పట్టించింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల రికవరీ కలిసొచ్చింది. ఉదయం సానుకూలంగా మొదలైన సూచీలు ట్రేడింగ్‌లో అధిక భాగం లాభాల్లో ట్రేడయ్యాయి. అయితే శని, ఆది, సోమవారాలు ఎక్స్ఛేంజీలకు సెలవు కావడంతో ఇన్వెస్టర్ల ఆఖర్లో అప్రమత్తత వహిస్తూ కొంత లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. ఫలితంగా సెన్సెక్స్ 320 పాయింట్లు పెరిగి 65,828 వద్ద స్థిరపడింది. ఒక దశలో 643 పాయింట్లు లాభపడి 66,152 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. నిఫ్టీ 115 పాయింట్లు బలపడి 19,638 వద్ద నిలిచింది. ఒక్క ఐటీ మినహా అన్ని రంగాల షేర్లు కొనుగోళ్ల మద్దతు లభించడంతో బీఎస్ఈ మిడ్ క్యాప్, స్మాల్ సూచీలు వరుసగా 1.31%, 0.57 శాతం చొప్పున రాణించాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,686 కోట్ల షేర్లను అమ్మారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2,751 కోట్ల షేర్లను కొన్నారు. ఈ వారం మొత్తంగా సెన్సెక్స్ 181 పాయింట్లు, నిఫ్టీ 36 పాయింట్లు నష్టపోయాయి. యూరోజోన్, అమెరికా సెప్టెంబర్ ద్రవ్యోల్బణ అంచనాలకు తగ్గట్లే దిగిరావడంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు రికవరీ బాటపట్టాయి.

**మార్కెట్లో మరిన్ని సంగతులు**

- ఇంధన రంగ షేర్లైన రిలయన్స్ (0.50%), ఓఎన్‌జీసీ (2%), ఎన్‌టీపీసీ (3.50%), ఐఓసీఎల్ (1.28%), గెయిల్ (2.50%), బీపీసీఎల్ (1%), ఎస్‌హెచ్‌పీసీ (2%), హెచ్‌పీసీఎల్ (2%), పెట్రోనెట్ ఎల్‌ఎన్‌జీ (2%), ఇంద్రప్రస్థ గ్యాస్ (1%) రాణించాయి.
- ఎంసీఎక్స్ వచ్చే వారం(అక్టోబర్ 3) నుంచి ప్రారంభించాలనుకున్న కొత్త కమోడిటీ డెరివేటివ్స్ ప్లాట్‌ఫామ్ లైవ్ ట్రేడింగ్‌ని వాయిదా వేయాలని సెబీ కోరడంతో షేరు 2.50% నష్టపోయి రూ.2049 వద్ద స్థిరపడింది.
- లాభాల మార్కెట్లోనూ ఐటీ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ ఐటీ సేవల దిగ్గజం యాక్సెంచర్ తన వార్షిక, తొలి త్రైమాసిక ఆదాయ అంచనాలను తగ్గించుకోవడంతో దేశీయ ఐటీ షేర్లపై అమ్మకాల ఒత్తిడి నెలకొంది. ఎల్‌టీఐఎం, ఎల్‌టీటీఎస్, ఇన్ఫోసిస్ షేర్లు 3–1% పతనమయ్యాయి. కోఫోర్జ్, హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా, టీసీఎస్ షేర్లు అరశాతం వరకు నష్టపోయాయి.
- ఇటీవల వరుస నష్టాలు చవిచూస్తున్న ఫార్మా షేర్లు లాభాల బాటపట్టాయి. అత్యధికంగా గ్లెన్‌మార్క్ ఫార్మా 10% ర్యాలీ చేసింది. అరబిందో ఫార్మా 5%, గ్రాన్యూల్స్ 4% లాభపడ్డాయి. లుపిన్, డాక్టర్ రెడ్డీస్, ఆల్కేమ్, సన్‌ఫార్మా, సిప్లా, బయోకాన్ లారస్ ల్యాబ్స్ షేర్లు 3–1% చొప్పున పెరిగాయి. రంగాల వారీగా బీఎస్ఈలో అత్యధికంగా ఫార్మా ఇండెక్స్ 2.60% ర్యాలీ చేసింది.

# మౌలిక రంగం భేష్

- ఆగస్టులో 12.1 శాతం వృద్ధి
- 14 నెలల గరిష్ట స్థాయి

**న్యూఢిల్లీ:** ఎనిమిది పారిశ్రామిక రంగాలతో కూడిన మౌలిక పరిశ్రమ ఆగస్టులో మంచి పనితీరును ప్రదర్శించింది. మౌలిక రంగం సమీక్షా నెల్లో 12.1 శాతం వృద్ధిని (2022 ఇదే నెల గణాంకాలతో పోల్చి) నమోదుచేసుకుంది. గడచిన 14 నెలల్లో (2022 జూన్‌లో వృద్ధి రేటు 13.2 శాతం) ఈ స్థాయి భారీ వృద్ధిరేటు నమోదుకావడం ఇదే తొలి సారి. సిమెంట్ (18.9 శాతం), బొగ్గు (17.9 శాతం), విద్యుత్ (14.9 శాతం), స్టీల్ (10.9 శాతం), సహజ వాయువు (10 శాతం) రంగాలు రెండంకెల్లో వృద్ధి సాధించగా, రిఫైనరీ ప్రొడక్టులు 9.5 (శాతం), క్రూడ్ ఆయిల్ (2.1 శాతం), ఎరువుల (1.8 శాతం) రంగాల్లో వృద్ధి రేటు ఒక అంకెకు పరిమితమైంది. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) ఏప్రిల్ నుంచి ఆగస్టు ఎనిమిది రంగాల వృద్ధి రేటు 7.7 శాతంగా నమోదయ్యింది. మొత్తం పారిశ్రామిక ఉత్పత్తిలో ఈ ఎనిమిది పరిశ్రమల వెయిటేజ్ 40.27 శాతం.



# అధిక పెన్షన్ కోసం సంస్థలకు గడువు పెంపు

### డిసెంబర్ 31 వరకు అవకాశం



**న్యూఢిల్లీ:** అధిక పెన్షన్ కోరుకుంటూ దరఖాస్తు చేసుకున్న ఉద్యోగుల తరఫున, వేతన వివరాలను అప్‌లోడ్ చేసేందుకు గడువును డిసెంబర్ 31 వరకు పొడిగించినట్టు ఈపీఎఫ్‌వో ప్రకటించింది. ఈ గడువు సెప్టెంబర్ 30తో ముగియనుండగా, సంస్థల యాజమాన్యాలు, యాజమాన్య సంఘాలు చేసిన వినతి మేరకు ఈపీఎఫ్‌వో ఈ నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా సెప్టెంబర్ 29 నాటికి 5.52 లక్షల పెన్షన్ దరఖాస్తులు యాజమాన్యాల వద్ద పెండింగ్‌లో ఉన్నట్టు ఈపీఎఫ్‌వో తెలిపింది. అధిక పెన్షన్ కోసం ఈపీఎఫ్‌వో దరఖాస్తులు ఆహ్వానించగా.. జూలై 11 నాటికి మొత్తం 17.49 లక్షల దరఖాస్తులు వ్యాలిడేషన్ ఆఫ్ ఆప్షన్/జాయింట్ ఆప్షన్ కోసం వచ్చినట్టు ఈపీఎఫ్‌వో ప్రకటించింది. ఈ దరఖాస్తుదారులకు సంబంధించి వేతన వివరాలను సంస్థలు అప్‌లోడ్ చేసి, తమవైపు ఆమోదం తెలియజేస్తే అప్పుడు వాటిని ఈపీఎఫ్‌వో ప్రాసెస్ చేయడానికి వీలుంటుంది.

# జెట్ ఎయిర్‌వేస్ పునరుద్ధరణకు మరో 100 కోట్లు

### ఇన్వెస్ట్ చేసిన జలాన్ కల్రాక్ కన్సార్షియం



**ముంబై:** జెట్ ఎయిర్‌వేస్ కార్యకలాపాలను పునరుద్ధరించే దిశగా జలాన్ కల్రాక్ కన్సార్షియం (జేకేసీ) మరో రూ. 100 కోట్లు సమకూర్చింది. దీనితో, కోర్టు ఆమోదిత పరిష్కార ప్రణాళిక ప్రకారం మొత్తం రూ. 350 కోట్లు సమకూర్చినట్లయిందని జేకేసీ తెలిపింది. కంపెనీపై పూర్తి అధికారాలు దక్కించుకునేందుకు అవసరమైన నిబంధనలన్నింటినీ పాటించినట్లయిందని పేర్కొంది. ఎయిర్‌లైన్ కార్యకలాపాల పునరుద్ధరణ ప్రణాళికలో ఎటువంటి మార్పులు ఉండవని, వచ్చే ఏడాది (2024) నుంచి ప్రారంభించేందుకు కొత్త ప్రమోటర్లు దృఢనిశ్చయంతో ఉన్నట్లు జేకేసీ వివరించింది. లాంచ్ తేదీని రాబోయే వారాల్లో ప్రకటించనున్నట్లు పేర్కొంది. ఆర్థిక సంక్షోభంతో దివాలా తీసిన జెట్ ఎయిర్‌వేస్ కార్యకలాపాలు 2019 ఏప్రిల్ 17 నుంచి నిలిచిపోయిన సంగతి తెలిసిందే.

# మంగోలియాలో మేఘా భారీ ప్రాజెక్ట్

- క్రూడ్ ఆయిల్ రిఫైనరీ నిర్మాణం
- డీల్ విలువ రూ.5,400 కోట్లు



పి.వి.కృష్ణారెడ్డి

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** మేఘా ఇంజనీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ (ఎంఈఐఎల్) తాజాగా మంగోలియాలో మరో భారీ ప్రాజెక్టును చేజిక్కించుకుంది. ఇందులో భాగంగా అత్యాధునిక ముడిచమురు శుద్ధి కేంద్రాన్ని నిర్మించనుంది. డీల్ విలువ సుమారు రూ. 5,400 కోట్లు. ప్రాజెక్టు పూర్తయితే ఏటా 15 లక్షల టన్నుల ముడిచమురు ఉత్పత్తి చేయనుందని కంపెనీ ప్రకటించింది. మేఘా ఇంజనీరింగ్ ఇప్పటికే మంగోలియాలో రూ.6,500 కోట్ల విలువైన రెండు ప్రాజెక్టులను చేపట్టింది. మంగోలియా రాజధాని ఉలాన్‌బటోర్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఎంఈఐఎల్, మంగోల్ రిఫైనరీ స్టేట్ ఓన్డ్ ఎల్‌ఎల్‌సీ మధ్య ఒప్పందం జరిగింది. మంగోలియాలో తొలి గ్రీన్ ఫీల్డ్ క్రూడ్ రిఫైనరీ నిర్మాణంలో భాగస్వామ్యం అయినందుకు గర్వంగా ఉందని ఎంఈఐఎల్ ఎండీ పి.వి.కృష్ణారెడ్డి తెలిపారు.

# సినిమా



● హన్సిక

## పోరాటం.. పోరాటం..

హన్సిక టైటిల్ రోల్‌లో నటించిన లేడీ ఓరియంటెడ్ చిత్రం 'మై నేమ్ ఈజ్ శృతి'. శ్రీనివాస్ ఓంకార్ దర్శకత్వంలో వైష్ణవి ఆర్ట్స్ పతాకంపై బురుగు రమ్యా ప్రభాకర్ నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. మార్క్ కె. రాబిన్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'పోరాటం పోరాటం..' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్. కృష్ణకాంత్ రచించిన ఈ పాటను రాహుల్ సిప్లిగంజ్, హారిక నారాయణన్, సత్య యామిని ఆలపించారు. శ్రీనివాస్ ఓంకార్ మాట్లాడుతూ– ''విభిన్నమైన కథాంశంతో రూపొందుతున్న 'మై నేమ్ ఈజ్ శృతి' చిత్రంలో ప్రతి సన్నివేశం ఉత్కంఠభరితంగా ఉంటుంది'' అన్నారు. ''తన భావాల్ని ధైర్యంగా వెల్లడించే శృతిగా విభిన్నమైన పాత్ర చేశాను. ఆద్యంతం మలుపులతో ఈ సినిమా ఆసక్తికరంగా సాగుతుంది'' అన్నారు హన్సిక. ఈ చిత్రానికి కెమెరా: కిశోర్ బోయిడపు, సహనిర్మాత: పవన్‌కుమార్ బండి.



● శ్రద్ధా శ్రీనాథ్

## ఏమవుతుంది?

ప్రపంచ మానవాళికి 2064 సంవత్సరంలో ఏం అవుతుంది? ఏం మార్పులు సంభవిస్తాయి? అనే అంశంతో రూపొందిన చిత్రం 'కలియుగం'. శ్రద్ధా శ్రీనాథ్, కిశోర్ ప్రధాన పాత్రల్లో నటించారు. ప్రమోద్ సుందర్ దర్శకత్వంలో కేఎస్ రామకృష్ణ నిర్మించిన ఈ చిత్రం తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో త్వరలో రిలీజ్ కానుంది. ''హారర్ థ్రిల్లర్‌గా 'కలియుగం' రూపొందింది'' అని మేకర్స్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: డాన్ విన్సెంట్, కెమెరా: కె. రామ్‌చరణ్.

## నిశ్చితార్థం పూర్తి



● ప్రవీర్, ఐశ్వర్య

ప్రవీర్ శెట్టి, ఐశ్వర్యా గౌడ జంటగా రాజు బొనగాని దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఎంగేజ్‌మెంట్'. రోడియమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సమర్పణలో జయరామ్ దేవ సముద్ర నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. జయరామ్ దేవ సముద్ర మాట్లాడుతూ– ''యూత్‌ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'ఎంగేజ్‌మెంట్'. సినిమా ఔట్‌పుట్ బాగా వచ్చింది. రాజు బొనగాని అద్భుతంగా తీశాడు. ఈ చిత్రాన్ని తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ, హిందీ, బెంగాలీ, ఒడియా భాషల్లో రిలీజ్ చేస్తాం. త్వరలో రిలీజ్ డేట్ ప్రకటిస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం : దిలీప్ బండారి, రజత్ గోష్, కెమెరా: వెంకట్ మన్నం, సహనిర్మాతలు: లక్ష్మీకాంత్ ఎన్‌ఆర్, నారాయణ స్వామి .ఎస్.

## తాంత్రికుడు వస్తున్నాడు



● మహేందర్, వేణుగోపాల చారి

మహేందర్ వడ్లపట్ల, సన్నీ కునాల్, రాజేష్, అనూష, త్రివేణి నటించిన చిత్రం 'తాంత్రికుడు'. సౌమ్య వడ్లపట్ల సమర్పణలో మహేందర్ వడ్లపట్ల స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ సినిమా త్వరలో రిలీజ్ కానుంది. ఈ చిత్రం టీజర్‌ని మాజీ కేంద్ర మంత్రి, తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ సముద్రాల వేణుగోపాల చారి రిలీజ్ చేశారు. ''మంచి చిత్రం తీయాలని అమెరికా నుండి వచ్చి, 'తాంత్రికుడు' తీశా'' అన్నారు మహేందర్ వడ్లపట్ల. ఈ చిత్రానికి సంగీతం: కె. ఆనంద్, కెమెరా: వంశీ.

## తొలి పొరుడు తనే!



● అక్సా, సమర సింహారెడ్డి

సమర సింహారెడ్డి, అక్సా ఖాన్ జంటగా తెలుగు శ్రీను దర్శకత్వంలో 'మగపులి' సినిమా ఆరంభమైంది. 'ఫార్మర్ ఈజ్ ద ఫస్ట్ సిటిజన్ ఆఫ్ ద వరల్డ్' (రైతే ప్రపంచంలో తొలి పౌరుడు) ఉపశీర్షిక. ఎమ్‌బీడబ్ల్యూడీఏ సమర్పణలో నారాయణ స్వామి నిర్మిస్తున్నారు. తొలి సీన్‌కి రైతు టి. రంగడు కెమెరా స్విచ్చాన్ చేయగా, నటుడు సుమన్ క్లాప్ ఇచ్చారు. ''నిరుద్యోగులు, రైతులు, రాజకీయ నాయకుల నేపథ్యంలో ఈ చిత్రం ఉంటుంది'' అన్నారు తెలుగు శ్రీను. ''ఆంధ్ర, కర్ణాటక సరిహద్దులో ఉండటం వల్ల కన్నడలో సినిమాలు చేశాను. ఇప్పుడు మాతృ భాషలో సినిమా చేస్తుండటం హ్యాపీ'' అన్నారు సమర సింహారెడ్డి. ఈ చిత్రానికి సంగీతం: భానుప్రసాద్. జె, కెమెరా: శివారెడ్డి యస్వీ.

## నవ్వుల జాతర



● కక్షీ, క్రిష్

క్రిష్ సిద్ధిపల్లి, కక్షీ జంటగా 'జంధ్యాలగారి జాతర 2.0' సినిమా షురూ అయింది. వాల్మీకి దర్శకత్వంలో శ్రీ నిధి క్రియేషన్స్ సమర్పణలో సన్ స్టూడియో బ్యానర్‌పై రూపొందుతోన్న ఈ చిత్రం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. వాల్మీకి మాట్లాడుతూ– ''పూర్తి హాస్యభరిత చిత్రంగా 'జంధ్యాలగారి జాతర 2.0' ఉంటుంది. ఈ సినిమాకు జంధ్యాలగారి పేరు పెట్టడంతో మంచి అంచనాలుంటాయి. ఆ అంచనాలను అందుకునేలా మా చిత్రం ఉంటుంది'' అన్నారు. ''విందు భోజనం లాంటి చిత్రమిది'' అన్నారు క్రిష్ సిద్ధిపల్లి. నటులు రఘుబాబు, పృథ్వీ, యాని మాస్టర్ తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: వంశీ కృష్ణ, కెమెరా: విజయ్ ఠాగూర్.

# రెడీ



● షారుక్ ఖాన్



● 'సలార్'లో ప్రభాస్

**రెండు పాన్ ఇండియా సినిమాలు ఒకేరోజు థియేటర్లకు వస్తే.. ఏ సినిమా చూడాలి? అనేది ప్రేక్షకుల ముందుండే ప్రశ్న. ఏ సినిమాకి ఎక్కువ థియేటర్లు ఇవ్వాలి? అనేది ఎగ్జిబిటర్ల ముందుండే ప్రశ్న? ఏ సినిమాని ఏ ఏరియాకి ఎంత ఇచ్చి కొనాలి? అనేది డిస్ట్రిబ్యూటర్ల ముందుండే ప్రశ్న.. అసలు రెండు పెద్ద సినిమాలు ఒకేసారి రావడం కరెక్టేనా? బిజినెస్ ఎఫెక్ట్ అవుతుందేమో.. ఇది నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ప్రొడ్యూసర్లు.. ఇలా అందరి ముందుండే ప్రశ్న. శుక్రవారం వచ్చిన 'సలార్' విడుదల తేదీ (డిసెంబర్ 22) ప్రకటన ఈ ప్రశ్నలకు కారణమైంది. అదే రోజు షారుక్ ఖాన్ 'డంకీ' కూడా రిలీజ్ కానుంది. బాక్సాఫీస్‌ను ఢీ కొట్టడానికి రెడీ అవుతున్న 'సలార్', 'డంకీ'... చిత్రాల్లో ఏది వసూళ్లను కొల్లగొడుతుంది? ఈ రెండింటి కారణంగా వేరే చిత్రాలు వాయిదా పడతాయా? ఓ లుక్కేద్దాం.**

### ● డంకీ వర్సెస్ సలార్

ఇండియన్ సినిమా బడా సూపర్ స్టార్స్ ప్రభాస్, షారుక్ ఖాన్ బాక్సాఫీస్ ఫైట్‌కి రెడీ అయ్యారు. పాన్ ఇండియన్ స్టార్ ప్రభాస్ హీరోగా 'కేజీఎఫ్' ఫేమ్ ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న 'సలార్'లోని తొలి భాగం 'సలార్: సీజ్ ఫైర్'ను డిసెంబరు 22న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేస్తున్నట్లుగా ఈ చిత్ర యూనిట్ శుక్రవారం ప్రకటించింది. నిజానికి 2022 ఏప్రిల్ 14న విడుదల చేయాలనుకుని, ఆ తర్వాత 2023 సెప్టెంబరు 28కి వాయిదా వేశారు. తాజాగా డిసెంబర్ 22 అంటున్నారు. ఇంకో వైపు మరో పాన్ ఇండియన్ స్టార్ షారుక్ ఖాన్ నటిస్తున్న తాజా చిత్రం 'డంకీ'. హిందీలో 'మున్నాభాయ్ ఎమ్‌బీబీఎస్', '3 ఇడియట్స్', 'పీకే' వంటి బ్లాక్‌బస్టర్ ఫిల్మ్స్ తీసిన అగ్రశ్రేణి దర్శకుడు రాజ్‌కుమార్ హిరాణి ఈ సినిమాకు దర్శకుడు. షారుక్, రాజ్‌కుమార్.. ఈ ఇద్దరికీ విడివిడిగా రికార్డులు ఉండటంతో తొలిసారి ఇద్దరూ కలిసి చేస్తున్న 'డంకీ' చిత్రంపై మంచి అంచనాలున్నాయి. గౌరీ ఖాన్, రాజ్‌కుమార్ హిరాణి, జ్యోతి దేశ్ పాండే ఈ సినిమాను నిర్మిస్తున్నారు. కాగా 2022 ఏప్రిల్ 19న 'డంకీ' సినిమాను ప్రకటించిన రోజే విడుదల తేదీని (22 డిసెంబరు 2023) కూడా ప్రకటించారు. ఇప్పుడు ప్రభాస్ అండ్ టీమ్ ఇదే రోజున 'సలార్' విడుదలను నిర్ణయించడం ఇటు తెలుగు అటు హిందీతో పాటు పాన్ ఇండియా సినిమాలు కాబట్టి.. ఇతర భాషల ఇండస్ట్రీల్లోనూ చర్చనీయాంశమైంది.

**ఎవరి రికార్డులు వారివి...**

'బాహుబలి: ది కన్‌క్లూజన్' తర్వాత ప్రభాస్ చేసిన 'సాహో (2019)', 'రాధేశ్యామ్ (2022)', 'ఆదిపురుష్ (2023)' చిత్రాలకు ఆశించిన ఫలితాలు రాలేదు. దీంతో ప్రభాస్‌కు 'సలార్' హిట్ కీలకంగా మారింది. ఇటు 'జీరో (2018)' రిజల్ట్‌తో షారుక్ ఖాన్ డీలా పడ్డప్పటికీ ఆ తర్వాత చేసిన రెండు సినిమాలు 'పఠాన్', 'జవాన్' బాక్సాఫీస్ వద్ద కొత్త రికార్డులను క్రియేట్ చేశాయి. ముఖ్యంగా 'జవాన్' చిత్రం కలెక్షన్స్‌లో హిందీ హయ్యెస్ట్ గ్రాసర్‌గా నిలిచిందని యూనిట్ పేర్కొంది. ఇవి షారుక్ ఖాన్ సూపర్ ఫామ్‌ను స్పష్టం చేస్తున్నాయి. అలా అని ప్రభాస్, ప్రశాంత్ నీల్ సినిమాలనూ తక్కువ చేయలేం. ఎందుకంటే ప్రభాస్ 'బాహుబలి: ది కన్‌క్లూజన్' మొత్తం వసూళ్లను షారుక్ ఏ సినిమా కూడా ఇంకా అధిగమించలేదని ట్రేడ్ విశ్లేషకులు చెబుతున్నారు. అలాగే షారుక్ కెరీర్‌లో ఓ డిజాస్టర్‌గా నిలిచిన 'జీరో' రిలీజైన రోజున.. అంటే డిసెంబరు 21నే 'కేజీఎఫ్: ఛాప్టర్ 1' (యశ్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందింది) విడుదలై బ్లాక్‌బస్టర్‌గా నిలిచి, కొత్త రికార్డులను సృష్టించింది. ఇలా ప్రశాంత్ నీల్, షారుక్ ఖాన్ మరోసారి బాక్సాఫీస్ వద్ద ఢీ కొనడానికి రెడీ కావడం ఆసక్తికరమైన విశేషం. ఎవరి రికార్డులు వారికి ఉన్న నేపథ్యంలో తాజా పోటీలో రికార్డ్ ఎవరిదనేది ఆసక్తికరంగా మారింది.

### ఆ తేదీకే ఎందుకు?

ఓ సినిమా బాక్సాఫీస్ సరికొత్త రికార్డులను సృష్టించాలంటే సరైన రిలీజ్ డేట్ కూడా ముఖ్యం. ఇప్పుడు 'సలార్', 'డంకీ' చిత్రాలు డిసెంబరు 22ను ఎంచుకోవడం సరైనదే. ఎందుకంటే ఆ రోజు నుంచి వారాంతం ఆరంభమవుతుంది. సరిగ్గా క్రిస్మస్ సెలవులు కూడా మొదలవుతాయి. దీంతో ప్రేక్షకులు థియేటర్స్‌కు రావడం ఖాయం. ఒకవేళ ఈ చిత్రాలు హిట్ టాక్ తెచ్చుకుంటే.. న్యూ ఇయర్, ఆ తర్వాత సంక్రాంతి వరకూ ప్రదర్శనకు స్కోప్ ఉంటుంది. సంక్రాంతి సెలవుల టార్గెట్‌గా కొత్త చిత్రాలు వస్తాయి. అప్పుడు 'సలార్', 'డంకీ'కి థియేటర్లు తగ్గే అవకాశం ఉంది. ఒకవేళ పండగ టైమ్‌లో వచ్చే చిత్రాలకన్నా ఈ రెండూ బంపర్ హిట్ టాక్ తెచ్చుకుంటే అప్పుడు సంక్రాంతి సెలవులను కూడా క్యాష్ చేసుకుంటాయి. ఈ చిత్రాల టాక్ ముందే తెలిసిపోతుంది కాబట్టి.. సంక్రాంతికి వచ్చే చిత్రాల్లో ఏదైనా వాయిదా పడే అవకాశం కూడా లేకపోలేదు.

**ఫుల్ కన్‌ఫ్యూజన్**

నో కన్‌ఫ్యూజన్..'సలార్: సీజ్ ఫైర్'ను డిసెంబరు 22న విడుదల చేస్తున్నాం అంటూ 'సలార్' టీమ్ ప్రకటించింది. అయితే 'సలార్'కు కన్‌ఫ్యూజన్ అక్కర్లేకపోవచ్చు కానీ 2023 క్రిస్మస్‌కు ఆల్రెడీ రిలీజ్‌ను కన్ఫార్మ్ చేసుకున్న తెలుగు చిత్రాల విడుదల విషయం ఇప్పుడు ఫుల్ కన్‌ఫ్యూజన్. డిసెంబరు 21న నాని 'హాయ్ నాన్న', 22న వెంకటేశ్ 'సైంధవ్', సుధీర్‌బాబు 'హరోం హర', 23న నితిన్ 'ఎక్స్‌ట్రా' చిత్రాలు విడుదలకు షెడ్యూల్ అయ్యాయి. ఇప్పుడు 'సలార్' ఎఫెక్ట్‌తో ఈ సినిమాల విడుదల వాయిదా పడే అవకాశం ఉంటుంది. ఒకవేళ అప్పుడు వాయిదా వేసి, సంక్రాంతికి వద్దామనుకుంటే ఆల్రెడీ పండగ బరిలో నాగార్జున 'నా సామిరంగ', మహేశ్‌బాబు 'గుంటూరు కారం', రవితేజ 'ఈగల్', విజయ్ దేవరకొండ 'ఫ్యామిలీ స్టార్ (ప్రచారంలో ఉన్న టైటిల్), తేజా సజ్జా 'హనుమాన్' చిత్రాలతో పాటు అనువాద చిత్రాలు శివ కార్తికేయన్ 'అయలాన్', సుందర్. సి 'అరణ్మనై 4' ఉన్నాయి. అయితే ఒకేసారి ఇన్ని సినిమాలంటే థియేటర్ల సంఖ్య ప్రశ్నార్థకమవుతుంది... దాంతో పాటు వసూళ్లు కూడా షేర్ అయిపోతాయి కాబట్టి వీటిలో ఏదైనా వాయిదా పడే అవకాశమూ లేకపోలేదు. ఇక ప్రభాస్ నటిస్తున్న మరో చిత్రం 'కల్కి 2898 ఏడి' కూడా సంక్రాంతి బరిలో ఉంది. ఈ సినిమా వాయిదా పడే చాన్స్ ఉందని తెలుస్తోంది.


**'సలార్', 'డంకీ'... ప్రకటించిన ప్రకారం డిసెంబర్ 22నే వస్తాయా? ఇవి వస్తే ఏ చిత్రాలు వెనక్కి వెళతాయి? సంక్రాంతి బరిలో నిలిచే చిత్రాలేంటి? అనేది తెలియాలంటే కొంత సమయం వేచి ఉండక తప్పదు.** ●



● 'సైంధవ్'లో వెంకటేశ్



● 'హాయ్ నాన్న'లో మృణాల్, బేబీ కియారా, నాని



● 'హరోం హర'లో సుధీర్‌బాబు



● 'ఎక్స్‌ట్రా'లో నితిన్

## క్లుప్తంగా...

## టైమ్స్ వరల్డ్ ర్యాంకింగ్స్‌లో ఏపీ వర్సిటీలు

- 4 ప్రభుత్వ విశ్వవిద్యాలయాలతో సహా 7 వర్సిటీలకు చోటు

సాక్షి, అమరావతి: ప్రతిష్టాత్మకమైన టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్–2024లో రాష్ట్రానికి చెందిన 7 యూనివర్సిటీలు ఉత్తమ స్థానాల్లో నిలిచాయి. ఇందులో 4 ప్రభుత్వరంగ వర్సిటీలు ఉండగా 3 ప్రైవేటు, డీమ్డ్ వర్సిటీలున్నాయి. హయ్యర్ ఎడ్యుకేషన్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగులను టైమ్స్ తాజాగా విడుదల చేసింది. ఈర్యాంకింగ్స్‌లో దేశంలోని 91 విశ్వవిద్యాలయాలకు చోటు దక్కగా అందులో 51 వర్సిటీలు దక్షిణాది రాష్ట్రాలకు చెందినవే. వీటిలో ఏడు ఆంధ్రప్రదేశ్‌వి ఉన్నాయి. అనంతపురంలోని జేఎన్టీయూ దేశీయ వర్సిటీల్లో 34వ స్థానంలో నిలిచింది. నాగార్జున వర్సిటీకి 58వ స్థానం దక్కింది. టైమ్స్ వరల్డ్ వర్సిటీ ర్యాంకు స్కోరు 801– 1,000 విభాగంలో అనంతపురం జేఎన్టీయూ నిలిచింది. ఇక నాగార్జున వర్సిటీ 1,201–1,500 గ్లోబల్ స్కోర్‌లో స్థానాన్ని సాధించింది. 1,202–1,500 కేటగిరీలో శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ, కోనేరు లక్ష్మయ్య యూనివర్సిటీ స్థానాన్ని దక్కించుకున్నాయి. టైమ్స్ వరల్డ్ వర్సిటీ ర్యాంకు స్కోరు 1,501 ఆపై విభాగంలో ఆంధ్రాయూనివర్సిటీ, గీతం, విజ్ఞాన్ వర్సిటీ నిలిచాయి. వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రమాణాల్లో నిలిచిన రాష్ట్ర వర్సిటీలు ఈ స్థానా లను కైవసం చేసుకున్నాయి. దేశంలోని 91 ఉన్నత విద్యాసంస్థలలో బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సు (ఐఐఎస్‌సీ) అగ్రస్థానంలో ఉంది. మొత్తం ప్రపంచ వ్యాప్తంగా 108 దేశాలకు చెందిన 1,904 వర్సిటీల ప్రమాణాలను పరిశీలించి వరల్డ్ హయ్యర్ ఎడ్యుకేషన్ వర్సిటీ ర్యాంకింగ్ జాబితాను టైమ్స్ సంస్థ ప్రకటించింది. టీచింగ్, ఎన్విరాన్మెంట్, రీసెర్చ్ క్వాలిటీ, పరిశ్రమలు, అంతర్జాతీయ దృక్పథం అనే ఐదు ప్రామాణికాలను పరిగణనలోకి తీసుకొని లండన్‌లోని ప్రఖ్యాత టైమ్స్ సంస్థ ఈ ర్యాంకులను ప్రకటిస్తోంది.

## తెలుగు వర్సిటీ కోర్సులకు దరఖాస్తులు

హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2023–24వ విద్యా సంవత్సరానికి వివిధ కోర్సుల్లో ప్రవేశం పొందడానికి దరఖాస్తులు కోరుతున్నట్టు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. లలిత కళారంగంలో ఎంపీఏ (కూచిపూడి, జానపదం, రంగస్థలం, సంగీతం), సామాజిక తదితర శాస్త్రాల విభాగంలో ఎంఏ (జ్యోతిషం), భాషాభివృద్ధి శాఖలో ఎంఏ (లింగ్విస్టిక్స్) కోర్సులలో చేరడానికి ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి తక్షణ ప్రవేశాల కోటా కింద దరఖాస్తులను కోరుతున్నట్లు వివరించారు. కోర్సుల పూర్తి వివరాలు, అర్హతలు, ఫీజుల గురించి మరింత సమాచారం కోసం విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చని సూచించారు.

## ఇద్దరు విద్యార్థులకు జాతీయ సేవా పథకం అవార్డు

- ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో అందజేసిన రాష్ట్రపతి ముర్ము



రాష్ట్రపతి నుంచి అవార్డు అందుకుంటున్న జయమారుతి, సాత్విక

సాక్షి, న్యూఢిల్లీ/వెంకటాచలం: స్వచ్ఛంద సేవలకు గుర్తింపుగా ఏటా కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ ప్రదానం చేసే జాతీయ సేవా పథకం అవార్డు( 2021–22)ను ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు దక్కించుకున్నారు. నెల్లూరు జిల్లాకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్ పెళ్లకూరు సాత్విక, అనంతపురానికి చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్ కురబ జయమారుతికి శుక్రవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ అవార్డులను అందజేశారు. విక్రమసింహపురి వర్సిటీ పరిధిలోని జగన్ డిగ్రీ, పీజీ కాలేజీకి చెందిన సాత్విక డిజిటల్ ఇండియా, డిజిటల్ అక్షరాస్యత, ప్రధానమంత్రి ఉజ్వల యోజన, పీఎం జీవన్ జ్యోతి యోజన, పీఎం జీవన్ బీమా యోజన తదితర పథకాల ప్రచార కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. లాక్‌డౌన్ సమయంలో పేదలకు సేవలందించారు. స్వచ్ఛ భారత్, హెచ్ఐవీ అవగాహన, మాదక ద్రవ్యాల వినియోగంతో వచ్చే నష్టాలను వివరించే కార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు. సుమారు 1,500 మొక్కలు నాటడంతో పాటు పలు రక్తదాన శిబిరాల్లో పాల్గొన్నారు. ఈ విధంగా ఎన్ఎస్ఎస్ ద్వారా సాత్విక చేసిన సామాజిక సేవకు గుర్తింపుగా కేంద్రం ఈ అవార్డు అందజేసింది. అలాగే శ్రీకృష్ణదేవరాయ వర్సిటీ పరిధిలోని ఎస్కేయూ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్‌కు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్ జయమారుతి డిజిటల్ ఇండియా, పీఎం ఉజ్వల్ యోజన, పీఎం జీవన్ జ్యోతి తదితర ప్రభుత్వ కార్యక్రమాల ప్రచారాల్లో చురుగ్గా పాల్గొనడంతో పాటు కరోనా సమయంలో పేదలకు సేవలందించారు. 1,700 మాస్కులు తయారు చేసి ప్రజలకు పంపిణీ చేశారు. 120 మొక్కలు నాటడంతో పాటు పలు రక్తదాన శిబిరాల్లో పాల్గొన్నారు. రూ.23 వేలు సేకరించి సాయుధ దళాల అమరవీరుల కుటుంబాలకు విరాళమిచ్చారు. ఈ సేవలను గుర్తించిన కేంద్రం జాతీయ సేవా పథకం అవార్డుకు ఎంపిక చేసింది.

# పప్పు లోకేశ్.. ఇది తప్పు

## రాష్ట్రంలో లైంగిక వేధింపులపై లోకేశ్ తప్పుడు ఆరోపణ

**చిన్న వయసులో గర్భధారణలకు వేధింపులే కారణమంటూ ట్వీట్**

**టీడీపీ పాలనలోకంటే ఇప్పుడు బాగా తగ్గిన లైంగిక వేధింపులు**

**2015-16లో 6.8 శాతం ఉండగా**

**2019-20లో 3.7 శాతానికి తగ్గాయి**

**జాతీయ కుటుంబ, ఆరోగ్య సర్వే వెల్లడించిన వాస్తవమిది**

**ప్రభుత్వంపై బురద జల్లే ఉద్దేశంతో తప్పటడుగు**

సాక్షి, అమరావతి: మాజీ సీఎం చంద్రబాబు తనయుడు, టీడీపీ నేత నారా లోకేశ్‌ని పప్పు అని, మందబుద్ధి అని ఇతర పార్టీల నేతలు విమర్శిస్తుంటారు. ఇది కరెక్టే అని ఆయన మాటలు, చేతల్లో ఆయనకు ఆయనే నిరూపించుకుంటూ ఉంటారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మీద ఆరోపణలు చేసే విషయంలో ఈ అజ్ఞానం మరింత స్పష్టంగా బయటపెట్టుకుంటూ ఉంటారు. ఇలాంటిదే శుక్రవారం ఒక ట్వీట్ చేశారు. మహిళల రక్షణ పైన వాస్తవాలు తెలుసుకోకుండా.. ఒక అంశాన్ని మరో అంశంతో కలిపేసి సోషల్ మీడియా సాక్షిగా అజ్ఞానాన్ని బయటపెట్టుకున్నారు.

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో మహిళల రక్షణకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్న విషయం తెలిసిందే. సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలో మహిళల రక్షణకు ప్రత్యేకంగా దిశ పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. దిశ ఎస్ఓఎస్ యాప్ ద్వారా ఆపద సమయంలో ఆడబిడ్డలకు అండగా నిలుస్తున్నారు. దీంతో రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలు చాలా తగ్గిపోయాయి. సాక్షాత్తు కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన జాతీయ కుటుంబ, ఆరోగ్య సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్)– 5 ఈ విషయాన్ని స్పష్టంగా చెప్పింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంతో పోలిస్తే రాష్ట్రంలో 18 నుంచి 29 ఏళ్ల మహిళలపై లైంగిక వేధింపుల ఘటనలు ప్రస్తుత ప్రభుత్వంలో తగ్గినట్టు వెల్లడించింది. టీడీపీ ప్రభుత్వం ఉండగా 2015–16లో 6.8 శాతం మంది లైంగిక వేధింపులకు గురైనట్టు ఎన్ఎఫ్‌హెచ్ఎస్–4 నివేదికలో కేంద్రం వెల్లడించింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2019–20లో లైంగిక వేధింపుల ఘటనలు 3.7 శాతానికి తగ్గాయని ఎన్ఎఫ్‌హెచ్ఎస్–5లో కేంద్రం పేర్కొంది. అయితే, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై బురద జల్లేలా లోకేశ్ ఎన్ఎఫ్‌హెచ్ఎస్–5లో వెల్లడించిన చిన్న వయస్సులో గర్భధారణల అంశాన్ని ప్రస్తావిస్తూ.. ఇందుకు లైంగిక వేధింపులే కారణమంటూ దిగజారి ఆరోపణలు చేశారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు సరైన అవగాహన లేక చిన్న వయస్సుల్లోనే ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేస్తుంటారు. దీంతో వారు చిన్న వయస్సులో గర్భం దాలుస్తుంటారు. 2019–20లో ఇలా గర్భం దాల్చిన వారు 12 శాతం దాటినట్లు ఎన్ఎఫ్‌హెచ్ఎస్–5లో వెల్లడించారు. దీన్ని పట్టుకొని మహిళలపై లైంగిక దాడులే ఇందుకు కారణం అంటూ ఆరోపణలు చేయడం లోకేశ్ మందబుద్ధికి నిదర్శనం. ఇదే లోకేశ్ తండ్రి చంద్రబాబు సీఎంగా ఉన్న 2015–16 మధ్య రాష్ట్రంలో చిన్న వయస్సు గర్భధారణలు 12 శాతం ఉన్నట్టు ఎన్ఎఫ్‌హెచ్ఎస్–4 నివేదిక పేర్కొంది. దీనికి ఏం సమాధానం చెబుతావ్ అని సోషల్ మీడియాలో లోకేశ్‌పై ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.

# సొరంగ మార్గం.. స్వర్గతుల్యం

- అద్భుతంగా రూపుదిద్దుకున్న ఓబులవారిపల్లె–కృష్ణపట్నం రైల్వేలైన్
- దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద టన్నెల్ లైన్‌గా గుర్తింపు
- కోస్తా కారిడార్, రాయలసీమకు అనుసంధానం
- విజయవాడ, విశాఖ తదితర నగరాలకు సులువైన మార్గం


ఓబులవారిపల్లె–కృష్ణపట్నం రైల్వే మార్గం (ఇన్‌సెట్) సొరంగ మార్గం

సాక్షి ప్రతినిధి కడప: రాయలసీమ–కోస్తా జిల్లాలకు రైల్వే కనెక్టివిటీ పెరిగేందుకు అరుదైన రైల్వే మార్గం.. ఓబులవారిపల్లె–కృష్ణపట్నం రైల్వేలైన్. దక్షిణ భారతదేశంలోనే అతి పెద్ద టన్నెల్ ఏర్పాటు చేసి దీనిని నిర్మించారు. న్యూ ఆస్ట్రేలియన్ టన్నెల్ మెథడ్‌తో సాంకేతిక పనులు పూర్తి చేశారు. వెలుగొండ అడవుల్లో 7.560 కిలోమీటర్ల పొడవైన టన్నెల్‌ను ఈ మార్గం కోసం ఏర్పాటు చేశారు. దీంతో ఓబులవారిపల్లె–కృష్ణపట్నం మార్గంలో గూడ్స్ రైళ్ల రాకపోకలు కొనసాగుతున్నాయి. అద్భుతమైన ఈ లైన్‌లో ప్రయాణికుల కోసం రైళ్లు నడిపితే విజయవాడ, విశాఖపట్నం తదితర కోస్తా జిల్లాలకు కనెక్టివిటీ బాగా పెరుగుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రకృతి అందాల నడుమ కాశ్మీర్ తరహాలో ఏర్పాటు చేసిన ఈ మార్గం గుండా ప్రయాణం మరుపురాని అనుభూతినిస్తుంది.

**ఎగుమతుల కోసం..**

ఈ రైలు మార్గాన్ని ఎస్ఆర్ఎస్‌పీ నెల్లూరు జిల్లా కృష్ణపట్నం ఓడరేవు నుంచి పలు రకాలైన ఖనిజాలను ఎగుమతి చేసేందుకు ఏర్పాటు చేశారు. ఏపీఎండీసీ పరిధిలో మంగంపేట నుంచి బెరైటీస్, బళ్లారి నుంచి ఐరన్ ఓర్ కూడా ఇదే మార్గంలో వెళుతోంది. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో నూతనంగా ఈ మార్గంలో 35 కిలోమీటర్లు, నెల్లూరుజిల్లాలో 58 కిలోమీటర్ల మేర నిర్మించారు. ఈ నడుమ ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో మంగంపేట, నేతివారిపల్లె, చెర్లోపల్లె రైల్వేస్టేషన్లుండగా..నెల్లూరు జిల్లాలో ఎనిమిది స్టేషన్ల ద్వారా గూడ్స్ రైళ్లు కృష్ణపట్నం చేరుకుంటున్నాయి.

**రూ.470 కోట్లతో టన్నెల్..**

ఓబులవారిపల్లె–కృష్ణపట్నం రైల్వే లైన్ ఏర్పాటుకు 7.56 కిలోమీటర్ల టన్నెల్ ఏర్పాటు చేశారు. న్యూ ఆస్ట్రేలియన్ టన్నెల్ మెథడ్‌తో సాంకేతికపనులు చేపట్టారు. స్కాట్‌లాండ్ మిషనరీతో నిర్మించారు. పెనుశిల అభయారణ్యం కొండల్లో ఈ నిర్మాణం జరిగింది. 2006లో అప్పటి రైల్వేశాఖ మంత్రి నితీశ్‌కుమార్ రైల్వేలైన్‌కు పచ్చ జెండా ఊపారు. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి చొరవ కారణంగా సకాలంలో భూసేకరణ, పర్యావరణ అనుమతులు లభించాయి. రూ.1646 కోట్లతో ఈమార్గం రూపుదిద్దుకుంది. రెండు గుహల మధ్య పచ్చని లోగిళ్లలో రైల్వే లైన్ వెళుతుంది. చుట్టూ కొండలు, పెనుశిల అభయారణ్యం మధ్యన టన్నెల్‌లో రైల్వే ప్రయాణం అత్యంత ఆహ్లాదకరంగా ఉంటుంది. ఈ రైల్వే మార్గాన్ని ఉప రాష్ట్రపతి హోదాలో 2019 సెప్టెంబర్, 1వ తేదీన ఎం.వెంకయ్యనాయుడు జాతికి అంకితం చేశారు. అప్పటి నుంచి కృష్ణపట్నం పోర్టుకు గూడ్స్ రైళ్ల రాకపోకలు సాగుతున్నాయి.

**కనెక్టివిటీకి సులువు**

కడప–విజయవాడ మధ్య రైల్వే రాకపోకలు చాలా అరుదుగా ఉన్నాయి. కడప నుంచి తిరుమల ఎక్స్‌ప్రెస్(కడప–విశాఖపట్నం).. యర్రగుంట్ల, ప్రొద్దుటూరుల నుంచి ధర్మవరం–విజయవాడ రైళ్ల ద్వారా ప్రయాణం చేయాల్సి ఉంది. లేకపోతే తిరుపతి, రేణిగుంటల నుంచి వెళ్లాల్సి ఉంటుంది. అయితే నేరుగా కడప నుంచి విజయవాడకు ప్రత్యేకించి రైళ్లు లేవు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లా నుంచి నిత్యం వేలాది మంది విజయవాడకు వెళ్తున్నారు. ప్రత్యేకించి అక్కడి ప్రాంతాల్లోని వివిధ పాఠశాలలు, కళాశాలల్లో ఇక్కడి విద్యార్థులు దాదాపు 20వేల మంది వరకు విద్యను అభ్యసిస్తున్నారు. పేరెంట్స్ రాకపోకలు సాగించేందుకు ఈ మార్గం ఉపయోగపడనుంది. కడప, రాజంపేట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, గుంటూరు, విజయవాడ వెళ్లేందుకు ఈ మార్గం సులభతరంగా ఉంటుందని రైల్వే నిపుణులు వివరిస్తున్నారు.




## స్వదేశానికి చేరుకున్న ఏపీ విద్యార్థులు

అమెరికాలోని పలు అంతర్జాతీయ సదస్సుల్లో ఏపీ ప్రభుత్వం తరఫున స్వరాన్ని వినిపించిన విద్యార్థుల బృందం శుక్రవారం రాష్ట్రానికి చేరుకుంది. ప్రభుత్వ ప్రతినిధులుగా తమను ఎంపిక చేసి, ప్రపంచ వేదికలపైకి పంపించిన సీఎం వైఎస్ జగన్‌కి హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయంలో 'థాంక్యూ సీఎం సార్' అంటూ కృతజ్ఞతలు తెలిపింది. 10 రోజుల పర్యటనలో భాగంగా విద్యార్థుల బృందం ఐక్యరాజ్యసమితిలోని ఎస్‌డీజీ సమ్మిట్, వరల్డ్ బ్యాంక్, ఐఎంఎఫ్ మీటింగ్, వాషింగ్టన్‌లోని శ్వేత సౌధాన్ని సందర్శించింది.

– సాక్షి, అమరావతి

## పార్లమెంట్‌లో 'అరుణో'దయం

- ఏపీ నుంచి పార్లమెంట్‌లో ప్రసంగించే అవకాశం
- ఆటోడ్రైవర్ కుమార్తెకు అరుదైన గౌరవం



వైవీయూ: వైఎస్సార్ జిల్లా కేంద్రమైన కడపలోని అక్కాయపల్లెకు చెందిన ఆటోడ్రైవర్ హరిప్రసాద్, రమాదేవి దంపతుల కుమార్తె జానగొండ అరుణ పార్లమెంట్‌లో ఉపన్యసించే అరుదైన అవకాశాన్ని దక్కించుకుంది. దేశవ్యాప్తంగా ఇలాంటి అవకాశం 25 మందికి దక్కగా, ఏపీ నుంచి ఈమె ఒక్కరే ఉండటం విశేషం. గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి పురస్కరించుకుని అక్టోబర్ 2న న్యూఢిల్లీలోని పార్లమెంట్ భవనంలో జరగనున్న ప్రత్యేక కార్యక్రమంలో మహాత్మాగాంధీ జీవిత చరిత్రపై అరుణ ప్రసంగించనుంది. ఈమె కడపలోని శ్రీవివేకానంద మహిళా డిగ్రీ కళాశాలలో గతేడాది డిగ్రీ పూర్తిచేసి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో ఎంఎస్సీ (మ్యాథ్స్) చదువుతోంది. చిన్నప్పటి నుంచి కో–కరికులర్, ఎక్స్‌ట్రా–కరికులర్ యాక్టివిటీస్‌లో రాణిస్తోంది. ఈమె విద్యాభ్యాసం అంతా ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే పూర్తి చేసింది. 2017లో ఇంటాక్ రీజినల్ పురస్కారాన్ని అందుకున్న ఈమె పలు వ్యాసరచన పోటీల్లో రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో విజేతగా నిలిచింది. నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో 'జాతీయ నాయకులకు నివాళి' అనే కార్యక్రమంలో భాగంగా 'మహాత్మాగాంధీ జీవనవిధానం, ఆయన అనుసరించిన పద్ధతులు: ప్రపంచంపై ఎనలేని ప్రభావం', 'అమృత్‌కాలంలో లాల్‌బహదూర్‌శాస్త్రి జీవితపాఠాలు' అంశంపై ఎంపికలు జరిగాయి. జిల్లాస్థాయిలో విజేతలకు రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించగా, ఇందులో అరుణ ప్రతిభ కనబరచడంతో ఆమెకు ఈ అవకాశం దక్కింది. కాగా, ప్రస్తుతం యూపీఎస్సీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నానని అరుణ తెలిపింది.

# సద్బుద్ధితో.. సంకల్ప్‌సిద్ధి

పదిలో ప్రత్యేకత చాటాలంటే పుట్టిన ఊరు వదలాలి. ఇంటర్‌లో విన్నర్ కావాలంటే ఇంటి నుంచి దూరంగా పోవాలి. ఇక.. ఐఐటీ సీటు రావాలంటే అయినవారిని వీడాల్సిందే. నీట్‌లో ర్యాంకు రావాలంటే నిలుచున్నచోటును మరిచిపోవాల్సిందే. ఇదీ నిన్నామొన్నటివరకు రాయలసీమ విద్యార్థుల పరిస్థితి. అవును.. ప్రతిభ ఉన్నా సానబెట్టేవారు దొరకని దుస్థితి. పట్టుదల ఉన్నా పెద్దపట్టణాలకు వెళ్లలేని ఆర్థికస్థితి. ఇలాంటి తరుణంలో ఓ యువకుడు తన సద్బుద్ధితో వీరికి సరికొత్త మార్గాన్ని చూపాడు. రాళ్లసీమ నుంచి రత్నాల్లాంటి విద్యార్థులను వెలికితీస్తున్నాడు. కడప గడ్డ వేదికగా ఐఐటీ, నీట్‌లలో ర్యాంకుల పంట పండిస్తున్నాడు. తన 'సంకల్ప్'బలంతో కార్పొరేట్ శక్తులకు సవాల్ విసురుతున్నాడు. విద్యార్థుల సామర్థ్యానికి తన శక్తి జోడించి లక్ష్యం వైపు నడిపిస్తున్న ఓ విజేత స్ఫూర్తిగాథే నేటి 'సాక్షి' ప్రత్యేక కథనం.

- ఐఐటీ, నీట్‌లలో ర్యాంకుల పంట
- కరువు సీమలో విద్యాసౌరభం
- క్రమశిక్షణతో ఉత్తమ బోధన


సంకల్ప్‌లో తరగతులకు హాజరైన బాలికలు, విజయసూచిక చూపుతున్న వంశీకృష్ణ(ఇన్‌సెట్‌లో)

సాక్షి, కడప డెస్క్: 'విజయం కోసం ఆరాటపడితే సరిపోదు.. జీవితంలో ఎదగాలని ఆశపడితే చాలదు.. మనసా వాచా కర్మణా ఆచరించాలి.. అలా చేయకుంటే ఎంత ఉన్నతాశయమైనా భూమిలో నాటని విత్తనంతో సమానమే.. అది మొలకెత్తదు.. ఆ ఆశయమూ ఫలించదు..' అంటూ విద్యార్థులకు స్ఫూర్తిమంత్రం నూరిపోస్తుంటాడు వంశీకృష్ణ. వెనుకబడిన సీమ విద్యార్థుల భవితకు దీపధారై నడుస్తున్న ఆయన పుష్కరం క్రితం కడపకు వచ్చాడు.

**లాభాపేక్ష లేకుండా...**

2011లో వైఎస్సార్ జిల్లా కేంద్రంలో నాగార్జున మోడల్ స్కూల్ కేంద్రంగా 'సంకల్ప్' స్థాపించాడు. అప్పటి నుంచి ఎందరో విద్యార్థులకు ఉత్తమ విద్యాబోధన అందిస్తున్నారు. అటుతర్వాత ఏపీహెచ్‌బీ కాలనీలో దశాబ్దం కిందట 'సంకల్ప్' పేరిట ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు చేశాడు వంశీకృష్ణ. అయినా 'నాగార్జున'తో అనుబంధాన్ని కొనసాగిస్తూనే ఉన్నాడు. డబ్బు సంపాదన లక్ష్యంగా కాకుండా సేవాదృక్పథంతో ఇస్తున్న ఆయన శిక్షణతో ఎంతోమంది ఉజ్వల భవిష్యత్ పొందారు.

**పకడ్బందీగా ప్రవేశపరీక్ష**

'సంకల్ప్'లో ప్రవేశాల కోసం బేసిక్ మ్యాథమేటిక్స్ విధానం ద్వారా పరీక్ష నిర్వహిస్తారు. నాలుగో తరగతి ముగించి ఐదో తరగతిలో చేరబోయే విద్యార్థులు మాత్రమే ఇందుకు అర్హులు. పదో తరగతి వరకు శిక్షణ కొనసాగుతుంది. ఏటేటా నిర్వహించే ప్రవేశ పరీక్షలకు సీమ జిల్లాల నుంచి విద్యార్థులు వెల్లువలా వస్తారు. ఇక్కడ చేరితే ఐఐటీలో కచ్చితంగా సీటు వస్తుందనే నమ్మకమే ఇందుకు కారణం. పరీక్షల్లో అర్హత సాధించిన వంద మందికే ఇక్కడ అవకాశం కల్పిస్తారు.

**ఆలోచనే ఆయుధం**

సంకల్ప్‌లో మొత్తం సిలబ స్ను వేగంగా బోధించరు. విద్యార్థి ఆలోచనా విధానం, స్వతహాగా చొరవను గుర్తిస్తారు. ఉపాధ్యాయులపై ఆధారపడకుండా సొంతంగా సబ్జెక్ట్ అర్థం చేసుకుని చదివేలా తర్ఫీదు ఇస్తారు. నిత్యం ఏదో ఒక టాపిక్ చెబుతారు. అది నేర్చుకున్న విద్యార్థి సొంతంగా దానిపై ఒక్క నిమిషం మాట్లాడాల్సి ఉంటుంది. ఇలాంటి ప్రత్యేక తరహా శిక్షణతో వారు రాటుదేలుతారు.


మామయ్య నాగేశ్వర్‌తో వంశీ కుటుంబ సభ్యులు

**మామయ్య సలహాతో..**

వంశీకృష్ణ మేనమామ రాజకీయ, సామాజిక అంశాల విశ్లేషకులు ప్రొఫెసర్ నాగేశ్వర్. సంకల్ప్ స్థాపించాలనే తన ఆలోచనను ఆయనకు వివరించారు. వెనుకబడిన ప్రాంతాలకు ఉపయోగపడేలా సంస్థ ఉండాలని, రాయలసీమ అందుకు అనుగుణంగా ఉంటుందని నాగేశ్వర్ సలహా ఇచ్చారు. దీంతో రాయలసీమ నడిబొడ్డునున్న కడపలో సంస్థ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

**ప్రశ్నించడం నేర్పుతూ..**

సంస్థలో ప్రతి విషయంలో ఎందుకు? ఏమిటి? ఎలా? అంటూ ప్రశ్నించడం అలవరుస్తున్నారు. మూస పద్ధతిలో బోధన కాకుండా విద్యార్థికి న్యూమరికల్ ప్రాబ్లం ఇచ్చి ఎన్ని పద్ధతుల్లో సాల్వ్ చేస్తారంటూ అడుగుతారు. చాలామంది మూడు పద్ధతుల్లో సాల్వ్ చేస్తారు. కొందరు అంతకంటే ఎక్కువ పద్ధతుల్లో పరిష్కరిస్తారు. ఈ క్రమంలోనే ఓ విద్యార్థి తొమ్మిది పద్ధతుల్లో సాల్వ్ చేయడం విశేషం. చిన్నారుల ఆలోచనలను సరైన దారిలో పెడితే ఇలాంటి అద్భుతాలు సాధ్యమంటాడు వంశీ.

**ఉత్తర తెలంగాణ నుంచి..**

ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఓదేడుకు చెందిన సత్యనారాయణ, పద్మ దంపతుల కుమారుడు చకిలం వంశీకృష్ణ. ఓదేడు, మంథనిలో ఈయన బాల్యం గడిచింది. అక్కడే ప్రాథమికస్థాయి నుంచి డిగ్రీ వరకు చదువు పూర్తి చేశారు. ఫిజిక్స్‌లో పీజీ చేసిన ఆయన ఐఐటీ, జేఈఈ లెక్చరర్‌గా కోటా(రాజస్థాన్), ఢిల్లీ తదితర ప్రాంతాల్లో పని చేశాడు. ఐఐటీ రామయ్య, సూపర్ థర్టీ ఆనంద్ కుమార్‌ల నుంచి స్ఫూర్తి పొందాడు. వెనుకబడిన ప్రాంతాలకు ఏదైనా చేయాలనే ఆలోచన అక్కడే మొదలైంది. కెమిస్ట్రీ లెక్చరర్ చకిలం రేణుకతో వివాహమైన అనంతరం 'సంకల్ప్' స్థాపనకు బీజం పడింది.

**ర్యాంకులకు సూచిక**

భావిభారతానికి సేవ చేయాలనే లక్ష్యంతో తన శిష్యులను డాక్టర్లు, ఇంజినీర్లుగా.. సమాజానికి ఉపయోగపడే ఉన్నతాశయాలు కలిగినవారిగా తయారు చేస్తున్నాడు వంశీ. ప్రతీ పురుషుడి విజయం వెనుక ఓ స్త్రీ ఉంటుందనే నానుడిని నిజం చేస్తున్నారు ఆయన భార్య రేణుక. కెమిస్ట్రీ బోధకురాలైన ఆమె 'సంకల్ప్'కు డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. అయితే 'సంకల్ప్' ఘనత తమతో పాటు సహోపాధ్యాయులది కూడా అంటున్నాడు వంశీకృష్ణ. అందరి సమష్టికృషితోనే ఘనమైన ఫలితాలు సాధిస్తున్నామంటున్నాడు. ఆయన వద్ద చదివిన చాలామంది విద్యార్థులు ప్రపంచ ప్రఖ్యాతి చెందిన కంపెనీల్లో రూ. లక్షల్లో గడిస్తున్నారు. ఎంతోమంది ఇంజినీర్లు, డాక్టర్లుగానే కాకుండా ఐఏఎస్, ఐపీఎస్‌లుగా కూడా స్థిరపడ్డారు. ఈ ఏడాది ప్రణతిరెడ్డి అనే విద్యార్థిని నీట్ ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరిలో 45వ ర్యాంకు సాధించడం 'సంకల్ప్' సాధనకు గీటురాయిగా నిలిచింది. పదుల సంఖ్యలో ఐఐటీ, మెడికల్ సీట్లు సాధించడం గర్వకారణమైంది. తమ సంస్థలో ఏటా పది మందికి ఉచితంగా శిక్షణ ఇవ్వడమేగాక కార్పొరేట్ కళాశాలలో చదివిస్తున్నాడు వంశీకృష్ణ. భవిష్యత్తులో అనాథ పిల్లలకు శిక్షణను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమంటున్నారాయన.

**సెల్ఫ్ లెర్నింగ్ అత్యావశ్యకం**



ఐఐటీల్లో ఇంజినీరింగ్ చేసే విద్యార్థులకు సెల్ఫ్ లెర్నింగ్ చాలా అవసరం. అందుకే మా వద్ద వారిని అందుకు అనుగుణంగా సిద్ధం చేస్తున్నాం. విద్యార్థులకు మాస్టర్ టాస్క్ ఇచ్చి అదే పద్ధతుల్లో ప్రశ్నలు క్రియేట్ చేయమని చెబుతాం. వారి విశ్లేషణ శక్తి పెంచుతాం. ఇష్టంలో కష్టపడే వాతావరణం ఉండేలా చూస్తాం.

– వంశీ, సంకల్ప్ సంస్థ

**సీమవాసుల అదృష్టం**



కడపలో ఇన్‌స్టిట్యూట్ పెట్టడం జిల్లావారికే కాదు సీమవాసులకు సైతం అదృష్టంగా మారింది. విద్యార్థులు బరువుగా కాకుండా, బాధ్యతగా చదువుకోవడాన్ని నేర్పిస్తున్నారు. దీంతో మావాడు కేవీపీవై, మ్యాథ్స్ ఒలింపియాడ్, తదితర పరీక్షల్లో సైతం రాణించాడు. ఐఐటీలో 280 ర్యాంకుతో ఖరగ్ పూర్‌లో సీటు సాధించాడు. అమెజాన్‌లో సీనియర్స్ విభాగంలో ఇంటర్న్‌షిప్ సాధించాడు.

– చంద్రశేఖర్‌రెడ్డి, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు

**క్రమశిక్షణ నేర్పుతున్నారు**



నా కుమారుడు శ్రీనందన్‌రెడ్డి, కుమార్తె హర్షిత సంకల్ప్‌లో చదివారు. బేసిక్స్‌తో పాటు పోటీప్రపంచానికి తగ్గట్టు తీర్చిదిద్దారు. ప్రాబ్లం సాల్వింగ్‌తో పాటు క్రమశిక్షణ నేర్పారు. దీంతో ఇంటర్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ సులభమైంది. శ్రీనందన్ 2019లో అఖిల భారత స్థాయిలో 42వ ర్యాంకు సాధించారు. హర్షిత కూడా మంచి ర్యాంకు సాధించింది.

– ఎ.ప్రసూన, ప్రొఫెసర్, హోమియో మెడికల్ కళాశాల

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

## క్లుప్తంగా

### విరబూసిన బ్రహ్మకమలం



బ్రహ్మకమలానికి పూజలు చేస్తున్న దృశ్యం

**రాయచూరు రూరల్:** నగరంలో బ్రహ్మకమలం విరబూసింది. ఏడాదికి ఒకసారి విరబూసే బ్రహ్మకమలం కేవలం కొన్ని గంటల వ్యవధిలోనే తన స్వరూపాన్ని కోల్పోతుంది. శుక్రవారం నగరంలోని శ్రీరామనగర్ కాలనీలో అయ్యనగౌడ, గౌరమ్మల నివాసంలో బ్రహ్మకమలం విరబూయడంతో ప్రత్యేక పూజలు జరిపారు. బ్రహ్మకమలాన్ని ప్రజలు ఆశ్చర్యంగా తిలకించారు.

### మాజీ ఎమ్మెల్యేకు సన్మానం



సురేష్‌బాబును సన్మానిస్తున్న అభిమానులు

**కంప్లి:** తాను ఏనాడూ క్షేత్ర ప్రజలకు దూరం కాలేదని, గత ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును శిరసావహించానని మాజీ ఎమ్మెల్యే సురేష్‌బాబు తెలిపారు. గురువారం క్షేత్రంలోని పలు గ్రామాల్లో పర్యటించిన సందర్భంగా గతవారం వీఎస్ఎస్ఎన్ సహకార సంఘం ఎన్నికల్లో అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా గెలుపొందిన బీజేపీ మద్దతు అభ్యర్థులను అభినందించారు. అనంతరం సురేష్ బాబును నూతన అధ్యక్షులు బీ.రమేష్ పూలమాలతో సన్మానించారు. మాజీ వీఎస్ఎస్ఎన్ అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, అభిమానులు పాల్గొన్నారు.

### భర్త మందలించాడని భార్య బలవన్మరణం

**బళ్లారి రూరల్:** భర్త మందలించాడని జిల్లాలోని సండూరు తాలూకా భుజంగనగర్‌లో పురుగుల మందు తాగి ఓ మహిళ బలవన్మరణానికి పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలు.. భుజంగనగర్‌కు చెందిన శైలజ(38) అనే మహిళ గురువారం తనను భర్త మందలించడంతో మనస్తాపం చెంది పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి సండూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విమ్స్‌లో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందింది. కాగా మృతురాలికి భర్త, పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై సండూరు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

### చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులుగా మహారుద్రగౌడ



కార్యవర్గాన్ని సత్కరిస్తున్న సభ్యులు

**బళ్లారిటౌన్:** జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా పీ.మహారుద్రగౌడ ఎంపికయ్యారు. కార్యదర్శిగా సురేష్‌బాబు, సీనియర్ ఉపాధ్యక్షులుగా యశ్వంత్‌రాజ్ నాగిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఏ.మంజునాథ, దొడ్డనగౌడ, సొంతా గిరిధర్, సంయుక్త కార్యదర్శులుగా మర్చేడ్ మల్లికార్జునగౌడ, శ్రీరామచంద్ర, కోశాధికారులుగా ఎంపికైన పాలన్న, నాగళ్లి రమేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

### డివిజన్ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

**కంప్లి:** కురుగోడు తాలూకాలోని సోమలాపుర గ్రామ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి బాలుర ఖోఖో క్రీడల్లో ప్రథమ స్థానం పొంది కల్బుర్గి డివిజన్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ శారీరక, మానసిక అభివృద్ధికి సహకరించే క్రీడలపై క్రీడాకారులు ఎక్కువ ఆసక్తి చూపి పాఠశాల కీర్తి ప్రతిష్టలను మరింత పెంచాలని కోరారు.

### కాగడాల ర్యాలీ



కాగడాలతో ర్యాలీ చేపట్టిన దృశ్యం

**రాయచూరు రూరల్:** తాలూకాలోని మన్సలాపూర్‌లో ఏఐడీవైఓ, ఏఐడీఎస్ఓ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ 136వ జయంతిని ఘనంగా జరిపారు. జయంతిని పురస్కరించుకుని గురువారం రాత్రి జిల్లాధ్యక్షుడు చెన్నబసవ నేతృత్వంలో భగత్‌సింగ్ చిత్రపటాన్ని చేతబూని గ్రామంలో కాగడాలతో ర్యాలీ చేపట్టారు. భగత్‌సింగ్ పోరాట పటిమను కొనియాడారు.

### ఉచిత ఆరోగ్య పరీక్షా శిబిరం

**గంగావతి:** నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం తాలూకా ప్రజలకు ఉచిత ఆరోగ్య పరీక్షా శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రముఖ వైద్యులు ఈశ్వర్ చౌడి ప్రారంభించి మాట్లాడుతూ గర్భకోశ సమస్యలతో బాధపడుతున్న మహిళలకు, సకాలంలో నెలసరి రాని మహిళలకు చికిత్స చేస్తారన్నారు. కార్యక్రమంలో స్థానిక వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా ఈ శిబిరంలో 87 మందికి ఉచిత చికిత్సను అందించినట్లు తెలిపారు.

# స్వచ్ఛందంగా బంద్‌కు మద్దతు

- మూతపడిన దుకాణాలు, వాణిజ్య సముదాయాలు
- కదం తొక్కిన కన్నడ సంఘాల నాయకులు, కార్యకర్తలు



బోసిపోయిన కోలారు బస్టాండు



కోలారులోని ఎంజీ రోడ్డులో దుకాణాలు మూసివేసిన దృశ్యం

**కోలారు:** తమిళనాడుకు కావేరి నీటిని వదలడాన్ని ఖండిస్తూ వివిధ సంఘాలు చేపట్టిన కర్ణాటక బంద్‌కు కోలారులో ఉత్తమ స్పందన లభించింది. దుకాణాలు, వాణిజ్య సముదాయాలు, హోటళ్లు, సినిమా థియేటర్లు బంద్ అయ్యాయి. బస్సులు రోడ్డెక్కలేదు. ప్రభుత్వ కార్యాలయాలు తెరచి ఉన్నా ఖాళీగా కనిపించాయి. కేఎస్ఆర్టీసీ బస్టాండు నిర్మానుష్యంగా మారింది. ప్రధాన రహదారులు జనసంచారం లేక బోసిపోయాయి. వ్యాపారులు బంద్‌కు స్వచ్ఛందంగా మద్దతు తెలిపారు. వివిధ సంఘాల కార్యకర్తలు ఉదయం 6 గంటలకే రహదారులపైకి వచ్చి ఆందోళన ప్రారంభించారు. కేఎస్ఆర్టీసీ డిపో వద్దకు వెళ్లి బస్సులు బయటకు రాకుండా అడ్డుకున్నారు. ఆస్పత్రులు, పాల బూత్‌లు, మెడికల్ షాపులు మాత్రం తెరచి ఉంచారు. వచ్చి వెళ్లే వాహనాలను ఆందోళనకారులు అడ్డుకున్నారు. నగరంలోని కేఎస్ఆర్టీసీ బస్టాండు సర్కిల్ వద్ద కన్నడ పర సంఘాల కార్యకర్తలు రక్తంతో సంతకాలు చేసిన వస్త్రాన్ని ప్రదర్శించారు.

**కావేరిపై ప్రశాంతంగా ధర్నా**

**బళ్లారిఅర్బన్:** కేఆర్ఎస్ జలాశయం నుంచి కావేరి నీటిని తమిళనాడుకు వదలడాన్ని వ్యతిరేకిస్తూ కన్నడ పర సంఘాల నేతలు శుక్రవారం బంద్‌కు మద్దతుగా శాంతియుతంగా ధర్నా నిర్వహించారు. కరవే ప్రవీణ్ శెట్టి వర్గం రాష్ట్ర సంచాలకుడు అద్దిగేరి రామన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి వీహెచ్.హులుగప్పల నేతృత్వంలో రాయల్ సర్కిల్, సుధాక్రాస్, హొసపేటి రోడ్డు ప్రాంతాల్లో చేపట్టిన ఆందోళనల్లో వారు మాట్లాడారు. రాష్ట్రంలో తాగు, సాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నా పొరుగు రాష్ట్రం తమిళనాడుకు డ్యాం నుంచి 5 వేల క్యూసెక్కుల కావేరి నీటిని విడుదల చేయడం సరికాదని ఆరోపించారు. బంద్‌లో కరవే జిల్లా గౌరవ అధ్యక్షులు కే.ఉమేష్, పదాధికారులు వెంకటరెడ్డి, అద్దిగేరి బుజ్జి, మేఘనాథ్‌గౌడ, మనోజ్ వెంకటేష్, వీరేష్, రామకృష్ణ, వై.రామయ్య పాల్గొన్నారు.

**కావేరి నీటిని తమిళనాడుకు వదలొద్దు**

**రాయచూరు రూరల్:** కావేరి నీటిని తమిళనాడుకు విడుదల చేయరాదని జయ కర్ణాటక, రైతు సంఘాలు డిమాండ్ చేశాయి. శుక్రవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళననుద్దేశించి అధ్యక్షుడు శివకుమార్ యాదవ్, జ్యోతి మాట్లాడుతూ ప్రతి రోజూ 3000 క్యూసెక్కుల నీటిని విడుదల చేయకుండా నిలుపుదల చేయాలని కోరుతూ స్థానికాధికారికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు రవి, కరుణాకర్‌రెడ్డి, వసంత్, మారెప్ప, అశోక్ కుమార్ జైన్‌లున్నారు. కాగా శుక్రవారం రాష్ట్ర బంద్‌కు ఇచ్చిన పిలుపునకు రాయచూరులో స్పందన కరువైంది. రైతు, కన్నడ పర సంఘాలు నగరంలో కేవలం ఆందోళనలను చేపట్టి వినతిపత్రాలు సమర్పించారు.

**కావేరి నీరు వదలొద్దని ధర్నా**

**గంగావతి:** కేఆర్ఎస్ జలాశయం నుంచి తమిళనాడుకు కావేరి నీటిని వదలరాదని డిమాండ్ చేస్తూ కన్నడ పర సంఘాలు శుక్రవారం నగరంలో ధర్నా చేపట్టారు. తుంగభద్ర డ్యాం వద్ద గంగావతికి చెందిన కన్నడ పర సంఘాల కార్యకర్తలు అర్ధనగ్నంగా ధర్నా చేశారు. డ్యాం నుంచి వదులుతున్న కావేరి నీటి విడుదలను వెంటనే బంద్ చేయాలని ఒత్తిడి చేశారు. రైతు సంఘం నాయకులు శరణప్ప దొడ్డమని, కరవే జిల్లాధ్యక్షులు పంపన్న నాయక్, పదాధికారులు విజయ్‌కుమార్, విరుపాక్షిగౌడ నాయక్, అర్జున్‌నాయక్, బళ్లారి రామన్న నాయక్, చెన్నబసవ జైకిన్, ప్రశాంత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**కావేరి నీటి విడుదలపై ఆందోళన**

**కంప్లి:** కావేరి నీటి విడుదలను ఖండిస్తూ శుక్రవారం పట్టణంలో వివిధ సంఘ సంస్థల కార్యకర్తలు ఉద్భవ గణపతి ఆలయం నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. రైతు సంఘం, కన్నడపర సంఘాలు, విద్యుత్ కాంట్రాక్టర్ల సంఘం సభ్యులు తహసీల్దార్ శివరాజ్‌కు వినతిపత్రం అందించారు.



కోలారు బస్టాండు సర్కిల్ వద్ద రక్తాక్షరాలతో సంతకం చేసి నిరసన ప్రకటిస్తున్న దృశ్యం



బళ్లారిలో కర్ణాటక బంద్‌కు మద్దతుగా ధర్నా చేస్తున్న కరవే నేతలు, కార్యకర్తలు



రాయచూరులో వినతిపత్రం సమర్పిస్తున్న కార్యకర్తలు



టీబీ డ్యాం వద్ద అర్ధనగ్నంగా ధర్నా చేస్తున్న గంగావతి తాలూకా కరవే నేతలు

## హంపీని సమగ్రంగా అభివృద్ధి చేస్తాం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జిల్లాధికారి తదితరులు

**హొసపేటి:** హంపీలో పర్యాటకులకు అత్యాధునిక సౌకర్యాలను అందించడానికి, సమగ్ర అభివృద్ధికి రూ.90 కోట్ల వ్యయంతో ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నట్లు జిల్లాధికారి ఎంఎస్ దివాకర్ తెలిపారు. జిల్లా అధికార యంత్రాంగం, పర్యాటక శాఖ, ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, ఫెడరేషన్ ఆఫ్ హంపీ టూరిస్ట్ గైడ్‌ల సహకారంతో ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకల్లో భాగంగా హంపీలోని గజశాల ప్రాంగణంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. హంపీకి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు పూర్తి సమాచారం అందించడంతో పాటు హంపీలో విమానాశ్రయం ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు. అత్యాధునిక మరుగుదొడ్లు, మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. హంపీలో వివిధ ప్రాంతాల్లో 7–8 స్థలాలను ఒకే రోజు వీక్షించేందుకు అన్ని రకాలుగా వ్యవస్థ ఏర్పాటు చేస్తామన్నారు. కేఎంఆర్‌సీ ద్వారా రూ.90 కోట్ల ప్రణాళికను సిద్ధం చేసి ప్రతిపాదనలను సమర్పించనున్నట్లు తెలిపారు. పర్యాటక శాఖ నిర్వహించే వివిధ పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. రిటైర్డ్ లెక్చరర్ డాక్టర్ హెచ్‌ఎం.చంద్రశేఖర శాస్త్రి హంపీ చారిత్రక వారసత్వంపై ఉపన్యసించారు. ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా సూపరింటెండెంట్ నిహిల్‌దాస్ పాల్గొన్నారు.

## 1 నుంచి వివిధ సేవా కార్యక్రమాలు



మాట్లాడుతున్న ఫౌండేషన్ సీఈఓ అజిత్ కులకర్ణి

**హుబ్లీ:** మజేతియ ఫౌండేషన్ అధ్యక్షులు జితేంద్ర మజేతియ 75 వసంతాల సార్థక శుభవేళ అక్టోబర్ 1 నుంచి 5 వరకు వివిధ సేవా కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు ఆ ఫౌండేషన్ సీఈఓ అజిత్ కులకర్ణి తెలిపారు. శుక్రవారం నగరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 1వ తేదీన 25 వీరయోధుల కుటుంబాలకు ఘన సన్మానాన్ని దేశ్‌పాండే నగర్‌లో నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి, బ్రిగేడియర్ ఎస్‌జీ.భాగవత్, కెప్టెన్ నవీన్ నాగప్ప తదితర ప్రముఖులు పాల్గొంటారన్నారు. మూరుసావిర మఠంలో 175 మంది లబ్ధిదారులకు కృత్రిమ చేతులు, కాళ్లు అమర్చే శిబిరం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సంతోష్‌లాడ్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. 2వ తేదీన తోపుడు బండ్లను సుమారు 22 మందికి ఉచితంగా పంపిణీ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రసాద్ అబ్బయ్య, మూరుసావిర మఠం పీఠాధిపతి డాక్టర్ గురుసిద్ధ రాజయోగేంద్ర స్వామీజీ పాల్గొంటారు. 3వ తేదీన వివిధ ప్రాంతాల్లో ఉచిత పౌష్టికాహార పంపిణీ కార్యక్రమం జరుగుతుందన్నారు. 4వ తేదీన పీహెచ్‌డీ, ఎంబీబీఎస్ విద్యార్థులకు ఉచిత ల్యాప్‌టాప్, దివ్యాంగులకు వీల్‌చెయిర్లను పంపిణీ చేస్తారన్నారు. 5వ తేదీన గబ్బూరులోని విశ్వకర్మ దివ్యాంగుల పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు.

## యువతి విషయమై వ్యక్తి హత్య



హతుడు భైరారెడ్డి (ఫైల్)



ప్రధాన నిందితుడు నవీన్ (ఫైల్)

**మాలూరు:** యువతి విషయమై ప్రారంభమైన గొడవ హత్యకు దారి తీసిన ఘటన తాలూకాలోని లక్కూరు గ్రామంలోని అశోక్ వైన్స్ వద్ద చోటు చేసుకుంది. చిక్కతిరుపతి జీపీ జగదేనహళ్లి గ్రామానికి చెందిన భైరారెడ్డి(34) హత్యకు గురైన వ్యక్తి. లక్కూరు జీపీలోని కోడిహళ్లి గ్రామానికి చెందిన నవీన్(25) హత్య చేసిన వ్యక్తి. భైరారెడ్డి హొసకోటె తాలూకా మాకనహళ్లి గ్రామం వద్ద ఉన్న ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడు. తనకు పరిచయం ఉన్న కుటుంబానికి చెందిన యువతి జోలికి వెళ్లవద్దని నవీన్ అనే యువకుడు భైరారెడ్డిని హెచ్చరించాడు. అయినా భైరారెడ్డి పెడచెవిన పెట్టిన నేపథ్యంలో శుక్రవారం అశోక్ వైన్స్ వద్ద ఉన్న భైరారెడ్డిపై నవీన్, అతని స్నేహితుడితో కలిసి దాడి చేసి కళ్లలో కారం పొడి చల్లి వెంటపడి మారణాయుధాలతో నరికి హత్య చేశాడు. విషయం తెలిసిన వెంటనే ఎస్పీ ఎం నారాయణ, మాలూరు ఇన్‌స్పెక్టర్ వసంతకుమార్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. నవీన్, అతని స్నేహితుడు మంజునాథ్‌లను అరెస్టు చేసి జ్యుడిషియల్ కస్టడీకి పంపారు.

## స్వచ్ఛ రక్షణ అందరి బాధ్యత



కార్యక్రమంలో పాల్గొన్న మేయర్, ఉపమేయర్, అధికారులు

**బళ్లారిఅర్బన్:** స్వచ్ఛతను కాపాడటం మన అందరి బాధ్యత అని మేయర్ త్రివేణి అన్నారు. శుక్రవారం జిల్లా గ్రంథాలయం ఆవరణలో గాంధీ జయంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన స్వచ్ఛత కార్యక్రమాన్ని ప్రారంభించి ఆమె మాట్లాడారు. జాతిపిత మహాత్మాగాంధీ 154వ జయంతి సందర్భంగా ఉదయం 7 గంటల నుంచి నూతన జిల్లాధికారి కార్యాలయ భవనం ఎదురుగా గల కన్నడ సంస్కృతి శాఖ కార్యాలయ ప్రాంగణంలో ఈ శ్రమదాన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈనెల 30న కొళగల్లు రోడ్డు విద్యానగర్ సర్కిల్, ఎయిర్‌పోర్ట్ ప్రాంతంలో, అక్టోబర్ 1న ట్యాంక్‌బండ్ రోడ్డులోని రంగమందిర, ఏపీఎంసీ సర్కిల్ ప్రాంతాల్లో స్వచ్ఛతా కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఉపమేయర్ జానకి, కార్పొరేటర్లు, కమిషనర్ ఖలీల్ సాబ్, అధికారులు పాల్గొన్నారు.

## కొలువుల పేరుతో రూ.కోట్లు లూటీ

- నిరుద్యోగ మహిళలకు శఠగోపం



ఈరమ్మ(ఫైల్)

**రాయచూరు రూరల్:** గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ టికెట్లను ఇప్పిస్తామని చైత్రా కుందాపుర టికెట్ గ్యాంగ్ కేసు, మంత్రుల పేర్లతో అప్పులు నిరుద్యోగులకు ఉద్యోగాలిప్పిస్తామని మోసగించిన ఉదంతాలు కనుమరుగు కాకమునుపే అంగన్‌వాడీల్లో కార్యకర్తల ఉద్యోగాలిప్పిస్తామని రూ.లక్షల్లో డబ్బు దండుకుని శఠగోపం పెట్టిన ఘటన జిల్లాలో వెలుగు చూసింది. 2021 కోవిడ్ సమయంలో మహిళా శిశు అభివృద్ధి సంక్షేమ శాఖలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తల నియామకాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో నగరానికి చెందిన ఈరమ్మ అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు మోసగించి సింధనూరు తాలూకా రౌడకుంద, అరగినమర క్యాంప్ వంటి ప్రాంతాల్లో అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టింగ్‌కు నకిలీ ఉత్తర్వులు ఇచ్చారు. ఆ సమయంలో అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లకుండా ఇంటిలోనే ఉండాలని చెప్పి రెండు నెలల వేతనాలు వేసి చేతులు దులుపుకున్నారు. చివరికి గత మూడేళ్ల నుండి వేతనాలు రాకపోవడంతో ఆశ్చర్యపోయిన బాధితులు నిజం తెలుసుకుని తాము ఇచ్చిన డబ్బులు వాపస్ ఇవ్వాలని కోరగా రూ.1.22 కోట్లకు ఫేక్ చెక్‌లను ఇచ్చి పరారైంది. ఈనేపథ్యంలో కేసు దర్యాప్తు చేపట్టిన ఈరమ్మను జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు.

## ఘనంగా చౌడేశ్వరి దేవి జ్యోతి ఉత్సవాలు



జ్యోతిని మోసిన కార్పొరేటర్ బీఆర్ఎల్ శీన



పుష్పాలంకరణలో చౌడేశ్వరి దేవి అమ్మవారు



జ్యోతి ఉత్సవాల్లో పాల్గొన్న అశేష భక్తాదులు

**బళ్లారిటౌన్:** నగరంలోని రూపనగుడి రోడ్డులోని చౌడేశ్వరి, హులిగమ్మ దేవి ఆలయంలో శుక్రవారం పౌర్ణమి సందర్భంగా తొగటవీర క్షత్రియ సమాజం చేపట్టిన పంచమజ్యోతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. తొలి రోజు గురువారం గంగపూజ జరుపగా, రెండో రోజు శుక్రవారం తెల్లవారు జామున 3 గంటల నుంచి పాండురంగ ఆలయం నుంచి జ్యోతి ఉత్సవాల ఊరేగింపును ప్రారంభించారు. ఈ ఊరేగింపు రూపనగుడి రోడ్డు నుంచి ప్రారంభమై ఉదయం 9 గంటలకు చౌడేశ్వరి ఆలయానికి చేరింది. ఊరేగింపులో పంచమ జ్యోతులతో పాటు బాజాభజంత్రిలు, డోలు, తప్పెట్లు మారుమోగాయి. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించి పూజలు జరిపారు. కార్యక్రమంలో నగర మేయర్ త్రివేణి, ఉపమేయర్ జానకి, కార్పొరేటర్లు బీఆర్ఎల్ శీన, గోవిందరాజులు, తొగటవీర క్షత్రియ సమాజ నేతలు దేవానంద్, చంద్రశేఖర్, జీఆర్ వెంకటేశ్వర్లు, మోహన్, ధనుంజయ, నారాయణప్ప, బాలరాజు, ఉదయ్‌కుమార్, హరి, ప్రసాద్ పాల్గొన్నారు.

### జెడ్పీ సీఈఓ ఆకస్మిక తనిఖీ



భోజనాన్ని రుచి చూస్తున్న సదాశివప్రభు

**హొసపేటి:** నగరంలోని ఎంపీ ప్రకాష్‌నగర్‌లోని పోస్ట్ మెట్రిక్ బాలుర విద్యార్థి వసతి గృహాన్ని జెడ్పీ సీఈఓ బి.సదాశివప్రభు ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. హాస్టల్ పైపు లైన్, విద్యుత్ కనెక్షన్ మరమ్మతు చేయాలని, ఆవరణలో విద్యార్థులకు దుస్తులు అరబెట్టుకునేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని వార్డెన్‌ను ఆదేశించారు. హాస్టల్‌లో తయారు చేసిన ఆహారాన్ని స్వయంగా తిని నాణ్యతను, రుచిని పరిశీలించారు. ఆహారాన్ని వృథా చేయరాదని తెలిపారు. వంటగది, హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. హాస్టల్‌లో పరిశుభ్రతపై మరింత శ్రద్ధ వహించాలన్నారు. నిరంతరాయంగా విద్యుత్ కనెక్షన్ నిలిపి వేయడంపై విద్యార్థులు సీఈఓ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈసందర్భంగా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ హెచ్‌వి.మంజునాథ్ హాజరయ్యారు.

### వంతెనల నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే హంపయ్య నాయక్

**రాయచూరు రూరల్:** జిల్లాలోని మాన్వి తాలూకాలో తుంగభద్ర ఎడమ కాలువపై పలు చోట్ల వంతెనల నిర్మాణపనులకు మాన్వి ఎమ్మెల్యే హంపయ్య నాయక్ భూమిపూజ చేశారు. శుక్రవారం మాన్వి తాలూకా వడవాటి వద్ద కృష్ణా భాగ్య జల నిగమ మండలి ఆధ్వర్యంలో మంజూరైన రూ.5 కోట్ల నిధులతో 8 వంతెనల నిర్మాణాలకు ఆయన భూమిపూజలు నెరవేర్చిన అనంతరం మాట్లాడారు. వంతెనల నిర్మాణ పనులను నాణ్యతగా చేపట్టి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఈఈ అనిల్‌కు సూచించారు. నాసిరకం పనులకు అవకాశం ఇవ్వొద్దన్నారు. ఈసందర్భంగా జెడ్పీ మాజీ అధ్యక్షుడు శివబసప్ప, అధికారులున్నారు. అనంతరం మల్లట్‌లోని ఓ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని విద్యార్థులతో కలిసి ఆరగించారు.

### కావేరి నీటి విడుదలపై నిరసన



ఆందోళన చేస్తున్న కన్నడ సంఘాల కార్యకర్తలు

**హొసపేటి:** తమిళనాడుకు కావేరి నీటి విడుదలను నిరసిస్తూ శుక్రవారం చేపట్టిన కర్ణాటక బంద్ ప్రశాంతంగా ముగిసింది. బంద్ సందర్భంగా నగరంలో ఆర్టీసీ బస్సులు, ఆటోలు, ప్రైవేట్ వాహనాలు యథావిధంగా సంచరించాయి. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, బ్యాంకులు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, హోటళ్లు, దుకాణాలు యథావిధంగా తెరచి ఉంచారు. ఆందోళనకారులు బంద్‌ను నగరంలో ప్రశాంతంగా చేపట్టారు. బంద్ ర్యాలీని నగరంలో గాంధీ సర్కిల్ నుంచి ప్రారంభించి పునీత్ సర్కిల్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా దివంగత పునీత్ రాజ్‌కుమార్ గన్‌మ్యాన్, వివిధ కన్నడ సంఘాలు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ప్రశాంతంగా వినాయక నిమజ్జనం

**హుబ్లీ:** ఓ వైపు డీజేల హోరు, బాణసంచా శబ్దాలు, యువకుల నృత్యాలు, భక్తిపరవశులైన ప్రజల మధ్య ఈ ఏడాది వినాయక నిమజ్జనోత్సవ ఘట్టం భారీ బందోబస్తు మధ్య గురువారం అర్ధరాత్రి వరకు కొనసాగి ప్రశాంతంగా ముగిసింది. శుక్రవారం వాస్తవంగా 11వ రోజు నిమజ్జనం ఉండాల్సి ఉన్నా పున్నమి రోజున నిమజ్జనోత్సవం చేయడం అంతమంచిది కాదన్న నమ్మకంతో గురువారమే ఈ నిమజ్జనోత్సవ కార్యక్రమాలను పటిష్టమైన బందోబస్తు మధ్య ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ఘనంగా నెరవేర్చారు. సుమారు ఈ వేడుకలో ప్రముఖ కూడళ్లలో కొలువైన భారీ వినాయక విగ్రహాల ఊరేగింపు ప్రదర్శనను సాయంత్రం 7 గంటలకే ప్రారంభించి ప్రధాన వీధుల గుండా తరలించి అంతిమంగా నిమజ్జన కార్యక్రమాన్ని పూర్తి చేశారు. కాగా పోలీసులు నచ్చజెప్పి డీజే శబ్దాల హోరును రాత్రి 10 గంటలకే ముగించారు.

### అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శ్రీకారం



భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే గవియప్ప, అధికారులు

**హొసపేటి:** జిల్లా వెనుకబడిన వర్గాల సంక్షేమ శాఖ, జెడ్పీ నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శుక్రవారం నగరంలో ఎమ్మెల్యే హెచ్‌ఆర్.గవియప్ప భూమిపూజ, ప్రారంభోత్సవాలు చేశారు. నగరంలోని ఆర్టీఓ కార్యాలయం ఆవరణలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ద్వారా 2022–23వ సంవత్సరానికిగాను రూ.2.5 కోట్లతో మంజూరైన పోస్ట్‌మెట్రిక్ బాలుర వసతిగృహ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. నగరంలోని 60 పడకల మాతా శిశు ఆస్పత్రి ప్రాంగణంలో జిల్లా పంచాయతీ యాక్షన్ ప్లాన్ కింద నిర్మించిన నూతన జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ అధికారి కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ శంకర్‌నాయక్, జిల్లా ఆర్‌సీహెచ్ అధికారి డాక్టర్ జంబయ్యానాయక్, ఎంపీపీ దొడ్డమని, ధర్మనగౌడ, భాస్కర్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

### ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

**రాయచూరు రూరల్:** మానవుడు వయస్సు పెరుగుతున్న కొద్ది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా ఎస్పీ నిఖిల్ అన్నారు. ఆయన శుక్రవారం గంజ్ రహదారిలోని బెట్టదూరు ఆస్పత్రి వద్ద ఏర్పాటు చేసిన ప్రపంచ హృదయ దినోత్సవ జాతాను ప్రారంభించి మాట్లాడారు. ఏ సమయంలో మనిషికి గుండెపోటు వస్తుందో తెలియదని, దీని నియంత్రణకు వైద్యుల వద్ద సకాలంలో పరీక్షలు చేయించుకుని చికిత్స పొందితే అరికట్టడానికి వీలవుతుందన్నారు. అనంతరం నగర ప్రజలను జాగృతపరిచేందుకు సైకిల్ జాతాను చేపట్టారు.

### పరిశుభ్రతపై జాగృతి జాతా



జాగృతి జాతాను నిర్వహిస్తున్న దృశ్యం

**హొసపేటి:** తాలూకా పంచాయతీ తరఫున శుక్రవారం మలపనగుడి జీపీలో స్వచ్ఛత వారోత్సవాల్లో భాగంగా పరిశుభ్రతపై జాగృతి జాతాను నిర్వహించారు. అనంతరం టీపీ ఈఓ ఎం.ఉమేష్ ఆధ్వర్యంలో శ్రమదానం చేపట్టారు. పంచాయతీలోని నాలుగు గ్రామాలకు చెందిన 120 మంది ప్రజాప్రతినిధులు పాల్గొని సుమారు 2 గంటల పాటు శ్రమదానం చేసి గ్రామంలోని ప్రభుత్వ స్థలాలను శుభ్రం చేశారు. దుకాణాలు, హోటళ్ల యజమానులు తమ దుకాణాల నుంచి కొనుగోలు చేసిన టెంకాయ పీచు, ఇతర కవర్లు, డబ్బాలను రోడ్లపై పారేయకుండా వాటిని నిల్వ చేసి ఉంచుకొని చెత్తవాహనాల్లోనే వేయాలని సూచించారు. అనంతరం జీపీ సభ్యుడు వెంకటేష్ గ్రామస్తులకు స్వచ్ఛత ప్రతిజ్ఞను బోధించారు. జెడ్పీ ప్లానింగ్ డైరెక్టర్ అశోక్ తోటద్, సహాయ ప్రణాళిక అధికారి లక్ష్మీకాంత్, జీపీ అధ్యక్షురాలు చంద్రమ్మ, పక్కీరస్వామి, ఉపాధ్యక్షుడు హొసళ్లి దొరె, పీడీఓ హనుమంతప్ప పాల్గొన్నారు.